యండమూరి వీరేంద్రనాథ్

ప్రేమ ఒక కళ

వచ్చేవారమే ప్రారంభం



ప్రేమ ఒక కళ




-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 9246502662

ముందే చెపుతున్నాను స్మీ. ప్రేమ అనగానే ఇదేదో హృదయాన్ని గిలిగింతలు పెట్టే ప్రేమ అనుకుని చదవటం ప్రారంభించినట్టయితే, ప్రేమ బురదలో బోదకాలు వేసినంత ఆశాభంగం చెందుతారు.

ప్రేమ మూడు రకాలు. మన మీద మనకి, మన మీద ఇతరులకి, ఇతరుల మీద మనకి...!

మనం ఇతరుల్ని ప్రేమించటానికి కండిషన్లు ఏమీ అవసరం లేదు గానీ, ఇతరులు మనను ప్రేమించటానికి మాత్రం మనకి కొన్ని అర్హతలు ఉండాలి. ఇది అందరూ ఒప్పుకునేదే. కానీ, 'మనని మనం ప్రేమించుకోవటానికి ఇంకా ఎక్కువ అర్హతలుండాలి' అంటే కొందరు సందిగ్ధంగా చూస్తారు. ఇది మాత్రం అక్షరాలా సత్యం. మనని మనం ప్రేమించుకోవటం అంటే నిరంతరం సంతోషంగా ఉండటం.

ఈ కోపం నీదే! ఈ దుఃఖమూ నీదే!!



అంతులేని కోపం, అమితమైన భయం, అపరిమితమైన దుఃఖం లాంటి భావోద్వేగాలున్న మనిషి తనను తాను ప్రేమించుకోలేడు. నిరంతరం డిప్రెస్డ్‌గా, చిరాగ్గా ఉంటాడు. అలా అని, భావోద్వేగాలు లేకపోతే మనకీ, జంతువుకీ తేడా ఉండదు. జంతువులకి కేవలం భయమూ, కోపమూ లాంటి రెండు మూడు ఉద్వేగాలు మాత్రమే ఉంటాయి. మనిషికి ఆనందం, ఈర్ష్య, అసూయ, సిగ్గు, చిరాకు, అభద్రత, నిస్సహాయత, బాధలాంటి కొన్ని వందల ఉద్వేగాలున్నాయి.

పాజిటివ్, నెగెటివ్, ఉద్వేగరహితం అని ఎమోషన్స్ మూడు రకాలు.

మన సంతోషాన్ని ఇతరులూ ఆనందిస్తారు. ఇది పాజిటివ్. కోటి రూపాయలు లాటరీ వచ్చిందని తెలియగానే, పక్కనున్న అపరిచితుడికైనా సరే ఆ విషయం చెప్పి షేక్ హాండ్ తీసుకోవాలనిపిస్తుంది. కొందరైతే పక్కనున్నది అమ్మాయి అనైనా చూడకుండా ఆ ఉద్వేగంలో కౌగిలించుకోవచ్చు. అదే విధంగా, ఆత్మీయులు మరణించినప్పుడు దుఃఖమూ, ఓదార్పు సహజం.

ఆక్సిడెంట్ జరిగిన చోట, చుట్టూ వున్న మీడియా కెమెరాల గురించి పట్టించుకోకుండా శవం ప్రక్కనే గుండెలు బాదుకుంటూ ఒక స్త్రీ ఏడుస్తుంది. ఇది ప్రకటిత ఉద్వేగం (uncontrolled emotion). సెంటిమెంటు సినిమా చూస్తున్నప్పుడు బుగ్గలపై కారిన కన్నీటిని లైట్లు వెలగగానే ఎవరూ చూడకుండా గౌరవప్రదంగా తుడిచేసుకుంటాం (civilised control). 'మూకుమ్మడిగా ఏడవటానికేగా అందరూ ఈ ఏడుపుగొట్టు సినిమాని చూడ్డానికి వచ్చింది' అనుకోము. ఇది నియంత్రణ.

భావోద్వేగం లేకపోతే ఆనందమే లేదు.

కొత్త శీర్షిక ప్రారంభం

క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. ఆఖరి ఆరు బంతుల్లో ప్రత్యర్థి జట్టు ముప్ఫై రన్స్ కొట్టాలి. మన వాళ్లు గెలిచేసారనే ధీమాతో జనం గోల గోల చేసేస్తున్నారు. మొదటి బాలు సిక్సరు. రెండోది బౌండరి. మూడోది మళ్ళీ సిక్సు. ఆడిటోరియం నిశ్శబ్దం అయిపోయింది. ఆఖరి బాలు. అయిదు కొట్టాలి. సూదిపడితే వినపడేటంత నిశ్శబ్దం. ఆ బాలు ఆడిటోరియం అవతలికి వెళ్ళిపడింది. జనం 'ఛీ' అన్నారు. బౌలర్ని తిట్టనివాడు లేడు.

ఇదే ఉదాహరణలో, బ్యాటింగు చేసే జట్టు మనదయితే ఎలా ఎంజాయ్ చేసే వుండేవాళ్ళం? అయితే, పై ఉదాహరణలో అది ఒక గేమ్. దాన్ని అలానే ఎంజాయ్ చేయాలి. లేకపోతే థ్రిల్ ఉండదు. గెలిచింది మనవాళ్ళయినా అవతలివాళ్ళయినా ఒకేలా స్పందించే వాడు బాలకృష్ణనీ, బ్రహ్మానందాన్నీ ఒకేలా చూడగలిగే గొప్ప వేదాంతి అయివుంటాడు.

ఉద్వేగ రాహిత్యం:

ఒక మహిళ విడాకులు కోరుకుంది. జడ్జి కారణం అడిగినప్పుడు "నా భర్త ఎప్పుడూ కోపం తెచ్చుకోరు. నన్ను ఓదార్చటానికి ఎప్పుడూ ప్రయత్నం చేయరు. ఒళ్ళోకి తీసుకుని ఓదారుద్దామంటే బాధ పడరు. నేను బ్రతిమాలటానికి అవకాశం ఇవ్వరు. నా తప్పు తెలుసుకోవటానికి ఎప్పుడూ నాపై చిరాకు పడరు. నేను జోక్ వేస్తే నవ్వరు. నాతో ఆనందం పంచుకోరు. నన్ను కొట్టరు,

పౌర్ణమిరోజు వెన్నెల్లో తెల్లచీర కట్టుకొని, తల్లో మల్లెపూలు పెట్టుకొని, మెళ్ళో తెల్లటి ముత్యాలహారం వేసుకొని భార్య ఎదురొస్తే, ఉద్వేగ పారవశ్యంతో మోకాళ్ళపై వాలి, రెండు చేతులూ సాచి "ఓ దేవీ...! నువ్వు అందానికే ప్రతిరూపం" అంటూ ఉద్వేగంతో ఊగిపోతాడు అమిగ్డాలా ప్రభావిత భర్త. మరునటి రోజు ఆమె సాంబారులో ఉప్పు వెయ్యడం మర్చిపోతే చెంపచెళ్ళు మనిపిస్తాడు.

తాల్మస్‌తో ప్రభావితమైన వ్యక్తులు దీనికి విరుద్ధంగా, తెల్లచీర కట్టుకొని మల్లెపూలు పెట్టుకొని వచ్చిన భార్యతో "చీర అశాశ్వతం, పూలు క్షణికం, హూ.... జీవితమే తాత్కాలికం" అంటారు. మరునటిరోజు ఆమె ఉప్పు వెయ్యటం మర్చిపోతే అభావంగా, "మనం బ్రతకటానికి తింటున్నాం. తినటానికి బతకటం లేదు. జీవితానికి ఉప్పు అంత ముఖ్యం కాదు" అంటారు.



తిట్టరు" అని చెప్పింది. జడ్జి ఆమెకు వెంటనే విడాకులు మంజూరు చేసాడు.

మెదడులోని అమిగ్డాలే, తాల్మస్‌లు మన భావోద్వేగాల్ని నియంత్రిస్తాయి. (ఇది సైంటిఫిక్ వివరణ కాదు. కేవలం పాఠకులకు అర్థంకావటం కోసమే). అమిగ్డాలే ప్రభావం ఉన్న వ్యక్తులు విపరీతమైన ఎమోషన్స్ ప్రదర్శిస్తూ, ఆవేశం వల్ల ఇతరుల్తో సంబంధాల్ని పాడుచేసుకుంటారు. తాల్మస్ వ్యక్తులు ఉద్వేగ రహితంగా, సదా నిర్లిప్తంగా, అదే మెచ్యూరిటీ అనుకుంటూ చుట్టూ ఉన్న అందాల్ని, ఆత్మీయుల్ని కోల్పోతారు. వీళ్ల గట్టిగా నవ్వటం చాలా అరుదు.

అమిగ్డాలా వ్యక్తులు దగ్గిరవాళ్ళని "కన్నా-మున్నా-బంగారం" అని పిలుస్తూ ఉంటారు. థాలమస్ వారు "ఛా... కన్నా... ముక్కూ, బంగారం, వెండీ ఏమిటి నాన్సెన్స్" అంటారు. ఆవేశంతో తిట్టినా, ఆ తరువాత ఒళ్ళో తలపెట్టుకుని ఏడ్చే అమిగ్డాలా వ్యక్తుల్నే ఆడపిల్లలు ఎక్కువ లైక్ చేస్తారు.

ఎప్పుడు భావోద్వేగాలకి లోనుకావాలి? ఎక్కడ హేతుబద్ధంగా ఆలోచించాలి? సమాధానం చాలా చిన్నది. కోపం, దుఃఖం, భయం లాంటి నెగెటివ్ ఎమోషన్స్‌ని నియంత్రించుకోవలసి వచ్చినప్పుడు తాల్మస్ వాడాలి. ఆనందం, ఉల్లాసం. ప్రేమ మొదలైన విషయాల్లో అమిగ్డాలే ఆసరా తీసుకోవాలి. మానవ సంబంధాలకీ, మనసు నిరంతరం ఆహ్లాదకరంగా ఉండటానికీ ఇదే మంచి మార్గం.

ఇతరుల్ని మనం అపార్థం చేసుకుంటే వారిపై మనకి వచ్చేది కోపం. మనల్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతే కలిగేది 'దుఃఖం'.

ఆనందానికి అర్ధాంగి (సహచరి) ప్రేమ. ప్రేమకు సవితి భార్య కోపం. కోపానికి తమ్ముడు డిప్రెషన్.

కోపం ప్రకృతి, ప్రదర్శన వికృతి.
నవ్వెయ్యటం సంస్కృతి.

ఎర్రలైటు పడటానికి ముందే జంక్షన్ దాటే ప్రయత్నంలో వాహన వేగాన్ని పెంచుతాం. ఇంతలో ఆరెంజ్ సిగ్నల్ చూసి ముందున్న డ్రైవరు కారు ఆపుతాడు. దానిని ఢీ కొట్టబోయి అతి కష్టం మీద ఆగుతాం. అతని ట్రాఫిక్-సెన్స్‌ని మెచ్చుకోకపోగా తిట్టుకుంటాం. అతను కారు ఆపినందుకు కాదు. మన గెలుపుకి అడ్డుపడినందుకు. ఆ విధంగా చాలా సందర్భాల్లో మనం బాధని కోపంగా ప్రదర్శిస్తూ వుంటాం.

పిల్లవాడు మెట్ల మీద నుండి జారిపడితే, ఓదార్చడానికి బదులు తిడుతుంది తల్లి. బాధ 'నిజం'. వ్యక్తీకరణ 'తప్పు'. ఒక అమ్మాయి పెద్దలకి ఇష్టం లేని పెళ్ళి చేసుకుంది. తండ్రి కోపంతో ఇంట్లోంచి వెళ్ళగొట్టాడు. తల్లి బాధతో ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. ఇద్దరి ఫీలింగ్ ఒకటే. రియాక్షన్ వేరు.

కొడుకు ప్రోగ్రెస్ రిపోర్ట్ చూసి చెంపమీద ఫెడేల్‌మని కొట్టి "బాగా చదువు, లేకపోతే ఒళ్ళు చీరేస్తాను" అంటాడు తండ్రి. ఇందులో, కొడుకు చదవటం లేదన్న బాధ. శిక్షించటం వల్ల బాగుపడతాడు" అన్న రెండు అంశాలున్నాయి. కానీ రెండిటికీ ఏమాత్రం సంబంధం లేదని మనో విశ్లేషకులు అంటారు. మంచి మార్కులు రావాలంటే తండ్రి అతడితో పాటు కూర్చోవాలి. అర్థం కాని విషయాలు బోధించాలి. ఇవన్నీ చేయలేక తండ్రి ఒక సులభమైన దారి ఎంచుకున్నాడు.... శిక్షించటం! చిత్రమేమిటంటే-తండ్రి కోపం సరైయినదే అంటూ చాలా మంది సమర్థిస్తారు.



డిప్రెషన్ పుండు లాంటిదయితే, కోపం దురదలాంటిది. మరీ సినిమా డైలాగ్‌లా వుందా? కానీ నిజమే కదా! పుండు మానాలంటే, దాన్ని కెలక్కుండా వుండాలి. కానీ గోకే కొద్దీ వచ్చే తాత్కాలిక ఉపశమనాన్ని ఆనందిస్తూ, అది శాశ్వతమైన గాయాన్ని చేస్తున్నదన్న విషయాన్ని మర్చిపోతాం.

ఒక వ్యక్తి పట్ల మనం 'సంతోషంగా లేము' అని ప్రదర్శించడమే కోపం. ఈ ఇబ్బందికరమైన ఎమోషన్ మూడు రకాలుగా బయట పడుతుంది. మౌనం, ఆవేశం, దుఃఖం. దంపతులు కలహించుకున్నప్పుడు ఒక భార్య భోజనం మాని దుఃఖించవచ్చు. మరొకామె నిశ్శబ్దంగా తన గుహలోకి వెళ్ళిపోవచ్చు. ఒక భర్త చెంప చెళ్ళు మనిపించవచ్చు. లేదా మంచి రొమాన్స్ ద్వారా ఇద్దరూ క్షణాల్లో కాంప్రమైజ్ కావొచ్చు.

కోపం వచ్చినప్పుడు అంకెలు లెక్కపెట్టి దాన్ని తగ్గించుకోవాలి. కష్టం వచ్చినప్పుడు అంకెలు లెక్కపెడ్తూ కూర్చో కుండా పరిష్కారం ఆలోచించాలి.

అధికారం వల్ల, డబ్బు వల్ల వచ్చిన పవర్‌తో ఒకరు కోపం చూపించినప్పుడు, ఎదుటి వ్యక్తి



మౌనంగా ఆ తిట్లు భరించవలసి వస్తుంది. ఆ మౌనాన్ని 'ఉక్రోషం' అంటారు. తనకన్నా అల్ప ప్రాణి దొరికినప్పుడు ఆ వ్యక్తి అక్కడ విరుచుకుపడతాడు. దీన్నే "సూట్‌కేస్ ట్రాన్స్‌ఫర్" అంటారు. ఈ కాన్సెప్ట్ గురించి 'విజయానికి ఐదు మెట్లు" అనే పుస్తకంలో వివరంగా చర్చించటం జరిగింది.

అవతలివారి కోపానికీ, అందువల్ల మనకి జరిగిన అవమానానికీ, మనం ప్రతిస్పందించేటప్పుడు ఆ స్పందనలో ఆవేశాలు, కార్పణ్యాలు వదిలేసుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. ఒక చిన్న ప్రయత్నం చేసి చూడండి. ఎవరి మీదా కోపం, పగ, కసి, ఆవేశం లేకుండా 24 గంటల పాటు బాధనీ, దుఃఖాన్నీ, అవమానాన్నీ భరించండి. వెనక్కి తిరిగి చూసుకుంటే ఆరోజు మీకే ఎంతో ఆశ్చర్యంగానూ, రిలీఫ్‌గానూ అనిపిస్తుంది. శరీరంతో పాటు మనసు కూడా ఎంతో తేలికయిన అనుభూతి కలుగుతుంది. ఆకస్మాత్తుగా ఏదో కొత్త శక్తి ప్రవేశించిన ఫీలింగ్ కలుగుతుంది. కొద్ది రోజుల పాటు సాధన చేస్తే ఇది అలవాటైపోతుంది.

ఒక్కోసారి అవతలివారు యధాలాపంగా అన్న చిన్నమాటను కూడా పట్టుకొని చాలామంది బాధపడుతూ వుంటారు. కోపం తెచ్చుకుంటారు. "ఈ ప్రపంచంలో ఎవ్వరూ మనల్ని కావాలని బాధపెట్టరు. కేవలం తమ ఎమోషన్స్‌ని నుంచి బయటపడటం చేతకాకే, దాన్ని మనమీద కోపంగా ప్రదర్శిస్తారు" అన్న చిన్న విషయం తెలుసుకుంటే, మనకి వారిపై కోపంరాదు. జాలి కలుగుతుంది. మీ బాల్యాన్ని గుర్తుతెచ్చుకోండి. చిన్నప్పుడు ఏదో విషయంలో మిమ్మల్ని ఎవరో ఛడామడా తిట్టి వుంటారు. ఆ విషయాన్ని వాళ్ళు ఎప్పుడో మర్చిపోయి వుంటారు. మీకు ఆ తిట్లు, దాని వెనుక ఉన్న కారణాలూ ఇప్పటికీ గుర్తున్నాయంటే మీ గాయం ఇంకా ఫ్రెష్‌గా వుందన్న మాట.

కోపానికి స్టాప్ బటనూ, తప్పుకి రివైండ్ బటనూ, కష్టానికి ఫార్వర్డ్ బటనూ, మంచికి పాజ్ బటనూ ఉంటే జీవితం అనే టేప్ రికార్డర్ అద్భుతంగా పని చేస్తుంది. తనపట్ల తన ప్రేమ పెరగటానికి, మనిషి 'ఆత్మవిమర్శ' అనే ఆయిల్‌తో ఆ టేప్ రికార్డర్‌ని నిరంతరం సర్వీసింగ్ చేసుకుంటూ ఉండాలి.



"నువ్వు తప్పు నిన్నెవరూ బాధించలేరు. నువ్వు తప్పు నిన్నెవ్వరూ రక్షించలేరు. నువ్వు జుడాస్ అవ్వాలా? జీసెస్ అవ్వాలా? అన్నది నీమీదే ఆధారపడి ఉంటుంది" అంటాడు ఒక ఫిలాసఫర్.

ఆపరేషన్ చేసి బుల్లెట్లు తీసిన తరువాత మచ్చ మాసిపోవచ్చు. కానీ కోపంలో అనాలోచితంగా అన్న చిన్నమాట అవతలవారి హృదయం మీద జీవితాంతం మచ్చగా నిలిచిపోతుంది. ముఖ్యంగా పెళ్ళి అయిన కొత్తలో.

కోపం ఎవరి మీద వస్తుంది? మనం ఎవరి మీద ప్రదర్శించగలమో వారి మీదే వస్తుంది. 'అయిన వాళ్ళకి ఆకుల్లో అన్న నానుడి కోపానికీ వర్తిస్తుంది. చిన్న ఉదాహరణ చూడండి. పది నిమిషాల్లో గెస్టులు వస్తున్నారు. సోఫాలో నీళ్ళగ్లాసు వంపేసేడు నాలుగేళ్ళ కొడుకు. ".... నీకసలు పిల్లల్ని పెంచటం చేతకాదు. దరిద్రపు మొహమా" అని భార్యని తిడతాడు ఇంటి యజమాని. గెస్టులు వచ్చేసరికి తిరిగి చిరునవ్వు ముసుగు వేసుకుంటాడు. అయిదు నిముషాల గెస్ట్‌కోసం. కలకాలం కలిసి వుండాల్సిన జీవితపు భాగస్వామిని బాధపెడతాడు. ఫ్రాయిడ్ దీన్ని 'డిస్‌ప్లేస్‌మెంట్ చర్య'గా అభివర్ణిస్తాడు.

ఒక వ్యక్తి కొత్తగా కారు కొన్నాడు. కొడుకు సైకిల్ గాలికి తూలి దాని మీద పడింది. సైకిల్‌ని నిర్లక్ష్యంగా పెట్టినందుకు కొడుకు చెంప బద్దలు కొట్టాడు. తప్పెవరిది? 'ఎప్పుడూ పెట్టే చోటే కొడుకు సైకిల్ పెట్టాడు. కొత్తగా వచ్చింది నా కారు. సైకిల్ దూరంగా పెట్టమని కొడుక్కి చెప్పాల్సింది నేను. అందులో నా కొడుకు తప్పులేదు' అని తెలుసుకోవటమే ఇంగిత జ్ఞానం.

కానీ ఆ విచక్షణా జ్ఞానాన్ని, కొత్తకారు పాడయిందన్న దుగ్ధ పోగొడుతోంది. ఆ బాధని 'వెంటిలేట్' చేసుకోవటం కోసం ఉపయోగించే భావోద్వేగమే కోపం. మరుగుతున్న నీటిలో నీడ కనబడదు. మండు తున్న కోపంలో నిజం కనబడదు. అదే, అతడి బాస్ ఆ కారుని తీసుకెళ్ళి ఎద్దుని ఢీ కొట్టాడనుకోండి. 'ఫర్వాలేదండీ... పోయింది ఎద్దేగా. కారుకి చిన్న దెబ్బేగా' అంటూ శుష్కంగా నవ్వుతాడా వ్యక్తి. కోపాన్ని ప్రదర్శించలేడు.

'ఎంత పెద్దతప్పు జరిగినా నేనసలు ఆవేశానికి గురికాను" అనుకోవటం కూడా తప్పే. ఒక్కోసారి కోపాన్ని ప్రదర్శించకపోతే పనులు జరగవు. అవతలివారు మనల్ని అసమర్థులుగా జమ కట్టే ప్రమాదం ఉంది.

ఎమోషన్స్ ఉండాల్సిందే! కానీ ఎవరిమీద,

ఎంతవరకూ. ఏ సమయంలో, ఎలా ఆ ఎమోషన్‌ని ప్రదర్శించాలని తెలుసు కోవటమే జ్ఞానం. ఇది సాధ్యమేనా? సాధ్యమే. గౌతమబుద్ధుడి 'నిర్వాణ యోగ' దీనికి సంబంధించిందే. ఐదు ప్రశ్నలు వేసుకుంటే ఇలాంటి భావోద్వేగ నియంత్రణ సాధ్యమే. దీనినే 'ట్యూనింగ్' అంటారు.

1. ఎందుకు నాకీ కోపం?

2. నాది కోపమా లేక నిస్సహాయతా?

3. నాకు తరచూ ఈ మధ్య ఇటువంటి స్థితి కలుగుతోందా?

4. ఇలా కాకుండా నేను ఇంకో రకంగా ప్రతిస్పందించే అవకాశం ఉందా?

5. నేనిప్పుడు ప్రవర్తిస్తున్న విధానాన్ని రేపు నా అంతరాత్మ ఒప్పుకుంటుందా?

ఈ ఐదు సూత్రాలు అమలు జరిపి చూడండి. క్రమక్రమంగా మీ ప్రవర్తనలో ఒక అద్భుతమైన మార్పు మీకే తెలుస్తుంది.




ట్రాఫిక్‌లో ఎర్రలైట్ దగ్గర ఆపిన మీ వాహనాన్ని పక్కనుంచి రాసుకుంటూ ఒకడు జామ్మని దూసుకుపోయాడు. ఆవేశం తెచ్చుకోకండి. 'ఇంత తొందరగా వెళ్ళటం వల్ల ఓ నాలుగు నిమిషాలు సేవ్ చేస్తాడు. అంతేగా' అనుకోండి. మీకు ఇరిటేషన్ రాదు. తరువాత జంక్షన్లో అందరికన్నా చివరగా గోళ్ళు గిల్లుకుంటూ వాడు మీకు కనబడతాడు.

మీరెప్పుడయినా ఆలోచించారా? కోపంతో మార్చాలనుకున్న ప్రతీ సంఘటననీ ప్రేమతో కూడా మరింత బాగా మార్చవచ్చు. గౌతమ బుద్ధుడు ఒకచోట "కోపంలో నీ నోటి వెంట వచ్చే ప్రతీ మాటా నీ చేతిలో నిప్పుకణిక లాంటిది. దాన్ని అవతలివారి మీదకు విసురుదామనుకుంటావు. అది వారిని కాల్చదు. నీ నుంచి వారిని దూరంగా పారిపోయేలా చేస్తుంది. ఈ లోపులో నీ చేయి మాత్రం తప్పక కాలుతుంది" అంటాడు.

అతిగా కోపం వచ్చేవాళ్ళు నెలకొకసారి కేన్సర్ పేషంట్లకి పళ్ళు పంచాలి. మన ఫ్రస్ట్రేషన్‌లు ఎంత చిన్నవో తెలుసుకోవాలంటే నిజమయిన కష్టాల్ని స్వయంగా చూడమే మంచి మందు.

మూర్ఖుల మీద కోపం బురదలో పందుల్తో మల్లయుద్ధం చేయటం లాంటిది. ఇతరుల మీద కోపం వారిని మనకి దూరం చేస్తుంది. మన మీద మన కోపం మనల్ని మనకి దూరం చేస్తుంది. కోపం ఒక బలహీనత. దాన్ని జయిస్తే ఆనందం. లేకపోతే విషాదం. కోపం తగ్గించుకోవటానికి చిన్న చిట్కా.



మీ తప్పేమీ లేకపోయినా అవతలివారు మిమ్మల్ని ఛడమడా తిడుతున్నప్పుడు తిరిగి తిట్టకుండా, మనసు పాడుచేసుకోకుండా వారి కడుపు వైపు కన్నార్పకుండా చూస్తూ, వారి వీపుని నగ్నంగా ఊహించుకుంటూ "ఎందుకు అంత ఆవేశపడుతున్నావ్? పోతావ్‌రా! కిడ్నీలు ఎలా పాడవుతున్నయో వెనక్కి తిరిగి ఒకసారి చూసుకో" అని అనుకొంటూ వుండండి. వారు తిడుతూనే వుంటారు. మీకు నవ్వొస్తూనే వుంటుంది. కనీసం బి.పి. రాదు. కోప నిర్మూలనకి మరికొన్ని సూత్రాలు.

- 'కారణం లేకుండా నాకు కోపం రాదంటారు' చాలామంది. కానీ ఆ కోపకారణమే అకారణం. కారణం ఉన్నా లేకపోయినా కోపం కోపమే కదా.
- కోపానికి మందు మౌనం. శత్రువు 'చిరునవ్వు'. ఆత్మబంధువు దుఃఖం. మీరు కోపగ్రస్తులైతే. కాసింత సేపు ఉదయాన్నే మౌనంగా ప్రార్థన చెయ్యండి. ప్రొద్దున్న లేవగానే అయిదు సెకన్ల పాటు చిరునవ్వుతో అద్దంలో చూసుకుంటే, కోపం తగ్గుతుంది. చిరునవ్వు వల్ల మెదడులో విడుదలయ్యే 'సెరటోనిన్' రోజంతా ఆహ్లాదంగా వుండేలా చేస్తుంది.
- మగవారి కోపానికి అవుట్‌లెట్ స్త్రీలూ, చిరాకూ అయితే, స్త్రీల కోపానికి ద్వారాలు పిల్లలూ, కన్నీళ్ళు.
- భావాలకి మీరే బాధ్యత వహించండి. కుటుంబ సభ్యులతో ఇష్టంగా వుండండి. మిమ్మల్ని తరచూ విమర్శించేవారి నుంచీ, మీకు కోపం తెప్పించేవారి నుంచీ దూరంగా ఉండండి.
- కోపం రాగానే పిడికిలి బిగించి, గుండెల్నిండా గాలి పీల్చి, క్షణం తరువాత వదలండి. ఎడమ అరచేతిలో కుడిచేతి పిడికిలితో బలంగా, వేగంగా కొట్టుకుంటూ వుంటే క్రమక్రమంగా కోపం తగ్గిపోతుంది.

ప్రారంభంలో ఇది చాలా కష్టసాధ్యంగా కనబడుతుంది. కానీ కాస్త సాధన చేస్తే అలవాటవుతుంది. ఇది నేను అనుభవంతో చెప్తున్న మాట. కోపంలో సమాధానం చెప్పకుండా వుండగలగటం. సంతోషంలో వాగ్దానం చేయకుండా నిభాయించుకోగలగటం, వత్తిడిలో నిర్ణయం తీసుకోకపోవటం, ఆవేశంలో అబద్ధం చెప్పక పోవటం 'ఉద్వేగ నిబద్ధత' (ఎమోషనల్ బ్యాలెన్స్).

దేవుళ్ళు సైతం కోపానికి అతీతులు కారు. శివుడు ఆగ్రహిస్తే ఎదుట ఉన్న ఎంతటి వారికైనా శాపం తప్పదు. మహావిష్ణువు సైతం భావావేశానికి లోనయి మొసలి బారి నుండి ఏనుగును కాపాడే తొందరలో 'సిరికిన్ చెప్పలేదు... శంఖచక్ర యుగమున్ చేదోయి సంధింపలేదు'. లక్ష్మీదేవి పైటకొంగుని వదలటం సైతం మర్చిపోయాడు.

కోపానికి స్టాప్ బటనూ, తప్పుకి రివైండ్ బటనూ, కష్టానికి ఫార్వర్డ్ బటనూ, మంచికి పాజ్ బటనూ ఉంటే జీవితం అనే టేప్ రికార్డర్ అద్భుతంగా పని చేస్తుంది.

తనపట్ల తన ప్రేమ పెరగటానికి, మనిషి 'ఆత్మవిమర్శ' అనే ఆయిల్‌తో ఆ టేప్ రికార్డర్‌ని నిరంతరం సర్వీసింగ్ చేసుకుంటూ ఉండాలి.

(ఇంకా ఉంది)



తన చిన్నప్పటి థ్రిల్లింగ్ లవ్ అనుభవం గురించి కూతురికి చెప్తూ ఒక తల్లి, ''పదహారేళ్ళ వయసులో మీ నాన్నగారితో ప్రేమలో పడ్డాన్రా చిట్టీ. అప్పుడు తన వయసు పద్దెనిమిది. సినిమాల్లో ఇప్పుడు చూపిస్తున్న ఈ సీన్లన్నీ మన ఇంట్లో ఎప్పుడో జరిగాయి. అతను సరాసరి ఇంటికే రావడంతో అందరూ షాక్ తిన్నారు. '.... మా పెళ్ళికి అంగీకరించండి. మీరు ఒప్పుకోకపోయి నట్లయితే తను మేజర్ అయ్యేంతవరకూ ఉండి, ఆ తరువాత నాతో తీసుకెళ్ళి పోతాను. కానీ నాకు మీ ఆశీర్వాదాలు కావాలి' అని ధైర్యంగా అన్నాడు. మా నాన్నకీ, అతడికీ చాలా వాగ్వివాదం జరిగింది. చివర్లో నాన్న కోపంగా '...ప్రేమను అర్థం చేసుకునేంత వయసు మీకింకా రాలేదు' అన్నప్పుడు మాత్రం, అప్పటివరకూ మౌనంగా వారి వాదనలు వింటూన్న నేను ఆ మాటలకు అడ్డుపడి, ''.... ప్రేమకు వయసుతో సంబంధం లేదు నాన్నా...! ఏ వయసులో ప్రేమించా లన్నది అని ఎవ్వరూ నిర్ణయించ లేరు'' అని చెప్పాను.

ఏ వయసులో ప్రేమించాలి? ఎప్పుడు ప్రేమించాలి?

ఇలా మూడు సంవత్సరాల యుద్ధం తర్వాత, చివరికి మా తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. పెళ్ళి జరిగింది. మీ తాతయ్య అమ్మమ్మలు ఇప్పుడు మమ్మల్ని ఎంతగా ప్రేమిస్తున్నారో నీకూ తెలుసు. ఎప్పుడైనా చిట్టచివరి గెలుపు ప్రేమదే. ప్రేమే ఫైనల్...! ప్రేమే అల్టిమేట్...!''.

ఆఖరి వాక్యం చెప్పడం పూర్తవగానే అమ్మాయిల కాలేజీ ఆడిటోరియం కరతాళ ధ్వనులతో దద్దరిల్లింది.

''ఆగండి. నేను చెప్పాల్సింది ఇంకా పూర్తవ లేదు'' అని, తిరిగి ప్రారంభించాను. ''తల్లి మాటలు విన్న పదేళ్ల కూతురు విప్పారిన మొహంతో, '...ప్రేమకు వయసుతో పనిలేదని అన్నందుకు థ్యాంక్స్ మమ్మీ. ఇన్నాళ్ళూ చెప్పటానికి సందేహించాను. నా స్నేహితుడు నాన్న కన్నా ధైర్యవంతుడు. రేపు ఇంటికి తీసుకు వస్తాను. వాడి వయసు పన్నెండు. మేమిద్దరం మేజర్లు అయ్యేంతవరకూ వేచి ఉంటాము....' అని చెప్పింది'' అంటూ ముగించాను.

ఆడిటోరియంలో సూది పడితే వినబడేంత నిశ్శబ్దం అలుముకుంది. చప్పట్లు కొట్టాలో లేదో తెలియక అమ్మాయిలు సందేహంలో పడ్డారు.

***

వరంగల్ మహిళా కళాశాలలో పదిహేను రోజుల వ్యవధిలో ఇద్దరు అమ్మాయిలు చనిపోయారు. బాయ్‌ఫ్రెండ్ పెళ్ళి చేసుకునేందుకు నిరాకరించాడని మొదటి అమ్మాయి హాస్టల్‌లో ఉరి వేసుకుని చనిపోయింది. 'పెళ్ళి చేసుకోను' అన్నందుకు

రెండో అమ్మాయి బాయ్‌ఫ్రెండ్ ఏసిడ్‌తో దాడి చేశాడు. విచారించవలసిన విషయం ఏమిటంటే రెండు సంఘటనల్లోనూ బాధితులు మహిళలే. మానసికంగా డల్ అయిపోయిన విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడమని ఆ కాలేజీ వారు సెమినార్ ఏర్పాటు చేసారు.

ఇటువంటి సెమినారే మరొకటి సిర్పూర్ కాగజ్ నగర్‌లో జరిగింది. అయితే అక్కడి సమస్య కాలేజి విద్యార్థులది కాదు. ఏడు నుంచి పదో తరగతి పిల్లల మధ్య ప్రేమ. దాదాపు రెండు సభల్లోనూ ఒకటే ఉపన్యాస సారాంశం.

ఫిఫ్త్ క్లాస్‌లో ప్రేమ మీకు ఓకేనా?

''మీరంతా ప్రేమలో ఉన్నారని కానీ, ప్రేమలో పడొద్దని కానీ, చెప్పటం నా ఉద్దేశ్యం కాదు. నాలుగో క్లాసు చదువుతున్న మీ చెల్లెలు, అయిదో తరగతి చదువుతున్న అబ్బాయితో ప్రేమలో పడ్డానని చెప్తే మీరెలా స్పందిస్తారు? ఇప్పుడు మీరు ఆలోచించండి. మీ చెల్లెలి కన్నా మీరు ఎన్ని సంవత్సరాలు పెద్ద? మీ లెక్క ప్రకారం ప్రేమలో పడడానికి సరైన వయసు ఏది? ఎప్పుడు ప్రేమించాలి?''.

చాలామంది నేను చెప్పిన చివరి వాక్యాలతో ఏకీభవించరని నాకూ తెలుసు. కానీ కొన్ని చేదు వాస్తవాలు ఆ చిన్నపిల్లలకి చెప్పక తప్పదు. '...రాజమండ్రి ప్రాంతంలో జరిగిన యదార్థ సంఘటన ఒకటి చెప్తాను. అప్పటివరకూ నట్టింట్లో కళకళలాడుతూ తిరిగిన అమ్మాయి కనపడటం లేదు. మరుసటి రోజు

2

ప్రేమ ఒక కళ



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 9246502662



ప్రేరణ ఇచ్చేదైతేనే అది 'ప్రేమ' అవుతుంది. దిగులునీ, భయాన్నీ, అనుమానాన్నీ ఇచ్చేది కాదు

సాయంత్రం ''...రెండొందల కిలోమీటర్ల దూరంలో రాష్ట్ర సరిహద్దు దగ్గర, అర్థరాత్రి కారు ఆక్సిడెంట్లో ఆ అమ్మాయి మరణించిందని పోలీసుల నుంచి ఫోను. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతూన్న అమ్మాయి, మొదటి సంవత్సరమే చదువుతూన్న కుర్రాడితో కలిసి రహస్యంగా పెళ్ళి చేసుకోవటం కోసం మరో రాష్ట్రం వెళ్తుండగా జరిగిన ఆక్సిడెంట్. ముప్ఫై లక్షల క్యాషూ, పది లక్షల బంగారం ఆమెతో పాటు కార్లో దొరికిందన్న వార్త ఒక వైపు, తల్లిదండ్రులకి దుఃఖం, మంట కలిసిన పరువు మరో వైపు''.

జ్వరం తగ్గాలంటే ఎంత చేదుగా వున్నా సరే కషాయం తప్పదు. చెప్పటం కొనసాగించాను.

ప్రేమ ఒక అవకాశం!

''...ప్రేమ ఒక అవకాశం. మీరేదో 'ప్రత్యేకమైన' వారనీ, మీకేవో ప్రత్యేకమైన అర్హతలున్నాయనీ ఏ అబ్బాయి మిమ్మల్ని ప్రేమించడు. అతని చర్యల్ని మీరు రెసిప్రోకేట్ చేయడం వల్ల మిమ్మల్ని ప్రపోజ్ చేస్తాడు. మీరు స్పందించక పోయినట్లయితే ఇంకొక అమ్మాయి దగ్గరికి వెళ్తాడు. మీరిద్దరూ ఒకేచోట చదవటం యాదృచ్ఛికం. అందుకే దాన్ని 'అవకాశం' అన్నాను. ఇది నాణేనికి ఒకవైపు. మరో వైపు... అబ్బాయి ప్రపోజల్ అమ్మాయి 'ఓకే' చేయడానికి చాలా కారణాలుంటాయి. ఇంట్లో తల్లిదండ్రుల అఫెక్షన్ తక్కువ అవటం, తల్లిదండ్రులు తరచూ గొడవ పడడం, క్రమశిక్షణ గురించి రాత్రింబవళ్ళు చివాట్లు పెట్టడం, బాగా చదవటం లేదని పదే పదే మందలించడం, వీటన్నిటితో ఎంత వేగంగా ఆ ఇంటిని వదిలిపెడదామా అని కొందరు అమ్మాయిలు సినికల్‌గా మారతారు. బయటివారు ఓదార్పుగా ఒక చిన్నమాట అనేసరికి అదే ప్రేమ అనుకుంటారు. అయితే, వీటన్నికన్నా ముఖ్యమైనది సినిమాల ప్రభావం. చాలా దారుణమైన ప్రభావం అది.''

''సినిమా వారిని 'సప్నోం-కా-సౌదాగర్స్' అంటారు. వారు కలలను అమ్ముతారు. అత్యంత దుర్మార్గుడైన సంపన్నుడి కూతురితో హీరో ప్రేమలో పడతాడు. ముందు 'నో' చెప్పి ఆరు రీళ్ళ తర్వాత 'ఓకే' చెప్తుంది హీరోయిన్. ఆమెని పెళ్ళి చేసుకుని అతను కూడా సంపన్నుడయిపోతాడు. ఇందులో నాలుగు అభూత కల్పనలున్నాయి.

ఒకటి: డబ్బున్న వాళ్ళంతా చెడ్డవాళ్ళు. పేద వారంతా నీతికి కట్టుబడి ఉంటారు.

రెండు: ప్రేమించడం తప్ప కాలేజీలో ఇంకేమీ చెయ్యనక్కర్లేదు.

మూడు: ఒక అబ్బాయి నిరంతరం వెంటపడినట్లైతే ఆ అమ్మాయి 'యస్' చెప్పాలి.

నాలుగు: కేవలం హీరోయిన్‌కి మాత్రమే బాయ్ ఫ్రెండ్ ఉంటాడు, మిగతా వారంతా కేవలం ఎక్స్‌ట్రాలు.

అంతమంది అమ్మాయిల మధ్య కేవలం 'మిమ్మల్ని' మాత్రమే ఎన్నుకుని ఒక అబ్బాయి ప్రపోజ్ చేసినప్పుడు అది మీ ఇగోని సంతృప్తి పరుస్తుంది...! మీరు గాయపడ్డట్లైతే నన్ను క్షమించండి.

కానీ నా ఉద్దేశ్యం మీరు జీవిత సత్యాల్ని అర్థం చేసుకునేలా చేయడమే'' అని కొనసాగించాను. ''... నా ముప్ఫై అయిదు సినిమాల అనుభవంలో, ఒక్క కమల్‌హాసన్-శ్రీదేవి సినిమాలో తప్ప, మిగతా ఏ సినిమాలోనూ నా హీరో విద్యార్థి కాదు. చివరకు ***జగదేకవీరుడు-అతిలోకసుందరి***లో కూడా హీరో ఒక గైడ్. కాలేజీ ప్రేమను నేను సమర్థించను. ప్రేమించడానికైనా, ప్రేమింపబడటానికైనా పరిపక్వత ఉండాలని నేనంటే, దానికి మీలో కొందరు ఏకీభవించకపోవచ్చు. 'చదువు పూర్తయిన తర్వాతే పరిపక్వత వస్తుందా?' అని మీరు ప్రశ్నిస్తే నా దగ్గిర సమాధానం లేదు. మళ్ళీ చెప్తున్నాను. ప్రేమ వివాహాలకి నేను వ్యతిరేకిని కాను. ఆ మాటకొస్తే మా కొడుకు ప్రేమ వివాహాన్ని నేను స్వయంగా వెళ్ళి అమ్మాయి తండ్రితో మాట్లాడి, వయసు, కులం, గోత్రం వగైరా విషయాల్లో కొన్ని అబద్ధాలు చెప్పి మరీ చేసాను. వారిజాక్షులందు, వైవాహికములందు' అన్న పద్యం అందుకే పుట్టిందనుకుంటాను (నవ్వులు)''.

ఏది జరిగినా నష్టం అమ్మాయిలకే

శ్రోతలు అమ్మాయిలు కాబట్టి వారి కోణంలోనే మాట్లాడాను... ''...ఒక అబ్బాయి మీతో 'స్వచ్ఛమైన స్నేహం' అని ప్రారంభిస్తాడు. మీ మనసులో ఏ ఉద్దేశ్యమూ లేదు కాబట్టి అతడి స్నేహాన్ని ఒప్పుకుంటారు. రెండు మూడు సార్లు కలిసి తిరిగాక అతడు స్నేహం నుంచి ఇంకొంచెం పై స్థాయికి తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తూ ఉంటాడు. ఆ విషయం మీకు అర్థమవుతూనే ఉంటుంది కానీ, అతడు బయటపడినప్పుడు కదా అప్పుడు చూసుకుందాం' అన్న ఉద్దేశ్యంతో మీరుంటారు. ఈ లోపులో ఇంట్లో మరో సంబంధం కుదరటమో లేక మీరు ఇష్టపడే మరో వ్యక్తి పరిచయం అవ్వటమో జరుగుతుంది. దాంతో మీ మొదటి స్నేహితుడు ఆవేశపడతాడు. అతనిలో ఏ మాత్రం ఉన్మాద లక్షణాలున్నా అది యాసిడ్ దాడికి దారితీస్తుంది. అలా కాకుండా సీను రివర్సయి, ఒక వేళ మీరే ఈలోపులో అతడి ప్రేమలో పడి కమిటయి



మోసపోతే 'మౌన పోరాటం' చేయవలసి వస్తుంది. ఏది జరిగినా నష్టం అమ్మాయిలకే...''

అవునన్నట్టు కొందరు తలలూపారు.



ఫేస్‌బుక్‌లో మరుగుజ్జు మోసం!

''... టీనేజర్స్ ఎంత అమాయికంగా మోసపోతారో ఇటీవలే హైదరాబాదు పరిసరాల్లో జరిగిన ఒక యదార్థ సంఘటన చెపుతాను. ఫేస్‌బుక్‌లో ఒక అమ్మాయి ఒక అబ్బాయితో మాటలు కలిపింది. నెల రోజుల గాఢప్రేమ తరువాత అతడు తన రెండు కిడ్నీలు పాడైపోయామని, హాస్పటల్లో మరణశయ్య మీద ఉన్నానని, మూడు లక్షల రూపాయలు అవసరమౌతాయని ఫోన్లో ఏడుస్తూ చెప్పాడు. అక్క పెళ్ళి కోసమని దాచిన డబ్బు, నగలు ఆమె అతడి స్నేహితులకి అందజేసింది. తరువాత అతను మాయమయ్యాడు. పోలీసులు ఆ నిందితుడ్ని పట్టుకున్నప్పుడు ఒక దిగ్భ్రాంతికరమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఆమె దగ్గర డబ్బు తీసుకున్న వారిలో అతను కూడా ఒకడు. ఆ అబ్బాయి ఒక మరుగుజ్జు....''

శ్రోతలు నమ్మలేనట్టు చూసారు. ఒకమ్మాయి 'మైగాడ్' అనుకోవటం అస్పష్టంగా వినిపించింది... ''... ఫేస్‌బుక్‌లో లాగే... సాయంత్రం పూట పార్కుల్లో కలుసుకునే ప్రేమల్లో కూడా అవతలివారి అలవాట్లు బయటపడవు. బద్ధకం, కోపం, శుభ్రత, టైం మానేజ్‌మెంట్ లేకపోవటం లాంటి ఇతరత్రా బలహీనతలు తెలియవు. కేవలం బాడీ-కెమిస్ట్రీ ప్రముఖ పాత్రను వహిస్తుంది. ప్రేమ వేరు. ఆకర్షణ వేరు. ఆకర్షణ కళ్ళను మూసి ఉంచితే, ప్రేమ వాటిని తెరచి ఉంచుతుంది. అయితే దీన్ని ఎవ్వరూ ఒప్పుకోరు. 'మాది ప్రేమ కాదని నీకెలా తెలుసు?'' అని వాదిస్తారు. అవున్నిజమే. ఇన్‌ఫ్యాచుయేషన్‌కు ప్రేమకు మధ్య తేడాను చెప్పడం చాలా కష్టం..'' వారి దృష్టిని కేంద్రీకరించడానికి కాసేపు ఆగాను.

''...కొంతమంది అమ్మాయిలకు ప్రేమ ఒక 'థ్రిల్'. కానీ చాలామంది అమ్మాయిలకు ప్రేమ గమ్యం 'పెళ్లి'...! గమ్యం పెళ్ళయినా, థ్రిల్లయినా ప్రేమ ఒక గమ్మతయిన మత్తు, చదువుకునే వయసులో, నిర్వాణ-యోగాలో మీరు మాస్టర్ అయితే తప్ప, చదువునీ - ప్రేమ తాలూకు ఆలోచనలనీ విడివిడిగా కంపార్ట్‌మెంటలైజ్ చేయలేరు... ''... ఎటో వెళ్ళిపోయింది మనసు: ఈ వేళలో నీవు ఏం చేస్తూవుంటావు: అరె ఏమైందీ-ఒక మనసుకి రెక్కలొచ్చి, ఎగిరిందీ' అన్న పాటలు ఆ విధంగా వచ్చినవే (నవ్వులు). ప్రేమించడానికి భవిష్యత్తులో చాలా సమయం ఉంటుందని నేను సలహా ఇస్తే... ''... ప్రేమ అనేది ప్రీ-ప్లాన్డ్ కాదు. అది ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది' అని మీరు వాదించవచ్చు. కరెక్టే. కానీ ఎడ్యుకేషన్ 'దాని కంటే ప్రీ-ప్లాన్డ్' అంటే మీరు ఒప్పుకోరా? మనసులో చాలామందిమి మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చిన వాళ్ళమే. బాగా చదివి, తొందరగా సెటిల్ అయి తల్లిదండ్రులకు న్యాయం చేయడం మన ముఖ్య లక్ష్యం. కాదంటారా?'' వాళ్ళని కాన్ఫిడెన్స్‌లోకి తీసుకుంటున్నట్టు చెప్పాను.

''ప్రేమంటే నమ్మకం. ఒక కుర్రాడి వద్ద కుక్కీలు, ఇంకో అమ్మాయి దగ్గర స్వీట్లు ఉన్నాయి. ఆ కుర్రవాడు అమ్మాయి స్వీట్లకి బదులు తన కుక్కీలు ఇస్తానన్నాడు. ఆమె కూడా ఒప్పుకుంది. అతడు తన వాటిలో కొన్నిటిని రహస్యంగా దాచిపెట్టి మిగతావి ఇచ్చాడు. ఆ రాత్రి ఆ పాప ప్రశాంతంగా పడుకుంది. కాని ఆమె తనని మోసం చేసిందేమో అన్న ఉద్దేశ్యంతో ఆ కుర్రవాడికి నిద్రపట్టలేదు. ఈ కథలో నీతి ఏమిటంటే, మన నూరుశాతం ఇవ్వనప్పుడు అవతలివారు మనకి పూర్తిగా ఇచ్చారా లేదా అని నిరంతరం అనుమానిస్తూ, బాధపడుతూనే ఉంటాము. దీనికి రివర్సులో ఆలోచించండి. మనం నూరుశాతం ఇచ్చి, అవతలివారు ఇవ్వకపోతే?''

ఆలోచించేందుకు వాళ్ళకు కొంత సమయాన్నిచ్చి మళ్ళీ ప్రారంభించాను. ''ఒక అబ్బాయి తన లవర్‌ని ఇంట్లో పెద్దలకు ఎందుకు పరిచయం చెయ్యడని ఎప్పుడైనా ఆలోచించారా? ఉద్యోగం వచ్చేంతవరకూ తమ తల్లిదండ్రులతో ప్రేమ వ్యవహారం చెప్పకుండా దాచి, ఎగిరిపోయేందుకు రెక్కలు వచ్చే వరకూ వేచి చూస్తాడు. ఆ తరువాత తల్లిదండ్రుల్ని 'పెళ్లికి ఒప్పుకోక పోయినట్లయితే మిమ్మల్ని వదిలేస్తా'నంటూ ఎమోషనల్‌గా బ్లాక్ మెయిల్ చేస్తాడు... అవునా? పాతికేళ్ళు పైగా పెంచి పోషించిన తల్లిదండ్రులను ఆ విధంగా సులభంగా వదిలెయ్య గలిగినవాడు, రేపు ఇంకా మంచి ఆకర్షణ కనపడితే మీకు అన్యాయం చేయడని గ్యారంటీ ఏమిటి? అటువంటి వ్యక్తిని ఎలా నమ్మగలరు?''

అమ్మాయిలు దిగ్భ్రాంతులైనట్లుగా చూసారు.

''అలా కాకుండా, వరకట్నం కారణంగానో, తల్లిదండ్రులు ఒప్పుకోలేదనో, తల్లి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిందనో, మీపై ఉత్సాహాన్ని కోల్పోవడం చేతనో, ఒక వేళ అతను మొహం చాటేస్తే, ఆ తరువాత పరిణామాలు ఏమిటో ఆలోచించారా? మీ ప్రేమ విషయం ప్రపంచం మొత్తానికి తెలిసిపోయిన తర్వాత చివరికి నష్టపోయేది ఎవరు? మీరా లేక మీ స్నేహితుడా? అబ్బాయిల కంటే అమ్మాయిలు సెంటిమెంటల్ అని, ఎక్కువ బాధకు గురవుతారని తెలిసిందే కదా'' చివరి వాక్యంతో వారి మొహాల్లో సీరియస్‌నెస్ కాస్త తగ్గింది.

''మీరు ప్రమాదంలో ఉన్నప్పుడు మిమ్మల్ని రక్షించేందుకు మీ స్నేహితుడు వస్తాడా లేదా అన్నది కాదు. అది సందర్భరహితం. అతడు రావచ్చు, రాకపోవచ్చు. కానీ ఒకవేళ రానట్లయితే మాత్రం ఫిర్యాదు చేయొద్దు. 'ఎవరు నిజమైన ఫ్రెండ్?' అని ఎన్నటికీ అడగద్దు. 'నేను నిజమైన ఫ్రెండ్‌నా?' అని అడగండి. అది సరైన ప్రశ్న. ఎవరితో అయితే మీ సమయాన్ని అధికంగా గడపగలరో, ఎవరైతే మీపై గొప్ప ప్రభావాన్ని చూపుతారో, అటువంటి వ్యక్తితో సంబంధం ఏర్పరచుకోండి. ఆ ఫ్రెండ్ బలహీనతలను అర్థం చేసుకోండి. క్రమశిక్షణతోనో లేక భయపెట్టో ఆ ఫ్రెండ్‌ని మార్చండి. మీరే మార్చలేకపోతే ఇంకెవరు మార్చగలరు? ఆ ఫ్రెండ్ ఎవరో తెలుసా? 'మీరే....!'


ఒక్కసారిగా చాలామంది నోట వెంట సంభ్రమంగా వచ్చిన... 'ఓ' అన్న పదం అక్కడ గాలితో నిండింది.

ఇంకా మంచి మోడల్ దొరకవచ్చేమో!

''నా ఆఖరు ప్రశ్నకి సమాధానం చెప్పండి... ఉద్యోగం వచ్చాక మీరు ఒక చిన్నకారు కొనుక్కోవాలనుకుంటే, దానికి ఇప్పుడే అడ్వాన్సు కడతారా? కట్టరు. ఎందుకంటే దీని కంటే మంచి మోడల్ కారు రావొచ్చు. లేదా పెద్ద ఉద్యోగం వస్తే, మీరు దీని కంటే ఇంకా ఖరీదైన కారు కొనేంత ధనవంతులు అవ్వచ్చు...'' అని ఆగి, ఆఖరి వాక్యాలు పూర్తిచేసాను. ''...ఒక చిన్నకారు కొనేటందుకే కొన్ని సంవత్సరాలు వేచి ఉండగలిగినప్పుడు, భవిష్యత్తు ఏమిటో తెలుసుకోకుండా ఒక అబ్బాయిని తొందరపడి ఎందుకు ఎన్నుకుంటున్నారు? మీరు భవిష్యత్తులో ఐ.ఎ.యస్. లేదా పోస్ట్‌గ్రాడ్యుయేషనో చేస్తున్నప్పుడు, ఇంకా మంచి మోడల్ దొరకవచ్చేమో ఎవరికి తెలుసు...?''

ఆడిటోరియం చప్పట్లతో ధ్వనించింది. దీప్తివంతమైన అమ్మాయిల మొహాల్ని చూస్తే, మా ఉద్దేశ్యం ఫలించిందనిపించింది.

(ఇంకా వుంది)



ప్రేమ ఒక కళ 3



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 9246502662

టెన్షన్, భయం లేకపోతే జీవితమే లేదు!

సుఖప్రదమయిన వర్తమానానికి ప్రథమ శత్రువు 'భవిష్యత్తు భయం'. విద్యార్థి సంతోషానికి శత్రువు 'పరీక్ష భయం'. ప్రేమకి శత్రువు 'పెద్దల భయం'. ఆ విధంగా చూస్తే మనిషి మనస్ఫూర్తిగా తనని తాను ప్రేమించుకోకుండా చేసేది 'భయం'. ఒక్క భయమే కాదు. 'టెన్షన్', 'బద్ధకం', 'మొహ మాటం' లాంటివన్నీ ఆనందానికి శత్రువులే.

మనం భయపడే కొద్దీ అవతలివారు మన బలహీనతల మీద ఆడుకొంటారు. చాలామంది క్రికెటర్‌ల మణికట్లకి తాళ్ళూ, మెడలో దండలూ మెండుగా కనపడుతూ వుంటాయి. ఎక్కడైతే ఒక అభద్రతాభావం ఉంటుందో, అక్కడ ఒక బాబానో, జ్యోతిష్యుడో పబ్బం గడుపుకుంటూ వుంటారు. విజ్ఞులు తెలుసుకోవలసింది ఏమిటంటే, రంజీ ఆడేవారికి కూడా తాయత్తులుంటాయి. కానీ వందమంది రంజీ ఆటగాళ్ళలో కేవలం ఒకరే దేశానికి సెలెక్ట్ అవుతారు.



దేశానికి ప్రాతినిధ్యం వహించాలంటే ఇంకా బాగా ఆడాలి. ఆటకి కావల్సింది ప్రత్యర్థి ఎత్తుకి పైఎత్తు. తాయెత్తు కాదు.

"ఈ ఉత్తరాన్ని వందమందికి పంపకపోతే నీ బ్రతుకు బందరు బస్‌స్టాండ్ అవుతుంది" అని వ్రాస్తాడొకడు. "ముఖద్వారం మార్చకపోతే నీ వ్యాపారం మటాష్" అంటాడు ఇంకొకడు. "కడుపు మీద ఊచతో ఎర్రగా కాల్చకపోతే నీ కొడుకు కడుపు నొప్పి తగ్గదు" అంటారు ఇంకొకరు. అమెరికాలో తన ఇల్లు మంచి ధరకి అమ్ముడవటం లేదని, భీమవరం సిద్ధాంతి సూచనల మేర, ఆ ఇంటి ఎనిమిది దిక్కులా మట్టీ తవ్వి పాకెట్లలో పెట్టి, వాటిపై 'ఈశాన్యం' వగైరా పేర్లు వ్రాసి. 5 లక్షల రూపాయల డ్రాఫ్టుతో కలిసి పూజ నిమిత్తం పంపాడొక ఎన్నారై.

మీరెలా ఉండాలనుకున్నారో, ఎలా ఉన్నారో – ఆ వ్యత్యాసం ఎక్కువయ్యేకొద్దీ టెన్షన్ ఎక్కువ అవుతుంది. గొప్ప నిర్వచనం ఇది. కన్‌ఫ్యూజింగ్‌గా వుందా? మీరేపాటికి ఆడపెళ్లి వారిచ్చిన విడిదిలో, నలుగు పెట్టుకుని 'పెళ్లిస్నానం' చేస్తూ వుండాలి. నలిగిపోయిన బట్టల్తో ఆగిపోయిన బస్సులో ఉన్నారు. టెన్షన్...! నవ్వుతూ పరీక్ష వ్రాయాలను కొన్నారు. ఒక ప్రశ్న అర్థమయితే ఒట్టు. టెన్షన్....! తండ్రి అవ్వాలనుకున్నారు. డెలివరీ (మీకు కాదు) అవటం లేదు. టెన్షన్...!

సినిమా వారి భయాలు వేరు. విడుదల కాక దర్శకులూ, విడుదలకి ముందు నిర్మాతలూ, విడుదల అయ్యాక పంపిణీదారులూ ఏడవటం, కళ్ళజోళ్ళు విరగకొట్టటం, విస్కీ బాటిళ్ళు విసిరెయ్యటం, మందు కొడుతూ తుపాకుల్తో కాల్చుకోవటం అక్కడే ఎక్కువ చూస్తాం.

ఇన్ని నష్టాలున్నా సరే మనిషన్నాక కాసింత టెన్షన్ కావాలి. నష్టం వల్లే లాభం విలువ తెలుస్తుంది. ఉన్నట్టుండి మీ బిల్డింగ్ కాస్త కదిల్తే, మీరు వెంటనే లేచి బయటకు పరుగెత్తటానికి సాయపడేది 'పాజిటివ్' భయం. బంగీజంప్‌లో రక్తాన్ని పరుగులెత్తించేది 'ఆనందంతో' కూడిన భయం.

జూదం ఆడేది కేవలం డబ్బుల కోసం కాదు. కళాపోషణలో కాస్త టెన్షన్ ఉంటుంది. అందుకే జూదం ఒక్కరే ఆడలేరు. "ఎందుకు గంటల తరబడి ఆ వెధవ పేకాట. మీకు ఆ దరిద్రపు ఆటలో ఎంత వస్తుందో చెప్పండి. మా నాన్నని అడిగి తెప్పిస్తాను" అంటుంది ఇల్లాలు. "చూడమ్మా! పేకాడేది కేవలం డబ్బు కోసం కాదు. ప్రసవ వేదనలో వున్న సుఖం నాకెలా తెలీదో, పేకాటలో 'లాస్' వస్తూంటే వచ్చే కిసి నీకు తెలీదు. తెలియని విషయాల గురించి చర్చ ఎందుకు చెప్పు?" అని ఫిలాసఫి చెపుతాడు మొగుడు. పోలిక తప్పయితే క్షమించాలి. చెప్పదల్చుకున్న విషయం ఏమిటంటే, టెన్షన్ లేకపోతే జీవితం లేదు. భయం అనేది లేకపోతే మనిషికి ఇన్ని తెలివితేటలు పెరిగేవి కావు.

అపాయం తప్పిపోగానే కొందరు నెర్వస్‌గా నవ్వుతారు. ఏడవలేక నవ్విన నవ్వు అది. చిన్నపిల్లాడిని ఎగరేసి పట్టుకుంటే నవ్వుతాడు. అది ఆనందం



అని మనం పొరపాటు పడతాం. కాదు. 'ఈ సాడిస్టు దుర్మార్గుడితో నాకు పెద్ద ప్రమాదం తప్పింది కదా' అన్న రిలీఫ్‌తో వచ్చిన నవ్వు అది.

మనపై మనకి ప్రేమని తగ్గించే మొహమాటం

ఇతరులకి 'నో' చెప్పటం మనని వారికి దూరం చేయవచ్చు కానీ 'యస్' చెప్పటం మనని మనకి దూరం చేయకూడదు కదా...! ఇతరుల కోరికలకీ, మన ఇబ్బందులకీ మధ్య సరి అయిన గీత గీసుకోగలిగితే మానవ సంబంధాలు బావుంటాయి. ఇతరుల అభిప్రాయాలతో సంబంధం లేకుండా తన విలువల్తో బ్రతగ్గలగటం గొప్ప కళ.

ఇవ్వటం వల్ల వచ్చే ఆనందం కన్నా, కోల్పోయే దాని వల్ల వచ్చే విషాదం ఎక్కువైతే దాన్ని 'మొహమాటం' అంటారు. కోల్పోయేదాని వల్ల వచ్చే విషాదం కన్నా, ఇచ్చేదాని వల్ల వచ్చే ఆనందం ఎక్కువైతే దాన్ని 'దాతృత్వం' అంటారు.

అందరితో మంచి అనిపించుకోవటానికి చేసే ప్రయత్నం ఒక రకమైన కాంప్లెక్సు. ఆస్తి, అధికార ప్రదర్శన మరో మానసిక రోగం. ఈ కాంప్లెక్సులు రకరకాలుగా ఉంటాయి. ఉదాహరణకి డబ్బు విషయం తీసుకుందాం. మనం ఎంత అనుభవిస్తామో అది మన ఆస్థి. ఎంత ఇతరులకి చూపించాలనుకుంటామో అది మన కాంప్లెక్స్. 'ఇంకే విధమైన ఐశ్వర్యమూ లేని వాళ్లే తమ వైభోగాన్ని అందరూ గుర్తించాలి అనుకుంటారు' అని ఎక్కడో వ్రాసాను.

చుట్టూ వున్న వ్యక్తుల అందం, మొగతనం, పవర్, హోదా, కళ్ళు మిరిమిట్లు కొలిపే డబ్బు, ఐశ్వర్యం చూసి మీకు డిప్రెషన్ అభద్రతా భావం కలుగుతూ వుండవచ్చు. కానీ ఒక్కసారి ఆలోచించండి. మీ మిత్రబృందంలో మీకు బాగా నచ్చే వ్యక్తి ఎవరు? చాలా సందర్భాల్లో మీకు నచ్చే వ్యక్తిలో ఆ అర్హతలేమీ



వుండి వుండవు.

శృంగారానికి బద్ధకం ఉన్నదా?

మొహమాటమూ, ఆత్మన్యూనతా భావమూ లాగే, మనిషికి తనపట్ల తనకి ప్రేమను తగ్గించే మరో రోగం బద్ధకం. బద్ధకం వేరు. విశ్రాంతి వేరు. పనికి పనికీ మధ్య శ్వాస తీసుకోవటం విశ్రాంతి, అసలు పనే చేయకపోవటం బద్ధకం. బద్ధకానికి ముగ్గురు

శరీరాన్ని స్పృశించటం ప్రేమలో ఒక భాగం. మనసుని స్పృశించటంతో ప్రేమ సంపూర్ణం.

చెల్లెళ్ళు. నిర్లిప్తత, నిర్వేదం, నిరాసక్తత.

ఒక బ్రహ్మచారి కుర్రాడు డిన్నర్ ప్లేట్లని వదిలేసి రెండో ఆట సినిమాకి వెళ్లాడు. మరుసటిరోజు ప్రొద్దున్న ఆలస్యంగా నిద్ర లేచి హడావుడిగా ఆఫీసుకు వెళ్ళిపోతాడు. సాయంత్రం వచ్చే సరికి గదంతా వాసన వస్తూ వుంటుంది. శుభ్రం చేద్దామని చాలా నిజాయితీగా అనుకుంటాడు. కానీ శరీరం సహకరించదు. బయట నుంచి బిర్యానీ తెప్పించుకుంటాడు. ఆ విధంగా నెమ్మదిగా వాసనకి అలవాటు పడతాడు. తన నుంచి బద్ధకం అనే దుర్వాసన వస్తోందన్న విషయాన్ని గ్రహించడు.

ఆఫీసర్స్‌కి ట్రయినింగ్ ఇస్తూ, 'మీలో బద్ధకం వున్నవారు చేతులెత్తండి' అని అడుగుతాను. చెయ్యి ఎత్తటానిక్కూడా బద్ధకం ఉన్నవారు తప్ప అందరూ ఎత్తుతారు. అసలు 'బద్ధకమంటే ఏమిటి?' అన్న ప్రశ్నకు '1. పని మీద ఆసక్తి లేకపోవటం 2. తరువాత చెయ్యొచ్చులే తొందరేముంది అని వాయిదా వేయటం 3. నేను చేయకపోతే మరొకరు చేస్తార్లే అనుకోవటం' లాంటి పాయింట్లు దొరుకుతాయి.

బద్ధకం క్షణాల్లో పోవాలంటే ఏం చెయ్యాలో ఒక గొప్ప చిట్కా చెప్తానంటాను. యువకులందరూ ఉత్సుకంగా చూస్తారు. ఈ మూడు పాయింట్లనీ బెడ్‌రూంలో ఫ్రేము కట్టించి, పడుకోబోయే ముందు చదవమంటాను. రెండు నిముషాల తరువాత నేను చెప్పింది అర్థమై ఆడిటోరియం నవ్వుల్తో దద్దరిల్లుతుంది.

బద్ధకం అని సెపరేట్‌గా ఏమీలేదు. అవసరమైన పని మానేసి ఇష్టమైన పనిచేసి, తరువాత బాధపడటాన్నే బద్ధకం అంటారు. చదువు బోర్‌కొట్టి విద్యార్థి టీ.వి. ఆన్‌చేయడం. గదిలో టీ.వి. చదువుకుని బోర్ కొట్టేలా చేస్తుంది.

మీకు రోజురోజుకి బద్ధకం ఎక్కువవుతోందా? నెలకు అరకేజీ బరువు ఎక్కువవుతున్నట్లు ఫీలవుతున్నారా తిండి తగ్గించు కోలేకపోతున్నారా? వ్యాయామం చేయబుద్ధవడం లేదా? ఈ సారి రైల్వే స్టేషన్‌కి గానీ, ఎగ్జిబిషన్‌కి గానీ లేదా మార్కెట్‌కి గానీ వెళ్ళినప్పుడు, మీ చుట్టూ వున్న జనంలో బాగా లావుగా వున్నవాళ్ళని, ముప్ఫైఏళ్ళకే రెట్టింపు బరువు మోస్తున్న ఊబకాయుల్ని చూడండి. ఆటో ఎక్కడానికీ, సిటీబస్‌లో ప్రయాణించడానికి వారెంత కష్టపడుతున్నారో, నడవడానికి ఎంత ప్రయాసపడుతున్నారో గమనించండి. కొన్నాళ్ళకి మీ పరిస్థితి కూడా అలాగే వుంటుందన్న నిజాన్ని ఊహించుకోండి. పది రోజులు ఇలా జరిగే సరికి మీ శరీరం అంటే మీకు భయం పుడుతుంది. ఎక్కువ తినాలంటే అసహ్యం వేస్తుంది. ఎక్సర్‌సైజ్ చేయకపోతే గిల్టీ ఫీలింగ్ ఏర్పడుతుంది. మీలోనే క్రమక్రమంగా ఒక మార్పు రావటాన్ని మీరు గమనిస్తారు.

కూతురి పెళ్ళిలో ఆఫీసు విషయాలు చర్చించే వర్క్-హాలిక్స్:

ఒక లిమిట్ దాటి పనిని ప్రేమించేవారిని భార్యాపిల్లల్తో సహా ఎవరూ ప్రేమించరు. వర్క్ ఇంటరెస్ట్ (ఎక్కువ పని చేయటం) వేరు. వర్క్‌హాలిజం (పనిలోనే మునిగిపోవటం) వేరు. కన్‌ఫ్యూజ్ అవ్వొద్దు.

సమర్థులు పనితో పాటూ ఆటలూ, యాత్రలూ, స్నేహితులూ మొదలైన రెలాక్సేషన్ టెక్నిక్స్ ద్వారా ఆనందం పొందుతారు. ఉత్తేజితమౌతారు.

వర్క్‌హాలిక్స్ అలా కాకుండా ఒకేపనిలో మునిగి



ఉంటారు. పార్టీల్లో అవతలివారు వింటున్నారో లేదో కూడా పట్టించుకోకుండా పని గురించే మాట్లాడ తారు. తాము సాధారణ ప్రజల కంటే పై అంతస్థులో ఉన్నామని అభిప్రాయపడుతూ ఉంటారు. ''హృదయం కోల్పోవటం'' అంటే ఇదేనని వీరెప్పటికి తెలుసుకోలేదు.

వర్క్‌హాలిక్స్ ఈ క్రింది లక్షణాలు కలిగి ఉంటారు. ''రాత్రిళ్లు గుడ్లగూబలా మేల్కొని, పొద్దున్నే కోడిపుంజులా లేచి నా సంస్థ కోసం పని చేస్తాను/ మా నైట్ వాచ్‌మెన్ డ్యూటీ దిగక ముందే ఆఫీసుకుకి చేరుకుంటున్నందుకు నేను గర్వపడ తాను/ఏదైనా సభలో ఉన్నప్పుడు నాకు తరుచుగా ఫోన్లు రావటాన్ని గర్వంగా ఫీలవుతారు/సినిమా హాల్లో భార్యతో కలిసి సినిమా చూస్తున్నప్పుడు కూడా ఆఫీసు నుంచి వచ్చే మెసేజ్‌ల కోసం తరచు సెల్‌ఫోన్ చెక్ చేస్తూ ఉంటాను/హోటల్లో నా భార్య మెనూ చదువుతూ ఉంటే, నేను నా ఆఫీసు వారికి ఫోన్లో సూచనలు ఇస్తూ ఉంటాను.

వర్క్‌హాలిక్స్ శెలవుల్ని ఆనందించలేరు. సిని మాలు, టివి లాంటి తాత్కాలిక ఆనందాలకోసం, 'గమ్యాన్ని' వదులు కోవటం మూర్ఖత్వం. కానీ కేవలం గమ్యం కోసం సంసారమూ, పిల్లలూ లాంటి 'ఆనందాలన్నీ' వదులుకోవటం అంతకన్నా మూర్ఖత్వం. వర్క్‌హాలిక్స్ భార్యను సంతోష పెట్టటం కంటే, బాధ్యతలు అప్పగించటంలో ఎక్కువ సంతో షిస్తారు. అందుకే తరచూ ''నా భార్య లేకుంటే నేనేదీ సాధించేవాడిని కాదేమో'' అని అందరికీ చెప్తూ ఉంటారు.

జీవితం పట్ల ప్రేమ:

పెయింటింగ్, మ్యూజిక్, బర్డ్ వాచింగ్, మంచి స్నేహం... అన్నీ ఆనందాలే. నది ఒడ్డున ప్రాణ స్నేహి తుడితో గంటసేపు నిశ్శబ్దంగా గడిపి తిరిగివస్తూ, ''ఇంత అందమైన సంభాషణ ఇంతవరకూ ఎప్పుడూ జరగలేదు'' అని సంతృప్తిగా అనుకోవటమే ఆనందం.



మీరు పౌర్ణమిని చూసి ఎన్ని రోజులైంది? ఆరు బయట ఆకాశాన్ని చూస్తూ వెల్లకిలా పడుకొని ఎంత కాలం అయింది? ఈ మధ్య చెరువులో స్నానం చేశారా? లైబ్రరీలో అరుదైన పుస్తకం చద వటం, ఆడిటోరియంలో కచేరి వినటం, పెయింటింగ్ ఎగ్జిబిషన్‌కి వెళ్ళటం లాంటి ఉత్తేజకరమైన ఆనందాలూ, ఉత్పాదకర మైన కోరికలు ఏ మాత్రం ఖర్చు లేనివి. శక్తుల్ని ఉత్తేజపరుస్తాయే తప్ప నష్టం కలి గించవు. ఆనందాన్నిచ్చే పాజిటివ్ బ్లిస్ పాయింట్స్‌ని గుర్తించలేకపోవడం జీవి తంలో అతిదైన్య స్థితి.

> **మనిషన్నాక కాస్తంత టెన్షన్, భయం ఉండాలి. ఈ రెండూ లేకపోతే జీవితం ఉండదు. తెలివితేటలూ పెరగవు. మనల్ని మనం తీర్చిదిద్దుకోవాలంటే భయం ఉండాల్సిందే. చిన్న చిన్న ఆనందాల్ని కోల్పోకూడదు. ఇంకా మానవ సంబంధాలు బాగుండాలంటే ఏం చెయ్యాలో కూడా ఈవారం ఎన్నో చిట్కాలు చెప్పారు యండమూరి.**



ఇక డబ్బు విషయానికి వద్దాం. ఒక బీదవాడు ఫుట్‌పాత్ మీద సుఖంగా నిద్ర పోవచ్చు. ఒక ధనికుడికి ఎయిర్ కండిషన్డ్ గదిలో కూడా సరిగ్గా నిద్ర పట్టకపో వచ్చు. దాని అర్థం మనిషి ఎయిర్ కండిష నర్లు కోరుకోకూడదని కాదు. డబ్బు ఆనం దాన్ని ఇవ్వకపోవచ్చు. కానీ నిశ్చయంగా సుఖాన్ని ఇస్తుంది. ఆనందంలో సుఖం ఖచ్చితమైన అంతర్భాగం. కుటుంబంతో స్టార్ హోటల్‌కి డిన్నర్‌కి వెళ్లినప్పుడు మెనుకార్డ్‌లో కేవలం ఎడమ వైపు చూసి (కుడివైపు ధరలు వుంటాయి కాబట్టి) ఇష్టమైన పదార్థాలు ఆర్డర్ ఇవ్వగలిగే స్థాయికి రావటం అభిలషణీయమే కదా.

వేదాంతం వేరు. వైరాగ్యం వేరు. కోరికలు లేక పోవటం వేరు. కోరికని చంపేసుకోవటం వేరు. కోరిక లన్నీ తీర్చుకుని చనిపోవటం వేరు.

తృప్తికి మించిన ఆనందం లేదు. అయితే తృప్తి వేరు, బద్ధకం వేరు. ఈ విషయంలో చాలా మంది పొరపాటు పడుతుంటారు. ''నేను సంతృప్తిగా బ్రతుకుతున్నాను'' అనుకొనే వాడికి 3 లక్షణాలుండాలి.

1. తనకున్నా ఎక్కువ డబ్బు, కీర్తి, అధికారం కలి గిన వారిని చూసి అసూయ పడకుండా 'ఇంత కన్న సుఖాలు నాకవసరం లేదు' అని మనస్ఫూ ర్తిగా అనుకోగలగాలి.
2. ఇంకా ఎక్కువ డబ్బు సంపాదించకపోతే భవి ష్యత్తు ఏమౌతుందో అన్న భయం లేకుండా, తన వాళ్ళతో ప్రస్తుతం సంబంధాల పట్ల అభద్రతా భావం లేకుండా ఉండగలగాలి. బ్రతకగలగాలి.
3. ఒంటరితనమూ, బోరింగ్, విసుగూ లేకుండా, తాపత్రయం లేకుండా రోజంతా ఆనందంగా ఉండగలగాలి.

నా స్నేహితుడి కొడుకు విదేశాల్లో చాలా మంచి ఉద్యోగంలో ఉన్నాడు. నా ఫ్రెండ్ ఇటీవలే రిటైర య్యాడు. అతడి బర్త్‌డే రోజు నిద్రలేచే సరికి బయట పోర్టికోలో కోటి రూపాయలు ఖరీదు చేసి బి.ఎం. డబ్ల్యూ.కారుంది. వెనుక నుంచి భార్య ''మీ అబ్బాయి పుట్టిన రోజు గిఫ్ట్'' అంది నవ్వుతూ. ఇదేదో 'బ్యాంకు'లోన్ అడ్వర్టైజ్‌మెంట్' కాదు. యదార్థ సంఘటన. కానీ ఇది ఇక్కడితో పూర్తయితే ఇందులో విశిష్టంగా చెప్పుకునేది ఏమీ లేదు. అతడు తన కొడుక్కి ఫోన్ చేసి, ''ఈ వయసులో నాకు అంత ఖరీ దైన కారు అవసరం లేదు బాబూ, ఉన్న చిన్నకారు చాలు. ఆ డబ్బు బ్యాంకులో వేసి ఇద్దరు బీద పిల్లల్ని చదివించు'' అని చెప్పాడు.

మదర్ థెరిస్సాలూ, మోహన్‌దాస్ కరంచంద్ గాంధీలూ ఎక్కడో ఉండరు. జాగ్రత్తగా గమనిస్తే మన పక్క ఇళ్ళల్లోనే ఉంటారు.

(ఇంకావుంది)

మనపై మనకి ప్రేమని పెంచేది క్రియేటివిటీ. ఏ జంతువుకీ లేని ఒక అద్భుతమైన వరాన్ని (క్రియేటివిటీని) ప్రకృతి మనిషికి ఇచ్చింది. మానవుడు సృష్టించగలడు. తన సృష్టితో తాను ఆనందించగలడు. ఇతరుల్ని ఆనందింపచేయగలడు.

మరొకరి సృష్టిని చూడటం ఆనందం. కానీ, మన సృష్టిని మరొకరు ఆనందిస్తూ వుంటే వచ్చే సంతోషం దానికన్నా గొప్పది. అదే క్రియేటివిటీ. కొందరు తమ శక్తుల పట్ల తక్కువ అంచనాతో, ''సృష్టించే వ్యక్తులు'' వేరే వుంటారన్న భ్రమలో వుంటారు. కాదు. ప్రయత్నం చేయక పోవటం వల్ల వారు జడులుగా వుండి పోతారే తప్ప, చేతకాక కాదు. కొత్తగా ఇంటిని అలంకరించినా, వంటలో కొత్త ప్రయోగం చేసినా అది సృష్టే కదా...



ప్రేమ ఒక కళ

4



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 9246502662

క్రియేటివిటీ అనుకున్నంత కష్టమైంది కాదు!

జడులు నాలుగు రకాల అపోహల్లో ఉంటారు. ఏదైనా రంగంలో పైకి రావాలనుకునేవారు ఈ క్రింది అపోహల గురించి తప్పక తెలుసుకోవాలి.

1. సాహిత్యం, సంగీతం, పెయింటింగ్, సినిమా మొదలైన రంగాల్లో మాత్రమే తప్ప... డబ్బు సంపాదనలో గానీ, సంసారం నడపటంలో గానీ, రోజువారి విధుల్లోగానీ క్రియేటివిటీ అవసరం లేదు. (తప్పు. ప్రతీ విషయంలోనూ క్రియేటివిటీ ఉంటుంది. అన్నం వండటంలో, అప్పడం వత్తటంలో కూడా...! ఉడికే బియ్యంలో రెండు చుక్కల నెయ్యి వేస్తే అన్నం నిగనిగలాడుతూ ఉంటుంది. వడియాల పిండిలో కాస్త ఉల్లిరసం కలిపితే ఆ రుచే వేరు).
2. క్రియేటివిటీ అనేది పుట్టుకతోనే వస్తుంది. నేర్చుకుంటే రాదు. (తప్పు, సాధన లేకుండా ఎవరూ పైకి రాలేరు. ఇప్పుడేదో వచ్చని కాదు గానీ, రచయిత అవక ముందు నాకు తెలుగు అక్షరాలూ, పదాలూ కూడా సరీగ్గా రావు).
3. సృజనాత్మకత కోసం చాలా కఠినమైన దీక్ష, శ్రమ అవసరం. (కొంతవరకూ నిజమే అయినా, ఆనందం వచ్చే చోట 'కఠిన శ్రమ' ఏం వుంటుంది?)
4. క్రియేటివిటీ ఉన్న వారు ప్రత్యేకమైన వాతావరణంలో పెరుగు తారు. (తప్పు. వారు మన పక్కనే ఉంటారు. మనలోనే ఉంటారు).

మీరు సెల్‌ఫోన్‌లో, ఇంటర్నెట్‌లో చాలా కొటేషన్లు, జోకులు, సూక్తులూ, ఇతర ఆసక్తికరమైన మెసేజ్‌లూ చదివే ఉంటారు. కొన్నింటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసుంటారు. ప్రపంచంలో ఇన్ని మిలియన్ జోకులున్నాయి కదా. ఈ జోకులన్నీ ఎవరో ఒకరు, ఎక్కడో ఒక దగ్గర, ఎప్పుడో ఒకప్పుడు సృష్టించినవే కదా. అలా తయారు చేసినవారందరూ రచయితలూ, పుస్తకాలూ కాదు. మీరెప్పుడైనా ఒక సొంత జోకుని గానీ, కొటేషన్ గానీ తయారు చేశారా? ముందే చెప్పినట్టు, సొంతంగా ఒక జోకు తయ్యారు చేయటం కూడా క్రియేటివిటినే, ప్రయత్నించి చూడండి. అదేమీ మీరనుకున్నంత కష్టమైనది కాదు.

ఈ వ్యాసం తాలూకు వ్రాతప్రతి చదివి, ఒక మిత్రుడు ''ఈ పార్టీ అయిపోయే లోపులో సొంతంగా ఒక జోక్ ఆలోచించి చెప్పు చూద్దాం'' అని ఛాలెంజ్ చేసాడు. ఆ హడావుడిలో ఆలోచించటం కష్టమే అయినా పార్టీ మూడ్‌కి అనుగుణంగా ప్రయత్నం చేసాను.


> ''నేను లేనప్పుడు మా ఆయన 'కమ్మా... కమ్మా... కమలా'' అంటూ వంటింట్లోకి, బెడ్రూంలోకి నిమిషానికి ఒకసారి తిరుగుతారు''
> ''ఎంత అదృష్టవంతులు కమలగారు మీరు...''
> ''నా పేరు రాజేశ్వరి''
> ''మరి కమల ఎవరు?''
> ''మా పనిమనిషి''



వందేమాతరం పాటని కొత్త ట్యూన్‌లో పాడటానికి ప్రయత్నం చేయండి. ఏ అనే అక్షరం లేకుండా మీరు పెద్దవాక్యం వ్రాయ గలరా? పందెం వేసి గెలవండి. మనం కొట్టే చప్పట్ల కన్నా, మన కోసం కొట్టే చప్పట్ల ధ్వని బావుంటుందని అర్థమవుతుంది.

జీవితం పట్ల కుతూహలం ఉండటం కన్నా గొప్ప ఐశ్వర్యం ఇంకేం వుంటుంది? చెరువులో ఈదటం నుంచి లైబ్రరీలో పుస్తకం చదవటం వరకూ, గోటీబిళ్ళా ఆడటం నుంచి గోకుల్‌చాట్‌లో పానీ-పూరీ తినడం వరకూ అన్నీ ఆనందాలే. ఉత్సాహమూ, కుతూహలమూ, జ్ఞానమూ కలిస్తే అది అద్భుతమే.





ఈ బొమ్మ చూడండి. పుస్తకాలతో చేసిన ఒక క్రియేటివ్ ఆయిల్ పెయింటింగ్ ఇది. దీని పేరు 'ది లైబ్రేరియన్'. ఈ బొమ్మలో అన్నీ పుస్తకాలే. ఒక వ్యక్తి పుస్తకం చదువుతున్నట్టు వున్న ఆలోచనతో గీసిన ఈ పెయింటింగ్ చిత్రకారుడి రూపకల్పనకు ఒక ఉదాహరణ.

ఇక పుస్తకాల విషయానికి వస్తే, ఈ ప్రపంచంలో అన్నిటికన్నా ఖరీదైన పుస్తకం. 'బర్డ్స్ ఆఫ్ అమెరికా'. దీని ఖరీదు దాదాపు పదకొండు మిలియన్ డాలర్లు. అంటే దాదాపు అయిదు కోట్ల రూపాయలపైనే. అలాగే అత్యంత పెద్ద పుస్తకం ''ఫ్రగెయిల్ నేచర్''. దీని బరువు పధ్నాలుగు వందల కిలోలు.

'నో వేర్ ట్రైన్' అనే రెండొందల ముప్పై పేజీల పుస్తకంలో విశిష్టత ఏమిటంటే ఈ పుస్తకంలో వాక్యాలన్నీ క్రియ లేకుండానే వుంటాయి. What luck! A vacant seat, almost, in the train. A provisional stop, why not? మొత్తం పుస్తకం ఇలాగే ఉంటుంది. వాక్య నిర్మాణంలో కర్త, కర్మ లేకపోయినా 'క్రియ' తప్పనిసరి... ''...ఒక మంచి పూల వనంలో కలుపు మొక్కలాంటిది 'క్రియ'. అందుకే అది లేకుండా ఈ పుస్తకం వ్రాయటానికి ప్రయత్నించాను'' అంటాడు ఈ పుస్తకం ముందుమాటలో రచయిత.

అది చూసి మరో రచయిత ఇంకో అద్భుతమైన ప్రయత్నం చేసాడు. E అన్న అక్షరమనేది లేకుండా ఒక నవల వ్రాయటానికి సంకల్పించాడు. ఆంగ్ల సాహిత్యంలో 'E'కున్న ప్రత్యేకత మనందరికీ తెలిసిందే కదా. అటువంటి అక్షరం లేకుండా ఒక నవల వ్రాయటం అపూర్వం. చాలా కష్టమయిన ప్రయత్నం.

"Throughout all history, if youth had a champion to stand up for it, to show a doubting world that a child can think...." అన్న వాక్యంతో ప్రారంభమై.... 'Goodnight' to all our happy bunch, and to John Gadsby" అన్న వాక్యంతో పూర్తవుతుంది. యాభై వేల పదాలున్న ఈ నవల పేరు 'Godsby'.

'విజయం సాధించటం కష్టమైన ప్రక్రియ కాదు. ఒకవేళ ఆ పని కోసం కష్టపడినా, ఒక్కసారి అది పూర్తయ్యాక ఆ ఫలితాన్ని చూసు కుంటే, అప్పటివరకూ పడిన కష్టమంతా పోతుంది' అన్న విషయాన్ని బలపరుస్తూ ఈ పుస్తక రచయిత ఈ విధంగా అంటాడు: ''నేను వ్రాయటం మొదలు పెట్టగానే E అనే అక్షరాలన్నీ నా రైటింగ్ టేబుల్ చుట్టూ చేరి, తమని పిలుస్తానేమోనని ఆసక్తిగా ఎదురు చూసాయి. నేను తలెత్తకుండా వ్రాసుకుంటూ పోతూ వుంటే అవి చాలా అనీజీగా కదలటం ప్రారంభించాయి. కనీసం, ఒక్క పదంలోనైనా జారి పడదామని ఎదురు చూసాయి. పుస్తకం పూర్తవగానే అవి చేతిలో చెయ్యి వేసుకుని, మూకుమ్మడిగా కదిలిపోతూ కోపంగా... 'కొన్ని వేల సంవత్సరాల నుంచి, కొన్ని కోట్లమంది కోటానుకోట్ల వాక్యాలు వ్రాసారు. మమ్మల్ని ఉపయోగించుకోకుండా వ్రాసిన ప్రథముడివి నువ్వు' అన్నాయి. వాటిని ఓడించాలని కాదు. నా శక్తిని పరీక్షించుకుందామని వ్రాశాను'' అంటాడు. ఈ ఎక్స్‌ప్రెషను ఎంత బావుందో చూడండి.

లిటరేచరే కాదు. ప్రతీ సబ్జెక్టూ ఇంత ఇంటరెస్టింగ్‌గానే వుంటుంది. కొత్త కొత్త విషయాలు తెలుసుకోవాలన్నా కుతూహలం బద్ధకాన్ని ఆమడ దూరంలో వుంచుతుంది. బద్ధకానికి ఉత్సాహం ప్రథమ శత్రువయితే, నిద్ర దానికి ప్రథమ మిత్రువు. మీ అలవాట్లన్నీ ఒక పేపర్ మీద వ్రాసుకోండి. అందులో అనవసరంగా సమయాన్ని వృధా చేసేవి గుర్తించండి. మరింత 'సంతోషాన్ని ఇచ్చే' లాభదాయక మయిన వాటితో వాటిని రీప్లేస్ చేయండి. అదే విజయానికి తొలి మెట్టు.

విజయం అంటే ఏమిటి? రోజు రోజుకీ మన మీద మనకి ప్రేమ పెరుగుతూ పోవటం. మన మీద మన ప్రేమను పెంచుకోవటం ఎలా?


జీవితాన్ని చిన్న పిల్లాడిలా అనుభవించటం ద్వారా....


దీనికి వివరణ తెలుసుకోబోయే ముందు 'అపజయం' అంటే ఏమిటో అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేద్దాం. నిరంతరం మనసులో దుఃఖిస్తూ ఉండటమే అపజయం. ''చిన్నపిల్లవాడు కూడా ఏడుస్తాడు కదా?'' అని మీరు ప్రశ్నించవచ్చు. కాని పిల్లవాడు ఏడ్చేది కేవలం తనకి కావలసినది దక్కించుకోవడానికి మాత్రమే. అది వాడి బాణం.


పిల్లల్లో ఉండే గొప్ప అదృష్టం ఏమిటంటే సమయం వాళ్ళని శాసించదు. ఎప్పుడు నిద్రపోవాలంటే అప్పుడు పడుకోవచ్చు. ఒక ప్రధానమంత్రికి, ఒక కోటీశ్వరుడికి ఇలాంటి అవకాశం ఉండదు. సమయాన్ని తమ చేతుల్లో ఉంచుకోవటమే జీవితంలో సాధించదగ్గ గొప్ప విజయం.

ఆరోగ్యం, కీర్తి, డబ్బు, జ్ఞానం, ప్రేమ, ఉత్సాహం లాంటి షడ్విధ ఐశ్వర్యాలని పిల్లలకి అన్వయించి చూద్దాం. పిల్లలు మానసికంగా చాలా ఆరోగ్యంగా ఉంటారు. వారికి భవిష్యత్తు పట్ల భయం లేదు. వారు అందరినీ ప్రేమిస్తారు. పెద్దలు కూడా వారిని ప్రేమిస్తారు. కొత్త విషయాల్ని తెలుసుకోవాలనే జ్ఞానం వారికి ఉంది. తరువాత ఐశ్వర్యం డబ్బు. ఏదైనా వస్తువు కొనే ముందు ధర చూస్తాం. కాని పిల్లలకి అవేం పట్టవు. వారికి కావలసింది ఎలా పొందాలో వారికి తెలుసు. ఒకవేళ అది దొరక్కపోతే దాని గురించి ఎలా మర్చి పోవాలో కూడా వారికి తెలుసు. ఒక బొమ్మ కోసం ఏడ్చిన పాప, తల్లిదండ్రులు దాన్ని తనకివ్వరని తెలిసిన తరువాత ఐదు నిముషాల్లో ఆ విషయం మర్చిపోయి తిరిగి ఆడుకుంటుంది. పెద్దలు అలా కాదు. దొరకనిదాని గురించి బాధపడుతూనే ఉంటారు. ప్రొద్దున్న లేచింది మొదలు, రాత్రి నిద్రపోయే వరకూ 'తాను చేయాలనుకున్నది చేయగలిగినవాడిదే' విజయం

ప్రేమంటే నమ్మకం. ప్రేమున్నచోట ఈర్ష్య ఉంటుందంటారు. ''నేను తన గురించి ఇంతగా ఆలోచిస్తోంటే, ఇంకెవ్వరితోనో గంటల తరబడి మాట్లాడుతూండటం భావ్యమా?'' అన్నది ఈర్ష్య. ఫోన్ పాడై ఉంటుందనుకోవటం నమ్మకం.







అనుకుంటే, అలా మనం చేయగలమా?

ఒక చిన్నపిల్లవాడు చేయగలడు

జ్ఞానేంద్రియాలను ఆనందింపజేసేదే ధ్యానమయితే, ఐస్‌క్రీం తినే పిల్లవాడి దగ్గర పాఠం నేర్చుకోవాలి. కళ్లతో రంగును, ముక్కుతో వాసనను, నాలుకతో రుచిని ఆస్వాదిస్తాడు. ఇది కూడా ఒకరకమైన ధ్యానమే. కళ్లు మూసుకొని గంటలు తరబడి నిద్రలో బ్రతకడం కాదు ధ్యానం అంటే...! సమస్యల నుంచి గాని, పని నుంచి గాని పారిపొమ్మని, ముక్కు మూసుకొని తపస్సు చేయమని ధ్యానం చెప్పదు. ఒక ఆటగాడు, చిత్రగాడు, సంగీత విద్వాంసుడు, శాస్త్రవేత్త నిజమైన సాధనలో నిమగ్నమయ్యేదే ధ్యానం.

ఈ సందర్భంగా నాపై గొప్ప ప్రభావాన్ని

> క్రియేటివిటీ అనుకున్నంత కష్టమైంది కాదు. ప్రయత్నించి చూడాలి. కొత్తగా ఏది చేసినా క్రియేటివిటీయే! పుస్తకాలతో బొమ్మ తయారు చేయడం 'క్రియ' లేకుండానో, ఏదైనా ఒక అక్షరం లేకుండానో పెద్ద గ్రంథం రాయాలనుకోవడం అన్నీ క్రియేటివిటీనే. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా గానీ ప్రపంచానికి ఏదైనా శ్రేష్టమైన దాన్ని ఇవ్వాలి!

చూపించిన వేదాంతి 'ఎపిక్యురస్' గురించి చెప్పాలి. ''తిను, తాగు, సంతోషంగా ఉండు'' అన్న సామెతని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చినది అతడేనని చాలా మంది అతడి గురించి తప్పుగా మాట్లాడతారు. అతని గురించి పూర్తిగా చదవకముందు నాకు కూడా అతడిపై అలాంటి అభిప్రాయమే ఉండేది. మిగతా సాధువుల్లాగా కాక, ''పేషన్‌తో జీవించు. ఆనందించడానికి పనిచెయ్యి. పంచుకోవటానికి సంపాదించు. ఇవ్వటాన్ని ఆనందించు. దాచుకోవటాన్ని విసర్జించు'' అని అతడు కొత్త థియరీ చెప్పాడు.

అతని గురించి ఒక గొప్ప భారతీయ తత్వవేత్త ఇలా అంటాడు. ''రెండు వేల సంవత్సరాల క్రితం గ్రీసులో పుట్టిన వ్యక్తితో నాకొక లోతైన అనుబంధం ఏర్పడింది. 'మతానికి వ్యతిరేకంగా ఉండే మొట్టమొదటి మెటీరియలిస్ట్' అని అతని గురించి అందరూ అనుకుంటారు. కానీ కాదు. అతడిది సహజమైన మతం. బుద్ధుడు, మహావీర్‌లాంటి వారి మతం కాదు ఇతడిది. వారు అనవసరమైన వాటినన్నిటిని జయించారు. సాధారణ జీవనాన్ని గడిపేటందుకు ఆస్తులను, అంతస్తులను వదిలేసారు. జీవితాన్ని ఒక గాడిలో పెట్టుకున్నారు. కాని 'ఎక్కడైతే క్రమశిక్షణ ఉన్నదో అక్కడ సంక్లిష్టత ఉంటుంది' అంటాడు ఎపిక్యురస్'.

'అతడు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నాడని ఆ దేశపు రాజు 'అతడి విలాసాలకి అడ్డుకట్ట వేస్తాను. పన్ను కట్టకపోతే బంధించి శిక్షిస్తాను' అనుకొని ఎపిక్యురస్ నివసించే తోటకి వెళ్లాడు. ఆ చిన్నతోటలో చెట్లకు నీళ్ళు పోస్తూ సాధారణమైన జీవనాన్ని గడుపుతున్న అక్కడి వారిని చూసి అతడు ఆశ్చర్యపోతాడు. కేవలం బ్రతకడానికి సరిపోయే వస్తువులు మాత్రమే వాళ్ళ దగ్గర ఉంటాయి. రాత్రి భోజనంలో రొట్టెకి రాసుకోవటానికి కనీసం వెన్న కూడా ఉండదు. కాని అందరూ ఉన్నదాన్ని ఒక గొప్ప విందులాగా ఆనందిస్తారు. భోజనం తరువాత నాట్యం చేస్తారు. ఆశ్చర్యపోయిన రాజు ఎపిక్యురస్‌ని ''తిను, తాగు, ఆనందించు అనటంలో అర్థం ఏమిటి?'' అని అడుగుతాడు.

అప్పుడు ఎపిక్యురస్ ఈ విధంగా చెప్తాడు: ''రాజా....! మేమూ దేవుడ్ని ఏమీ కోరుకోవడం లేదు కనుక రేయి, పగలు ఇక్కడ ఆనందంగా, సుఖంగా జీవిస్తున్నాము. దేవుడే ఈ కష్టాలు సృష్టించాడని మీరు మనస్ఫూర్తిగా విశ్వసిస్తే, వాటి నుంచి విముక్తి కోసం తిరిగి అతడినే ప్రార్థించటంలో అర్థం ఏమైనా ఉన్నదా? ప్రజలందరూ తనని ప్రార్థించటం మర్చిపోతారేమో అన్న ఉద్దేశంతో గనక భగవంతుడు ఈ కష్టాలు సృష్టించి వుంటే, అతడి కన్నా స్వార్థపరుడు ఇంకెవరైనా ఉన్నారా? మీరు దేవుడి గురించి ఆలోచించకండి. పాపులకు, భయస్థులకూ మాత్రమే భగవంతుడి అవసరం ఉన్నది. చేతులు జోడించి ఆకాశం వైపు చూసి ప్రార్థనలు చేయనవసరం లేదు అది వెర్రితనం. భగవంతుడు అన్నిచోట్లా వ్యాపించి వున్నాడు. ప్రార్థన ఒక వైఖరి. అది ఒక జీవిత విధానం. పుణ్యులకు జీవితమే భగవంతుడు. తెల్లవారుఝాము నుంచి సాయం సంధ్య వరకూ మనస్ఫూర్తిగా చేసే ప్రతీ పనీ ప్రార్థనే'' అని వివరిస్తాడు.

''విజ్ఞులు మూర్ఖులు కారు. భగవంతుడు అన్నిచోట్ల ఉంటే మళ్ళీ అతడి కోసం ప్రత్యేకంగా గుడులూ, చర్చీలూ ఎందుకు కట్టారు?'' అని ప్రశ్నించాడు ఆ రాజు.

''రాజా! అన్నిచోట్లా గాలి ఉన్నా పంకాలు ఎందుకు? పంకా సౌఖ్యం కావలసినవారికే భగవంతుడు...! ప్రకృతి సుఖం కావలసిన వారికి అవసరం లేదు''





అతడి తర్కానికి సంతోషించిన రాజు ''నేను మీ అందరికీ మంచి బహుమతులు ఇద్దామనుకుంటున్నాను. ఏమికావాలి?'' అన్నప్పుడు ఎపిక్యురస్... ''క్షమించండి, మీరు గొప్పరాజు, ఏదైనా ఇవ్వగలరు.

> అవతలివారు నీ దగ్గర లేనప్పుడు నీ 'నవ్వునీ', ఉన్నప్పుడు నీ 'కాలాన్నీ' మర్చిపోవటమే ప్రేమ.

కానీ మాకు వాటి అవసరం లేదు. మీరు గట్టిగా కోరితే మాకు కాస్త ఉప్పు, వెన్న పంపించండి'' అంటాడు.

ఎపిక్యురస్ థియరీ ఈ విధంగా వుంటుంది:

- కొందరు జనం నిన్ను దెప్పి పొడుస్తారు. గేలి చేస్తారు. అయినా సరే దయగా వుండు.
- నీవు నిజాయితీ పరుడవూ, నమ్మకస్తుడవూ అయితే జనం నిన్ను మోసం చేస్తారు. అయినా నీ నిజాయితీని, నమ్మకాన్ని వదలకు.
- సంవత్సరాలు తరబడి కట్టింది ఒక్క రాత్రిలో కూలిపోవచ్చు. కట్టడం మానకు. నువ్వు మంచి పనులు చేస్తే జనం వాటిని కాలక్రమేణా మర్చిపోవచ్చు. అయినా మంచినే చెయ్యి.
- నువ్వు ప్రపంచానికి శ్రేష్టమైనదాన్నివ్వు, అది ఈ ప్రపంచానికి సరిపోక పోవచ్చు. కానీ నువ్వు అత్యంత శ్రేష్టమైనదాన్ని ఇవ్వటం మానవద్దు.


కొండలపైనుండే నిశ్శబ్దాన్ని వినగలగటం. సూర్యాస్తమయంలో సూర్యోదయాన్ని చూడగలననే విశ్వాసాన్ని కలిగి ఉండటం, సాధువుల చిరునవ్వు అర్థం చేసుకోవడం, ఇతరులపై 'వారి భాషలో' దయ చూపటం నిజమైన ప్రార్థన. ప్రేమ ఒక అందం. అందం ఒక నిస్వార్థం.

విశ్వజనీనమైన ప్రేమకి ఇంతకన్న గొప్ప నిర్వచనం ఏముంటుంది?

(ఇంకావుంది)


మనుషులు సాధారణంగా నాలుగు రకాల పనుల్లో నిమగ్నమై వుంటారు.

1. ఉత్సాహం లేని ఉపయోగమైనవి: చదువు, ఉద్యోగం మొదలైనవి కేవలం బాధ్యతగా.
2. ఉత్సాహం, ఉపయోగం ఉన్నవి: ఆటలూ, మ్యూజిక్, రచన, చిత్రలేఖనం (కొందరికి) తమ వృత్తి.
3. ఉపయోగం లేని మొహమాటపు బాధ్యతలు: పెళ్ళిళ్ళు, ఫంక్షన్లు, మీటింగ్‌లు.
4. ఉపయోగం లేని ఉత్సాహమైనవి: టీ.వి. సినిమాలు, కబుర్లు.



విజయశిఖరం ఎక్కాలంటే రెండేమెట్లు చాలు!

ప్రేమ ఒక కళ 5



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 9246502662

ఇందులో ఏ వ్యక్తి అయితే ఆఖరి రెండు విషయాల్ని తక్కువచేసి మొదటి విషయంలో ఎక్కువ ఆసక్తితో వుంటాడో అతడిని విజయలక్ష్మి వరిస్తుంది. పైన చెప్పిన మూడో విషయం గురించి ఒకసారి ఆలోచించండి. మీకు నిజంగా టైములేక ఒక పెళ్ళికి వెళ్ళలేదనుకోండి. పనుండి రాలేదనుకుంటారు. మీరు ఆలోచించినంతగా వాళ్ళు క్షణం కూడా ఆలోచించరు. నాలుగైదు ఫంక్షన్స్‌కి వెళ్ళకపోతే, వీడింతే అనుకుంటారు.

'జీవితం' అంటే గమ్యం నుండి గమ్యానికి ప్రయాణం అయినప్పుడు, 'ప్రయాణాన్ని' ప్రేమించాలి. డాక్టర్ కావాలన్నది గమ్యం అయితే, ప్రవేశ పరీక్షకి చదవటం ప్రయాణం. ఊటీ వెళ్ళడానికి మూడు రోజులు పడితే, వెళ్ళిన మరుక్షణం నుండి తిరుగు ప్రయాణం పనిలో బిజీ అయిపోతే, ఇక అక్కడి అందాలు ఏమి ఆనందించినట్టు?

భగవద్గీతలో **కర్మణ్యేవాధికారస్తే** అన్నాడు. గల్లీ క్రికెట్ ఆడటమే ఆనందం. గెలవటం బోనస్. అలాగే, చదవటం ఆనందం. పాసవటం బోనస్. పాఠం చెప్పటం ఆనందం. జీతం బోనస్. తాను చెప్పే పాఠాలు ఆనందించకుండా, 29 రోజులు ఏడుస్తూ, కేవలం జీతం రోజు కోసం బ్రతికితే, ఇంతకన్నా దైన్యమైన స్థితి మరొకటి ఉంటుందా?

కొంతమంది గమ్యాన్ని ఊహించుకుంటూ ఆనందిస్తారే తప్ప, దాన్ని నిజం చేసుకునే ప్రయత్నం చేయరు. యువతీ యువకుల్ని 'మీ కోర్కె ఏమిటి' అని అడిగితే 'ఒక అనాథాశ్రమం పెట్టాలి' అనో, 'ఇద్దరు ముగ్గురు పిల్లలకి ఉచితంగా చదువు చెప్పించాలి' అనో అంటూ వుంటారు. ఈ రకమైన కోర్కెలు వయసు పెరిగేకొద్దీ తగ్గిపోతాయి.

'కరాటే-కిడ్' అనే సినిమాలో జాకీ చాన్ తరచు 'ఆటిట్యూడ్' అని ఒక మాట అంటూ వుంటాడు. ఒకే తల్లిదండ్రులకి పుట్టిన ఇద్దరు వ్యక్తులు. ఒకే సౌకర్యాలను ఆనందిస్తూ, ఒకే కాలేజీలో చదివినా కూడా ఎందుకు ఒకేలా తమ గమ్యానికి చేరుకోరు? దీనికి కారణం జీవన విధానం. స్కూల్లో, కాలేజీలో తోటి వారి సహచర్యం.

చిన్నప్పుడు మన తల్లిదండ్రులు మన జీవితాన్ని ఆర్గనైజ్ చేయటానికి ప్రయత్నించినా, క్రమక్రమంగా దాన్ని మన ఆధీనంలోకి తెచ్చు కుంటాము. మన స్వంత నిర్ణయాలు, పాజిటివ్ ఆలోచన్లు, నెగిటివ్ అభిప్రాయాలూ, బద్ధకం, తెలివి, దూరదృష్టి, స్నేహితుల సహచర్యం మన మార్గాన్ని నిర్దేస్తాయి.

'నీరము తప్త లోహమున 'నిల్చి' అని సంస్కృతంలో ఒక శ్లోకం ఉంది. 'నీటి బిందువు వేడి ఇనుముపై పడితే క్షణంలో ఆవిరై పోతుంది. దగుల్బాజీలతో కలిస్తే విద్యార్థి జీవితం ఆ విధంగా పనికి రాకుండా పోతుంది. అదే నీటి బిందువు తామరాకుపై పడితే, మోటార్ బైకుల మీదా, బీరుటిన్నుల మీదా మెరిసి సాయంత్రానికి ఆవిరైపోతుంది. కాలేజీలో హీరో, హీరోయిన్లలా చలామణీ అయి, బయటకు రాగానే కాలగర్భంలో కలిసిపోతారు. అదే బిందువు ముత్యపు చిప్పలో పడినట్లయితే ముత్యంలా మారుతుంది. తాను ఎక్కడ పడాలో నీటి బిందువు చేతిలో లేదు. కానీ ఆ శక్తి, యుక్తి మనకి ఉంది'.

ఒక తల్లి కొడుకుని ఒక స్వామి దగ్గరకు తీసుకు వెళ్ళింది. అతడు చదువుకున్న వాడు. జ్ఞాని. ''స్వామీ! నా కొడుకు తెలివైన వాడే కానీ మాట వినడు. చదువు తప్ప అన్ని విషయాల్లోనూ ఆసక్తి వున్నది. వాడికేదైనా చెప్పి మార్చండి'' అన్నది.

''ఏం చెప్పను? దేని గురించి?'' అని స్వామి చిరునవ్వుతో అడిగాడు. కొంటె కుర్రవాడు కొత్తగా వేస్తున్న తారు రోడ్డు చూపిస్తూ ''దాని గురించి చెప్పండి'' అన్నాడు. పక్కనే పడి వున్న ఒక తారుముద్దని తీసుకు రమ్మని ''ఈ తారు ఉండ ఖరీదు ఎంత వుంటుందో ఉజ్జాయింపుగా చెప్ప గలవా?'' అని అడిగాడు స్వామి.

''అయిదు నుంచి పది రూపాయలు''.

''కానీ ఇందులోని పెట్రోలియంని సింథెటిక్ వైరుగా మారిస్తే, అది గుండె ఆపరేషన్‌లో పది వేలు ఖరీదు చేసే దారంగా పని చేస్తుంది. ఈ ముద్దలోంచి వెయ్యి వైర్లు తయారు చేయవచ్చు. మరోలా చెప్పాలంటే ఈ పది రూపాయల తాడుని మరొక రకంగా ప్రాసెస్ చేస్తే, దాని విలువ కోటి రూపాయలు అయి వుండేది''.

వింటూన్న కుర్రవాడు నిశ్చేష్టుడయ్యాడు. అతడి

జీవితంలో విజయశిఖరం అధిరోహించాలంటే వెయ్యి మెట్లు ఎక్కాలి. కానీ ఆత్మశోధన ద్వారా బలహీనతల్ని గుర్తించడం, వాటిని అధిగమించడం అనే రెండే రెండు మెట్లు ఎక్కితే మిగిలిన 998 మెట్లు అంత ముఖ్యమైనవి కావు.



కళ్ళలోని కుతూహలం గమనించి స్వామి కొనసాగించాడు. "వర్తమానాన్ని ఎలా ప్రోసెస్ చేసుకుంటే నీ భవిష్యత్తు అలా మారుతుంది. నీవిప్పుడు ఇంటర్మీడియెట్ స్టేజిలో వున్నావు. ఇంటర్ అంటే 'మధ్య'లో అని అర్థం. అదొక రైల్వే జంక్షన్. రకరకాల రైళ్ళు అక్కడికి వస్తూ వుంటాయి. ఒక రైలు ఏ.సి. కంపార్ట్‌మెంట్ బయట రకరకాల రంగులతో ఆకర్షణీయంగా, లోపల మంచి వాసనలు వెదజల్లుతూ ఉంటుంది. అది నిన్ను జైసల్మీర్ ఎడారికీ తీసుకెళ్తుంది. మరొకటి సాదాగా ఉంటుంది. కాశ్మీరుకి తీసుకెళ్తుంది. ఒకసారి రైలు ఎక్కిన తరువాత మారటం కష్టం. పూల వనానికి వెళ్తావా, ఇసుక ఎడారికి వెళ్తావా అన్నది నీవే నిర్ణయించుకోవాలి. లక్ష రూపాయల ఉద్యోగంతో ప్రారంభిస్తే కోటికి చేరుకోవటం సులభం. పది వేలతో మొదలుపెడితే లక్షకు చేరుకోవటం కష్టం" వింటున్న కుర్రవాడు అర్థమైనట్టుగా వినమ్రతతో నమస్కరించాడు.

మీకు కనపడిన ప్రతి విద్యార్థికి పై కథ చెప్పండి. చివర్లో ఒక ప్రశ్న వేయండి. 'భగవంతుడు ప్రత్యక్షమై, '.... మొదటి ఇరవై సంవత్సరాలు నీ జీవితం అద్భుతంగా ఉండి, తరువాత సమస్యలతో నిండిపోతుంది. లేదా, మొదటి ఇరవై సంవత్సరాలూ సామాన్యంగా ఉండి, తరువాత అద్భుతంగా వుంటుంది. నీకేది కావాలి?' అని అడిగితే, ఏది కోరుకుంటావ'ని ప్రశ్నించండి. అందరూ 'రెండోదే' అంటారు. 'ఇరవై సంవత్సరాలంటే విద్యార్థి జీవితమే కదా' అనండి.

చాలు. అర్థమయ్యే వారికి అర్థమౌతుంది. మారేవారు మారుతారు. ఈ క్రింది ఉదాహరణ చదవండి. ఇది జరిగి చాలా సంవత్సరాలైంది. ప్రతి విద్యార్థి చదవవలసిన సంభాషణ. "వదో క్లాసు చదివేటప్పుడు మీ పుస్తకాలు చదివే వాడిని సాబ్..." అన్నాడు ఆటో డ్రయివరు స్టేషన్‌కి తీసుకెళ్తూ... "... ఇంటర్‌లో కాలేజీకి వెళ్ళేవాడిని కాను. ఫెయిల్ అవగానే నాన్న చదువు మానిపించేసాడు. ఇప్పుడు మా అబ్బాయి ఇంటర్. చదువంటే వాడికి చాలా అశ్రద్ధ. నాలాగే తయారయ్యాడు" అన్నాడు.


'ఎలా?' అని అడిగాను.

"చూడండి సాబ్. ప్రొద్దున్న అయిదు వరకూ పాసింజర్లు ఒకటిన్నర ఛార్జీలు ఇవ్వాలి. అందుకని తెల్లవార్నే నాలుగింటికి రైల్వేస్టేషన్‌కి వెళ్తాను. ఇంటికి వచ్చేసరికి రాత్రి తొమ్మిదవుతుంది. చచ్చేవరకూ ఇలా ఆటో నడపాల్సిందే. ఇదే బుద్ధి నాకు ఇంటర్‌లో ఉండి, రెండు సంవత్సరాల పాటు తెల్లారే లేచి వుంటే, జీవితం మొత్తం సుఖంగా నిద్ర పోయిండే వాడ్ని. ఇలా ఆటో నడుపుకోవలసిన పని వుండేది కాదు. నా కొడుకు ఇది అర్థం చేసుకోవడం లేదు".

మెచ్యూరిటీ అంటే- "తనేం చేస్తే బావుంటుందో కరెక్ట్‌గా తెలుసుకోవటం" గొప్ప అర్థమున్న ఒకే ఒక వాక్యం. పన్నెండేళ్ళ కుర్రాడు నాలుగేళ్ళ కుర్ర వాడిలా బస్ స్టీరింగ్ చేతిలో వున్నట్లు ఊహించుకుని "బోయ్... బోయ్...' మంటూ హారన్ నొక్కుతూ పరుగెత్తినా, పాతికేళ్ళ కుర్రాడు చేతిలో బాల్ వూహించుకుంటూ గాలిలో బౌలింగ్ చేసినా, యాభై ఏళ్ల గృహిణి 'అబ్బనీ తీయని దెబ్బ' అంటూ డాన్స్ చేసినా, అరవై ఏళ్ళ మనిషి మొదటిరోజు సినిమా కోసం క్యూలో కొట్టుకున్నా 'ఇంకా మెచ్యూర్ కాలేదు' అంటాం.

పాతికేళ్ళ కుర్రాడు ఉన్నాడనుకుందాం. కరెంటు లేదు. పరుపు లేదు. మంచి భోజనం లేదు. అయినా పట్టించుకోడు. రెండు సమోసాలు తిని, జీన్సు ప్యాంటు కూడా విప్పకుండా నేలమీద పడుకుని హాయిగా నిద్రపోతాడు. ప్రొద్దున్నే హుషారుగా లేచి, వేణ్ణీళ్ళతో, అవి లేకపోతే చన్నీళ్ళతో స్నానం చేసో/చేయకో, కాలేజీకో, ఆఫీసుకో బయల్దేరతాడు. బస్‌స్టాప్‌లో స్నేహితులతో మాట్లాడుతూ, అమ్మాయిల మీద జోకులేస్తూ, బస్సు గంట ఆలస్యంగా వచ్చినా విసుగులేకుండా మండుటెండలో నిల్చుంటాడు. బస్సు రష్‌గా ఉంటే రాడ్ పట్టుకుని వేలాడుతూ ప్రయాణం చేస్తాడు. ప్రపంచంలోని ఆనందమంతా తనలోనే ఉన్నట్టు హాయిగా, హుషారుగా, కేర్‌పిన్‌లా బ్రతికేస్తాడు.

ఇప్పుడు పై పేరాగ్రాఫ్‌ని మళ్ళీ చదవండి. అయితే ఈసారి పాతికేళ్ళ కుర్రాడి బదులు అరవై ఏళ్ళ వృద్ధుడిని వూహించుకుని చదవండి. అతడు పై పనులు చాలా చేయలేడు. చేయవలసివస్తే బలవంతంగా, బాధపడుతూ చేస్తాడు. ఇంకొంచెం కంఫర్ట్ కోరుకుంటాడు. నేల బదులు పరుపు, కాస్త మంచి భోజనం, బస్సు బదులు ఆటో లాంటి సుఖాలుంటే బాగుండేది అనుకుంటాడు. కూతురికి ఇంకొంచెం మంచి సంబంధం వస్తే బావుణ్ణు, కొడుకు విదేశీ చదువు కోసం చేసిన అప్పు తొందరగా తీరిపోతే బావుణ్ణు అనుకుంటూ బాధపడతాడు.



యవ్వనంలో ఉన్నప్పుడు అలాంటి సుఖప్రదమైన భవిష్యత్ ప్రణాళిక వేసుకోవటమే ప్లానింగ్. మనిషికి కారు అవసరం లేదు. కానీ వంట్లో నలతగా వుంటే ఆస్పత్రికి వెళ్ళటానికి కనీసం ఆటోకి డబ్బు కావాలి. పూర్వకాలపు వేదాంతుల్లా కాకుండా ఇప్పటి మోడరన్ ఫిలాసఫర్స్ ఆనందాన్ని సుఖంతో ముడిపెడుతున్నారు. మనశ్శాంతి కోసం ఆర్థికావసరాల ఆవశ్యకతని గుర్తిస్తున్నారు. కేవలం కంఫర్ట్ వల్ల మాత్రమే ఆనందం రాకపోవచ్చు. కానీ ఆనందంలో సుఖం ఒక భాగం' అన్న సూత్రాన్ని నమ్ముతున్నారు.

మనం గతాన్ని మార్చలేము. కానీ వర్తమానాన్ని మార్చుకోగలం. మీ భవిష్యత్తును ఒక కాగితంపై వ్రాసుకోండి. డెబ్భై సంవత్సరాల తరువాత వెనుతిరిగి చూసుకుంటే, మీ గతం గురించి మీరు ఎలా ఫీలవ్వాలని ఊహించుకుంటారు? అంపశయ్యపై ఉన్నప్పుడు జీవిత బాధ్యతల్ని సంతోషంతో నెరవేర్చిన సంపూర్ణమైన సంతృప్తితో, ఏ విధమైన ఫిర్యాదులూ లేకుండా శలవు తీసుకోవాలనుకుంటున్నారా? అదే గెలుపంటే.

మీరు కలలు కంటారా?

పదిహేనేళ్ళ వయసులో క్లాస్ టాపర్‌గా నిలవాలన్న కసి మీకుందా? ఇరవై ఏళ్ళకి ఆస్ట్రోనాట్ అవ్వాలని అనుకుంటున్నారా? పాతికేళ్ళ వయసులో రాష్ట్రపతి ఇస్తున్న పార్టీలో ప్రముఖ సినీ తారలతో కరచాలనం చేయాలని ఉందా? ముప్ఫై ఏళ్ళ వయసులో బి.ఎం. డబ్ల్యూ కారు సొంతం చేసుకోవటంపై మీ అభిప్రాయం ఏమిటి? నలభై సంవత్సరాల వయసులో మల్టీనేషనల్ కంపెనీకి సి.ఇ.ఓ అవటమా? యాభై ఏళ్ళ వయసులో ప్రధానమంత్రి అవ్వాలనుకుంటున్నారా? అరవై ఏళ్ళ వయసులో నోబెల్ ప్రైజు? డెబ్భై ఏళ్ళ వయసులో పీఠాధిపతి అవ్వటమా? ఎనభైలో మరథాన్ పరుగులో పాల్గొనటమా? ఏమిటి మీ కల?

మీ బాస్ ఆఫీస్‌కి బాస్ అవటమా? మీ అధికారానికి భజన చేసే కోటరీని మీ చుట్టూ నిర్మించుకోవటమా? కళ్ళు మిరుమిట్లు కొలిపేటంత డబ్బా? దాన

ధర్మాలా? పురాణ శ్రవణాలా? అన్నమయ్య, రామదాసుల్లా కీర్తనలు వ్రాసుకోవటంలో ఆత్మసంతృప్తా?

భవిష్యత్తు కోసం కలలు కనండి. దాన్ని సాకారం చేసుకోవటానికి వర్తమానంలో ఆస్వాదించటానికి ఇంకేమీ లేదు అన్నట్టుగా లోతుకంటా అనుభవించండి. మీకు 'టీ' ఇష్టమైతే లెమన్ టీ, ఐస్ టీ, బ్లాక్ టీ, చైనీస్ టీ త్రాగారా? ఐస్‌క్రీమ్ ఇష్టమైతే ఫ్రైడ్ ఐస్‌క్రీమ్, వేఫర్ కోన్, సండీస్, జెల్లీస్, సాఫ్ట్ ఫేంటసీ, హాట్‌కాఫీ, బ్లూబెర్రీ, క్యూబన్ కాఫీ విత్ డోల్స్, హనీ లెవెండరీ కోట్ ఐస్‌క్రీములు ట్రై చెయ్యండి.

'జీవితం చిన్నది' అని అంటారు. కాదు. మనం దానిని చాలా ఆలస్యంగా మొదలు పెడతాము. పిల్లలూ యువకులూ ఎంత తొందరగా 'గెలిచే ప్రయత్నం' మొదలుపెడితే అంత తొందరగా సుఖ సంతోషాలని స్వంతం చేసుకోవచ్చు. గెలిచే ప్రయత్నం అంటే... కొందరు విద్యార్థులను చూడండి. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు ఏదో ఒక పని చేస్తూ డబ్బు సంపాదిస్తారు. మరి కొందరికి చదువు పూర్తయ్యేవరకూ డబ్బు సంపాదించాలనే ఆలోచన ఉండదు.

ఈ ప్రపంచంలో ఒకవైపు ఉచితంగా దొరికేదీ, మరోవైపు ఖరీదైనదీ కేవలం 'కాలం' మాత్రమే. హాల్లో అందరూ టీవీ చూస్తూ వుండగా, తన గదిలో నేలపై మోకాళ్ళ మీద కూర్చుని పదేళ్ళపాప ఏకాగ్రతతో బొమ్మ వేసుకుంటూ వుందనుకుంటాం. ఆ ఇంట్లో వారికి ఆ అమ్మాయి మీద ప్రేమతో పాటూ 'గౌరవం' కూడా వుంటుంది. ఇంట్లో వాళ్ళు ఇంకొకరి వర్క్ చూస్తున్నారు. ఆ పాప తన వర్క్ ఇంకొకరికి చూపించాలనుకుంటోంది. 'కీర్తి' అంటే అదే.

రాజు మరణించె ఒక తార రాలిపోయె/కవియు మరణించె నొక తార గగనమెక్కె

రాజు జీవించె రాతి విగ్రహములందు/సుకవి జీవించె ప్రజల నాలుకలయందు

అంటాడు జాషువా. ఒక రాజు చచ్చిపోతే ఒక నక్షత్రం ఆకాశంలో రాలిపోతుందట. కానీ ఒక కీర్తి ప్రతిష్ఠుడు మరణిస్తే ఒక నక్షత్రం ఆకాశంలో వెలుస్తుందట. 'కీర్తి' గొప్పతనం గురించి ఎంత గొప్ప భావమో చూడండి.

'అభిలాష', 'ఛాలెంజ్' అనే సినిమాలకి సత్యమూర్తి అనే రచయిత స్క్రీన్ ప్లేని సమకూర్చాడు. అతని కొడుకుకి చిన్నప్పట్నించి మ్యూజిక్‌పై ఇంట్రెస్టు వున్నట్లు కనబడేది. గది నిండా వాయిద్యాలతో ప్రాక్టీసు చేస్తూ వుండేవాడు. ఆ తరువాత మేము 'కొండవీటి దొంగ', 'జగదేక వీరుడు-అతిలోకసుందరి' తీసే సమయానికి పరిపూర్ణుడయ్యాడు. చాలా చిన్న వయసులో తారా జువ్వలా ఫీల్డులోకి దూసుకువచ్చాడు. 'వర్షం' సినిమాతో తన స్థానం సుస్థిర పర్చుకున్నాడు. ఆ కుర్రవాడు **దేవిశ్రీ ప్రసాద్.**

మనిషిలోని అంతర్గతశక్తిని ఎంత తొందరగా గుర్తిస్తే అంత వేగంగా జీవితంలో పైకి రావొచ్చునన్నమాట నిజమే గానీ, 'వయసు పైబడింది కదా, ఇంకేం చేయగలను' అని అనుకోవలసిన అవసరం కూడా లేదు. అంతర్గత శక్తిని పైకి తీసుకురావటం ముఖ్యం. ఏ వయసులో అనేది ప్రశ్న కాదు. అసలు చేయకుండా వుండటం కన్నా ఏదో ఒకటి చేయటం మంచిదే కదా.

నా 'నల్లంచు తెల్లచీర' నవల ఆధారంగా 'దొంగ మొగుడు' సినిమా చేస్తున్నప్పుడు మా దగ్గర భూపతిరాజు రవిశంకర్ అనే సహాయ దర్శకుడు ఉండేవాడు. అప్పటికే అతడికి ముప్పయి ఏళ్ళు. నటుడు అవ్వాలని కోరిక. 'దొంగ మొగుడు' సినిమాలో చిరంజీవి పేరు చాలా కొత్తగా, సింపుల్‌గా వుంటుంది. అందుకని ఆ పేరు పెట్టి అతణ్ణి పిలుస్తూ వుండేవాణ్ణి. తరువాత అతనికి బ్రేక్ వచ్చి, ఆ పేరుతోనే ఫీల్డులోకి ప్రవేశించి చాలా విజయాలు సాధించాడు. ఆ పేరు '**రవితేజ**'.

ప్రతీ వ్యక్తీ తనలోని ఎక్స్-ఫ్యాక్టర్ (నైపుణ్యం) గుర్తించాలి. చదువు అయిపోగానే ఖాళీగా ఉండటం క్యాన్సర్ కన్నా భయంకరమైన రోగం. జీవితపు నాలుగు భాగాల్లో నాలుగు పనులు చెయ్యాలి.


1. బాల్యంలో చదువు, నైపుణ్యమూ, జ్ఞానం ఆటలూ, క్రమశిక్షణ మొదలైనవి అలవర్చుకోవాలి.
2. యవ్వనంలో లోపల నుంచి తన్నుకొస్తున్న ఎనర్జీని సరైన దారిలో పెట్టుకుని ఆకర్షణీయ-అనారోగ్య సుడిగుండాల్లో పడకుండా డబ్బు, పేరు లాంటి గమ్యాల్ని సాధించాలి.
3. మధ్య వయసులో అధికారం, సౌఖ్యం, సమాజంలో గుర్తింపు, జీవితపు ఆఖరి స్టేజీలో కంఫర్టబుల్‌గా బ్రతకటానికి కావలసిన భవనం నిర్మించుకోవాలి.
4. వృద్ధాప్యంలో దయ, తృప్తి, ఫిలాంత్రఫీ, స్పిరిచ్యువాలిటీ ఆభరణాలుగా సమకూర్చుకోవాలి. జీవితం ఎంతో తృప్తిగా గడిచిన ఫీలింగ్ కలగాలి. సాధించిన విజయాలు చూసి గర్వపడాలి.

ఈ రోజు మనం చేసే పనులు, మనల్ని మన లక్ష్యానికి దగ్గరో లేక దూరమో చేస్తాయి. విజయశిఖరం ఎక్కాలంటే 'వెయ్యి మెట్లు' అధిరోహించాలి. మొదటి మెట్టు: ఆత్మశోధన ద్వారా బలహీనతల్ని తెలుసుకోవటం. రెండో మెట్టు: వాటిని అధిగమించటం. రెండే మెట్లు: చాలు. మిగతా 998 మెట్లు అంత ముఖ్యమైనవి కావు.

(ఇంకా వుంది)

'ప్రేమ ఒక కళ' లేఖలపోటీ

నవ్యవీక్లిలో కొత్తగా మొదలయిన 'ప్రేమ ఒక కళ' శీర్షికను పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. వారం వారం వెలువడుతున్న వ్యాసాలపై వారి ప్రతిస్పందన అద్భుతంగా ఉంటోంది. వారి స్పందనను అభినందిస్తూ పాఠకులను కూడా ఈ వ్యాసావళిలో భాగస్వాములను చేసేందుకు సరికొత్త పోటీని నిర్వహిస్తున్నాం. 'ప్రేమ ఒక కళ' శీర్షికన వారం వారం వెలువడే వ్యాసాలపై మీ అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా పదిలైన్లకు మించకుండా రాసి మాకు పంపండి. ఇ-మెయిల్‌లో కూడా మీ అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఉత్తమలేఖకి వెయ్యిరూపాయలు విలువగల పుస్తకాలను బహుమతిగా అందుకోండి!!



మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా

నవ్యవీక్లి

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్,
హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.

email: weeklynavya@yahoo.com

కాలం విలువ తెలిసేదీ, కాలానికి విలువ లేదని తెలిసేదీ కేవలం ప్రేమలోనే!
పెళ్లయిన తరువాత కూడా ఈ సిద్ధాంతాన్ని నిలుపుకోగలిగితే అది సుఖ సంసారమవుతుంది.



లైఫ్ మేనేజ్‌మెంట్ అంటే...

దాదాపు ముప్ఫై సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన ఇది. అలహాబాద్‌లో గంగ, యమున, సరస్వతి అనే మూడు నదులు కలుస్తాయి. 'త్రివేణీ సంగమం' దగ్గర యమున ఆకుపచ్చ రంగులో గంభీరంగా ఉంటుంది. గంగ ఫోర్స్‌ఫుల్‌గా, క్లియర్‌గా ఉంటుంది. వర్షాకాలంలో ఈ తేడా స్పష్టంగా తెలుస్తుంది. చిత్రమేమిటంటే ఇక్కడ గంగ లోతు 5 అడుగులైతే, యమున లోతు దాదాపు నలభై అడుగులుంటుంది. మూడో నది సరస్వతి పైకి కనిపించదు.



అస్తికల నిమజ్జనం కోసం నది మధ్యలో ఈ సంగమం దగ్గర చిన్న ఫ్లాట్‌ఫారంలా కట్టారు. అక్కడ పూజచేస్తే చనిపోయిన (?) ఆత్మలు సంతోషిస్తాయని నమ్మకం. అలాంటి నమ్మకం ఉన్న నా స్నేహితుడు, తన తండ్రి అస్తికలు తీసుకుని అక్కడకు వెళ్ళాడు. పడవలోంచి ఫ్లాట్‌ఫారం మీదకి ఎక్కుతూ నీళ్ళలో పడిపోయాడు.

అప్రస్తుతమైనా ఇక్కడో విషయం ప్రస్తావించాలి. బల్లకట్టు మీద నుంచి పడవలోకి ఎక్కేటప్పుడు (లేక దిగేటప్పుడు) కాస్త అనుభవం కావాలి. కదిలే పడవ మీద ఒక కాలు, పాతిన చెక్కమీద ఒక కాలు వేసి నిల బడతారు. గాలికి పడవ కదులుతూ ఉండటంతో రెండు కాళ్ళూ ఒకదాని కొకటి దూరమై, దానికి మరింత గాబరా తోడై, నీళ్ళల్లోకి జారిపోతారు. నది ఒడ్డున లోతు తక్కువ కాబట్టి ప్రమాదమేమీ జరగదు. కృష్ణ, గోదావరిలాంటి నదీ పరివాహిక ప్రాంతాల్లో నివ శించేవారికి ముసిముసి నవ్వులు తెప్పించే దృశ్యం ఇది.

ఐతే అలహాబాద్ సంఘటన తీవ్రమైనది. మూడు నదులు కలిసే చోట లోతెక్కువ. మా మిత్రుడు నీళ్ళ ల్లోకి జారిపోగానే ఒడ్డున ఉన్న అతడి భార్య బిగ్గరగా "బచావ్.... బచావ్... జోభీ చాహో లేలో.... (ఎంత కావాలంటే అంత తీసుకో... ఆయన్ని రక్షించు)" అని అరవసాగింది. ఇదంతా తరచు జరిగే ప్రమాదమన్నట్టు అనుభవజ్ఞుడైన పడవ వాడు నీళ్ళల్లో దూకి, క్షణాల్లో మా స్నేహితుడ్ని బయటికి తీసుకొచ్చాడు.

ఆ తరువాత మొదలైంది అసలు గొడవ. ఐదు వేలు ఇమ్మంటాడు వాడు. ఐదొందలు ఇస్తామంటారు వీళ్ళు. "ఎంత అడిగితే అంత ఇస్తానన్నావు కదా" అని వాడు, "అర నిముషం పనికి ఐదు వేలా" అని అతడి భార్య; "నీ మొగుడి ప్రాణం అయిదొందలేనా" అని వాడూ, "అంతకన్నా తక్కువే అయ్యుండవచ్చు గాక, అది కాదు కృశ్చను" అని ఆవిడా, అలా అరగంట వాదించుకున్నాక మేటర్ వెయ్యికి సెటిల్ అయ్యింది.

పెద్దగా నష్టం జరగని క్షణికావేశ నిర్ణయం ఇది. అయితే, ప్రతిసారీ ఫలితం ఇంత సజావుగా వుండదు. కోపంలో, ఆకలిలో, అంతులేని ఇష్టంలో, దుఃఖంలో ఉన్నప్పుడు నిర్ణయం తీసుకోకూడదు. ఆకర్షణకి లోనైన ఒక అమ్మాయి ఆవేశంతో పెళ్ళి నిర్ణయం తీసుకున్నా, ఒక దేశాధ్యక్షుడు ఆవేశంతో శత్రుదేశంపై న్యూక్లియర్ బాంబు ప్రయోగించినా, రెండు సందర్భాల్లోనూ అంతిమ పర్యవసానం ఫలితం ఒకే స్థాయిలో ఉండవచ్చు.


తొందరపాటుకీ సమయస్ఫూర్తికీ తేడా:

గంటకి నూట నలభై కిలోమీటర్ల వేగంతో బంతి వస్తుంది. వది లెయ్యాలా? గాలిలోకి లేపాలా? అన్న నిర్ణయం తీసుకోవటానికి 0.01 సెకండ్ సమయం మాత్రమే వుంటుంది. బంతి బౌండరీ లైను దాటితే నువ్వు హీరోవి. వికెట్టుకి తగిల్తే నువ్వు జీరోవి.

ఏ సినిమా చూడాలో నిర్ణయించుకోలేక బస్ స్టాప్‌లో అబ్బాయి, వస్తువులు కావాలో తేల్చుకోలేక షాపులో అమ్మాయి సమయం వృథా చెయ్యచ్చు. ఇవి చిన్న నిర్ణయాలు. అద్దె ఇంట్లో ఉండాలా – సొంతంగా ఇల్లు కట్టుకోవాలా; ప్రస్తుత ఉద్యోగంలో కొనసాగాలా – ఎక్కువ జీతం వచ్చే మరో ఉద్యోగంలో రిస్క్ తీసుకో వాలా?' అనేవి పెద్ద నిర్ణయాలు, ఒక డెసిషన్ తీసు కోబోయే ముందు కొన్ని అంశాలు ఆలోచించాలి.

- నేనిది చేయగలనా? నా సామర్థ్యాలని తక్కువగా గాని, ఎక్కువగా గాని అంచనా వేసుకుంటున్నానా?
- నా మెదడులో వచ్చిన మొదటి ఆలోచనకి కట్టుబడి మిగతా దారులన్ని మూసేస్తున్నానా?
- ఈ నిర్ణయం తీసుకోవడానికి నేనెంత సమయం కేటాయించాలి? నిజంగా దీనికంత సమయం అవసరమా?
- ఇది నా పనేనా? లేక ఇతరులకోసం అనవసరంగా నా మీద వేసుకుంటున్నానా?
- ఈ నిర్ణయం తీసుకోవటంలో అవతలవారి నష్టాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటున్నానా?
- జ్యోతిష్కుడు చెప్పిన దానికి అనుగుణంగా నా నిర్ణయం ఉన్నదా? లేక లాజికల్‌గా ఆలోచిస్తు

ప్రేమ ఒక కళ 6



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 92465 02662

తన ఈడు పక్కింటి కుర్రాడికి, వాళ్ల అన్నయ్య విదేశాల్నుంచి బహుమతి పంపించాడని తెలిసి, 'తనకీ అలా ఒక అన్నయ్య ఉంటే బావుణ్ణు' అనుకోవటం సహజం. తనూ తొందరగా విదేశాలకి వెళ్లి, తమ్ముడికో బహుమతి పంపిస్తే బావుణ్ణనుకోవటం ప్రేమ.



న్నానా?

- నిర్ణయం నాకు అనుగుణంగా లేదు కాబట్టి మంచి సలహాలని పక్కన పెడుతున్నానా?

మంచి నిర్ణయం అనుభవం ద్వారా వస్తుంది. అనుభవం చెడు నిర్ణయం ద్వారా వస్తుంది. రోజు మనం కొన్ని వందల నిర్ణయాలు తీసుకుంటాము. 'తొందరగా లేవాలా? ఇంకొంచెం సేపు పడుకోవచ్చా?' అన్న మొట్ట మొదటి నిర్ణయంతో రోజు మొదలవు తుంది. ఏ షర్ట్ వేసుకోవాలి? ఏ ఛానల్ చూడాలి లాంటి చిన్నచిన్న విషయాల నుంచి స్మోకింగ్ ఆపె య్యటం, కెరియర్ ఎంచుకోవటం వంటి ప్రధాన నిర్ణ యాలు తీసుకోవటమే లైఫ్ మేనేజ్‌మెంట్. 'ఒక నిర్ణ యాన్ని ఇప్పుడు తీసుకోవాలా? లేక తరువాత తీసు కోవాలా?' అనేది కూడా నిర్ణయమే. ఆ విధంగా నిర్ణ యాలు అయిదు రకాలు.

1. మార్చలేనివి:

జీవితంలో తీసుకొనే అతి ముఖ్య నిర్ణయాలన్నీ దాదాపు వెనక్కి తీసుకోలేనివి. కెరియర్, జీవిత భాగ స్వామి ఎంపిక, ఆస్తి కొనుగోలు, కోర్టులో నేరాన్ని ఒప్పుకోవడం లాంటి నిర్ణయాలు తీసుకునే ముందు, కష్టనష్టాలు లోతుగా ఆలోచించాలి. నాకు లెక్కలంటే చాలా ఇష్టం. కానీ మా కుటుంబంలో ఒక డాక్టర్ ఉండాలన్న, ఉద్దేశంతో పెద్దలు బయాలజీ చదవ మన్నారు. మెడిసిన్‌లో సీటు రాలేదు. అదృష్టవశాత్తు మళ్ళీ కామర్స్‌లోకి వచ్చాను. కానీ, ఇది దాదాపు వెనక్కి తీసుకోలేని నిర్ణయం.

2. మార్చగలిగేవి:

వ్యాపారం నష్టాల్లో నడుస్తున్నప్పుడు 'మరింత అదనపు పెట్టుబడి పెట్టి కొనసాగించాలా? ఆపు చెయ్యాలా? జూదంలో నష్టపోతున్నప్పుడు 'ఇంకా ఆడాలా? మానేయ్యాలా?' అనే నిర్ణయం తీసు కోవటం చాలా కష్టం. నాకు తెలిసిన వ్యాపారవే త్తని ఒక కొత్త డైరెక్టర్ ఐదు లక్షలతో సినిమా తియ్యెచ్చని దింపాడు. మొదటి షెడ్యూల్లోనే మొత్తం డబ్బు ఖర్చైపోయింది. మేమందరం వద్దని చెప్పాం. కానీ పరువుకి సంబంధించిన విషయంగా భావించి, మరొక కోటి రూపాయలు ఖర్చు పెట్టి పూర్తి చేసాడు. ఇంతవరకూ రిలీజ్ అవలేదు.

3. వాయిదా వెయ్యగలిగేవి:

లెక్కలు, కామర్సు రెండూ ఇష్టమయి నప్పుడు, పదో క్లాసు చదువుతున్నప్పుడే సి.ఏ. చేయలా లేక ఇంజనీరింగ్ చదవాలా అని నిర్ణయించుకోవలసిన అవ సరం లేదు. లెక్కల ఆప్షను తీసుకొని, తరువాత ఫైన ల్‌గా ఒక ఆలోచనకి రావచ్చు. వాయిదా వెయ్యటం వల్ల పెద్దగా నష్టాలు, కష్టాలు లేవని తెలిసినప్పుడు, నిర్ణయాన్ని కొంతకాలం పాటు ఆపుచేయటం మంచిది. ఇద్దరు ఆధునిక భావాలున్న వ్యక్తులు పెళ్ళిచేసుకొని ఆపై విడిపోవటం కంటే సహజీవనం చేస్తూ ఆ తరు వాత పెళ్ళి చేసుకోవటం కూడా ఆ విభాగంలోకి వస్తుంది.

4. రెండు వ్యతిరేక విలువలతో కూడినవి:

ఒక వైపు తల్లిదండ్రులు, మరొక వైపు ప్రేమించిన వ్యక్తి మధ్య ప్రేమికులు ఒక్కోసారి ఎంపిక చేసుకోవ లసి వస్తుంది. కొత్తగా పెళ్ళయిన డ్యాన్సర్ మాతృ త్వంలో వుండే ఆనందాన్ని ఆస్వాదించాలను కొంటుంది. కానీ కెరీర్‌కి దెబ్బ తగులు తుందేమోనని ఆలోచిస్తోంది. మొదటిది మానసిక ఆనందానికి సంబం ధించినది, రెండవది డబ్బు, కీర్తికి సంబంధించినది.

5. క్షణికావేశ నిర్ణయాలు:

కోపంలో, ఆకలిలో, అంతులేని ఇష్టంలో, దుఃఖంలో ఉన్నప్పుడు తీసుకునే నిర్ణయాన్ని హేస్టీ డెసి షన్ అంటారు. ఆకర్షణలో ఒక అమ్మాయి ఆవేశంతో పెళ్ళి నిర్ణయం తీసుకున్నా, ఒక దేశాధ్యక్షుడు ఆవేశంతో శత్రు దేశంపై న్యూక్లియర్ బాంబు ప్రయోగించినా, రెండు సందర్భాల్లోనూ అంతిమ పర్యవసాన ఫలితం ఒకే స్థాయిలో ఉండవచ్చు.

ఒక్కోసారి మన పట్టుదలనీ, ఏకాగ్రతనీ ఎక్కువ అంచనా వేసుకుని నిర్ణయాలు తీసుకుంటాం. టీ.వీ.లో ఒక అమ్మాయి ట్రెడ్‌మిల్ మీద కాళ్ళు నాజుగ్గా కదు పుతూ, 'తన పిడికెడంత సన్నటి నడుముకి కారణం ఆ మిషనే' అని తేనెలూరే స్వరంతో చెపుతూ వుంటే, ఆ ప్రకటన చూసి నా మిత్రుడొకడు యాభై వేల రూపా యలు పెట్టి జిమ్‌కి సరిపడా సామాన్లన్నీ కొనబోయాడు.

"నా అనుభవంతో చెప్తున్నాను. రెండ్రోజులు వర్క్ చేసి తరువాత మానేస్తూ వుంటారు. కేవలం సామాన్లు కొనటం వల్ల సన్నబడిపోరు' అని అతడిని వారించాను. 'మరేం చేయాలంటావు?' అని అడిగాడు.

"పదిరోజుల పాటు ఇంట్లో బస్కీలు తియ్యి. నాలుగో రోజు నించీ బద్ధకం వేసి మానేస్తే, ఈ యాభై వేలూ సేవ్ అవుతాయి. పైగా వాటిని ఎలా వదిలించు కోవాలా అన్న ఇబ్బంది కూడా తప్పినట్టు అవుతుంది" అని చెప్పాను. నేను చెప్పిందే కరెక్ట్ అయ్యింది. ఐదు రోజుల తరువాత అతడు వ్యాయామం చేయటం మానేశానని చెప్పాడు.

బర్నింగ్ ద షిప్:

పత్రికకి స్క్రిప్ట్ పంపేటప్పుడు, వ్రాత ప్రతిలో కొట్టి వేతలు చాలా ఉంటే, దాన్ని మళ్ళీ తిరిగి వ్రాయాలా - అలాగే పంపించాలా? అనే డైలమా వస్తుంది. వ్రాసిన కాగితాల మీద అడ్డంగా ఒక గీత గీస్తాను. అప్పుడు తిరిగి వ్రాయటం తప్ప నాకు మరో దారి ఉండదు. 'బర్నింగ్ ద షిప్' అంటే, మిగిలిన అన్నీదారులు నాశనం చేయడం. తాము తప్పించుకొనే మార్గాలు మరింకేమీ లేవనీ, కేవలం విజయం మాత్రమే తమ ప్రాణాలు రక్షిస్తుందనీ గుర్తించినప్పుడు, సైనికులు ప్రాణా లకి తెగించి పోరాడతారు. ఒక తెలివైన సైనికాధికారి శత్రు సైనికులు పారిపోయేందుకు వీలుగా మార్గాలు సృష్టించి, కృత్రిమమైన పిరికితనాన్ని వాళ్ళలో చొప్పిస్తాడు. బర్నింగ్ ద షిప్ అంటే అదే.

రేపు క్లాసు పరీక్ష ఉందని మీ టీచరు ఈ రోజు సాయంత్రం స్కూలు వదులుతుండగా చెప్పింది. కానీ ఈ రోజు ఫస్ట్‌షో టికెట్లు మీరు అడ్వాన్స్ బుకింగ్‌లో



కొనుక్కున్నారు. 'ఏం చేయాలి' అని గంటల తరబడి ఆలోచించే బదులు టిక్కెట్లు చింపేస్తే, అప్పుడు ప్రశాంతంగా చదువు కోవచ్చు.

ఒక ఫంక్షన్‌లో నా ప్రక్కనే కూర్చున్న ప్రముఖ అతిథి 'నిన్న టీ.వీలో నా ఇంటర్వ్యూ చూశారా? అందులో మీ గురించి పేర్కొన్నాను' అన్నాడు. అతడితో అంతగా పరిచయం లేకపోవటంతో నేను ఆశ్చర్య పోయి 'ఎందుకు' అని అడిగాను.

''తెలంగాణా మారుమూల గ్రామంలో మూడు వేల రూపాయలకు ఉపాధ్యాయుడిగా ఉద్యోగం. హైదరాబాద్ వచ్చి పాటల రచయితగా ప్రయత్నించాలని ఉద్దేశ్యం. ఉద్యోగాన్ని రిస్క్ చేయాలా అని సందేహం. ఈ సమయంలో మీ పుస్తకంలో 'నిర్ణయం' అనే అధ్యాయం ఒక రాత్రి చదివాను. ప్రొద్దున్నకల్లా మళ్ళీ నా నిర్ణయం మారుతుందేమోనని మరుసటి రోజు ప్రొద్దున్నే హెడ్‌మాస్టార్ గారికి ఇమ్మని రాజీనామా లేఖ వ్రాసి నా భార్యకి ఇచ్చి, రాత్రికి రాత్రి హైదరాబాదు వచ్చేసాను'' అన్నాడు.

తరువాత కథ నాకు తెలుసు. అతడు సుమారు నాలుగు వందల సినిమాలకి 1600 పాటలు వ్రాసాడు. నేషనల్ అవార్డు కూడా పుచ్చుకున్నాడు. ఈ విషయం గురించి నా పుస్తకంలో ప్రస్తావించవచ్చా అని అడిగినప్పుడు అతడు సహృదయంతో ఒప్పుకున్నాడు.

బర్నింగ్ ది షిప్‌కి మరొక మంచి ఉదాహరణ చదవండి: అప్పటివరకూ స్నేహంగా ఉన్న అబ్బాయిగానీ అమ్మాయిగానీ అకస్మాత్తుగా మాట్లాడటం మానేస్తే, ఫోన్‌లో ఆ నెంబర్ చూసినప్పుడల్లా దుఃఖం కలుగుతుంది. మరేం చెయ్యాలి? ఒక భగ్న ప్రేమికుడి స్నేహితురాలికి నిశ్చితార్థం జరిగిపోయింది. 'ఆ అమ్మాయిని మర్చిపోవటం ఎలా?'' అని కౌన్సిలింగ్‌కి వచ్చాడు.

లైఫ్ మేనేజ్‌మెంట్ అంటే జీవితానికి సంబంధించిన ప్రధాన నిర్ణయాలు తీసుకోవడమే. ఈ విషయంలో క్లారిటీ ఉండాలి. మనశక్తి సామర్థ్యాలను మనం గుర్తెరిగి ప్రవర్తించాలి. క్షణికావేశంలో శక్తికి మించిన నిర్ణయాలు తీసుకోకూడదు. ఏపని ఎప్పుడు చెయ్యాలో నిర్ధారించుకోలేని వాళ్ళు ఏదీ పూర్తిగా చేయలేక నిరంతరం సతమతమౌతారు.

'ఆ అమ్మాయీ నువ్వూ ఎక్కడ కలుసుకుంటూ వుంటారు?'' అని అడిగాడు కౌన్సిలర్.

''కాలేజీ వున్నన్నాళ్ళూ అక్కడ కలుసుకొనే వాళ్ళం. ఆమె చదువు పూర్తయింది. ఇప్పుడు ఆ అమ్మాయిని చూడ్డానికి కూడా వీలు పడటం లేదు. ఇల్లెక్కడో తెలియదు. ఫోన్ చేసినప్పుడల్లా నన్ను మర్చిపో అంటుంది. మరింత చిరాగ్గా మాట్లాడుతోంది. బ్లాక్‌మెయిల్ చేస్తున్నానేమో అనుకుంటుంది. నా సమస్యల్లా ఆమెను మర్చిపోలేక పోవటమే''.

కొద్దిసేపు ఆలోచించి ''ఆమె ఫోన్ నంబరు నీ సెల్‌లోంచి తీసెయ్'' అన్నాడు కౌన్సిలర్. ఆ అబ్బాయికి ఆయన చెపుతున్నది అర్థం కాలేదు. ''ఆమె నంబరు చూసే కొద్దీ నీకు ఆమెతో మాట్లాడాలనిపిస్తుంది. ఫోన్ నంబరు తీసేసిన పక్షంలో మనసు ఎంత వేధించినా ఆమెతో మాట్లాడ లేవు. వివాహం ఎలాగూ జరగదని తెలిసినప్పుడు కనీసం ఆమెనైనా సంతోషంగా వుంచడం నీ బాధ్యత. ఆఖరి ఈ ఒక్క లింకూ తెంపేస్తే, నీ మనసు క్రమేణా కుదుట పడుతుంది'' అన్నాడు.


నిర్ణయలేమి:

ఒకమ్మాయికి క్లాస్‌మేట్ ప్రపోజ్ చేసాడు. అతడు బీదవాడు. కానీ ఎప్పుడూ క్లాస్‌ఫస్ట్. ఆమె అతడితో 'సరే' అనాలా వద్ద అని నిర్ణయించు కోలేక పోతున్నప్పుడు తల్లిదండ్రులు మరొక ప్రపోజల్ తీసుకొచ్చారు. వారు తెచ్చిన కుర్రవాడు అందమైనవాడు. బాగా చదువుకున్న వాడు. డబ్బున్న వాడు.

రెండు ఆకర్షణీయమైన గోల్స్ మధ్య ఏది ఎన్నుకోవాలో నిర్ణయించుకోలేక పోవటాన్నే డిసైడో ఫోబియో అంటారు. తొందరపాటు నిర్ణయం కన్నా ఇది మరింత ప్రమాదకరమైనది. కేవలం రాజకీయవేత్తలకి మాత్రమే ఇది పని చేస్తుంది. మన మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు గారు దీనికి ప్రతీక.

నిర్ణయలేమితో బాధపడేవాళ్ళు చాలా గమ్మత్తయిన వాదనలు చేస్తుంటారు. ఎక్కడెక్కడ్నించో కారణాలు వెతికి పట్టుకొచ్చి చెబుతూ వుంటారు. వంద కిలోల బరువున్న ఒక వ్యక్తి వెయిట్ తగ్గాలను కుంటున్నాడనుకొందాం. రెండురోజులు ఎక్సర్‌సైజ్ చేసి మానేసాక అతడు ఈ విధంగా వాదించవచ్చు. ''నేను సన్నబడితే పాత బట్టలన్నీ పడేసి తిరిగి కొత్తవి కొనుక్కోవాలి... లావుగా వున్న నా స్నేహితులు ఈర్ష్య పడతారు... నేను నా కుటుంబ సభ్యులతో కలిసి హోటలుకి వెళితే నేను తినటం మానేయటం చూసి మా వాళ్ళు కూడా తినటం మానేస్తారు. వాళ్ళని ఆ విధంగా నిరాశ పరచిన వాడినవుతాను.... బరువు తగ్గటం వల్ల తొందరగా అలసిపోతున్నట్లు గత రెండు రోజుల అనుభవంతో తెలుసుకొన్నాను...'' వింటున్న కొద్దీ ఇలాంటి వాదనలు ఎన్నో చేస్తారు.


నిజ జీవితంలో చిన్నచిన్న విషయాలకి కూడా మనం ఇలాగే నిర్ణయ లేమితో ప్రతిస్పందిస్తూ వుంటాం. కాఫీ పెట్టుకోవడానికి వెళుతున్నప్పుడు గత రాత్రి టేబిల్ మీద పడేసిన ఉత్తరాలు కనబడతాయి. వాటిని చదవ లేదన్న విషయం గుర్తుకు వస్తుంది. కాఫీ వాయిదా వేసి వాటిని చదువుతూ వుండగా, నాలుగు రోజుల క్రితవు కాఫీ కప్పు క్రింద కనబడు తుంది. దాన్ని వాష్-బేసిన్లో వేసి కడుగుతూ వుండగా, ఇంటర్నెట్‌లో పంపించవలసిన అర్జెంట్ మెసేజ్ గుర్తొస్తుంది. ఇలా ఒకదాని తరువాత ఒకటి చేసుకుపోతూంటే, రోజంతా బిజీగా వున్నట్టే కనబడుతూ వుంటుంది కానీ ఏ పనీ పూర్తవదు. ఏ పని ఎప్పుడు చేయాలో నిర్ధారించుకోలేని వాళ్ళు, ఈ విధంగా నిరంతరం సతమతమవుతూనే వుంటారు.



నేను చదివిన గొప్ప క్లాసిక్ డెసిషన్స్‌లో ఇది ఒకటే: అన్నదమ్ము లిద్దరూ పూర్వీకుల ఆస్థి కోసం సంవత్సరాల తరబడి పోరాడుతున్నారు. విసుగుచెందిన జడ్జి ఒకే ఒక వాక్యం తీర్పునిచ్చాడు. ''ఒకరు ఆస్థిని రెండుగా భాగాలు చెయ్యండి. మరొకడు అందులోంచి ఒకటి ఎన్నుకోండి'' అని.

(ఇంకావుంది)

'ప్రేమ ఒక కళ' లేఖలపోటీ



నవ్యవీక్లీలో కొత్తగా మొదలయిన 'ప్రేమ ఒక కళ' శీర్షికను పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. వారం వారం వెలువడుతున్న వ్యాసాలపై వారి ప్రతిస్పందన అద్భుతంగా ఉంటోంది. వారి స్పందనను అభినందిస్తూ పాఠకులను కూడా ఈ వ్యాసావళిలో భాగస్వాములను చేసేందుకు సరికొత్త పోటీని నిర్వహిస్తున్నాం. 'ప్రేమ ఒక కళ' శీర్షికన వారం వారం వెలువడే వ్యాసాలపై మీ అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా పదిలైన్లకు మించకుండా రాసి మాకు పంపండి. ఇ-మెయిల్‌లో కూడా మీ అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఉత్తమలేఖకి వెయ్యిరూపాయలు విలువగల పుస్తకాలను బహుమతిగా అందుకోండి!!

మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా
నవ్యవీక్లీ
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్,
హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.
email: weeklynavya@yahoo.com

సముచిత నిర్ణయం తీసుకోవటం ఒక కళ



ఎవరైనా ఒక సమస్యలో ఉన్నప్పుడు మరో మనిషితోడు, సలహా కావాలని పిస్తుంది. సలహా కోసమే అయితే, చుట్టూ బోలెడంత మంది స్నేహితులు, బంధువులు, పక్కింటివాళ్ళు, చివరికి పనిమనిషి కూడా తోచింది చెప్పడానికి రెడీగా ఉంటారు. అయితే క్లిష్టమయిన సమస్యల విషయంలో, వారి నిర్ణయాల కన్నా (లేక స్వంత నిర్ణయాల కన్నా) లాయర్లు, డాక్టర్లు, సైకాలజిస్టులు మొదలైనవారి మీద ఆధారపడటం మంచిది. అయితే కొంతమంది పేరుకుముందు 'డాక్టర్' అని తగిలించు కుని కౌన్సిలింగ్ చేస్తున్నారు. మరి కొందరు జలుబు నుంచీ విడాకుల వరకూ ఏ సమస్యకైనా ధ్యానమూ లేదా హిప్నాటిజమూ పరిష్కారాలని ప్రచారం చేస్తున్నారు. వారితో మాత్రం జాగ్రత్తగా ఉండాలి.

సెల్లింగ్ కౌన్సిలింగ్:

సలహాలిచ్చే నిపుణుల దగ్గరికి వెళ్ళేముందు, 'దీన్ని నేనే పరిష్కరించుకోగలనా? నిపుణుడి అవసరం ఉందా?' అని ఆలోచించుకోవాలి. చాలా సమస్యలకి ఎవరికి వారే పరిష్కారాలు ఆలోచించుకోగలరు. ఆ నిర్ణయాన్ని అమలు జరిపే మానసిక స్థయిర్యాన్ని మాత్రమే నిపుణులు ఇస్తారు. కౌన్సిలర్ చెపుతున్నది విన్నంత సేపూ బాగానే వుంటుంది కానీ అమలు జరపటమే కష్టం.

"నా భర్త వేరే స్త్రీని ఇష్టపడుతున్నాడు/నా గర్ల్ ఫ్రెండ్ వేరే కుర్రాడితో తిరుగుతోంది కాబట్టి నేను చదువుమీద కాన్సన్‌ట్రేట్ చేయలేక పోతున్నాను/నా బోయ్ ఫ్రెండ్‌కి పెళ్ళయి ఇద్దరు పిల్లలు. కానీ నన్నే ఇంకా ప్రేమిస్తున్నాడు కాబట్టి నేను అవివాహితగానే వుండి పోదామను కుంటున్నాను/నాకు జీవితంలో పైకి రావాలని వుంది కానీ ఎలా రావాలో తెలియటం లేదు..." ఈ విధంగా మనుష్యులకు రకరకాలయిన సమస్యలుంటాయి. ఈ విధమైన సమస్యలన్నిటినీ నాలుగు విభాగాలుగా విడగొట్టవచ్చు.

1. పరిష్కారం లేని సమస్యలు
2. మనమే ఈ సమస్యకి పరిష్కారాన్ని ఆలోచించగలం. సలహా అవసరం లేదు.
3. నిపుణుడి సలహా అవసరమైన సమస్యలు.
4. కౌన్సిలింగూ, సలహా కావలసింది అక్కడికొచ్చిన క్లయింట్‌కి కాదు. దగ్గరవారికి ఇంకెవరికో.

"మా ఆయన తాగుడు మానిపించాలంటే ఏం చెయ్యాలి?" ఆమె ప్రశ్న. "ఆయన్ని తీసుకురండి" డాక్టర్ సమాధానం. "మా పిల్లలు తెలివైన వాళ్ళే, సరిగ్గా చదవడం లేదు. ఏం చేయాలి." పెద్దల సందేహం. "వాళ్ళని టెలివిజన్ నుంచి దూరంగా ఉంచండి. మొబైల్ ఇవ్వకండి" కౌన్సిలరు సమాధానం. వచ్చినవాళ్ళు ఫీజు ఇచ్చి వెళ్ళిపోతారు. కౌన్సిలర్ చెప్పిన సలహాలు జీవితంలో అమలు జరపలేమని వారికి నిశ్చయంగా తెలుసు.

"నేనొక అబ్బాయిని ప్రేమించాను. అతన్ని పెళ్ళి చేసుకుంటే మా నాన్న చచ్చిపోతానంటున్నారు. నేనేం చేయాలి?" అని అడుగుతుంది ఓ గ్రాడ్యుయేటు. "ప్రేమించడానికి ముందే ఆ విషయం మీరు ఆలోచించి ఉండాల్సింది" అంటాడు కౌన్సిలర్. ఆ మాత్రం ఆ అమ్మాయికి తెలియదా?" ఆ అబ్బాయిని మర్చిపోవటానికి వేరే అభిరుచులు పెంచు కోండి" అని చెప్తే నప్పదు. పాయసం లాంటి పరిష్కారం కావాలి.

కౌన్సిలర్స్ దగ్గరికి వెళ్ళేటప్పుడు అయిదు విషయాలు గుర్తుపెట్టుకోవాలి.

1. ఏ సమస్యకీ ఖచ్చితమైన పరిష్కారం ఉండదు.
2. ఒక మంచి కౌన్సిలర్ ఎప్పుడూ నిర్ణయం చెప్పడు. నాలుగైదు మార్గాలు సూచించి మంచి దారి వెతుక్కోమంటాడు.
3. ఒక పరిష్కారాన్ని అమలు జరపాలంటే దృఢమైన మనస్సు, కఠినమైన నిర్ణయాలు అవసరం.
4. వైవాహిక సమస్యలు చాలావరకు ఇద్దరూ ఉంటేనే పరిష్కారమవుతాయి.
5. రాత్రికి రాత్రి మార్పుసాధ్యం కాదు.

చాలామంది కేవలం తమ బాధ చెప్పుకోవడానికే కౌన్సిలర్ దగ్గరకి వెళ్తారు. "ఒకామె నా దగ్గర గంటసేపు అపాయింట్‌మెంట్ తీసుకొని బాధలు చెప్పటం మొదలుపెట్టింది. యాభై తొమ్మిది నిముషాలు అయిన తరువాత 'ఇంకొక్క నిముషమే టైముంది' అన్నాను. 'ఆ నిముషం కూడా నన్నే మాట్లాడనివ్వండి' అని ఆమె కోరింది' అంటాడు ఒక ప్రముఖ సైకాలజిస్టు.

స్పాంటేనియిటీ:

నిర్ణయం సొంతంగా తీసుకోవాలా ఇతరుల మీద ఆధారపడాలా? అని నిర్ణయించేది జ్ఞానం. క్లిష్టమైన పరిస్థితులలో భయపడకుండా, కంగారు పడకుండా, అలస్యం చేయకుండా సరియైన కోణంలో సముచితమైన నిర్ణయాన్ని తీసుకోవటం ఒక కళ. పెద్దపెద్ద ఉద్యోగాల ఎంపికలలో, విషయ పరిజ్ఞానం కన్నా, దీనికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు.

ఇంటర్వ్యూలో అభ్యర్థులని 'రాత్రికి రాత్రి అకస్మాత్తుగా మీ జెండర్ శాశ్వతంగా మారిపోతే మీరేం చేస్తారు?' అని అడిగాడు ఒక మెంబరు. 'ఇలాంటి ప్రశ్న

ప్రేమ ఒక కళ 7



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 92465 02662



ఏమిటా' అని అనుకొన్నాం. కాని తరువాత అర్థ మయింది. ఒక ప్రాజెక్ట్ మేనేజర్‌కి కావలసిన లక్షణాలు రెండు: అనుకోకుండా ప్రాజెక్ట్ ఫెయిలయితే నిబ్బరంగా ఉండగలగాలి. రెండోది: ఏదన్నా ఊహించని ప్రశ్న ఎదు రైనప్పుడు ఎంత తొందరగా ఆలోచించి సమాధానం చెప్తావు?' అనేది స్పాంటేనియిటీ. పై ప్రశ్నలో ఈ విధ మైన తర్కం ఉంది' అని మేము భావించాం.

రకరకాల సమాధానాలు చెప్పారు. కొంతమందైతే అసలే సమాధానమూ చెప్పలేదు. కొందరు చాలా ఎవే సివ్‌గా 'ఏం చేస్తాం? అలాగే కంటిన్యూ అయిపోతాం' లాంటి సమాధానాలు చెప్పారు. మరికొందరు అమ్మా యిలు 'అబ్బాయి అయితే రాత్రిపూట తొందరగా ఇంటికి రావలసిన పని లేదు. అర్థరాత్రి వరకూ మోటార్ సైకిల్ మీద తిరగొచ్చు' వగైరా సమాధానాలు చెప్పారు. ఇవి కొంతలో కొంత బెటరు.

నారాయణమ్మ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అమ్మాయి చెప్పిన సమాధానానికి కొంత 'నాటకీయత' కలిపి వ్రాస్తాను: 'నా తల్లిదండ్రులకి నేనొక్కతే కూతుర్ని. నా తండ్రికి మోకాళ్ళ నొప్పులు. తెల్లవారుజామున లేచి కొబ్బరినూనె వేడిచేసి కాళ్ళకి రాస్తే తప్ప ఆయన మంచం దిగలేడు. నేను శాశ్వతంగా అబ్బాయినై పోయాను అని తెలిస్తే, నాన్న దగ్గరికి పరిగెత్తుకుని వెళ్ళి... ''నాన్నా...! ఇంకొన్ని రోజుల్లో నాకు పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోతే నీ కాళ్ళకి ఇంత ప్రేమతో, శ్రద్ధతో, భక్తితో నూనె ఎవరు రాస్తారు' అని ఫీలవుతూ ఉండే దాన్ని. బహుశ భగవంతుడు నా ప్రార్థన విన్నాడేమో... శాశ్వతంగా నీ సేవ చేసుకోవడానికి వీలుగా నన్ను అబ్బాయిగా మార్చేసాడు' అని చెప్పి సంతోషిస్తాను' అంది.

స్పాంటేనియిటీ అంటే అది...!

'నీ పుట్టిన రోజు ఎప్పుడు' అని టీచర్ అడిగి నప్పుడు 'పదమూడు అక్టోబర్' అని సమాధానం ఇచ్చాడు. 'ఏ సంవత్సరం' అని అడిగితే ఆ కొంటె పిల్లాడు 'ప్రతీ సంవత్సరం' అని బదులిచ్చాడు. అనుభ వజ్ఞుడైన టీచర్ నవ్వి 'నేను నీ వార్షికోత్సవాల గురించి అడగడం లేదు. పుట్టిన రోజు ఎప్పుడు అని అడిగాను' అన్నాడు. స్పాంటేనియిటీకి ఇది పరాకాష్ఠ.

అయితే, తొందరపాటు వేరు. స్పాంటేనియిటీ వేరు. తొందరగా నిర్ణయం తీసుకోవడం, తొందరపడి ఇంట ర్వ్యూల్లో సమాధానం చెప్పటం పొరపాట్లకి దారి తీస్తుంది. నేను నిర్వహించే సెమినార్లో ఈ ప్రశ్న అడుగు తాను. 'ఎ, బిలు చెరో 94 పరుగులు వద్ద ఉన్నారు. అదే చివరి వికెట్. ఆఖరి రెండు బంతుల్లో ఏడు పరుగులు చేయాలి. అంతకన్నా ఎక్కువ పరుగులే చేసి వాళ్ళు గెలి చారు. ఫైనల్ స్కోర్లు ఎ-100, బి-100. ఇదెలా సాధ్యం? దీనికి రెండు వేర్వేరు సమాధానాలు ఉన్నాయి. చెప్పండి'' అని అడిగినప్పుడు దాదాపు 99% విద్యా ర్థులు టక్కున లేచి ''వైడ్..' అనో, ''నో బాల్.. ఫ్రీ హిట్'' అనో అరుస్తూ ఉంటారు. అవన్నీ తప్పు సమా ధానాలే అని ఒక క్షణం ఆలోచిస్తే మీకే బోధపడు తుంది. ఏది సరియైన ఆన్సరో ఇక్కడ సమస్య కాదు. తొందరపడి నిర్ణయాలు తీసుకోవటం వల్ల వచ్చే ప్రమా దాన్ని చెప్పటమే ఈ ఉదాహరణ లక్ష్యం.

(సరైన సమాధానం కావాలంటే మీ పిల్లల్ని www.yandamoori.com చూడమనండి. ఇలాంటి పజిల్స్ 350 పైగా ఉంటాయి. వాళ్ళలో అలాంటి ఉత్సుకత కలిగించటం కోసమే ఇక్కడ సమాధానం ఇవ్వటం లేదు)

ఆలస్యం అమృతం విషం అంటారు ఒకవైపు. పరు గెత్తి పాలు తాగొద్దంటారు మరో వైపు. ఏది కరెక్టు? ఏ టైములో ఎలా చేయటం కరెక్టో తెలుసుకోవటం కరెక్టు.

24ని సింగిల్ డిజిట్ చేస్తే ఎంత? సమాధానం ఆరు (2+4). ఇప్పుడు 321, 53, 21, 64 సంఖ్యలని ఆ విధంగా చేసి సమాధానం చెప్పండి. చివరి అంకెకి మీ సమాధానం 'పది' అయితే, మీకు తొందరపాటు ఎక్కువ అన్న మాట. సరయిన సమాధానం '.... ఒకటి, మీ పిల్లలతో, స్నేహితులతో ఈ ప్రయోగం చేసి చూడండి. చాలామంది తప్పు చేస్తారు. ఆ విధంగా స్పాంటేనియిటీ వేరు. తొందరపాటు వేరు....! అదే విధంగా, తొందరపాటు నిర్ణయం వేరు. సరయిన నిర్ణయం వేరు.

కొత్తగా పెళ్లైన అమ్మాయికి ఒక హీరో అంటే తెగ పిచ్చి. ఆమె భర్తకి అసహ్యం. ఆ హీరో సినిమా చూడొ ద్దని కఠినంగా ఆంక్ష పెట్టాడనుకుందాం. అప్పుడా అమ్మాయి.

- అతడ్ని లెక్కచేయకుండా తన అభిమాన హీరో సినిమా చూడవచ్చు.
- నొప్పించక తానొవ్వక రీతిలో అతనికి తెలియ కుండా సినిమాకి వెళ్ళొచ్చు.
- ఆ హీరోలో ఉండే గొప్ప నటనా చాతుర్యాన్ని చెప్పి భర్తని ఒప్పించవచ్చు.
- పడక సత్యాగ్రహం లాంటి పద్ధతుల ద్వారా భర్తని లొంగదీసుకోవచ్చు.
- భర్త ఆనందం కోసం మనస్ఫూర్తిగా ఆ హీరో సిని మాలు చూడటం మానెయ్యవచ్చు.

నిరాశతో నిరంతరం బాధపడటం కంటే, పై వాటిలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవటం, మార్గాన్ని ఎన్నుకోవటం మేలు. ఇలాంటి సందర్భాల్లో ప్రఖ్యాత మానసిక శాస్త్రవేత్త ఫ్రాయిడ్ ఒక మంచి సూచన చేస్తూ, ''నిరర్థకమైన తన కోరికను 'మలుపు తిప్పడం' ద్వారా మనిషి మరింత మంచి మార్గంలో పయనించవచ్చు'' అని అంటాడు. దీన్నే 'పాజిటివ్ ట్రాన్స్ఫర్ ఆఫ్ ఎమో షన్' అంటారు. 'కాసింత శాడిజం ఉన్న వాళ్ళు బాక్సరో, రగ్బీ ప్లేయరో, సర్జనో లేక దంతవైద్యుడో అయితే ఆ నెగిటివిటి నుంచి ఎస్కేప్ అవ్వొచ్చు'' అని సలహా ఇస్తాడు. ఉదాహరణ అంత బాగోక పోయినా కొంతవరకూ సత్యమే కదా. ఫ్రాయిడ్ థియరీ ప్రకారం, నిరంతరం రొమాంటిక్ ఆలోచనలతో సతమతమయ్యే విద్యార్థి ఒక చిత్ర కారుడిగానో లేదా కవిగానో మారితే తన బాధని సవ్యమైన మార్గంలో ప్రకటించవచ్చు.

ఒక కుర్రవాడు తన తాతగారి పల్లెటూరికి వెళ్త న్నప్పుడు, అక్కడ తోటల గురించి, పొలాల గురించి, చెరువులో ఈతకొట్టడం గురించి ఊహించు కుంటాడే తప్ప, అక్కడి ఎండ, పవర్‌కట్, దోమల గురించి ఆలో చించడు. దీనివల్ల అతడు నెగెటివ్ విషయాల గురించి బాధ పడటం మానేసి, కేవలం ఆనందాన్ని మాత్రమే స్వీకరిస్తున్నాడన్న మాట.

నమ్మకం మీద ఆధారపడ్డ నిర్ణయాలు:

మేము పనిచేసిన ఒక సినిమాకి, బాగా సెంటి మెంట్ ఉన్న మా నిర్మాత, దర్శకుడు నన్ను, మరో ఇద్దరు ముగ్గురు టెక్నీషియన్స్‌ని తిరుపతి తీసుకెళ్ళారు. గుడికి వెళ్ళాం. వెంకటేశ్వరస్వామి పాదాల ముందు స్క్రిప్టు పెట్టి అందరం నమస్కరించాం. భక్తులు సాగి పోతున్నారు. కాని మేము మాత్రం స్పెషల్ కాబట్టి ఒక మూల నిలబడ్డాం. లోపల విపరీతమైన ఉక్క, ఫ్యాన్ ఉన్నా కూడా పూజారికి చెమట ధారాపాతంగా కారి పోతుంది. ఎంతసేపు దణ్ణం పెడితే అన్ని రోజులు సినిమా ఆడుతుందన్న లెవల్లో అందరూ భక్తితో ఆ తథా గతుడిని ప్రార్థిస్తూ ఉండి పోయారు. నాకేమో ఉక్కిరి బిక్కిరి. గాలి ఆడని పరిస్థితి. క్యూలో సాగిపోవటం వేరు. ఆగిపోవటం వేరు. కేవలం వారి మీద గౌరవంతో అక్కడ నిలబడ్డాను.

తిరిగి వచ్చేముందు అక్కడే కొండమీద గడ్డిలో కూర్చుని మాటల రచయిత డైలాగ్స్ వినిపించాడు. అద్భుతంగా వ్రాసాడు. ఆ తరువాత ఆ చిత్రం రిలీజై విజయఢంకా మోగించింది. సినిమా బాగుండబట్టి ఆడిందే తప్ప, వెంకటేశ్వరస్వామి పాదాల వద్ద స్క్రిప్టు పెట్టడం వల్ల కాదు అన్న నా వాదనని అక్కడెవ్వరూ ఒప్పుకోలేదు. పైగా నావైపు జాలిగా చూసారు. సరే, ఎవరి అభిప్రాయాలు వారివి.



అదే నిర్మాత, అదే దర్శకుడితో తీసిన ఆ తరువాత సినిమాకి మేమందరం ఈసారి మంత్రాలయం రాఘవేంద్రస్వామి దగ్గరకు వెళ్ళాము. అక్కడ గుడి చాలా విశాలంగానే ఉంది. గాలి బాగానే ఆడుతుంది. మళ్ళీ యథా తథంగా స్క్రిప్ట్ ఆయన పాదాల దగ్గర పెట్టి అందరం నమస్కరించి వచ్చాం. ఆ సినిమా బ్రహ్మాండంగా రిలీజయి, అంతే బ్రహ్మాండంగా మూడు రోజుల్లో వెళ్ళిపోయింది. 'ఏది ఏమయినా వడ్డీ కాసుల వాడి రైపే వేరు' అని మాట మార్చారు మా వాళ్ళు. అంతే తప్ప, తమ అభిప్రాయం మార్చుకోలేదు.

గుడి, భగవంతుడు, అస్తిత్వం కాదు ఇక్కడ, ''అందరూ నిన్ను ప్రభావితం చేయటానికి ప్రయత్నిస్తారు. నాతో సహా...! నేను చెప్పినా, మతప్రవక్తలు చెప్పినా, మేధావులు చెప్పినా, మతగ్రంథాల్లో వ్రాసినదైనా... అది నీ తర్కానికి... ఇంగిత జ్ఞానానికి హేతువుకి సరిపోతేనే దాన్ని నమ్మి ఆచరించు'' అని బోధిస్తాడు బుద్ధుడు.

నమ్మకం మీద ఆధారపడ్డ నిర్ణయాలు సంతృప్తిని ఇస్తాయే తప్ప, సంతృప్తికరమైన ఫలితాన్ని ఇస్తాయన్న గ్యారంటీ లేదు.

మెచ్యూర్డ్ నిర్ణయాలు:

ఒక్కోసారి మనం మానసికంగా చాలా మెచ్యూర్ అయినట్టు అను కుంటాం. కాదు, మునుపటి అభిప్రాయాల కన్నా ప్రస్తుతం అభి ప్రాయాలు 'కన్వీనియంట్'గా ఉంటే, ఆ విధంగా పొరపడే ప్రమాదం ఉంది.

ఒక అమ్మాయిని ప్రేమలోకి దింపి, అతడు ఇంకెవరినో పెళ్ళి చేసుకున్నాడు. అమ్మాయి నిద్ర, భోజనం, తల దువ్వుకోవటం వగైరా మానేసి ఆర్నెల్లు ఏడ్చింది. మనసు గాయాలకి 'మరుపు' అనే ఆయింట్‌మెంట్ రాస్తుందంటారు 'కాలం'. క్రమక్రమంగా కుదుట పడింది. ఇప్పుడు ఇద్దరు పిల్లలు. మంచిభర్త, గతం గుర్తు తెచ్చుకుని, ''అది నేనేనా?... తల్చుకుంటే నవ్వొస్తుంది. ఎంత ఇమ్మెచ్యూర్‌గా ఏడ్చేదాన్ని'' అనుకుంది.

ఆమె చెల్లెలు కూడా ఒక కుర్రవాడ్ని ప్రేమించి, ఆ విషయం అక్కకి చెప్పింది. ఇంతలో ఇంట్లో సంబంధాలు చూస్తే, నవ్వుతూ పెళ్ళి పీటల మీద కూర్చొని తాళి కట్టించుకుంది.

''అదేమిటి... కనీసం కొద్దిగా కూడా బాధలేకుండా అలా ఒప్పేసుకున్నావేంటి?'' అని ఆశ్చర్యపోయింది అక్క.


''నువ్వు ఆర్నెల్లు ఏడ్చిఏడ్చి చేసుకున్నావు. 'మెచ్యూరిటీ లేకుండా అలా ఏడ్చానేంటి?'' అని నాతో అన్నావు. ఇప్పుడు నేను క్షణం కూడా బాధపడ కుండా పెళ్ళి చేసుకున్నాను. మెచ్యూరిటీ నీదా? నాదా?'' అని అడిగింది చెల్లి.

ఇది జరిగిన పాతికేళ్ళకి ఆ చెల్లెలి కొడుకు కులం గోత్రం లేని విదేశీ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. భార్యాభర్తలు మనసులోనే కుమిలి పోయారు. కోడలు అద్భుతమైన అమ్మాయి. పది రోజుల్లో అందరి మనసులు దూరగొన్నది. ''మనం మూర్ఖపు పట్టుదలతో ఉంటే ఇంత మంచి అమ్మాయిని కోల్పోయేవాళ్లం కదా'' అనుకున్నారు.

దీన్ని బట్టి అర్థమయిందేమిటి? మెచ్యూరిటీ అనేది ఒక నిరంతర ప్రక్రియ. భావోద్వేగాలు లేకపోవటం, దుఃఖానికి అతీతంగా ఉండటం మెచ్యూరిటీ కాదు. ఆనందం విషాదం మిళితమైతేనే జీవితం. 'బాధని ఎంతో తొందరగా వదిలించుకుని ఆనందపరమైన భావోద్వేగాలతో బ్రతుకు తావు' అన్నదే మెచ్యూరిటీ. ఒక షేర్ బ్రోకర్ ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొన్న తరువాత అనుభవజ్ఞుడైన 'బుల్'గానో, 'బేర్'గానో మారతాడు. ప్రేమకి, ఆకర్షణకీ తేడా తెలుసుకోలేని యువతీ యువకులు పెళ్ళి చేసుకున్న తరువాత వేదాంతులుగా పరిణితి చెందుతారు.

(ఇంకా వుంది)

'ప్రేమ ఒక కళ' లేఖలపోటీ



నవ్యవీక్లీలో కొత్తగా మొదలయిన 'ప్రేమ ఒక కళ' శీర్షికను పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. వారం వారం వెలువడుతున్న వ్యాసాలపై వారి ప్రతిస్పందన అద్భుతంగా ఉంటోంది. వారి స్పందనను అభినందిస్తూ పాఠకులను కూడా ఈ వ్యాసావళిలో భాగస్వాములను చేసేందుకు సరికొత్త పోటీని నిర్వహిస్తున్నాం. 'ప్రేమ ఒక కళ' శీర్షికన వారం వారం వెలువడే వ్యాసాలపై మీ అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా పదిలైన్లకు మించకుండా రాసి మాకు పంపండి. ఇ-మెయిల్‌లో కూడా మీ అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఉత్తమలేఖకి వెయ్యిరూపాయలు విలువగల పుస్తకాలను బహుమతిగా అందుకోండి!!

మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా
నవ్యవీక్లీ
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్,
హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.
email: weeklynavya@yahoo.com

ఉత్తమ లేఖ

నిజమే! ఆత్మశోధనతో గమ్యం చేరగలం

మీరు (యండమూరి గారు) వ్రాసిన ప్రతి వాక్యం అక్షర సత్యం. కాకపోతే ఉత్సాహం, ఉపయోగం ఉన్న వాటిని ఎవరైనా ప్రొఫెషన్‌గా వేసుకుంటే అతడ్ని గ్రహాంతరవాసిని చూసినట్టు చూస్తారు ఎదుటి వ్యక్తులు (ఇంట్లో వారు కూడా). నేను క్రికెట్ ఆడి లేరు. బహుశా మధ్య తరగతి బ్రతుకులు వాళ్ళచేత అలా ఆలోచింపజేసి ఉండవచ్చు. కండరాలు బలంగా ఉన్న 20 యేళ్ళ కుర్రాడు తన మెదడుకు అంతగా పని చెప్పడు. చుట్టూ పరిస్థితులు ఎలా ఉన్నా 'బిందాస్' గా బతికేస్తాడు. కానీ ఒక్కోసారి అవే పరిస్థితులు కొంత మంది విజయానికి కారణమవుతాయి. మీరు ప్రస్తావించినట్టు తన అంతర్గత

సచిన్ అంతటి వాడ్ని అవుతా అంటే, ''నువ్వు సచినా?' అని ఆశ్చర్యార్థకంగా ఫేస్ పెడతారు. పోనీ సినిమా అంటే 'పిచ్చి' అంటారు. అదే వ్యక్తి విజయం సాధించి వస్తే ఆటోగ్రాఫ్‌కోసం వెంటపడతారు. చదువు తప్ప అన్నింట్లో ఆసక్తి ఉన్న తెలివైన కొడుకుని తీసుకెళ్ళి బలవంతంగా అయినా స్వామీజీ సాయంతో చదువులో జొప్పించాలనే చూస్తారు తప్ప, అతనికి ఆసక్తి ఉన్న దాంట్లో ప్రోత్సాహించ శక్తిని గుర్తించిన వడ్రంగి కొడుకు 'బిల్‌గేట్స్' అయ్యాడు గానీ బిల్‌గేట్ కొడుకు మరో బిల్‌గేట్స్ కాలేకపోయాడు. నిజమే. ఆత్మశోధన చేసుకున్న మనిషి ఇటు లౌకికంగా అటు అలౌకికంగా కూడా గమ్యం చేరుకోగలడు.

-కొల్లిపర హితేష్,
కొత్తపేట, గుంటూరు-1

ప్రతి ఒక్కరికీ మేలు కొలుపు 'ప్రేమ ఒక కళ'

ఉపయోగమా? నిరుపయోగమా? అని ఆలోచించటం మాని తమకు యిష్టమైన విధంగా వెళ్తోంది నేటి యువత. లక్ష్య సాధన కోసం కాకుండా టీ వీ సీరియళ్ళు, క్రికెట్ లతో అనవసర కాలయాపన, వృథా మానసిక వత్తిళ్ళతో ఎన్నో విలువైన క్షణాల్ని తమకే తెలియకుండా జారవిడుచుకుని చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు లేటుగా తప్పు తెలుసుకుని బాధ పడటం వల్ల ఏ ప్రయోజనం ఉండదని ఉదాహరణలతో చాలా చక్కగా వివరించారు. చెడు స్నేహాలతో తమ వారిని బాధపెట్టి తాము కూడా సంతృప్తిని పోగొట్టుకుంటున్నారని తెలిపారు. చిత్తశుద్ధి ఉంటే విజయ శిఖరం రెండు మెట్లతో చేరుకోవచ్చునని ఆలోచింపజేశారు. యువతనే కాకుండా ప్రతి ఒక్కరినీ మేలుకొలిపారు యండమూరి గారు.

-దేగల అనితాసూరి, హైదరాబాద్

అయ్యో! ఎన్ని మంచి విషయాలు మిస్ అయ్యానో!

నా ఇంటర్మీడియట్ చదువు పూర్తయింది. నాకు బుక్స్ చదవడం అంటే పెద్దగా ఇష్టం ఉండేదికాదు. కానీ ఇప్పుడు నవ్య వీక్లీ లో 'ప్రేమ ఒక కళ' చదువుతుంటే నాకు చాలా బాగా అనిపిస్తోంది. అయ్యో ఇప్పటివరకు నేను బుక్స్ చదవలేకపోవడం వల్ల ఎన్ని మంచి విషయాలు మిస్ అయ్యానో అనిపిస్తోంది. నేను ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్నాను. యండమూరి వీరేంద్రనాథ్ గారు చెప్పే విషయాలు చాలా బాగున్నాయి. చదవటం ఆనందం. పాస్ కావడం బోనస్. పాఠాలు చెప్పడం ఆనందం. జీతం బోనస్. తారు నుండి సింథటిక్ వైర్ తీస్తే అది గుండె ఆపరేషన్ లో పనికివస్తుంది అని చెప్పడం నాకు చాలా ఇంట్రస్టింగ్‌గా ఉంది.

-ఎస్.సాహితి

ఒక పక్షి పుట్టినప్పటి నుంచీ పంజరంలోనే వుందనుకొందాం. తనేం కోల్పోతున్నదో దానికి తెలియదు. ఇది మొదటి స్టేజి. వయసు వచ్చే కొద్దీ రెక్కలు విప్పుకొని ఎగరాలని అనిపిస్తుంది. ఎగరటంలో వుండే ఆనందం ఏమిటో తెలియదు కానీ యేదో తెలియని అసంతృప్తి. ఇది రెండో స్టేజి. అనుకోకుండా అకస్మాత్తుగా పంజరం ద్వారం తెరవబడింది. అది ఒక్కసారిగా బయటకు ఎగిరింది. మేఘాల్లోకి దూసుకు పోయింది. చెట్టుకొమ్మల మీద నాట్యం చేసింది. వర్షంలో తడిసింది. ఉన్నట్టుండి దానికి జీవితం అంటే ఏమిటో అర్థం అయ్యింది. ప్రకృతి తనకి రెక్కలు ఎందుకు ఇచ్చిందో తెలిసింది.

ప్రేమ ఒక కళ

8



-యండమూరి వీరేంద్రనాథ్
సెల్: 9246502662

అద్దంలో మనల్ని మనం చూసి నవ్వుకుంటే...!

మన జీవితం కూడా అంతే. మనం ఒక పర్పస్ కోసం సృష్టించబడ్డాం. మనలోని అంతర్గత శక్తుల్ని సరిగ్గా ఉపయోగించుకోకపోతే క్రమక్రమంగా నిస్తాణగా అయిపోతాము. ఎందుకు బ్రతుకుతున్నామో తెలియదు. బ్రతుకు భాగస్వామ్యంలో 'నిరాశ' సెకండ్ సెటప్ అయితే, 'నిస్పృహ' థర్డ్ సెటప్ అవుతుంది. ఆ రెండూ కలిసి 'ఆశ' అనే అసలు భార్యని చంపేస్తాయి.

మనం మన అందాన్ని, యవ్వనాన్ని తొందరగా కోల్పోవటానికి కారణం మన జీవన విధానమే. సమస్యల్ని గుర్తు తెచ్చుకుంటూ నిద్ర లేస్తాము. బ్రేక్‌ఫాస్ట్



టేబుల్ దగ్గర కంగారు, హడావుడి వల్ల వచ్చిన కోపంతో పిల్లల్ని తిట్టడంతో రెండో అంకం ప్రారంభం అవుతుంది. ఆఫీసులో మరింత చెడు రక్తాన్ని ఎక్కించుకుంటాము. గతంలో చేసిన తప్పులు, అప్పులు, ఇతరులతో చెడిపోయిన సంబంధాలు మదిలో ముసురుకుంటాయి. సాయంత్రం స్నేహితులతో, కుటుంబ సభ్యులతో డిన్నర్‌కి వెళ్ళి, కొత్తగా ధనవంతులైన బంధువుల గురించీ, అక్కడ లేనివారి గురించీ, సినిమా ఆర్టిస్టుల గురించీ, వారి అఫైర్స్ గురించీ చెడుగా మాట్లాడుకుంటూ, భూమ్మీద ఉన్న ప్రతీ చెత్త గురించీ వాదించుకుంటూ.... ఉత్తేజపడి... ఆవేశపడి... చివరికి రాత్రి ఇంటికి వచ్చి, మనకేమీ సంబంధం లేని ఈ మాఫియా, క్రైం, పాలిటిక్స్, అభం శుభం తెలియని చిన్నపిల్లల శృంగార నృత్యాలు, ఐటమ్‌సాంగ్స్ టీ.వీలో చూస్తూ మరింత చెడురక్తాన్ని ఎక్కించుకుని నిద్ర పోవడానికి ప్రయత్నిస్తాము. మరి మనం అందంగా, ఆనందంగా ఎలా ఉండగలము?

మీరు మిమ్మల్ని ఉత్సాహంగా, ఆనందంగా ఉంచుకున్నప్పుడు, మీ చుట్టూ వున్న వాళ్ళకు కూడా ఆ సువాసనలు వెదజల్లుతాయి. ఈ ఉల్లాసంతో మీరు మరింత శ్రద్ధతో పని చేస్తారు. అది మిమ్మల్ని 'మంచి ఉత్పత్తి' ఇచ్చేవాడిగా తయారుచేస్తుంది. మీ చుట్టూ వున్న ప్రజలు మీ 'మంచి ఉత్పత్తిని' ఆనందిస్తారు.! అదే విధంగా, మీరు హాస్యాన్ని పుట్టిస్తున్నప్పుడు, హాస్యాన్ని ఆస్వాదిస్తారు...! మీరు మీ బెస్టు ఇచ్చినప్పుడు, ప్రజలు మీ నుండి ఎక్కువ లాభాన్ని పొందుతారు...! ఈ మొత్తం ప్రక్రియ అంతా స్వీయ - సంరక్షణ చుట్టూ తిరుగుతుంటుంది.

మీ బెస్ట్‌ని ఇచ్చే కొద్దీ మీరు మరింత ఆనందంగా ఉంటారు. అది క్రికెట్‌మ్యాచ్ కావొచ్చు. వంట కావొచ్చు. నోబెల్ ప్రైజుకి సంబంధించిన పుస్తకం కావొచ్చు. మరోవైపు, మీ 'బెస్ట్' వర్క్‌తో అందరూ అన్ని వేళలా సంతోషంగా ఉండాలని రూలేమీ లేదు. ఇవ్వటం వరకే మీ బాధ్యత. ముఖ్యంగా క్రియేటివ్ పనులని మొక్కుబడిగా చెయ్యవద్దు. మూడు నెలలకో సినిమా విసర్జించవద్దు అన్నందుకు ఒక దర్శకుడికి కోపం వచ్చింది.

నాకొక మిత్రుడుండేవాడు. చాలా సరదాగా పందాలు కాస్తూ ఉండేవాడు. ''ఓసారి అమెరికా వెళ్ళినప్పుడు అక్కడ రాజమండ్రిలో నేను డ్రింక్ చేస్తూ ఉండగా ఒకమ్మాయి కనబడింది'' అన్నాడు.

''అమెరికాలో రాజమండ్రి ఏమిటి? అక్కడ అమ్మాయి ఏమిటి'' అన్నాడు మరొక స్నేహితుడు చిరాగ్గా.

''అయిదు వేలు పందెం కట్టు, అమెరికాలో రాజమండ్రి అనే ఊరుంది''.

అలా పందెం కాసుకున్నాక, ఇంటర్నెట్ అంతా వెతికి అటువంటి పేరు గల ఊరేదీ అమెరికాలో లేదని నిశ్చయమయ్యాక అయిదు వేలు చెల్లించాడు నా మిత్రుడు. ఇంత మూర్ఖంగా ఎందుకు పందెం కట్టాడో మాకు అర్థం కాలేదు. ఇది జరిగిన కొన్ని రోజులకి మళ్ళీ పార్టీ జరుగుతున్నప్పుడు 'ఇండోనేషియా అమలాపురంలో అటుకులు చాలా ప్రసిద్ధి'' అని ఏదో టాపిక్ తీశాడు.

'ఇండోనేషియాలో అమలాపురం ఏంటి?' చిరాగ్గా ప్రశ్నించాడు ముందు వ్యక్తి. ఈసారి పదివేలకి పందెం. పరిశీలిస్తే ఆ దేశంలో అమలాపూర్ అనే ఊరుందని తెలిసింది. తిరిగి ఆ డబ్బంతా సరదాగా ఆరోజు పార్టీకే ఖర్చుపెట్టినా, ఒక మనిషి తన చుట్టూ ఉండే కంపెనీని ఏ విధంగా ఉత్సాహపరుస్తాడో చెప్పాడానికి ఈ ఉదాహరణ.

తృప్తినిండిన కళ్ళకన్నా గొప్పదేది?

విజయలక్ష్మీ పండిట్ అమెరికాకు రాయబారిగా ఎంపికైన సందర్భంలో ఒక జర్నలిస్ట్ ఆమెని ''మీ దగ్గర వాళ్ళూ, సొంత మనుష్యులు మీకు సంతోషాన్ని

ప్రేమ అంటే రెండు శరీరాల్లో ఒకే 'ఆత్మ' అంటారు. నిజమే కావొచ్చు. కానీ, నాలుగు పెదాల మీద రెండు చిరునవ్వులు నిజమైన ప్రేమ.



ఇచ్చారా? మీ కుటుంబం పట్ల మీరు సంతృప్తిగా ఉన్నారా?'' అని అర్థం వచ్చేలా ప్రశ్న అడిగాడు.

''లేదు'' అని సమాధానం ఇచ్చింది.

చుట్టూ ఉన్నవారంతా విస్తుపోయారు. అక్కడ ఇబ్బందికరమైన నిశ్శబ్దం పేరుకుంది. రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, విదేశీ రాయబారులందరూ ఆమె సమాధానానికి నిశ్చేష్టులై ఉండగా, ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ ''నన్ను ఎవ్వరూ సంతోషపరచరు. నాలో నేనే, నాతో నేనే సంతోషంగా ఉంటాను'' అని ఆమె చెప్పింది. అక్కడున్న వారందరూ కరతాళ ధ్వనులు చేశారు.

సాధారణంగా కనబడే గొప్ప శక్తివంతమైన జవాబు ఇది. శాంతిని మనకెవ్వరూ ఇవ్వరు. భార్యా, భర్తా, పిల్లలు, తల్లి, తండ్రి అందరూ ఆనందం ఇవ్వవచ్చు గాక, సంతోష పరచవచ్చు గాక, కానీ శాంతి మాత్రం అంతర్గతమైనది. ఈ జవాబు చెప్పింది జవహర్‌లాల్ నెహ్రూ చెల్లెలు. ఆమె భర్త సీతారామ్ పండిట్ స్వాతంత్ర్య సమరయోధుడు. చాలాసార్లు జైలుకి వెళ్ళాడు. ఆమె నలభై నాలుగు సంవత్సరాల వయసులో మరణించాడు. తనంతట తానుగా ఆమె శిఖరాగ్రాలకు చేరుకుంది.

మనసులో ప్రశాంతత లేనప్పుడు అంతులేని సంపద, సంఘంలో గౌరవం, మంచి భర్త/భార్య, పిల్లల అందరూ ఉన్నా అది శూన్యమే. వయసు పెరిగే కొద్దీ భవబంధాలు తగ్గాలి. మరణాన్ని ఆనందంగా ఆహ్వానించేందుకు సిద్ధపడాలి. భౌతికమైన విషయాల పట్ల ఆకర్షణ తగ్గించుకుంటే శాంతి చేరువ అవుతుంది.

ఒక అవినీతిపరుడైన ఇంజనీరు, రైల్వే బ్రిడ్జీ నిర్మాణ సమయంలో లక్షల్లో లంచాలు తీసుకుని భారీగా సంపదను కూడబెట్టాడు. ఆ వంతెన ఒక సంవత్సరం తరువాత కూలిపోయింది. వందల మంది ప్రయాణికులు గాయపడ్డారు, చాలామంది మరణించారు. అవినీతి శాఖ జరిపిన విచారణల్లో అతడు ముందు సస్పెండ్ కాబడి, ఆ తరువాత ఉద్యోగంలో నుండి తొలగింపబడ్డాడు.

విచారణ జరుగుతున్నంత సేపు అతడు ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాడు. అతడి ఇంటిపై ఏ.సీ.బీ. దాడి జరిపినప్పుడు ఆ వార్తని మీడియా ప్రముఖంగా ప్రచురించింది. టీ.వీ ఛానల్స్ అతడి ఇంటిని, కూలిపోయిన బ్రిడ్జిని, ప్రయాణీకుల ఆర్తనాదాల్ని, మార్చి మార్చి చూపించాయి. సమాజంలో, బంధుమిత్రుల్లో అతడి పరువు సమూలంగా నాశనమైంది.

కాలక్రమేణా అతడి భార్య మరణించింది. చూసేందుకు ఇంట్లో ఎవరూ లేరనే నెపంపై అతను ముసలి తల్లిని వృద్ధాశ్రమంలో చేర్పించాడు. తరువాత రిటైరయ్యాడు. ఆస్తిలో కొంతభాగం కూతురికి, మరికొంత కొడుక్కి వ్రాసాడు. అప్పనంగా వచ్చిన ఆస్తిని అల్లుడు జూదంలో తగలబెట్టాడు. పక్కమీద నుంచి లేవలేని తండ్రిని కొడుకు కూడా వృద్ధాశ్రమంలో చేర్పించాడు. ఆ ఇంజనీరు అక్కడే మరణించాడు.

అనారోగ్యకరమైన ఎటాచ్‌మెంట్‌ని ''మోహం'' అంటారు. మోహం దుఃఖానికి కారణం. విజయానికి శత్రువు. నాలుగు రకాల ఎటాచ్‌మెంట్‌ల వల్ల ప్రజలు ప్రశాంతతని కోల్పోతారు. అనారోగ్యకరమైన ఎటాచ్‌మెంట్‌ని ''మోహం'' అంటారు. మోహం దుఃఖానికి కారణం. విజయానికి శత్రువు. నాలుగు రకాల ఎటాచ్‌మెంట్ వల్ల ప్రజలు ప్రశాంతతని కోల్పోతారు.

-బ్రతుకు పట్ల

-డబ్బు పట్ల

- ఆత్మీయుల (భవబంధాల) పట్ల,

- పరువు ప్రతిష్టల పట్ల.

కూతురు కులం తక్కువ వాడ్ని వివాహం చేసుకుంటే కొందరు దుఃఖించేది కూతురి గురించి కాదు. పరువుపోయిందని, అటాచ్‌మెంట్ కూతురితో కాదు. పరువుతో...! పరువు పోతుందేమో అన్నభయంతో ఒక విద్యార్థి స్టేజీ మీద మాట్లాడలేదు. పరువు పోతుందేమో అన్నబాధతో అప్పుల వాళ్ళకి తిరిగి చెల్లించలేక ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటాడు.

జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవాలంటే మనం 'అనుకునేదానికి', 'జరిగేదానికి' మధ్య ఉన్న దూరాన్ని తగ్గించటమే. గెలుపుకి దీనికంటే మంచి నిర్వచనం మరొకటి లేదు. మన ఆశకు - 'వాస్తవానికి' మధ్య ఉన్న తేడాయే బాధ. ఒక ఉద్యోగి ఎయిర్-కండిషన్డ్ బెడ్ రూం కావాలని లంచాలు తీసుకుంటాడు (ఆశ). పట్టుబడి జైలుకి వెళ్లాడు (వాస్తవం). ఒక కుర్రవాడికి ఫస్ట్ క్లాసులో పాస్ అవ్వాలని ఉంటుంది (ఆశ). చదవక ఫెయిల్ అవుతాడు (వాస్తవం). భర్త అపురూపంగా చూసుకోవాలని అమ్మాయి కోరుకుంటుంది (అంచనా). కానీ అతడు నిర్లక్ష్యం చేస్తూ ఉంటాడు (వాస్తవం). కోరికకి వాస్తవానికి తేడా ఎక్కువ అయిన కొద్దీ, ఈ విధంగా బాధ ఎక్కువ అవుతూ ఉంటుంది. 'తార్కిక' ఆలోచనలతో భవబంధాలకి దూరం అయితే మనసుకి ప్రశాంతత లభిస్తుంది.

నవ్వు ఒక కళ

ఇతరులు మనల్ని ప్రేమించాలంటే మన మొహం ప్రేమింపబడేలా ఉండాలి. మొహానికి చిరునవ్వుని మించిన మేకప్ మరొకటి లేదు. ''రొమాన్స్‌లో కూడా మనం పాక్షికంగా ఉంటాము. కేవలం చిరు నవ్వులోనే పరిపూర్ణంగా ఉంటాము'' అంటాడు విలియం వర్డ్స్ వర్త్. నిద్రలో నవ్వే శిశువులను చూడండి ఎంత స్వచ్ఛంగా, నిర్మలంగా, అద్భుతంగా ఉంటుందో.

మొగుడూపెళ్ళాలు చంటాడిని తీసుకుని పెళ్ళికి వెళ్ళారు. పిల్లాడు బొద్దుగా, ఆరోగ్యంగా, నవ్వుతూ కేరింతలు కొడుతూ ఉన్నాడు. భర్త తన ప్రొడక్ట్‌ని సగర్వంగా ఎత్తుకుని అందరికీ చూపిస్తున్నాడు. ఇంతలో ఎవడో వాడి బుగ్గ గిల్లాడు. దాంతో వాడు ఏడుపు లంకించుకున్నాడు. ఇప్పుడు మొగుడు భార్యతో ''ఇదిగో... వీడిని కాస్త తీసుకో, ఏడుస్తున్నాడు' అంటాడు. బస్‌స్టాప్‌లో నవ్వుతూ నిల్చొనే అవసరం



చిరునవ్వు ఆహ్లాదానికి చిహ్నం. ఆనందాన్ని వ్యక్తపరచడానికి నోటి కండరాల్ని వంచటం ద్వారా ఏర్పడే ముఖకవళికే చిరునవ్వు. ముప్ఫై మిలియన్ సంవత్సరాల క్రితం చింపాంజీల్లో భయానికి చిహ్నంగా ఈ చిరునవ్వు పుట్టింది అని బయాలజిస్టులు అంటారు. తమని వేటాడడానికి వచ్చే జంతువులకు ''తాము సాధు జంతువులము'' అని చెప్పే ప్రక్రియే తరువాత నవ్వుగా మారిందని వీరంటారు.

లేదు గానీ, ఆహ్లాదకరమైన నవ్వుతో బదులు ఇవ్వటం అవతల వారికి కచ్చితంగా మంచి ఇంప్రెషన్ కలుగజేస్తుంది.

ఏమన్నా అర్థమైందా? ఏడ్చేవాడిని అందరూ వదిలించుకుందామని చూస్తుంటారు. అవునా?

మన పెద్దలు సీరియస్‌నెస్ తెలివికి చిహ్నం అని మన నరనరాల్లో జీర్ణించి పోసారు. ఒక దేశపు ప్రెసిడెంట్ గానీ, మల్టీనేషనల్ కంపెనీ సి.ఈ.ఓ.గానీ నవ్వటం సాధారణంగా మనం చూడం. దురదృష్టవశాత్తు తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని గట్టిగా నవ్వనివ్వరు. ఆలోచించండి. మీరు బిగ్గరగా నవ్వి ఎంతకాలం అయింది. కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థులు నవ్వేటందుకు అస్సలు అనుమతి ఇవ్వరు. క్లాసులో పాఠం చెప్తున్నప్పుడు నవ్వుతూ విన్నారనుకోండి. టీచరు మెచ్చుకోడు. 'సీరియస్‌గా విను' అంటాడు. అంతవరకు ఎందుకు? మీరెప్పుడైనా ఒక సాధువు నవ్వటం చూశారా? "శిలువ మీద యేసుక్రీస్తు నవ్వుతూ ఉండి ఉంటే, అది 'పునర్జీవనం' కన్నా పెద్ద అద్భుతం అయ్యుండేది" అని ఓషో ఒక చోట అంటాడు.

మీరొక డాక్టర్ అయ్యుండి, ఎప్పుడూ నవ్వుతూ ఉన్నట్టయితే రోగులు మిమ్మల్ని అంగీకరించరు. రోగికి సాధారణ జలుబున్నా సరే, అదేదో క్యాన్సర్ అన్నంత సీరియస్‌గా చెప్పాలి. నవ్వుతూ చెప్తే ఫీజు తగ్గించే ప్రమాదం ఉంది. టీచర్, డాక్టర్, చర్చి ఫాదర్, చివరికి గుడిలో పూజారి... అందరూ సీరియస్‌గానే ఉండాలి. ఇంతకన్నా దౌర్భాగ్యం ఇంకొకటి ఉన్నదా?

ఎయిర్ హోస్టెస్‌లు, టీ.వీ యాంకర్లు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్లు మొదలైనవారికి ట్రైనింగ్ ఇస్తున్నప్పుడు 'నవ్వు' తాలూకు ప్రాముఖ్యత వాళ్ళకి చెప్తారు. నవ్వును నేర్చుకోగలమా? కచ్చితంగా...! ప్రతిరోజు ప్రొద్దున్న లేవగానే బ్రష్ చేసుకోవడానికి ముందు అద్దం దగ్గర నిలబడి పదిసెకన్ల పాటు నవ్వండి. మిమ్మల్ని చూసి మీకే నవ్వు రాకపోతే ఇంకెవరు నవ్వుతారు? షేవింగ్ చేసుకుంటున్నప్పుడు, స్నానం చేస్తున్నప్పుడు, తల దువ్వుకుంటున్నప్పుడు పాటల్ని ఎలాగైతే సన్నగా హమ్ చేస్తారో, నవ్వటం కూడా అలాగే సాధన చెయ్యండి. మీ చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటున్నప్పుడు, యవ్వనపు అనుభూతులని నెమరు వేసుకుంటున్నప్పుడు గట్టిగా నవ్వేసెయ్యండి.

పెళ్లంటే విరక్తి ఉన్న ఒక యువకుడు పెళ్లిచూపులకు వెళ్ళాడు. ఆమెను చూడగానే అతడిలో ఏదో కదలిక మొదలైంది. పది నిముషాలు మాట్లాడి, ఆమె లోపలికి వెళ్తూవెళ్తూ వెనుతిరిగి అతడికి చిరునవ్వుతో నమస్కరించింది. ఆ సమయంలో ఆమె బుగ్గ మీద చిన్న డింపుల్ పడింది. అతడు దాన్లో పడ్డాడు.

మూడు నెలల్లో ఆమెతో పెళ్ళి చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని తల్లిని బెదిరించాడు. పెళ్ళైపోయింది. అయితే ఆ అమ్మాయి అత్తారింటికి వచ్చాక కొత్త వాతావరణం వల్ల నవ్వటం మానేసింది. అతడు ఆమెను పార్కుకి తీసుకెళ్ళి నవ్వించేందుకు ప్రయత్నం చేసాడు. 'డార్లింగ్. నేను నీ నవ్వుకే పడిపోయాను. మా ఇంట్లో కొత్తగా ఫీలవ్వకు. నా తల్లిని నీ తల్లిగా భావించు. నా అక్కని నీ అక్కగా భావించు. నన్ను నీ మొగుడిగా భావించు" అన్నాడు. ఆమె ఫక్కున నవ్వింది. తన ప్రయత్నం సఫలీకృతం అయినందుకు సంబరపడుతూ, "చూసావా నువ్వు నవ్వితే ఎంత బాగున్నావో" అన్నాడు అతడు. ఆమె మళ్ళీ నవ్వింది.


ఈ ఉదాహరణను నా సెమినార్స్‌లో చెప్తూ "మూడు నెలల క్రితం చూసిన ఒక అమ్మాయి నవ్వితే అంత అద్భుతంగా ఉన్నప్పుడు అద్దంలో మిమ్మల్ని మీరు చూసి నవ్వుకున్నప్పుడు మీకెంత అద్భుతంగా ఉండాలి?" అంటాను. విద్యార్థులందరూ రిలాక్సింగ్‌గా చప్పట్లు కొడతారు.

ప్రశాంతమైన ముఖం మనసుకి చిహ్నం కావచ్చు. కానీ 'ప్రశాంతమైన నవ్వు' ఆత్మ తృప్తికి సూచిక. మానసిక ఒత్తిడి వల్ల వచ్చే నవ్వుని 'పేలవమైన' నవ్వు అంటాము. అవతల వాళ్ళని హేళనచేసి నవ్వుని 'వెక్కిరింత' అంటాము. కళ్లతో నవ్వడాన్ని 'డచ్‌మెన్ స్టైల్' అంటారు. ఇది మొహానికి చాలా అందాన్ని ఇస్తుంది. చాలా సులభంగా ప్రాక్టీసు చేయవచ్చు కూడా. మొహంలో కింద భాగాన్ని కాగితంతో కవర్ చేసి కళ్ళవైపే దృష్టిపెట్టి నవ్వటానికి ప్రయత్నం చెయ్యండి.

"లాఫింగ్ బుద్ధ" గురించి తెలియని వారుండరు. చిన్నగుడ్డ సంచీ పట్టుకున్న లావుపాటి విగ్రహం. పెద్ద పొట్ట...! చాలామంది ఇతడిని గౌతమబుద్ధుడుగా అభిప్రాయపడతారు. తప్పు. బుద్ధుడు విగ్రహారాధన వద్దన్నాడు. అతడికి విగ్రహం ఏమిటి? ఈ బుద్ధ వేరు. ఇతడి పేరు బుదాయ్. చైనీస్ సంస్కృతిలో ప్రతీ గుళ్ళోనూ, వ్యాపార సంస్థలోనూ, హోటళ్ళలోనూ, స్కూళ్ళలోనూ అతడి బొమ్మ కనపడుతుంది. ఎందుకు అందరికీ బుదాయి అంటే అంత ఇష్టం? ఎప్పుడూ నవ్వుతూ ఉండే ఫేస్ అది. ఆ ఫేస్‌లో 'తృప్తి' కొట్టొచ్చినట్టూ కనపడుతూ వుంటుంది. అతడి బొమ్మ ఎక్కడ వుంటే అక్కడ సిరి సంపదలుంటాయనీ, కష్టాలు రావనీ అంటారు. మరి బొమ్మకే అంతశక్తి ఉంటే, ఇంట్లో అలా సజీవంగా నవ్వే వ్యక్తి ఒకరు ఉంటే ఎంత బావుంటుంది? అది మీరే ఎందుకు కాకూడదు?

(ఇంకావుంది)

'ప్రేమ ఒక కళ' లేఖలపోటీ



నవ్యవీక్లిలో కొత్తగా మొదలయిన 'ప్రేమ ఒక కళ' శీర్షికను పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. వారం వారం వెలువడుతున్న వ్యాసాలపై వారి ప్రతిస్పందన అద్భుతంగా ఉంటోంది. వారి స్పందనను అభినందిస్తూ పాఠకులను కూడా ఈ వ్యాసావళిలో భాగస్వాములను చేసేందుకు సరికొత్త పోటీని నిర్వహిస్తున్నాం. 'ప్రేమ ఒక కళ' శీర్షికన వారం వారం వెలువడే వ్యాసాలపై మీ అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా పదిలైన్లకు మించకుండా రాసి మాకు పంపండి. ఇ-మెయిల్‌లో కూడా మీ అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఉత్తమలేఖకి వెయ్యిరూపాయలు విలువగల పుస్తకాలను బహుమతిగా అందుకోండి!!

మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా

నవ్యవీక్లి

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్,
హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.
email: weeklynavya@yahoo.com

ఎక్స్-ఫ్యాక్టర్‌ను వెలికితీయగల హితవచనాలు

ఉత్తమ లేఖ

గొప్ప సాహిత్య సంపద, వేల సంవత్సరాల ధార్మిక జీవన అనుభవాలను తనలో ఇముడ్చుకున్న దేశం భారతదేశం. ఎంతమంది అణచివేసినా, దోపిడీ చేసినా, మన దేశం వెలతెల పోలేదు. అంతటి మహత్తు గల శక్తివంతమైన మట్టిలో దొరికే వజ్రాల వంటివారు మన యువకులు. కెరటాల్లా పొంగి పొరలుతున్న వజ్రాల్లాంటి మన యువకులు ఇప్పటికే ప్రపంచ దేశాలన్నిటా విజయబావుటాలు ఎగురవేస్తున్నారు. గ్రామసీమల్లో పుడుతున్న ఇలాంటి మన యువకులకు సానపెట్టి, తోచిన సాయం చేస్తూ ఎక్స్-ఫ్యాక్టర్ (నైపుణ్యం) ను వెలికితీయించగల గొప్ప ఉపదేశకులు, మెంటర్ యండమూరి వీరేంద్రనాథ్. వారం వారం నవ్య వీక్లీలో ప్రచురితమవుతున్న శీర్షిక 'ప్రేమ ఒక కళ' దీనినే ఋజువు చేస్తోంది.

మే 14వ తేదీ సంచికలో 'విజయశిఖరం ఎక్కాలంటే రెండే మెట్లు చాలు!' వ్యాసం నా దృష్టిలో ప్రతి యువకుడికీ, పౌరునికీ ప్రాతఃస్మరణీయం. ప్రతివారం ఆయన చేస్తున్న సూచనలు, ఆచరిస్తే యువకులు కత్తుల్లా తయారవుతారు.

-ఉచితంగా దొరికేదీ, మరోవైపు ఖరీదైనదీ కాలం మాత్రమే.

-గమ్యం నుండి గమ్యానికి ప్రయాణంఅయినప్పుడు, ప్రయాణాన్ని ప్రేమించాలి.

-అంతర్గత శక్తుల్ని ఎంత తొందరగా గుర్తిస్తే అంత వేగంగా పైకి రావచ్చు.....ఇలా ఆయన చెప్పిన అంశాలు జీవితానికి అన్వయించుకోవాలి. నా ఇద్దరు పిల్లలతో ఈ శీర్షికను చదివిస్తున్నాను. నా తమ్ముడికి కూడా నవ్య పత్రిక పంపించి ఈ శీర్షికను చదవమన్నాను.

-వి.ప్రవీణ్, మచిలీపట్నం

-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 9246502662



మనసుకు దెబ్బ తగిలితే 'టాబ్లెట్' వెయ్యి!

మానసిక ఆరోగ్యం లేని వారు తమని తాము నూరుశాతం ప్రేమించుకో లేరు. మానసికారోగ్యం సరిగ్గా లేక పోవటమంటే – అపరిమితమైన దుఃఖము, అవధుల్లేని కోపము, నిరర్థకమైన భయము... ఈ మూడే.

చిన్నచిన్న కారణాలకి తరచూ కోపం వస్తున్నా, గుండె దడ పెరిగినా, ఆత్మహత్య చేసుకోవాలనిపించినా, దానికి కారణం ఎదుటి మనిషి కానీ, సందర్భం కానీ అయివుండదు. ఆర్థికపరమైన ఇబ్బందో, దగ్గర వాళ్ళతో చెడిపోయిన బాంధవ్యమో, మరేదో కావచ్చు. ఇవన్నీ రోగాలైతే, వీటికి మందు కూడా వున్నది. అదే 'ఫీవర్ అండ్ టాబ్లెట్' కాన్సెప్టు.

కోపం జ్వరానికి టాబ్లెట్ మందు:

ఒక తెలివైన యంగ్ ఎగ్జిక్యూటివ్, తన వితంతు తల్లితో కలిసి జీవిస్తున్నాడు. వయసు పాతిక. జీతం లక్ష. ఏ దురలవాట్లూ లేవు. అతడు పెళ్ళికి ప్రపోజ్‌చేస్తే 'నో' చెప్పే అభ్యంతరాలు సాధారణంగా ఏ అమ్మాయికి వుండవు! వాళ్ళిద్దరూ తల్లీ కొడుకుల్లా వుండరు. స్నేహితుల్లా వుంటారు. అటువంటిది క్రమంగా మారిపోయాడు. వారం రోజుల్లో విపరీతమయిన మార్పు వచ్చింది. చిరాకు ఎక్కువైంది. ప్లేటు తోసేస్తున్నాడు. తల్లిపై విసుక్కుంటున్నాడు.

అతడిని అంత కలవరపరిచే విషయం ఏమై వుంటుందా అని తల్లి అతడి స్నేహితుల దగ్గర ఎంక్వయిరీ చేసింది. వాళ్ళ ఆఫీసులో త్వరలో జరగబోయే రిట్రెంచ్‌మెంట్ గురించి అతని తోటి ఉద్యోగస్తుడు ఆమెతో చెప్పాడు. అందులో రాకేష్ కూడా వుండొచ్చు.

విషయం నాన్చితే లాభం లేదని '...ఉంటుందో లేదో తెలియని ఉద్యోగం కోసం నిద్రా, భోజనం మానేయటం మంచిది కాదు బాబూ. ఉద్యోగం పోయినా ఫర్వాలేదులే...' అంటూ ఓదార్చడానికి ప్రయత్నించింది. కొడుకు నిర్ఘాంతపోయాడు. అంత కోపంలోనూ నవ్వొచ్చింది. ఎందుకంటే, ఈ మాత్రం ఉద్యోగం తనకి ఎక్కడైనా దొరుకుతుందని అతడికి తెలుసు.

"నా దిగులుకు కారణం నా ఉద్యోగం అని నీకు ఎవరు చెప్పారు?" అన్నాడు. ఈసారి విస్మయం చెందటం తల్లివంతయింది. అసలు కారణం అతడు చెప్పటం ప్రారంభించాడు. అతడు పనిచేసే ఆఫీసు ఎదురు బిల్డింగ్‌లో స్వప్న అనే మందగమన స్టెనోగ్రాఫర్‌గా పని చేస్తోంది. 'ఛాలెంజ్' అనే మా సినిమాలో సరస్వతీపుత్రుడు వేటూరి వారు ఒక పాట వ్రాశారు. మందగమన, మధురవచన, గగన జఘన, సొగసు లలనవే... అని! గగనం అంటే 'శూన్యము' అనీ, గగన జఘన అంటే 'నడుము లేనిది' అనీ అర్థం. ప్రౌఢలు మంద గమనులు. కానీ కవి కల్పనలో, గగనజఘనలు కూడా మంద గమనలు అవటం ఒక ప్రయోగం. తెలుగు మర్చిపోతున్న యువతకి మన భాషలో ఉన్న సొగసులు చెప్పటం కోసమే ఈ అప్రస్తుత ప్రసంగం. తిరిగి సబ్జెక్ట్‌లోకి వస్తే...

ఆమె తనకి అన్ని విధాలా సరిపోతుందనుకొన్నాడు. పెళ్ళికి ముందు సినిమాలూ, పార్కులూ లాంటి డేటింగ్ విధానాన్ని అతను నమ్మడు. మర్యాద పూర్వకంగా లంచ్‌కి ఆహ్వానించి అక్కడ తన ఇష్టం గురించి చెప్పాలనుకున్నాడు. ఆమెకు ఫోన్‌చేసి "మీరు నాతో లంచ్‌కు వస్తారా?" అని అతడు అడుగుతుండగానే ఆమె కఠినమైన స్వరంతో "తరువాత మాట్లాడతాను" అంటూ ఫోన్ 'టప్' మని పెట్టేసింది. ఆ తరువాత మళ్ళీ ఫోన్ చేయలేదు. అదీ సంగతి.

అంతా విన్న అతడి తల్లి నమ్మలేనట్లు 'ఇంత బలహీనమయిన మనసా నీది' అన్నట్టుగా 'ప్రేమించిన అమ్మాయి కాదంటే భోజనం మానేసి ఏడుస్తావా?" అని అడిగింది.

"నేనామెను ప్రేమించలేదు. ఆమె కూడా ఇష్టపడితే, నా ఇష్టాన్ని ప్రేమగా మార్చుకుందామనుకున్నానంతే, ఆమెని మర్యాదగా మధ్యాహ్నం లంచ్‌కి పిల్చానే తప్ప రాత్రి 'పబ్'కి కాదు! కనీసం డిన్నర్‌కి కూడా కాదు, ఇష్టం లేకపోతే చెప్పొచ్చు కదా. అంత విసురుగా మొహం మీద కొట్టినట్టు ఫోన్ పెట్టెయ్యటం ఎందుకు?" సున్నితమైన చోట దెబ్బతగిలినట్టు అన్నాడు. అదీ కథ.

మనసుకి దెబ్బ తగిలింది. నిజమే. కానీ దాన్ని తల్లి మీద కోపంగా చూపించటం ఎందుకు? దీన్నే ఫీవర్ అంటారు. ఫీవర్ అంటే జ్వరం. అందరూ అనుకొనే జ్వరం కాదు. F అంటే ఫ్యాక్ట్ (నిజం), E–ఎఫెక్ట్ ప్రభావం, V–వెంటిలేషన్ (బహిర్గతం), E–ఎమోషన్ (భావోద్రేకం), R–రిజల్ట్ (ఫలితం).

రాకేష్ బాధకి కారణం అతడి తల్లి అనుకొన్నట్టు ఉద్యోగ భయం కాదు. ప్రేమ విఫలం. Fact అంటే అదే. ఐదు జ్ఞానేంద్రియాలతో మనం గ్రహించే 'దృశ్యం, పరిమళం, శబ్దం' వాస్తవం. అలా గ్రహించిన వాస్తవాన్ని మనం ఏ విధంగా అన్వయించుకుంటామనేది మన 'రియాక్షన్ ఫీలింగ్'. కాకరకాయ లాంటి కొన్ని రుచులు సహించకపోవడానికి, కొన్ని దృశ్యాలు చూడలేకపోవటానికి, ఎండు చేపల వాసన భరించలేకపోవటానికి ఈ రియాక్షన్ ఫీలింగే కారణం. చైనా దేశపు షాంగైలో క్యాడ్‌బరీస్ చాక్లెట్ మధ్యలో జీడిపప్పు అద్దినట్టూ తేలు పెట్టి అమ్ముతారు.





ప్రేమంటే చిరునవ్వు, ప్రేమంటే ఆనందం. ప్రేమంటే దయ. ప్రేమంటే తీసుకోవటం కాదు. ఇవ్వటం.

అక్కడ దానికి చాలా డిమాండు. మనకి...? చాక్లెట్ ఒకరికి తీపి, తేలు మరొకరికి వికారం.

వాస్తవపు ప్రభావాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా బహిర్గత పరుస్తారు. కొందరు కోపంతో అరుస్తారు. కొందరు ఏడుస్తారు. మరి కొందరు తమ చీకటి గుహల్లోకి నిశ్శబ్దంగా వెళ్ళిపోతారు. దాన్నే వెంటిలేషన్ (V) అంటారు. ఎమోషన్ కంట్రోలులో పెట్టుకోకపోతే రిలేషన్స్ దెబ్బతింటాయి. (E) అదే రిజల్ట్ (R). మూలం అమ్మాయి తిరస్కారం. దాని ప్రభావం తల్లిపై చూపిస్తోన్న అసహనం. మరి దీనికి పరిష్కారం?

టాబ్లెట్. ఫీవర్‌ని తగ్గించే టాబ్లెట్ కాదు. దీని అర్థం వేరే. Tఅంటే టేబిలింగ్ (అమర్చు), A–ఆక్సెస్ (విశ్లేషించు), B–బ్రౌజ్ (వెతుకు), L–లొకేట్ (పట్టుకో), E–ఎన్‌కౌంటర్ (ఎదుర్కో), T– టెర్మినేట్ (శాశ్వతంగా నాశనం చెయ్యి).

బుద్ధుడు చెప్పే యోగము కూడా ఇదే...! రోగము–కారణము– ఔషధము–నాశనము...! మన భావోద్రేకాలకీ, మూడ్ బావోలేక పోవటానికి, దుఃఖానికీ, కోపానికీ, అసహనానికి కారణం వేరే ఎక్కడో వుండవచ్చు. పరిస్థితులన్నిటినీ సమీకరించి, దాని మూలాన్ని వెతికి పట్టుకోవాలి (Table).

చాలామంది సమస్యని తేల్చరు. పరిష్కారం అంటే భయం! దీన్నే 'ఫియర్ ఆఫ్ ఫెయిల్యూర్' అంటారు. అంతంత పెద్ద మాటలు తల్లికి తెలిసి వుండకపోవచ్చు. కానీ విషయం ఏమిటో కనుక్కోమని కొడుకుని వత్తిడి చేసింది (Access). అతడా అమ్మాయి ఆఫీసుకు వెళ్ళాడు. ''నాతో లంచ్‌కి రావటం ఇష్టం లేకపోయినా, ఇప్పటికే వివాహం నిశ్చయమైపోయినా, ఆ విషయం మామూలుగానే చెప్పొచ్చు కదా! నేనొక విలన్‌ని అయినట్టు అలా మొహం మీద విసురుగా ఫోన్ పెట్టెయ్యటం దేనికి?'' అని అడగాలని అతడి ఉద్దేశం. అయితే ఆ అమ్మాయి ఆఫీసులో లేదు. పదిరోజులు సెలవు పెట్టింది. బహుశా పెళ్ళికోసం అయి వుంటుంది అనుకొన్నాడు. ఇంటి దగ్గర వివరాలు కనుక్కుంటే ఆమె హాస్పిటల్‌లో ఉందని తెలిసింది (Browse).

'ఆలస్యం చేసే కొద్దీ దిగులే మిగుల్తుందనీ, నిరంతరం దుఃఖంకన్నా, ఆ దుఃఖ కారణాన్ని నిర్మూలించటం మంచిదనీ, వెంటనే వెళ్ళి ఆ అమ్మాయితో మాట్లాడదాం'' అని అతని తల్లి ప్రోత్సహించింది (Locate). వాళ్ళు హాస్పిటల్‌కు వెళ్ళారు (Encounter). అతడిని చూడగానే ఆమె మొహం విప్పారింది. అతను ఫోన్ చేసినప్పుడే, అతని మనసులో ఆలోచన ఆమెకి తెలిసి ఆనందానికి అవధులు లేవు. ఈలోపు బాస్ ఇంటర్‌కమ్‌లో పిలవడం వల్ల కంగారుపడి ''తర్వాత మాట్లాడతాను'' అని ఫోన్ పెట్టేసింది. ఆమె గొంతులో ఆ రోజు కనపడిన తొందరని అతడు అపార్థం చేసుకున్నాడు. ఫోన్ పెట్టేసిన అమ్మాయి పక్షిలా ఆకాశంలో ఎగురుతూ క్రింద మెట్లు చూసుకోలేదు. జారి పడడంతో కాలు విరిగి ఆస్పత్రిలో జాయిన్ అయింది. తల్లీ కొడుకులు వెతుక్కుంటూ వెళ్ళినందుకు సినిమా లెవల్లో కథ సుఖాంతమయింది (Terminate).

ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మన మూడ్ బాగో లేకపోవడానికి, కోపానికీ, అసహనానికి కారణం వేరే ఎక్కడో ఉండదు. పరిస్థితుల్ని సమీకరించి దాని మూల కారణాల్ని వెతికి పట్టుకోవాలి.

కోపం ఎక్కువైతే ఏడుపు:


మనిషికి తన మీదున్న అసంతృప్తి కొందరి విషయంలో కోపంగా, మరి కొందరిలో దుఃఖంగా పరిణామం చెందుతుంది. మీకు తరచు కోపం వస్తూంటే ఎక్కడో ఏదో మానసికంగా లోటు జరుగుతూన్నదన్న మాట. అసలు ఏడుపుకి అర్థం ఏమిటి? కళ్ళల్లోంచి నీరు రావటమే ఏడుపైతే, మనం నిరంతరం ఏడుస్తూనే వుంటామట. కళ్ళని శుభ్రం చేయటం కోసం 'టియర్ గ్లాండ్స్' నిరంతరం స్రవించే నీటిచుక్కలు, కంటి చివరల నుంచి ముక్కులోకి ఇంకిపోతాయట. ఎమోషన్ ఎక్కువైనప్పుడు ఈ గ్లాండ్స్ మరింత ఎక్కువ స్రవించటంతో, ఇంకటానికి జాగా లేక బుగ్గలపైకి జారుతాయంట. ఇదీ ఏడుపు రహస్యం.

సినిమాల్లో ముగింపుకు ముందు, హీరో తన కుటుంబ సభ్యులందర్నీ కలుసుకొన్నప్పుడు ప్రేక్షకులకు ఎందుకు సంతోషంతో ఆనంద భాష్పాలు తుడుచుకుంటారు?' అనే ప్రశ్నకి సైకాలజిస్టులు చెప్పే వివరణ గమ్మత్తుగానూ, ఆలోచనాత్మకంగానూ ఉంటుంది. మనిషికి ఆనంద భాష్పాలు అనేవే లేవట. మామూలు కన్నీళ్ళేనట. రోజువారి జీవితంలో మనం ఎన్నోసార్లు దుఃఖించాలని, వయసూ, సంస్కారం దృష్టిలో పెట్టుకొని ఆపుకుంటామట. అలా ఆపుకోవటానికి ఉపయోగపడే ఎనర్జీ, ఏదయినా ఆనంద ప్రదమైన ప్రకంపన కలిగినప్పుడు ఒక్కసారి కన్నీళ్ళుగా రిలీజ్ చేస్తుందట. అందుకనే చిన్నపిల్లలు సినిమాలో దృశ్యాల్ని చూసి సంతోష, విషాదాలకి ప్రతిస్పందించరట. చాలా గొప్ప తర్కం ఇది. దేవదాసు సినిమా చూస్తూ ఏ పిల్లవాడన్నా ఏడవటం గమనించారా?

ఈ స్పందనని ఇ.క్యు అంటారు. ఎమోషన్స్‌కి మనం ప్రతిస్పందించే విధానం, మన ఎమోషన్స్ ఇతరులపై చూపే ప్రభావం.... అన్నీ కలిపితే ఇ.క్యూ. ఎంత తొందరగా దీనిని డెవలప్ చేసుకుంటే, అంత వేగంగా కోపం దుఃఖం తగ్గిపోతాయి. ఇ.క్యూలో నాలుగు అంశాలు మిళితమై వుంటాయి.

స్వయం స్పృహ: మీరు చాలా జాగ్రత్తగా డ్రైవ్ చేస్తారు. కానీ ఒకడు రాంగ్ రూట్లో రాకెట్‌లా వచ్చి మీ వాహనాన్ని ఢీ కొన్నాడు. మీరెలా రియాక్ట్ అవుతారు? గొంతు పగిలేలా వాదిస్తారా? తప్పుచేసి అడ్డంగా వాదిస్తున్న అతడిని, ఆవేశం ఆపుకోలేక కాలరు పట్టుకుని కొడతారా? తప్పు అవతలివాడిదే అయినా, చుట్టూ వున్న వారి చూపులు భరించలేక మీరే డబ్బులు ఇచ్చి వదిలించుకుని అక్కడి నుంచి తొందరగా బయటపడే ప్రయత్నం చేస్తారా? వాదనలతో ఫలితం లేదని తెలుసు కాబట్టి నోర్మూసుకుని వెహికల్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోతారా? సొట్టపడిన వెహికల్ గుర్తొస్తూంటే రాత్రంతా నిద్రపోరా? రిపేర్ ఖర్చు ఏమీ లేకపోయినా జరిగిన గొడవకి రోజంతా మూడ్ పాడు చేసుకుంటారా? ఆ చిరాకు ఇంట్లో వాళ్ళ మీద చూపిస్తారా? ఎప్పటికప్పుడు జీవిత విధానాన్ని విశ్లేషించుకుంటూ వుండటమే స్వయం స్పృహ.

తార్కిక ఆలోచన: మీరొక మారుమూల



ప్రాంతంలో కొండపైనున్న గుడికి వెళ్ళారు. గుళ్ళో చిటికెనవేలు విరిగిపోయిన దేవుడి విగ్రహం ఉంది. అక్కడి పూజారి 'విష్ణువుకి గరుత్మంతుడికీ మధ్య జరిగిన యుద్ధంలో ఆ పక్షిరాజు దేవదేవుని చిటికినవేలు తన ముక్కుతో విరిచేసాడని, ఆ విష్ణువే ఇక్కడకొచ్చి వెలిసాడనీ...' ఒక స్థల పురాణం చెప్పాడు. నమ్మితే మనస్ఫూర్తిగా దణ్ణం పెట్టుకోండి. లేదా, పాడు పడి శిథిలావస్థలో వున్న గుళ్ళో భక్తుల దక్షిణ కోసం పూజారి పడే స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్‌కి జాలిపడి సాయం చేయండి.

మన ఆలోచనల్నీ, ఎమోషన్స్‌ని నిర్మాణాత్మకమైన విధానంలో బలంగా నిర్మించుకోగలిగేది తర్కం. గరుత్మంతుడు తన యజమాని వేలు ఎలా విరిచేస్తాడని ఆలోచించటం తర్కం. బతుకుతెరువు కోసం కథలు చెపుతూన్న పూజారితో అనవసరంగా వాదించకుండా ఉండటం ఎమోషనల్ బ్యాలెన్స్. నీళ్ళల్లో పడిపోయిన ఆ అంగుళం సైజు చిటికిన వేలిని వంద రూపాయలిస్తే చూపిస్తాననీ, ఆ వేలు సందర్శించటం వలన మీ అబ్బాయి ఎల్.కే.జీలో ఫస్ట్ క్లాస్‌లో పాసవుతాడనీ ఎవరైనా చెప్తే, అతడితో కలిసి ఆ రాతి ముక్క చూడటం కోసం నాచు పట్టిన నీటి మధ్యకు వెళ్ళటం మూర్ఖత్వం.

స్వీయ దర్శకత్వం: ఆధారపడటానికీ, ఏడవటానికీ ఎప్పుడు ఏ భుజం దొరుకుతుందా అని వెతుక్కోవటం ఎమోషనల్ డిపెండన్సీ. చిన్న విషయాలకే ఆవేశ పడిపోవటం, తిట్టటం; ఎగతాళిగా, కోపంగా, ఇరిటేటింగ్‌గా జవాబివ్వటం ఎమోషనల్ ఇంబ్యాలెన్స్. ఎవరైనా పొరపాటున రాంగ్‌కాల్ చేసినప్పుడు వెటకారంగా సమాధానం చెప్పి ఫోన్ కట్ చేయటం మానసిక రోగం. హేతురహిత భావోద్వేగాల్ని కంట్రోల్ చేసుకుంటూ, సెల్ఫ్-డైరెక్షన్‌పై పట్టు సంపాదించటం విజేతల ముఖ్య లక్షణం. దీన్ని 'ఇంపల్స్ కంట్రోల్' అంటారు.

స్వీయ గౌరవం: "నీ అనుమతి లేకుండా నిన్నెవరూ చిన్నబుచ్చలేరు" అంటాడు బాల్యంలోనే పోలియోతో రెండు కాళ్ళూ పోగొట్టుకుని కూడా అమెరికన్ ప్రెసిడెంట్ అయిన రూజ్వెల్ట్. అందరూ తెలుసుకోవలసిన గొప్పపాయింటు ఏమిటంటే, '... మనిషికి ఒక వైపు ఆత్మవిమర్శ, మరోవైపు ఆత్మగౌరవం రెండూ వుండాలి. కోపం, దుఃఖం, అసంతృప్తిలాంటి 'మార్చుకోగలిగే దుర్లక్షణాలని' మార్చుకోవాలి. అది ఆత్మవిమర్శ!... నలుపు, బట్టతల, పొట్టి, నత్తిలాంటి 'మార్చుకోలేని వైకల్యాల' గురించి మర్చిపోవాలి. అది ఆత్మగౌరవం...! మనలో చాలామంది మార్చుకోగలిగే వాటిని వదిలేసి, మార్చుకోలేని వాటి గురించి ఎక్కువ బాధ పడతాము.

మీకు తెలుసా? మీకో పర్సూ, అందులో కాస్త డబ్బూ, కడుపుకి రెండు పూటలా తిండి, వంటి మీద బట్టలు, నిద్రించటానికి ఒక ఇల్లూ, ఆ ఇంటి మీద కప్పూ వుంటే ప్రపంచంలోని 92 శాతం జనం కన్నా మీరు ఐశ్వర్యవంతులు. బాంబు పేలిన శబ్దాన్ని ఇప్పటివరకూ విని వుండకపోయినా, యుద్ధం తాలూకు మంటల వర్షాన్ని చూసి ఉండకపోయినా, టెర్రరిస్టు ప్రమాదం ఏదీ జరగదన్న ధైర్యంతో ప్రార్థనాస్థలానికి వెళ్ళగలిగినా... యాభై కోట్ల నిర్భాగ్యులకన్నా మీరు అదృష్టవంతులు.


ఇంత అదృష్టవంతులైన మీరు మీ సొంత మనుషులకి, మీ కులం వారికి కాకుండా, అపరిచితులకి కనీసం ఒక్కరికైనా సాయం చేశారా? మీ పరోక్షంలో ఒకరైనా మీకు మనస్ఫూర్తిగా 'థాంక్స్' చెప్పుకున్నారా? సమాజానికి కాసింతైనా ఉపయోగపడ్డారా? ఇప్పటివరకూ కనీసం ఒక మొక్కయినా స్వహస్తాలతో నాటారా? కనీసం ఒక మొక్క నాటినా సమాజానికి ఉపయోగపడినట్టే.

మీరు విద్యార్థి అయితే, తెల్లవారుఝాము చలిలో మీ ఇంటిలోకి పేపర్ విసిరే ఎనిమిదేళ్ళ కుర్రాడిని స్ఫూర్తిగా తీసుకుని పది రూపాయలు సంపాదించండి. నిరుద్యోగులైతే కనీసం మీ సెల్‌ఫోన్ ఛార్జీలు మీరు స్వయంగా సంపాదించి కట్టుకోండి. ఉద్యోగులైతే ఒక అనాథబాలుడికి ఏడాదికి వంద రూపాయల పుస్తకాలు కొనిపెట్టండి. మీరు రిటైరైనవారైతే మీ పక్క 'స్లం' పిల్లలు నలుగురికి మీ ఇంట్లో పాఠాలు చెప్పండి.

'ఓస్. ఇంతేనా' అనొద్దు. ప్రారంభించండి. పని చేయటంలో సంతృప్తి, ఇవ్వటంలో ఉండే ఆత్మానందం తెలుస్తుంది. మన దేశంలో కోటి మంది పసిపిల్లలూ, 25 కోట్ల మంది విద్యార్థులూ ఉన్నారు. సగటున కోటి మంది హాస్పిటల్స్‌లో, మరో కోటిమంది జైళ్ళలో ఉంటారు. వారి నుంచి పనిని ఎక్స్‌పెక్ట్ చేయలేం. కోటిమంది ఐ.టి. ఉద్యోగులు 'మనదేశం' కోసం పని చేయరు. 27 కోట్ల గవర్నమెంట్ ఉద్యోగులు తమ పూర్తి శక్తిని వినియోగించరు. కోటి మంది రాజకీయ నాయకులు, వారి మీద ఆధారపడ్డ అయిదు కోట్ల కోటరీ (వీళ్ళని హాంగర్స్ అంటారు) దేశ సంపదని దోచుకుంటూ వుంటారు. ఇంకో 20 కోట్ల మంది తినటం, టివి చూడటం తప్ప మరేమీ చేయరు. నిరుద్యోగులు 15 కోట్లు, రిటైర్ అయినవారు 9 కోట్లు. అందరూ పోగా, మిగతా వారు స్పెషల్ కాటగిరి...!

మీ వల్ల మరో మనిషికి లాభం వుంటే మీరు ఆ స్పెషల్ కేటగిరీలోకి వస్తారు. అప్పుడు మీకే ఆశ్చర్యం కలిగించేలా, కోపం, దుఃఖం ఆటోమాటిక్‌గా తగ్గిపోతాయి.

'ప్రేమ ఒక కళ' లేఖలపోటీ



నవ్యవీక్లిలో కొత్తగా మొదలయిన 'ప్రేమ ఒక కళ' శీర్షికను పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. వారం వారం వెలువడుతున్న వ్యాసాలపై వారి ప్రతిస్పందన అద్భుతంగా ఉంటోంది. వారి స్పందనను అభినందిస్తూ పాఠకులను కూడా ఈ వ్యాసావళిలో భాగస్వాములను చేసేందుకు సరికొత్త పోటీని నిర్వహిస్తున్నాం. 'ప్రేమ ఒక కళ' శీర్షికన వారం వారం వెలువడే వ్యాసాలపై మీ అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా పదిలైన్లకు మించకుండా రాసి మాకు పంపండి. ఇ-మెయిల్‌లో కూడా మీ అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఉత్తమలేఖకి వెయ్యిరూపాయలు విలువగల పుస్తకాలను బహుమతిగా అందుకోండి!!

మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా

నవ్యవీక్లి

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్, హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.

email: weeklynavya@yahoo.com

నా మనవరాలి జీవితం చక్కదిద్దిన 'ప్రేమ ఒక కళ'

ఉత్తమ లేఖ

కాలేజీలో చదువుతున్న నా మనవరాలు తన ప్రమేయం లేకుండా, తనకు జరిగిన ఓ దారుణమైన సంఘటన వల్ల డిప్రెషన్‌కు లోనయింది. ఇంటా బయటా కోపం ప్రదర్శిస్తూ చదువును, జీవితాన్ని దుర్భరం చేసుకుంటోంది.

టీచరుగా పిల్లలకు మంచీ చెడ్డా చెప్పిన నలభైఏళ్ళ నా అనుభవం, నా మనవరాల్ని దారిలో పెట్టడానికి ఎందుకూ పనికిరాకుండా పోయిందని బాధ కలిగింది. అదిగో, అప్పుడే నవ్య వీక్లీ రూపంలో నాకో ఆయుధం దొరికింది. నవ్య వార పత్రికను నా మనవరాలికి పుట్టినరోజు బహుమతిగా ఇచ్చి, 'ప్రేమ ఒక కళ' తప్పక చదవమని చెప్పా.

"అమ్మమ్మా! 'ప్రేమ ఒక కళ' చదివా. ఆ ఆర్టికల్ నాకో దిక్సూచి అయింది. ఓ గైడ్ అయ్యింది. ఇది నేను ముందే చదివుంటే, నా జీవితం ఇంత గందరగోళం అయివుండేది కాదు" అంటూ ఆత్మ విమర్శ చేసుకుంది నా మనవరాలు. ధైర్యంగా కన్నీళ్ళు తుడుచుకుని మామూలు మనిషి అయింది.

కథగానీ, వ్యాసం గానీ ఒక జీవితాన్ని చక్కదిద్దగలిగినా ఆ రచయిత జీవితం ధన్యమే. సరస్వతీ అనుగ్రహం వల్ల వీరేంద్రనాథ్ ధన్యజీవే. పెద్దల మాటల్ని పెడచెవిన పెట్టిన పిల్లల్ని కన్ఫ్యూజన్‌లోంచి క్లారిటీలోకి తీసుకువస్తున్నందుకు రచయితకు కృతజ్ఞతలు.

-వి.మాణిక్యాంబ, విద్యానగర్, హైదరాబాద్-44

మనసుకీ బుద్ధికీ మధ్య అవగాహన లేకపోతే...

ఒకరు కొత్తగా బోర్డులు వ్రాసే వ్యాపారం పెట్టారు. ఒక సూపర్ మార్కెట్ మానేజర్ ఫోన్‌చేసి... ''తమ మొదటి అంతస్తులో టాయిలెట్ పాడయిందనీ, క్రింది ఫ్లోర్లో వున్న మరో టాయిలెట్ వాడవలసిందిగా కస్టమర్లకి సూచిస్తూ బోర్డు తయారుచేయాలనీ కోరాడు. అదే విధంగా ఒక వాషింగ్ మిషన్ వారూ, మరొక షాపు వారూ తమకి కావలిసిందేదో చెప్పారు. అతడి వ్రాత, డిజైనింగు అద్భుతంగా ఉంటాయి. వారు కోరినట్టుగానే బోర్డులు అందంగా తయారుచేసి ఇచ్చాడు. అయినా త్వరలోనే బిజినెస్ మూసేసుకోవాల్సి వచ్చింది. కారణం? అతడికి ఇంగ్లీష్ సరిగ్గా రాదు. ఆ విషయం అతడికి తెలీదు.



ఈ విధంగా బోర్డులు వ్రాసాడు:

టాయిలెట్ తలుపుకి బోర్డు: టాయిలెట్ పని చేయటం లేదు. క్రింద ఫ్లోర్ వాడండి.

వాషింగ్ మిషన్: లైటు ఆరిన తరువాత లోపలి బట్టలు తీసేయండి.

కర పత్రం: మీకు చదవటం రాదా? నెల రోజుల్లో నేర్పుతాం.

షాప్ ముందు బోర్డు: సైకిళ్ళు, ఫాన్లు, గ్రైండర్లు వగైరా ఇక్కడ ఎక్స్ఛేంజ్ చేసుకోవచ్చు. భార్యతో విచ్చేయండి.

కొందరికి గమ్యం ఉంటుంది. దారి తెలీదు. మరి కొందరికి దారి తెలిసినా, ప్రయాణించటానికి సరయిన వాహనం ఉండదు. వాహనం ఉన్నా అందులో ఇంధనం ఉండదు. బోర్డులు వ్రాసే వ్యాపారి గమ్యం మంచిదే. వాహనం మంచిదే. ఇంధనం మాత్రం సరిగ్గా లేదు. తమకి ఎలా కావాలో కస్టమర్లని అడగాల్సింది. కనీసం, 'తెలుగులో ఇలా వుంటుంది' అని కస్టమర్లకి చూపించాల్సింది. తనకి తెలీదన్న విషయం అతనికి తెలియక పోవటం, తనపై తనుకున్న మితిమీరిన నమ్మకం అతడిని తప్పుదారికి నడిపించాయి.

తాను చేస్తున్న పనిలో నైపుణ్యం లేకపోయినా, అసంతృప్తి ఉన్నా, మనిషికి క్రమక్రమంగా తన మీద తనకి ప్రేమ తగ్గిపోతుంది. మరో కారణం అతడి బుద్ధికి, మనసుకి మధ్య ఘర్షణ రోజుకీ ఎక్కువ అవుతూ ఉండటమే.

ఒకమ్మాయి సన్నబడాలనుకొంది. అమ్మ పాయసం వండుతోంది. ఆ వాసన అలజడి చేస్తోంది. కోర్కె తినమంటోంది. గమ్యం వద్దంటోంది. ఫలితం? ఒబెసిటీ సెంటర్‌లో చేరటం..! ఒక ఫంక్షన్‌కి మీ స్నేహితురాళ్ళందరూ డ్రెస్‌లో కాకుండా, వెరైటీగా వెళ్దామని డిసైడ్ అయ్యారు అనుకుందాం. అపార్థం చేసుకోవద్దు. చీర కట్టుకుని వెళ్దామని మీ ఉద్దేశం. మీ దగ్గర చీరలేదు. కొనటానికి షాప్‌కు వెళ్ళారు. మీ బడ్జెట్ వెయ్యి రూపాయలు. అక్కడ ఒక చీర బావుంది. నిజంగా చాలా బావుంది. ఖరీదు కూడా చౌకే. ఆరొందలు. మీకు నాలుగొందలు మిగులుతుంది....!

కానీ అనుకున్నది అనుకొన్నట్టు జరిగితే అది జీవితం ఎందుకవు తుంది? పక్కనే ఒక పేల్ పింక్ సాటిన్ ట్రిమ్ నెక్‌లైన్ ఉన్న బ్లాక్ క్రేప్ హాండ్‌మేడ్ కాక్‌టైల్ డ్రెస్...! తొలిసారి చూడగానే హీరో మనసుని హీరోయిన్ అందం గాలమేసి లాగినట్టు లాగేసింది. దాని ఖరీదు పద్నాలుగొందలు. నాలుగొందలు నెలా ఖర్లో కాస్త ఎక్కువే. 'ఏం చేద్దామా' అని ఆలోచిస్తూ వుంటే, మీలాంటి వారిని చాలా మందిని చూసిన సేల్స్‌మెన్ ''ఇదే ఆఖరి పీస్ అమ్మా! లేటెస్ట్ డిజైను. మీ తెల్లటి కలర్‌కి కరెక్ట్‌గా మాచ్ అవుతుంది'' అన్నాడు ఆ రోజు వందోసారి. దాంతో మరి ఆలోచించకుండా కొనేసారు.

మెట్లు దిగుతూంటే, స్నేహితురాలు ఫోన్ చేసిన విషయం తెలుసుకుని 'అందరూ చీరె అనుకున్నాం కదా, నీకిదేం పోయే కాలం' అంటూ చచ్చేటట్లు చివాట్లు పెట్టింది. మళ్ళీ లోపలికి వెళ్ళారు. 'ఎక్స్ఛేంజ్‌కి ఓకే' అన్నాడు షాపువాడు. బుద్ధి సరేనంది. సరీగ్గా అప్పుడు నిద్ర లేచింది మనసు. ఫలితం? రెండు పాకెట్లతో మెట్లు దిగారు.

మనసుకీ, బుద్ధికీ మధ్య సంఘర్షణ జరుగుతూ ఉన్నంత కాలం మనిషి తనను తాను ప్రేమించుకోలేడు.

జీవన విధానాలకి అనుగుణంగా సొంత థియరీలు ఎన్ని ఏర్పరచుకున్నా, మనసులో ఎక్కడో ఒక అసంతృప్తి ఉంటుంది. కొంతకాలానికి అదే 'కోపాన్ని, చిరాకుని పెంచుతుంది. అలాంటి అసంతృప్తుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఈ క్రింద వ్రాసిన విషయాలన్నీ విశ్లేషించుకొని, కొద్దిగా మార్పు చెందగలిగితే మనం మరింత నిజాయితీగా, ఆహ్లాదంగా బ్రతకొచ్చు.

- ఎదురింటి అమ్మాయి తనని చూసి నవ్వితే ఆనందపడే వ్యక్తి, భార్య ఇంకో మగవాడితో మామూలుగా మాట్లాడినా సహించలేడు.

10

ప్రేమ ఒక కళ



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 92465 02662

✧ పిల్లల్ని టీవీ చూడవద్దని చెప్పే తండ్రి, తాను దాన్ని చూడటం మానేసి, రాత్రిళ్ళు పిల్లలు చదువుకునే దగ్గర కూర్చుని ఏ పుస్తకమో చదువుకోడు.

✧ తన మామగారికి కేన్సర్ అని తెలిసి, ఆయన ఆరోగ్యం కోసం కాలినడకన తిరుపతి వస్తానని మొక్కుకుంది ఒకామె. ఆమెకు భయం భక్తి ఏం కాదు. మామగారు చనిపోతే అత్తగారిని తమతో ఉంచుకోవాల్సి వస్తుందని...! మనిషిలోని ఇలాంటి చీకటి కోణాలు చాలావరకు వాస్తవమయినవి. ఆత్మసాక్షికి వ్యతిరేకంగా పనులు చేసే కొద్దీ బ్రతుకు పట్ల ఉదాసీనత, జీవితంలో నిరాశక్తత పెరుగుతాయి. కళ్ళు తమ స్వచ్ఛత కోల్పోతాయి.



మనిషి తన అసంబద్ధమైన ప్రవర్తనకు మొదట్లో ఆత్మవిమర్శ చేసుకుంటాడు. క్రమక్రమంగా ఈ ఘర్షణ తగ్గిపోయి, మనసు మీద 'వంచన' ముసుగు వేసుకోవటం ప్రారంభిస్తాడు. ఈ ముసుగులు వివిధ రకాలుగా వుంటాయి.

1. అనంగీకార సందిగ్ధం: బుద్ధి చెప్పేదాన్ని మనసు వప్పుకోక పోవటం: పరీక్ష ఫెయిలయినట్టు కంప్యూటర్ చూపించినప్పుడు, కంప్యూటర్‌లోనే తప్పు ఉందని అనుకోవటం; క్రితం రాత్రి తాగుడు మైకంలో మాట్లాడిన మాటల్నీ, అసభ్యకరమైన ప్రవర్తననీ ఒప్పు కోకుండా మరుసటి రోజు పొద్దున్న అడ్డంగా వాదించటం.

2. స్పందన: పక్క దార్లో పరిష్కారం వెతుక్కోవటం: సమస్యని మర్చిపోవటం కోసం తాగటం. ఇంట్లో ఇబ్బందుల్ని మర్చిపోవటం కోసం పేకాడటం, గుప్తనిధుల కోసమని పిల్లలని బలి ఇవ్వటం.

3. వితండవాదం: "భార్య పోరు పడలేక ఈ విధంగా మారాను" అని ఒక తాగుబోతు తన వ్యసనాన్ని సమర్థించుకోవడం; "నాకు సర్జరీ అంటే మొదటి నుంచి గిట్టదు. నా తల్లిదండ్రుల వత్తిడి వల్ల అప్లై చేసాను" అని మెడిసిన్‌లో సీటు రాని వ్యక్తి తన అసమర్థతని సమర్థించుకోవడం; "నేను కట్టే డబ్బు ప్రభుత్వానికి చేరదు, నాయకుల జేబులు నింపటానికి వెళ్తుంది" అని టాక్సులు కట్టని వ్యక్తి తన లోపభూయిష్టమైన ప్రవర్తనకు అసంబద్ధమైన కారణాలు వెతుక్కోవటం; భార్య శారీరక సహ చర్యానికి పనికిరాదన్న అబద్ధంతో పరాయి స్త్రీకి ప్రపోజ్ చేయటం; కోరిక వప్పుకోవటం వల్ల సెక్రటరీని ఉద్యోగంలోంచి తీసేసి, సరిగ్గా పనిచేయక పోవటం వల్ల తీసేసానని చెప్పటం.

4. నెగెటివ్ పాయింట్: వయసు, చదువు, సంస్కారం మరచిపోయి చిన్నపిల్లాడిలా ఏడవటం, కోపంతో క్రూరంగా కొట్టడం, అవతలి వారు సిగ్గుపడేంత అసభ్యమైన భాషలో మాట్లాడటం.

5. అసాధారణం: ఆనందించవలసిన స్థితిలో కూడా సీరియస్‌గా వుండటమే తెలివికి చిహ్నం అని నమ్మటం, సెంటిమెంట్ సీన్లకి ఎమోషనల్‌గా ఇన్వాల్వ్ అవకుండా, 'లైటింగ్ బావోలేదు, కెమేరా యాంగిల్ సరిగ్గాలేదు' అంటూ సాంకేతిక విషయాలు చర్చించటం, సినిమాలో కడుపు చెక్కలయ్యేలాంటి కామెడీ సీన్ వచ్చినప్పుడు కూడా సీరియస్‌గా చూడటం ద్వారా 'నేను వేరు' అని ఇతరుల ముందు అనిపించుకునే ప్రయత్నం.

6. కోటరీ: ఆక్సిడెంట్ జరిగినప్పుడు, ఆ ప్రమాదానికి కారణమైన అన్ని అంశాలనీ ఒక అక్షరం కూడా పొల్లుపోకుండా వర్ణిస్తూ, ఆ చెప్పటంలో తనక్కావలసిన విధానంలో అక్కడక్కడా తగిన మార్పులు చేస్తూ, రకరకాల సమర్థనల ద్వారా చేసిన తప్పు తాలూకు అపరాధ భావన పోగొట్టుకునే ప్రయత్నం చేయటం, ఇతరుల సపోర్ట్‌తో మనసుకు నచ్చచెప్పుకునే ప్రయత్నం. లంచం డబ్బు కొంత హుండీలో వేసి, పాపం అంటదని సమాధానపడటం.


7. రొమాంటిసైజింగ్: గత చేదు వాస్తవాన్ని అందమైన అను భవంగా వర్ణించి చెప్పటం; పేకాడుతున్న ఒక విద్యార్థిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కి తీసుకెళ్ళి, అక్కడ తలతిక్క సమాధానాలు చెప్పటంతో మూడు రోజులు లాకప్‌లో పెట్టి చితకబాదారను కుందాం. పది సంవత్సరాల తరువాత ఆ సంఘటనని అతడు ఒక అందమైన అనుభవంగా కల్పించి చెప్పే, అది తన (అతి చెత్త) గతాన్ని 'రొమాంటిసైజ్' చేయటం.

చిన్నప్పటి సంఘటనకి మరికొంత అబద్ధాన్ని కలిపి రొమాంటిసైజింగ్ చేయటం కూడా కొన్ని సందర్భాల్లో జరుగుతుంది. కాలేజీలో ఒక అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించినందుకు ఒక కుర్రవాడు డిబార్ చేయబడతాడు. అప్పటివరకు అది నిజమైన కథ. పది సంవత్సరాల తరువాత దీన్ని తన మిత్రులకి చెప్తూ "తన తప్పు తెలుసుకున్న ప్రిన్సిపాల్, సస్పెన్షన్‌ని వెనక్కి తీసుకున్నారనీ, తను కాలేజీ ఫస్ట్ వచ్చాననీ. ఆ అమ్మాయి తనని క్షమాపణ అడిగిందనీ' ఒక కల్పిత కథని ఊహించి చెప్తాడు. మరికొన్ని సంవత్సరాలు జరిగిన తరువాత ఆశ్చర్యకరంగా అది నిజంగా జరిగిన కథే అని 'అతను కూడా మనస్ఫూర్తిగా' నమ్మటం ప్రారంభిస్తాడు. రొమాంటిసైజింగ్ వేరు. నోస్టాలజీ వేరు. చిన్నప్పుడు గోదారి మీద పడవలో ప్రయాణం చేస్తూ వుండగా కొబ్బరి చెట్లు వెనక్కి వెళ్ళటం గుర్తుండటం నోస్టాలజీ.

8. అణచివేత: పెళ్ళయిన పదేళ్ళకు ఒక అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. అంతకాలం కనీసం పుట్టింటివారికి కూడా తన మనసులో బాధ చెప్పలేదు. మనసులో దుఃఖం పెరిగినప్పుడు దాన్ని ఏదో ఒక రకంగా తీర్చుకోకపోయినా, ఇతరులతో పంచుకోక పోయినా అది ఒకరోజు అగ్నిపర్వతంలా పేలి లావాలా ఎగజిమ్ము తుంది. మరోరకం అణచివేతకి ఉదాహరణ ఓడిపోతున్నప్పుడు పక్కమార్గాలు వెతుక్కోవటం: వాదనలో నెగ్గలేము అని తెలిసినప్పుడు, "నీతో మాట్లాడటం నాదే బుద్ధి తక్కువ, సమయం వృధా" అంటూ సంభాషణకి తెరదించి అక్కడినించి వెళ్ళిపోవడం.

9. అధికారం: తనకున్న అధికారం, డబ్బు వల్ల ఇతరులని హేళన చేసి తృప్తి పొందటం: ఐదుగురు స్నేహితులు, తమలో అందరికన్నా మానసికంగా

స్నేహించిన కొత్తలో వున్న ఆకర్షణ, పది సంవత్సరాల పాటు అదే సాంద్రతతో కొనసాగితే దాన్ని 'ప్రేమ' అంటారు.



బలహీనమైన స్నేహితుడిని ఏడిపిస్తూ ఆనందించటం/రాత్రి బాగా తిట్టి పొద్దున్నే ఏమీ ఎరుగనట్టుగా ఆప్యాయంగా మాట్లాడటం. (నెపోలియన్ ఈ టెక్నిక్‌ని బాగా ఉప యోగించేవాడట. క్రితం రాత్రి సైనికాధికారిని తిడితే, మరుసటి రోజు మీటింగ్‌లో అందరి ముందు అతడ్ని పొగడటం ద్వారా తన బలహీనతని సరిదిద్దుకొనే వాడట.)

10. ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఎమోషన్: ఇది పాజిటివ్ కావచ్చు. నెగెటివ్ కావచ్చు. బాట్స్‌మాన్ సిక్సర్ కొట్టగానే, పక్క స్నేహితుడిని కౌగలించుకోవటం, ఫస్ట్ క్లాస్‌లో పాసైనట్టు నెంబరు చూడగానే పక్కనున్నది అమ్మాయి అనైనా చూడకుండా ముద్దు పెట్టుకోవటం పాజిటివ్ ట్రాన్స్‌ఫర్‌కి ఉదాహరణలు.

ఎదుటివారిపై కోపంతో తలుపు ధడేలున కొట్టుకుంటూ వెళ్ళి పోవటం, డబ్బు ఇబ్బందుల్తో పిల్లల్ని కొట్టడం; మీటింగ్‌లో సరిగ్గా మాట్లాడలేక రెండు నిముషాల్లో ముగించి వచ్చి సీటులో కూర్చొని, ఆ కోపంతో పేపరు మీద పిచ్చిగీతలు గియ్యటం – నెగెటివ్ ట్రాన్స్‌ఫర్‌కి ఉదాహరణలు.

మనసుకీ, బుద్ధికీ మధ్య సరైన అవగాహన లేకపోతే మనిషి ఏ రకంగా ప్రవర్తిస్తాడో పై ఉదాహరణల్లో తెలుసుకున్నాము. ఈ ఘర్షణలు మరీ ఎక్కువైతే అవి డిప్రెషన్‌కీ, లేదా అసహనానికి దారి తీస్తాయి. అంతర్ – సంఘర్షణ లేని వ్యక్తుల జీవితం శాంతంగా, మొహం ప్రశాంతంగా వుంటుంది.

మీరు కోపంగా, నిర్లిప్తంగా, నిరాశగా, నిస్సహగా ఉన్నట్లయితే బాధపడేది మీరొక్కరే కాదు, మీ చుట్టూ ఉన్న వాళ్ళుకూడా...! మీ వల్ల మీకు వచ్చే దుఃఖాన్నించి బయటపడాలంటే ఒకటే మార్గం. దుఃఖకారణం వెతకండి. దాన్ని నిర్మూలించండి. అప్పటివరకూ ఎంతో దగ్గరగా వున్న స్నేహితుడు/స్నేహితురాలు అకస్మాత్తుగా మాట్లాడం మానేశారనుకోండి. ఆ వ్యక్తిని మర్చిపోండి. కష్టమే. కానీ ఆలోచించండి. మంచి స్నేహితులనేవాళ్లు ఎందుకు విడిపోతారు? అలా విడిపోయే వాళ్ళు మంచి స్నేహితులెలా అవుతారు? అవునా. అదే తర్కం. బాధని మరిపించే దివ్య ఔషధం.

గురివింద తన నలుపెరగదు

ఒక్కోసారి మన బుద్ధి తన తప్పు గ్రహించదు. మన ప్రవర్తనకి అందమైన సమర్థన ముసుగులు వేసుకుంటాము. ఆ విషయం మరొకరు చెప్పినప్పుడు, దాన్ని ఒప్పుకోవటం కూడా మంచి అలవాటే. ఈ సందర్భంగా ఒక అనుభవం మీతో పంచుకోవాలి.

నా మిత్రుడు ఒక పాఠశాలకి ప్రధానోపాధ్యాయుడు. అతని కోరిక మీద వారి స్కూల్‌కి వెళ్ళి పిల్లలకి 'ఏకాగ్రత పెంచుకోవటం ఎలా?' అన్న విషయంపై 'మనస్సుని కంట్రోలులో పెట్టుకోవటమే విజయం' అని బోధించి వస్తూండగా నా మిత్రుడు "మనసుని కంట్రోల్‌లో పెట్టుకోవటం నిజంగా అంత సులభం అంటావా?" అని అడిగాడు.

"నిశ్చయించుకుంటే పెద్దకష్టం కాదు. పిల్లలకి ఎన్నో ఆకర్షణలుంటాయి. వాటినించి బయట పడితేనే చదువు మీద ఏకాగ్రత నిలుస్తుంది" అన్నాను.

"రోజు గంటసేపు నువ్వు యోగా చేస్తావు కదూ. దానికి ఒక టీచర్ని కూడా పెట్టుకొన్నట్టు గుర్తు. ఎంత కాలం నుంచి?" అని అడిగాడు. మేం చర్చిస్తున్న విషయానికీ ఈ ప్రశ్నకీ ఏం సంబంధమో అర్థం కాక, "దాదాపు పది సంవత్సరాల నుంచీ" అన్నాను.

"టీచర్ లేకుండా చేయలేవా?"


"ప్రయత్నించి చూసాను. ఆ మాటకొస్తే టీచర్ రాని రోజు కొంచెం సంతోషంగా వుంటుంది కూడా. కానీ యోగా చేయటం వలన రోజంతా హుషారుగా వుంటుంది. అందుకే బలవంతంగానైనా సరే.." అంటూ నేనేదో చెప్పబోతూ వుంటే నా మిత్రుడు ఆపు చేసి, "నేనడిగిన ప్రశ్న అదికాదు. నువ్వు పిల్లలకి ఇన్ని వ్యక్తిత్వ వికాస పాఠాలు చెపుతావు కదా. మనసు మీద నీకు నిజంగా కంట్రోలు వుంటే, యోగా టీచర్ లేకుండా ఆ వ్యాయామం ఏదో నువ్వే ఎందుకు చేయకూడదు? దాదాపు పది సంవత్సరాల అనుభవం వుంది కాబట్టి ఈపాటికే నీకు ఆ ఆసనాలన్నీ ఎలా వెయ్యాలో తెలిసి వుంటుంది. అయినా వేల జీతమిస్తూ టీచర్ని ఎందుకు పెట్టుకున్నావు? పైగా టీచర్ రాని రోజు నీకు వెసులుబాటుగా వుంటుంది. అంటే లోలోపలే నీకు బద్ధకం అన్నమాట. బుద్ధి ఆసనాలు వెయ్యమని ప్రోత్సహిస్తుంది. మనసు ఎలా ఎగ్గొడదామా అని చూస్తుంది. నువ్వే నీ మనసుని జయించలేకపోతున్నావు. ఇక విద్యార్థులకేం చెప్తావు?" అన్నాడు.

మొహం మీద కొట్టినట్టయింది. నిజమే. 'అనుకొన్న గమ్యం కోసం దేన్నయినా సాధించాలి. మనసుని కంట్రోలులో పెట్టుకోవాలి' అని ఇన్ని పుస్తకాలు రాసిన నేను, టీచర్ లేకుండా ఆసనాలు వెయ్యను. నా మిత్రడున్నట్టు టీచర్ లేకుండా కూడా నేనది చేయొచ్చు. కానీ టీచర్ వుండటం వల్ల నష్టమేం లేనప్పుడు ఆ సర్వీసుని ఉపయోగించుకోవటంలో తప్పేముంది? విద్యార్థుల సంగతి వేరు. 'మొక్కై వొంగనిది మానై వొంగదు. అందువల్ల విద్యార్థి దశలోనే మనసుని కంట్రోలులో పెట్టుకోవటం గురించి వాళ్ళకి నేర్పాలి' అన్నది నా వాదన. నా వాదన తప్పనీ, బలహీనత కప్పిపుచ్చుకోవటం కోసమే అనీ నాకు తెలుసు. ఏది ఏమైనా మిత్రుడితో చర్చ నా దృక్పథాన్ని మార్చింది.

(ఇంకా వుంది)

'ప్రేమ ఒక కళ' లేఖలపోటీ

నవ్యవీక్లిలో కొత్తగా మొదలయిన 'ప్రేమ ఒక కళ' శీర్షికను పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. వారం వారం వెలువడుతున్న వ్యాసాలపై వారి ప్రతిస్పందన అద్భుతంగా ఉంటోంది. వారి స్పందనను అభినందిస్తూ పాఠకులను కూడా ఈ వ్యాసావళిలో భాగస్వాములను చేసేందుకు సరికొత్త పోటీని నిర్వహిస్తున్నాం. 'ప్రేమ ఒక కళ' శీర్షికన వారం వారం వెలువడే వ్యాసాలపై మీ అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా పదిలైన్లకు మించకుండా రాసి మాకు పంపండి. ఇ-మెయిల్‌లో కూడా మీ అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఉత్తమలేఖకి వెయ్యిరూపాయలు విలువగల పుస్తకాలను బహుమతిగా అందుకోండి!!



మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా

నవ్యవీక్లి

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్,
హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.
email: weeklynavya@yahoo.com


తెలుగువారి అదృష్టం

ఉత్తమ లేఖ

మా అభిమాన వార పత్రిక నవ్యలో వారం వారం వస్తున్న 'ప్రేమ ఒక కళ' వ్యక్తిత్వ వికాస ధారావాహిక అద్భుతంగా ఉంటోంది. యండమూరి వీరేంద్రనాథ్ గారు తన సహజశైలిలో చదువరుల్ని మేల్కొల్పుతున్నారు. ఎనభయ్యవ దశకంలో మేము టీనేజర్లుగా ఉన్నప్పుడు ఆయన తన సాహిత్యం ద్వారా ఆప్యాయంగా మమ్మల్ని తన చిటికెనవేలు పట్టుకుని నడిచేలా చేశారు. ఆ రోజుల్లో కళాశాలల్లో ఎందరో విద్యార్థులకు ఆయన జీతం పుచ్చుకోని లైఫ్ కోచ్. 'ఆనందోబ్రహ్మ' లో 'నువ్వు జీవితంలో గెలవాలి. ఒక్కో గోల్ కొట్టుకుంటూ' అని రాస్తే, అది మమ్మల్ని ఉద్దేశించి అన్నట్టే ఉండేది. ఎంతో ప్రేరణ. ఇన్ని దశాబ్దాలు గడిచినా, ఇప్పుడు 'ప్రేమ ఒక కళ' అంటూ 'మీ బెస్ట్ ని ఇచ్చే కొద్దీ మీరు మరింత ఆనందంగా ఉంటారు' అన్నప్పుడు ఎంతో ఉత్తేజకరంగా ఉంటుంది. సాధారణంగా వ్యక్తిత్వ వికాస పుస్తకాలు ఒకే మూసలో ఉపరితలాన్ని స్పృశించేవిగా ఉండి తొందరగానే వాటి ప్రేరణాశక్తిని కోల్పోయేలా ఉంటాయి. అందుకు భిన్నంగా లోతైన భావాల్ని, అలవోకగా చెప్పే శైలితో ఈ వ్యాసాలుండడం చదువరుల్ని ఎదిగేలా చేస్తుంది. యండమూరి విషయంలో 'పీటర్ ప్రిన్సిపుల్' రూఢీ కాకపోవడం ఈ తరం తెలుగువాళ్ళ అదృష్టం.

–డాక్టర్ డి.వి.జి.శంకరరావు
పార్లమెంటు మాజీ సభ్యులు,పార్వతీపురం,
విజయనగరం జిల్లా.

జ్ఞానం-పరిజ్ఞానం-తర్కం-లేటరల్ థింకింగ్



జ్ఞానం (విజ్‌డం) వేరు. విషయ పరిజ్ఞానం (నాలెడ్జ్) వేరు. తెలివి (ఇన్‌టెలిజెన్స్) వేరు.

చదువు వల్లా, అనుభవంతో కూడిన పరిశీలన వల్లా వచ్చేది నాలెడ్జ్. సాంకేతిక పరిజ్ఞానం అంటే టెక్నాలజీ.

తన కున్న 'నాలెడ్జ్' ద్వారా ఒక లెక్కకి జవాబు గానీ, లేదా ఒక సమస్యకి పరిష్కారం గానీ కనుక్కోవటాన్ని 'తెలివి' అంటారు.

$(a+b)^2$ ఎంత? అన్న ప్రశ్నకి a^2+b^2+2ab అని చెప్తే నాలెడ్జి $(b+a)^2$ ఎంత?'' అని అడిగితే 'నాకు తెలీదు' అని చెప్తే ఆ కుర్రవాడికి తెలివి లేదన్నమాట. రెండిటికీ 'అదే' జవాబు అని తెలుసుకోవడం తెలివి. ఇది ఏ కాలేజీలోనూ చెప్పరు.

ఒక ప్రశ్నకి ఎంత తొందరగా సమాధానం చెప్పగలము (లేదా ఒక సమస్యకి ఎంత తొందరగా రియాక్ట్ కాగలము) అన్నది ప్రతి స్పందన. sin ?/cos ?= tan ? అన్నది నాలెడ్జి. (sin ?/cos ?) x (tan ? / tan^2?)=1 అని ఎంత తొందరగా సమాధానం చెప్పగలమూ అన్నది **ప్రతిస్పందన** (reflex x action).

ఒక పని చేయగా వచ్చేది **అనుభవం.** మనసు పెట్టి ఆ పని శ్రద్ధగా చేయడం వల్ల వచ్చేది నైపుణ్యం (స్కిల్)దానికి కామన్‌సెన్స్ కలిస్తే వచ్చేది **పరిపక్వత** (మెచ్యూరిటీ)

తెలివి. పరిజ్ఞానం ఉన్నా, సమాధానం ఆలస్యంగా చెప్పేవాడిని 'ముద్దపప్పు' అంటాము. కింద సంతకం పెట్టకుండా సెలబ్రెటీలకి పండగ రోజు శుభాకాంక్షలు పంపటం ముద్దపప్పు లక్షణం.

నాలెడ్జ్ లేకుండా, కేవలం తెలివి వున్నవాడిని 'అతి తెలివిగాడు' అంటాము. ఏప్రిల్ ఒకటిన పాస్ ఉండి కూడా, టికెట్ కొని బస్ కండక్టర్‌ని ఫూల్ చేసానని సంబర పడేవాడు ఈ కేటగిరే.

తెలివి లేకుండా కేవలం నాలెడ్జ్ వున్న వాడిని 'శుష్క పండితుడు' అంటాము. చంద్రబాబు నాయుడు పోలింగ్ బూత్ నుంచి బయటకు వచ్చి 'నేను బిజెపికి ఓటు వేసాను' అని ప్రకటించగానే, ఎన్నికల అధికారి 'చంద్రబాబు ఓటు చెల్లదు' అని ప్రకటించాడు. అంటే ఆ బూత్‌లో తెలుగుదేశానికి 1000 ఓట్లు పడితే కేవలం 999 మాత్రమే వచ్చినట్లు లెక్క కడతారన్నమాట. ఇంత వరకూ బాగానే ఉంది కానీ, రేపొద్దున్న వెయ్యిమంది బయటకి వచ్చి 'మేము తెలుగుదేశానికి ఓటు వేశాము' అని ప్రకటించారనుకోండి. ఎన్నికల అధికారి ఆర్డరు ప్రకారం తెలుగు దేశానికి పడిన ఓట్లలోంచి వెయ్యి తగ్గిస్తారు. కానీ వారు నిజానికి వైఎస్ఆర్ పార్టీకి వేసిన వారనుకోండి. అప్పుడేమౌతుంది? శుష్క పాండిత్యం అంటే అది. తరువాత తప్పు సరిదిద్దుకున్నారు. అది వేరే సంగతి.

జ్ఞానం లేని వ్యక్తిని స్టుపిడ్ అంటారు. ఫలానా వ్యక్తి మరణించాడని ఫేస్‌బుక్‌లో వస్తే 'లైకులు' కొట్టడం స్టుపెడిటీకి ఉదాహరణ.

అన్నీ ఉండి సంస్కారం లేకపోతే అతడిని మూర్ఖుడు అంటాము. 'ఈ ప్రపంచంలో కెల్లా అత్యంత సంస్కారరహితుడూ, నాగరికత లేని మూర్ఖుడు ఎవరు? అన్న ప్రశ్నకు ఒక మేగజైన్ పాఠకుల నుంచి సమాధానాలు ఆహ్వానించింది. ఎన్నుకున్న అత్యుత్తమ జవాబు 'అర్థరాత్రి పూట రైల్లో సెల్ ఫోన్లో గట్టిగా మాట్లాడే వ్యక్తి'

ఫ్యాను విప్పి మిస్టేక్ ప్లగ్‌లో వుందో, వైర్‌లో వుందో తెలుసుకోగలగడం నాలెడ్జ్. కరెంటు వైరుని ముట్టుకోకుండా వుండడం మెచ్యూరిటీ. తొందరగా రిపేరు చేయటం నైపుణ్యం. అన్నిటి కన్నా ముందు అసలు కరెంటు వుందా లేదా అని చూసుకోవడం కామన్‌సెన్స్.

అవన్నీ కలిస్తే వచ్చేది జ్ఞానం.

ఇప్పుడు ఒక్కొక్క విషయాన్నే విడి విడిగా పరిశీలిద్దాం.

నాలెడ్జ్...

విద్యార్థులు పరీక్షలవగానే పాఠం మర్చిపోతున్నారు. చదువుని జ్ఞానంగా మార్చుకోకపోతే ఎంత చదివినా వేస్ట్.

చదువు పూర్తయి కాలేజీ నుంచి బయటకు వచ్చాక బుర్రలో ఏమి మిగిలిందో అదే–''చదువు''

నాలెడ్జ్‌ని సరిగ్గా ఉపయోగించుకోవటమే జ్ఞానం అని పైన తెలుసుకున్నాం.

ఎంటెక్ సివిల్ విద్యార్థులకి సివిల్ ఇంజనీరింగ్‌లో జాగ్రఫీ ప్రాముఖ్యత వివరిస్తూ, భారత దేశపు మూడు వైపుల సముద్రాల్నీ, ఉత్తర దిక్కున హిమాలయ పర్వతాల్ని బోర్డు మీద మ్యాపు వేసి చూపించాను. ఆ తరువాత ఆరుగురు విద్యార్థుల్ని స్టేజి మీదకు పిలిచి, కళ్ళు మూసుకొని తూర్పుకు తిరగమన్నాను.

ఆ కాలేజీలో రెండు సంవత్సరాల నుంచీ చదువుతున్నా, తూర్పు ఎటు వుందో తెలియక కొంతమంది అయోమయం చెందారు. మొత్తానికి అందరూ తూర్పుకి తిరిగాక, వారిని బంగాళాఖాతం వైపు తిరగమన్నాను. ఇద్దరు కుడిపక్కకీ, ఒకళ్ళు వెనక్కి తిరిగారు. 'భారతదేశానికి బంగాళాఖాతం తూర్పున వుంటుందనీ, ఎటూ తిరగనవసరం లేదనీ చెప్పేసరికి ఆడిటోరియం ఘొల్లుమంది. ఇక్కడ ఉద్దేశం విద్యార్థుల్ని అవమానపరచడం కాదు.

చదువుకీ, జ్ఞానానికీ ఉన్న తేడా చెప్పడం

11

ప్రేమ ఒక కళ



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 9246502662

ఇతరుల నుండి మనం ఎలాంటి ట్రీట్‌మెంట్‌ని కోరుకుంటామో, అదేవిధంగా మనం కూడా ఇతరులను ట్రీట్ చేస్తే జీవితం ప్రేమ మయం అవుతుంది.

మాత్రమే.

అయితే వాళ్ళలో కొంతమంది మేధావులను చూసాను. ఉత్తరం వైపుకు తిరిగి వుండగా, 'మీ ఎదురుగా ఏ పర్వతాలున్నాయి?' అని అడిగినప్పుడు ఒక అబ్బాయి 'నేను ఏ దేశంలో ఉన్నాను?' అని ఎదురు ప్రశ్నించాడు. చాలా గొప్ప డౌటు అది. 'భారతదేశం' అని చెప్పినప్పుడు 'ఉత్తర భారతమా?' లేక 'దక్షిణమా'? అని తిరిగి ప్రశ్న వేసాడు. 'దక్షిణం' అన్నప్పుడు 'వింధ్య పర్వతాలు' అని సమాధానం ఇచ్చాడు. ఇది చాలా సమయస్ఫూర్తితో చెప్పిన సమాధానం. అయితే ఇది ఇక్కడితో ఆగలేదు.

ఏదైనా ఒక విషయం చెప్పినప్పుడు మనుష్యులు అయిదు రకాలుగా రియాక్ట్ అవుతారు. సమర్థించే వాళ్ళు...తటస్థులు, ఏకీభవించని వారు, అప్పటి వరకూ ఉన్న తమ అభిప్రాయాన్ని మార్చుకునే వారు,



సునామీలా విరుచుకుపడేవారు.

అందుకు ఉదాహరణ కూడా పై కాలేజీలో జరిగిన సంఘటన.

సెమినార్ అయిపోయాక అక్కడ పనిచేస్తున్న ఒక లెక్చరర్ "దేశానికి ఏ దిక్కున ఏమి వున్నదీ తెలుసుకోనవసరం లేదు. తిరుపతి ఏ దిక్కున ఉన్నదో చూపించండి చూద్దాం" అంది. షాక్ తగిలినట్టయింది. నేను ఈ కోణంలోంచి ఆలోచించలేదు.

ఆమె అక్కడితో ఆగలేదు. 'సచిన్ టెండూల్కర్, ఏఆర్ రెహ్మాన్, విశ్వనాధన్ ఆనంద్‌లని ఈ తరం జీనియస్‌లూగా ఒక ప్రఖ్యాత ఆంగ్ల పత్రిక పేర్కొంది. 'తూర్పుకి నిలబడితే హిమాలయాలు కుడివైపా, ఎడమవైపా? అని వాళ్ళని అడగండి. వాళ్ళు కూడా చెప్పలేకపోవచ్చు. ఇదంతా మీ శాడిజం. పాండిత్య ప్రకటన' అంది.

చెప్పుని పేడనీళ్ళలో ముంచి మొహం మీద కొట్టినట్టయింది.

"మీరు చెపుతున్నది ఏదో సాధించిన ప్రొఫెషనల్స్ గురించి. నేను అడుగుతున్నది విద్యార్థులని...! టెండూల్కర్‌కి తూర్పు ఎటుందో తెలియనవసరం లేదు. విద్యార్థులకి తెలియాలి. నేనిక్కడ క్లాసులు తీసుకొంటున్నది వీళ్ళలోంచి ఒక ఐన్‌స్టీన్నో, అబ్దుల్ కలాంనో తయారు చేద్దామనీ...! ఐశ్వర్యారాయ్‌ని గుర్తుపెట్టుకోగలిగిన మెదడు, సౌదీ అరేబియాని కూడా గుర్తు పెట్టుకోగలదన్న నమ్మకం వాళ్ళలో కలగచేయటానికి...! పాలు ఎలా తయారవుతాయి? అన్న ప్రశ్నకి రేపు మీ కూతురు... మిషన్లలో తయారుచేసి పాకెట్లలో అమ్ముతారు అని చెప్పినా... పర్లేదమ్మా..అది నీకు అవసరం లేదు. విశ్వనాథన్ ఆనంద్‌కి కూడా పాలు ఎలా వస్తాయో తెలీదు అని అంటారు. మీ క్లాసులో నూడుల్స్ తినే నూటికి తొంభైమందికి మైదా పిండి ఎందులో నుంచి వస్తుందో తెలీదు. మీ థియరీ ప్రకారం తెలియకపోయినా ఫర్వాలేదు.." అందామనుకున్నాను. అనలేదు.

ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే, ఇంటర్వ్యూ విత్ రాంగోపాలవర్మ లాంటివి ప్రసారమైనప్పుడు, వాటితో ఏకీభవించని వారు ఇలా విరుచుకు పడటం, ఒకరి గురించి ఒకరు "....చేరి మూర్ఖుని మనసు రంజింపరాదు" అనుకోవడం సాధారణమైన విషయమే. ఇటువంటి విషయాల్లో ఎవరి వాదనలు వారివి.

ఒక అమ్మాయి రంభావ్రతం చేసిందనుకుందాం. రంభా వ్రతమనగా 'మంచి' భర్త కోసం జ్యేష్ట శుద్ధ తదియనాడు కన్నెపిల్లలు అరటి చెట్టు (రంభావృక్షం)ను పూజించడం...! సదరు రంభావ్రతం చేసిన పిల్లని ముత్తైదువులందరూ వెళ్ళి పవన్ కల్యాణ్ లాంటి మొగుడు రావాలని ఆశీర్వదిస్తారు. ఒక వ్యక్తి అరచేతిని కోసుకుని, మెడలోతు నదిలో మునిగి, రక్తం తర్పణంగా నీళ్ళల్లో వదుల్తూ ఐశ్వర్యారాయ్ లాంటి అమ్మాయి కోసం ప్రార్థిస్తున్నాడనుకోండి..'మెంటల్' అంటారు.

ఏ స్టేజ్ నుంచి 'వ్రతం' 'మెంటల్'గా మారుతుంది?

సర్లెండి. ఇప్పుడు మన టాపిక్ అది కాదు. జ్ఞానం.

జ్ఞానం ఇంటికి పై కప్పు 'తెలివి' అయితే పునాది 'జ్ఞాపకశక్తి'

టెక్నిక్స్ వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందా?

చెప్పడం కష్టం. అనంతపురంలో మెమొరీ టెక్నిక్స్ మీద ఒక నిర్వాహకుడు బోర్డుపై రకరకాల గళ్ళు గీసి సభికుల్ని వివిధ అంకెలతో నింపమన్నాడు. రెండు నిమిషాల తరువాత అవే అంకెల్ని వరుసగా చెప్పేశాడు. ఒక్కొక్కర్నీ ఒక్కొక్క వస్తువు పేరు చెప్పమని యాభై వస్తువుల పేర్లు అదే క్రమంగా చెప్పాడు. సభికులందరూ కరతాళ ధ్వనులు చేశారు.

"మీ పిల్లలు కూడా ఇంత అద్భుతమైన మెమొరీని వారం రోజుల్లో పొందగలుగుతారు" అన్నప్పుడు మాత్రం ఒక వ్యక్తి నిలబడి..."గతంలో మీరు ఈ విధంగానే ప్రకటించినప్పుడు మా అబ్బాయిని చేర్పించాను. ఏ ఉపయోగమూ కనపడలేదు" అన్నాడు.

ఈ అనూహ్య పరిణామానికి అందరూ బిత్తరపోయారు.

"లోపం నాది కాదు. సరిగ్గా నేర్చుకోని మీ అబ్బాయిది" అన్నాడు ఆ నిపుణుడు. నిలబడ్డ వ్యక్తి కూడా అంత ధీమాగానే "మీరు చెప్పినదంతా కరెక్టుగా అమలు జరిగినట్టయితే మీ పిల్లలకి ర్యాంక్ రావాలి కదా. వారికెందుకు రాలేదు?" అని ప్రశ్నించాడు.

స్టేజి మీదున్న నిపుణులు ఈ పరిణామాన్ని ఊహించలేదు. సభలో కలకలం రేగింది. ప్రశ్నించడానికి నిలబడిన వ్యక్తి ముందే ప్రిపేరై వచ్చినట్టున్నాడు. "...అంకెలు, వస్తువులు గుర్తు పెట్టుకోవడానికి, తిరిగి చెప్పడానికి మీ టెక్నిక్స్ సరిపోతాయేమోగాని జువాలజీలో ఫైలమ్‌లు, కెమిస్ట్రీలో ఈక్వేషన్లూ గుర్తు పెట్టుకోవడానికి పనిచేయవు. కావాలంటే నేనొక పద్యం చెపుతాను. మీకు అరగంట టైమిస్తాను. తిరిగి ఆ పద్యాన్ని మళ్ళీ నాకు చెప్పండి" అన్నాడు.

సభలో కొందరు చప్పట్లు కొట్టారు. ఈలోపు నిర్వాహకులు పరిగెత్తుకు వచ్చి ఏదో సర్ది చెప్పి ఆ నిలుచున్న ఆయన్ని కూర్చోపెట్టారు.

ఆలోచిస్తే ఇదంతా నిజమే కదా అనిపించింది. ఈ మెమొరీ టెక్నిక్సు ఇవన్నీ పెగ్గింగ్ సిస్టం ద్వారా వస్తువులు గుర్తు పెట్టుకునేలాగ చేస్తాయే తప్ప జ్ఞానాన్ని పెంపొందించే విధంగా సహాయపడవనిపించింది. ఈ అభిప్రాయం తప్పో కాదో అనుభవం ఉన్న వారు చెప్పాలి.

అయితే ఈ మెమొరీ టెక్నిక్స్ వల్ల అబాకస్‌ల వల్ల మెదడు చురుగ్గా మారుతుంది. ముఖ్యంగా తన మీద తనకి నమ్మకం ఏర్పడుతుంది. సభా పిరికితనం పోతుంది.

ముందే చెప్పినట్టు జ్ఞానం వేరు, పరిజ్ఞానం వేరు.

సేమ్యాలు, యాలకులు, పంచదార కలిసిన పాయసం జ్ఞానం! తెలివి, పంచదార, పాలు నాలెడ్జ్. సేమ్యాలు అనుభవాలు, యాలకులు తర్కం. జీడిపప్పు లేటరల్ థింకింగ్...! ఉట్టి సేమ్యాలు తినలేము. పది యాలకులు నోట్లో వేసుకొని నమలలేము. గుప్పెడు పంచదార తింటే మొహం మొత్తుతుంది. విడివిడిగా ఏవీ బాగోవు. అన్నీ కలిపితే వచ్చేది మధురమైన పాయసం-జ్ఞానం!

తర్కం

దాదాపు పది సంవత్సరాల క్రితం అబాకస్ వారు, తమ వార్షికోత్సవం సభకి ఆహ్వానించడం కోసం మా

ఇంటికి వారి పిల్లల్తో వచ్చారు. పిల్లలిద్దరూ చాలా చురుగ్గా ఉన్నారు. పెద్ద పెద్ద గుణింతాలక్కూడా క్షణాల్లో జవాబు చెప్పారు. 'ఒక పిల్లి ఒక అడుగు ఎత్తు మీద నుంచి దూకితే ఒక కాలు విరిగితే, రెండు అడుగుల మీద నుంచి దూకితే ఎన్ని కాళ్ళు విరుగుతాయి' అన్న ప్రశ్నకి 'రెండు' అన్నారు.

ఆ దంపతులు తమ తప్పు గ్రహించారు. అయిదు సంవత్సరాల తరువాత తిరిగి మళ్ళీ వారు నిర్వహించిన ఫంక్షన్‌కి వెళ్ళినప్పుడు స్టేజీ మీద ఈ విషయం వారే ప్రస్తావిస్తూ, "తమ ఆలోచనా విధానాన్ని మార్చుకున్నామనీ, తాము నిర్వహించే అబాకస్ తరగతులలో అప్పటి నుంచీ లెక్కలతో పాటు తర్కాన్ని కూడా ఒక సబ్జెక్టుగా ప్రవేశపెట్టామని" చెప్పినప్పుడు మనస్ఫూర్తిగా సంతోషించాను. తప్పులని సరిదిద్దుకోవటం కన్నా గొప్ప ప్రగతి మరేముంటుంది?

తర్కాన్ని ఇంగ్లీషులో లాజిక్ అంటారు. మనకి తెలియనిది చాలా ఉండొచ్చు. కానీ లాజిక్ లేకుండా ఏదీ ఉండదు.

మన అయిదు వేళ్ళూ సమానంగా ఎందుకు వుండవు? ఎందుకు పశువులు మాటి మాటికీ నాలుకతో ముక్కు రంధ్రాల్ని శుభ్రం చేసుకుంటాయి? టైట్‌గా మూత వున్న గోధుమ పిండి డబ్బాల్లోకి పురుగులు ఎలా చేరతాయి?

-బంతిని పట్టుకొన్నప్పుడు మన అన్ని వేళ్ళూ సమానంగా వుండడం గమనించవచ్చు. కోతులు చెట్ల కొమ్మల్ని పట్టుకొని ఎగిరే క్రమంలో ఉపయోగ పడే సూత్రం కూడా ఇదే. వేళ్ళన్నీ ఒకే పొడవులో ఉండి వుంటే, ప్రతి దినం మన చిటికిన వేలికి దెబ్బ తగులుతూనే వుంటుంది.

గోవుల ముక్కు దగ్గర వుండే గ్లాండ్స్ తిండి జీర్ణం అవడానికి సహాయం చేస్తాయి. అంతే కాకుండా పశువులు తరచూ ఊపిరి తిత్తుల వ్యాధులతో బాధపడుతూ వుంటాయి. ముక్కు తుడుచుకోవడానికి వాటి దగ్గర కర్చీఫులు ఉండకపోవడం కూడా ఒక కారణం.

గోధుమపిండి డబ్బాల్లో పెట్టి మూత పెట్టకముందే వాటిల్లో పురుగుల తాలూకు గుడ్లు వుంటాయి. అవి లోపల పరిణితి చెందుతాయి.

ఇలా ప్రతీదానికి తర్కం ఉన్నది. ఈ ప్రపంచంలో చాలా విషయాలు మన ప్రస్తుత తర్కానికి, జ్ఞానానికి అందకపోవచ్చు.

లేటరల్ థింకింగ్

లేటరల్ థింకింగ్ అంటే, మరింత కొత్తగా ఆలోచించే విధానం. "నేల మీద పది కాకులున్నాయి. ధామ్మని పేల్చి ఒకదాన్ని చంపితే ఎన్ని ఉంటాయి?" అన్న ప్రశ్నకి, "శబ్దానికి అన్నీ ఎగిరిపోతాయి" అనటం మామూలు తెలివి, "చచ్చిన కాకి వుంటుంది" అనటం తర్కం. "చెప్పలేము ఆ శబ్దానికి మరొక దానికి హార్ట్ అటాక్ రావచ్చు కదా" అని చెప్పడం లేటరల్ థింకింగ్.

లేటరల్ థింకింగ్‌లో కాస్త అతి తెలివి కూడా ఉంటుంది. దాదాపు నలభై సంవత్సరాల క్రితం వ్రాసిన ఈ కథ లేటరల్ థింకింగ్‌కి ఉదాహరణ.

రోజంతా యాచించినా ఏమీ దొరక్కపోయేసరికి ఒక బిచ్చగాడు భగవంతుడ్ని "దేవా! ఈరోజు నాకే దన్నా దొరికేట్టు చేయి. అందులో సగం నీకిస్తాను" అని కోరుకున్నాడు. అతడికి సంభ్రమం కలిగేలా రోడ్డు మీద ఒక సంచి దొరికింది. అందులో రెండు వందల వరహాలున్నాయి. ఆ ఆనందంలో అతడు వారం రోజుల్లో మొత్తం ఖర్చుపెట్టేశాడు.

ఈ తరువాత పాపభీతి పట్టుకుంది.

భగవంతుడికి వందరూపాయలు బాకీ పడ్డానన్న భయంతో రాత్రి పూట నిద్ర పట్టడం మానేసింది.

అంతలో అతడికి ఒక ఆలోచన వచ్చి, "భగవంతుడా, ఇంకో రెండొందల వరహాలు దొరికేలా చెయ్యి. అందులో సగం నీకిస్తాను" అన్నాడు. ఆ రోజు అతడికేమీ దొరకలేదు. భగవంతుడికి బాకీ తీరిపోయిందన్న సంతృప్తితో హాయిగా నిద్రపోయాడు.

వంటలో కూడా లేటరల్ థింకింగ్ వుంటుంది. బీరకాయ తొక్కతో అద్భుతంగా పచ్చడి చేసేవాళ్ళు ఉన్నారు. 1970లో కలకత్తాలో ఒక చైనా వంటవాడికి ఒక కొత్త ఆలోచన వచ్చింది. కార్న్ ఫ్లోర్‌లో చికెన్ ముక్కల్ని వేపి, అల్లం వెల్లుల్లి ముక్కలుగా తురిమి అందరూ వాడే మసాలాకు బదులు సోయాసాస్ కలిపి ఒక కొత్త రకం వంటకం తయారు చేశాడు. అది ఎంత పాపులర్ అయిందంటే కొద్ది రోజుల్లో ప్రపంచంలోనే అతి రుచికరమైన డిష్‌గా విశ్వవ్యాప్తం అయిపోయి, దాంట్లోనే వెజిటేరియన్ కూడా వచ్చింది. ఆ డిష్ పేరు చికెన్ మంచూరియా.

కొత్తగా హోటల్ స్థాపించిన నా స్నేహితుడికి ఒక సలహా ఇచ్చాను. కాఫీ ఆర్డర్ ఇచ్చినప్పుడు అక్కడి వెయిటర్ షుగర్ మీడియమా, ఫుల్లా, తక్కువా? లైట్‌గానా, స్ట్రాంగ్‌గానా అనడుగుతాడు. బిర్యానీ ఆర్డరు చేస్తే ఎంత కారంగా ఉండాలో మననే అడిగి తెలుసుకుంటాడు. ఇలాంటి చిన్న చిన్న జాగ్రత్తలతో ఆ హోటల్ త్వరలోనే మంచి పేరు సంపాదించుకుంది. లేటరల్ థింకింగ్‌కు ఇదో ఉదాహరణ.

తెలివి+నాలెడ్జ్+ప్రతిస్పందన+అనుభవం+వత్తిడిలో ఆలోచించే విధానం+లాజిక్+సమయస్ఫూర్తి+లేటరల్ థింకింగ్=జ్ఞానం.

టమోటా ఒక ఫ్రూట్ అని గ్రహించడం నాలెడ్జ్. దాన్ని ఫ్రూట్‌సలాడ్‌లో వెయ్యక పోవడం తర్కం. పంచదార పాకంలో వేసిన టమోటాను ఫ్రూట్‌సలాడ్ మీద అందంగా అమర్చడం లేటరల్ థింకింగ్. అది దరిద్రంగా ఉంటుందని గ్రహించడం జ్ఞానం టమొటాల కన్నా చెర్రీస్ రుచి అని తెలుసుకోవటం రేషనల్ థింకింగ్. అంతా చేసి, చివరల్లో ఆ ఫ్రూట్ సలాడ్ని పెనం మీద వేపడం స్టుపిడిటీ.

(ఇంకా వుంది)

'ప్రేమ ఒక కళ' లేఖలపోటీ

నవ్యవీక్లిలో కొత్తగా మొదలయిన 'ప్రేమ ఒక కళ' శీర్షికను పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. వారం వారం వెలువడుతున్న వ్యాసాలపై వారి ప్రతిస్పందన అద్భుతంగా ఉంటోంది. వారి స్పందనను అభినందిస్తూ పాఠకులను కూడా ఈ వ్యాసావళిలో భాగస్వాములను చేసేందుకు సరికొత్త పోటీని నిర్వహిస్తున్నాం. 'ప్రేమ ఒక కళ' శీర్షికన వారం వారం వెలువడే వ్యాసాలపై మీ అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా పదిలైన్లకు మించకుండా రాసి మాకు పంపండి. ఇ-మెయిల్‌లో కూడా మీ అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఉత్తమలేఖకి వెయ్యిరూపాయలు విలువగల పుస్తకాలను బహుమతిగా అందుకోండి!!



మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా
నవ్యవీక్లి
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్,
హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.
email: weeklynavya@yahoo.com

మూలాన్ని వెతికి పట్టుకోవాలి

దేశంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు కొలువు దీరాయి. పాత కాలపు రోత పోయింది. ఇప్పుడు అంతా ఫ్రెష్..ఫ్రెష్! అలాగే యువతరానికి ఈ సందర్భంగా కొత్త దిశానిర్దేశం చూపాలి. వెనుకబడిన దేశం మనది. యువతరానికి ప్రాధాన్యం ఇస్తూ వారిపైనే ప్రధానంగా దృష్టికేంద్రీకరించి వారిని తీర్చిదిద్దే మాస్టర్స్ మనకు కావాలి. అలాంటి మాస్టర్ యండమూరి వీరేంద్రనాథ్. ఆయన వ్యాసాలు లైఫ్ గైడెన్స్! కేవలం యువతకే కాదు. అన్ని వయసుల వారికీ ఆయన వాక్యాలు మార్గదర్శకాలే! ఏదైనా పాత విషయమే. కానీ కొత్త తరానికి హత్తుకునేలా, వారు ఆచరణకు దిగేలా కొత్తరకంగా చెప్పేదే నిజమైన టీచింగ్. అందులో ఆరితేరిన భావ సంపద, వాక్య సంపదతో యువతకు చేరువైనవారు యండమూరి. 'ఫీవర్', 'టాబ్లెట్' పదాలకు యూత్‌కు సరిపడేలా సరికొత్త అబ్రివేషన్ ఇచ్చారు. అసహనాన్ని తల్లిపై చూపడం కాదు, బుద్ధుడు చెప్పే యోగం కూడా ఇదే అనడంలో మనదైన టచ్ ఇచ్చారు యండమూరి. పరిస్థితిని సమీకరించి మూలాన్ని వెతికి పట్టుకోవాలి. ఆత్మగౌరవం, ఆత్మ విమర్శ రెండూ ఉండాలి మనిషికి. పనిచేయడంలో ఉన్న సంతృప్తి, ఇవ్వడంలో ఉండే ఆత్మానందం తెలిసేలా చేశారు.

-కె.ఐశ్వర్య, పాలకొల్లు, ప.గో.జిల్లా

ప్రేమ ఒక కళ



12

-యండమూరి వీరేంద్రనాథ్
సెల్: 92465 02662

మానవాభ్యుదయం కోసం సుఖాన్ని వదిలేసిన వాడే ఋషి

''స్వార్థపరుడికి చివరకు మిగిలేది విచారమే'' అనేది పురాతన సామెత. ''తమ గమ్యం కోసం బ్రతికేవాళ్ళు, మిగతావాళ్ళకి ఎప్పుడూ స్వార్థపరులు గానే కనిపిస్తారు'' అన్నది దానికి విరుద్ధమైన నానుడి.

ఏది సరైనది? కేవలం ఐన్‌స్టీన్ మాత్రమే దీనికి సరైన సమాధానం ఇవ్వగలడు. ఎందుకంటే స్వార్థం సాపేక్షం. రిలెటివ్.

''ఆనందం పొందడాన్ని కూడా మీరు స్వార్థమని అంటే, స్వార్థం లేని చర్యే లేదు. పిల్లల్ని పెంచడం, పేదలకు సహాయం చేయడం... అన్నీ ఆనందాన్నిచ్చే పనులే'' అని ఒక ముక్కలో చెప్పాడు ఒక ఫిలాసఫర్.

నిస్వార్థానికి నిజమైన ఋజువులు ఋషులు. ఋషి అంటే 'గడ్డం పెంచుకొని, ముక్కు మూసుకొని కొండకోనల్లో తపస్సు చేసుకొనే వాడు' అనే భ్రమను మన బుర్రల్లోకి బాగా ఎక్కించారు కొందరు. కాదు. మానవాభ్యుదయం కోసం సుఖాన్ని వదిలినవాడు ఋషి. పరమాణువును కనుగొన్న కణాదుడు, గణితంలో సంచలనాలు సృష్టించిన భాస్కరాచార్యుడు, శూన్యాన్ని పూర్ణం చేసిన ఆర్యభటుడు, శస్త్ర చికిత్సా పితామహుడు సుశ్రుతుడు, వైద్య శాస్త్రవేత్త చరకుడు, వైమానిక శాస్త్రం రచించిన భరద్వాజ, వినోబా, గౌతముడు, జీసస్, గాంధీలే నిజమైన ఋషులు. ఆ విధంగా నిస్వార్థమే ఋష్యత్వం.

మీ నిస్వార్థత ఇతరులకి స్వార్థంలా కనిపించవచ్చు. తాను పక్షపాతం లేనివాడని నిరూపించుకోవడానికి, గర్భిణి భార్యను అడవులకు పంపించాడు రాముడు. రామాయణ విమర్శకులకు అది స్వార్థానికి ప్రతీక. దేశం కోసం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు కుటుంబ సభ్యులకి స్వార్థపరుడిగా కనబడవచ్చు. చిన్న వయసులోనే ప్రపంచాన్ని త్యజించిన ఆదిశంకరాచార్యుడు తల్లిదండ్రులను ఎంత మనస్తాపానికి గురిచేసాడో మనకి తెలీదు. తరువాత అతడు ప్రపంచానికే మార్గనిర్దేశకుడిగా భావించబడ్డాడు. అతడు స్వార్థపరుడా?

''గొప్ప వ్యక్తులందరూ స్వార్థపరులు'' అని షేక్స్పియర్ అన్నాడు. ''అంటే సాధారణ ప్రజలు స్వార్థపరులు కాదా?'' అని అతనిపై విమర్శకులు దాడికి దిగినప్పుడు ''వారు స్వార్థపరులవటానికి కావల్సింది అవకాశం మాత్రమే'' అని సరిదిద్దుకున్నాడు.

అయాన్ రాండ్ ఫిలాసఫీ కనుక మీరు నమ్మినట్లయితే, ఈ కాన్సెప్ట్ బాగా అర్థమౌతుంది.

రాండ్: మెటీరియలిజం అనేది సామాజిక హోదా కలిగిన వ్యవస్థ...!

ఆమె విమర్శకులు: మెటీరియలిస్టులు స్వార్థపరులు.

రాండ్: స్వార్థం వేరు, మెటీరియలిజం వేరు...! సంపద పోగు చేయడం, ఖర్చుపెట్టడంలోనే ఆనందం పెరుగుతుంది అను కుంటాడు మెటీరియలిస్ట్. తన ఆనందం కోసం (లాభం లేని పనులు చేసి కూడా) ఇతరులని సంతోషపెడతాడు. కానీ స్వార్థపరుడికి తాను తప్ప ఇంకేమీ పట్టదు. తనకి లాభం లేని పని గానీ, నష్టం వచ్చే పని గానీ ఏదీ చెయ్యడు...

విమర్శకులు: కాపిటలిస్టులందరి వాదనే ఇది.

అయాన్‌రాండ్: చేతకాని వాళ్ళు మాత్రమే విజేతల్ని 'మెటీరియలిస్టులు' అని పిలుస్తారు. పరోపకారం చేద్దామనుకుంటే, ఇవ్వడానికి కనీసం నీ దగ్గర ఏదైనా వుండాలి. నువ్వు ముందు విజయం సాధించాలి. కాబట్టి... విజయం కూడా మెటీరియలిజమే.

విమర్శకులు: పైనున్న వారు సహజంగానే ఎప్పుడూ పైనే ఉండాలనుకుంటారు. క్రింది వారు పైకి రాకుండా మానిప్యులేట్ చేస్తారు.

ఆమె: అందరూ పైకి ఎదగాలనే కోరుకుంటారు...! అవకాశం వస్తే సెలబ్రిటీ అవ్వాలనే అనుకుంటారు....! చెత్తకుండీ నుండీ తీసుకుని తినాలనీ, మురికి కాలువలో పడుకోవాలని ఎవరనుకొంటారు? మనకి ఉత్తమమైనదే కావాలి....! అది గొప్ప మారథాన్ (పరుగు పందెం)లా వుంటుంది. కొంతమంది దానిని శ్రద్ధతో సాధిస్తారు. కానీ చాలామంది దానిని ఎప్పటికీ సాధించకుండానే వుండి పోతారు. అలా ఉండిపోయిన వాళ్ళు.... సాధించిన వాళ్ళు పడిన కృషిని మర్చిపోయి, కేవలం తమ నైతిక విలువల వల్ల, సామాజిక బాధ్యత వల్ల ఇలా వుండిపోయామని ఆత్మవంచన చేసుకుంటారు. విలువల్తో కూడా అవన్నీ సాధించవచ్చని అనుకోరు. ఎవ్వరూ సంపూర్ణంగా స్వార్థపరుడు కానీ, నిస్వార్థపరుడు కానీ కాదు.

తన పట్ల తాను తీవ్రమైన ప్రేమను కలిగిన స్వార్థాన్ని 'సెల్ఫ్ సెంటర్డ్‌నెస్' అంటారు. ఇతరులకి జరిగే నష్టాన్ని పట్టించు కోకుండా, అసాధారణమైన స్వీయ-ఆసక్తి (Self-Interest) అది. చిన్నపిల్లవాడు చెల్లికి బొమ్మ ఇవ్వకపోవటం; చెల్లి ఏడ్చిగీపెట్టి అన్నయ్య నుంచి రిమోట్ కంట్రోల్ లాక్కో



మానవాభ్యుదయం కోసం సుఖాన్ని వదిలిన వాడు ఋషి. పరమాణువును కనుగొన్న కణాదుడు, గణితంలో సంచలనాలు సృష్టించిన భాస్కరాచార్యుడు, శూన్యాన్ని పూర్ణం చేసిన ఆర్యభటుడు, శస్త్ర చికిత్సా పితామహుడు సుశ్రుతుడు, వైద్య శాస్త్రవేత్త చరకుడు, వైమానిక శాస్త్రం రచించిన భరద్వాజ, వినోబా, గౌతముడు, జీసస్, గాంధీలే నిజమైన ఋషులు. ఆ విధంగా నిస్వార్థమే ఋషిత్వం.



వటం దీనికి రెండు ఉదాహరణలు. వయసు పెరిగే కొద్దీ చాలామంది దీన్నించి బయటపడతారు. కొందరు పడరు.

సెల్ఫ్ సెంటర్డ్ వ్యక్తులు ఒక పట్టాన మారరు. వీరికి సలహా ఇవ్వటం కూడా కష్టమే. ఇదెలా వుంటుందంటే, ఒక ఐటమ్ సాంగ్ డాన్సర్‌కి... '...ఇవాళ్టి అందాల్ని సురక్షితమైన భవిష్యత్తు కోసం రేపటికై భద్రపర్చుకోండి' అని ఇన్స్యూరెన్స్ ఏజెంటు సలహా ఇచ్చినట్టు వుంటుంది.

సెల్ఫ్ సెంటర్డ్‌నెస్‌కి వ్యతిరేకం 'నిస్వార్థం'. ఇంట్లో వాళ్ళంతా పస్తు ఉన్నప్పుడు పూర్తి భోజనాన్ని స్వాహా చెయ్యటం స్వార్థం. చివరిగా తినడం నిస్వార్థం.

మొత్తం అంతా కలిపి విశ్లేషిస్తే, మనుషుల్లో 5 రకాల ప్రవర్తనా నమూనాలు ఉంటాయి.

1. **స్వార్థం:** నాకు లాభం చేకూరుతున్నప్పుడు, నిన్ను బాధ పెట్టడానికి వెనుకాడను.
2. **నిస్వార్థం:** నాకు లాభం లేకపోయినా, నీకు సాయం చేస్తాను.
3. **మొహమాటం:** నాకు నష్టం వచ్చినా 'బాధపడుతూ' నీకు సాయం చేస్తాను.
4. **ద్వేషం:** నాకు నష్టం జరిగినా, నేను నిన్ను బాధ పెడతాను.
5. **సహకారం:** మనిద్దరి లాభం కోసం నీకు సహాయం చేస్తున్నాను.

చివరి దాన్ని సానుకూల స్వార్థం అనవచ్చు. ఇది అన్నిటికన్నా బెస్టు. స్వార్థానికీ, నిస్వార్థానికీ మధ్య గీత. ఎవరైనా సరే వారి ప్రాధాన్యతలను నిర్ణయించుకుని, ఆ పని చేసిన తరువాత దానికి పశ్చాత్తాపపడకుండా కట్టుబడి వుండాలి. లేదంటే థియేటర్లో హిందీ సినిమా చూస్తున్నంత సేపూ, ఇంగ్లీష్ సినిమాకు వెళ్ళనందుకు బాధపడటంలా ఉంటుంది.

ప్రేమ పరిధులు దాటితే, దాన్ని తాపత్రయం అంటారు. స్వార్థానికి పరాకాష్ట ఇది.

తాపత్రయం:

కోటీశ్వరుడయిన ఒక పెద్ద బిజినెస్‌మాన్ ఆక్సిడెంట్‌లో మెదడుకి గాయమై, అతి క్లిష్టమైన ఆపరేషన్ తరువాత బ్రతికాడు. కళ్ళు తెరవగానే చుట్టూ ఉన్న తన మనుష్యులను చూసి "ఎన్ని రోజుల నుంచి నేను ఇలా ఉన్నాను?" అని అడిగాడు.

"పది రోజులు" అన్నాడు కొడుకు. అతడు చుట్టూ చూసి, "అందరూ ఇక్కడే ఉన్నారా?" అని అడిగాడు. భార్య తలూపింది. "అయితే షాపులో ఎవరున్నారు?" అని అరిచాడు. *(ఇది మనందరికీ తెలిసిన కథే. దీనికి కొనసాగింపు చూద్దాం).*

అతడి భార్య అనునయంగా "కంగారుపడకండి. మనం అదృష్టవంతులం. మీ కారు తుక్కుతుక్కు అయిపోయింది. ఆ కారుని చూసిన వారెవ్వరూ అందులోంచి మీరు బ్రతికి బయటపడ్డారంటే నమ్మటం లేదు" అని కన్నీళ్ళు తుడుచుకుంది.

'కారు తుక్కుతుక్కు అయిపోయిందా' అని ఆ వ్యాపారి కంగారు పడి, "ఖరీదైన కారు... చాలా ఖరీదైన కారు... ఇన్సురెన్స్ వాళ్ళతో మాట్లాడారా?" అని అడిగాడు.

"అదే పనిలో ఉన్నా" అన్నాడు మూడో కొడుకు. ఇంతలో రెండో కొడుకు అతడికి షాక్ తగలకుండా ఒక వాస్తవాన్ని నెమ్మదిగా చెప్పే ప్రయత్నం చేసాడు. "నువ్వు ఇంత త్వరగా కోలుకుంటావను కోలేదు. డాక్టర్లు చాలా శ్రద్ధ తీసుకొని ట్రీట్‌మెంట్ చేసారు నాన్నా...! కానీ దురదృష్టవశాత్తు నీ ఎడమ చేతిని కాపాడలేక పోయారు. ధ్వంసమై పోయిన కారు డోరులో ఇరుక్కొని నీ చెయ్యి నుజ్జునుజ్జు అయిపోయింది" అన్నాడు.

వ్యాపారవేత్త చెయ్యి వైపు చూసుకున్నాడు. ఆ స్థానం ఖాళీగా ఉంది. ఆ చేదు నిజాన్ని అతడు జీర్ణించుకోనేందుకు సమయాన్నిస్తున్నట్టు చుట్టూ ఉన్న వారంతా నిశ్శబ్దంగా ఉన్నారు. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ "నా వాచ్... రోలెక్స్ వాచ్... పది లక్షలు...! దాన్ని రికవర్ చేసుకున్నారా?" అని అరుస్తూ అతడు పక్కమీంచి ఒక్కసారిగా లేవబోయాడు.

పెద్దకొడుకు అతడ్ని నెమ్మదిపరుస్తూ "ఉద్రేకపడకండి నాన్నా. మీ వెన్ను పూస దెబ్బతిన్నది. జీవితాంతం మీరిక నడవలేరు. కానీ చింతించనవసరం లేదు. విదేశాల్నించి చాలా ఖరీదైన కంప్యూటరైజ్డ్ వీల్ ఛైర్‌ని దిగుమతి చేసి తెప్పిస్తున్నాము. అది మీ ప్రతీ అవసరాన్ని చూసుకుంటుంది. స్నానం, పళ్ళు తోమటం, చివరికి బట్టలు..." అని చెపుతూంటే, కొడుకు మాటలకి అడ్డు తగులుతూ ఆ వ్యాపారవేత్త "ఖరీదెంత? కొటేషన్స్ పిలిచారా?" అని అడిగాడు.

దీన్నే తాపత్రయం అంటారు. తాపము అనగా కోరిక త్రయము అనగా మూడు. "అందరికన్నా నేను ఎక్కువ సంపన్నుడు అవ్వాలి, నా వాళ్ళకు అంతులేని సౌకర్యాలు కలుగజెయ్యాలి. నా తరువాత కొన్ని తరాల వరకూ కూడా నా వాళ్ళు డబ్బులో మునిగి తేలుతూ ఉండాలి" అన్నవి మూడు కోరికలు.

శారీరక, మానసిక అసౌకర్యం పెరిగే కొద్దీ దాన్నుంచి బయటపడే మార్గం వెతుకుతాడు మనిషి. ఆ బలహీనతని క్యాష్ చేసుకోవటానికి కొందరు రెడీగా వుంటారు. కొత్త కొత్త మార్గాలు కనిపెడతారు. పేరులో అక్షరం మారిస్తే అద్భుత

పదిమందిలో తప్పు ఎత్తిచూపటం, 'నీదసలే మట్టిబుర్ర' లాంటి ఎగతాళి మాటలూ, 'నోర్మూసుకుని చెప్పింది విను' లాంటి ఛీత్కారాలు పడగ్గదుల్లో కూడా గోడలు కడతాయి.



మైన భవిష్యత్తని చెప్పి, అక్షరానికి ఐదు వేలు తీసుకుని 'తన స్వంత' భవిష్యత్తు బాగు చేసుకుంటాడు ఒకడు.

తర్కరహిత భయాలున్నవారు, తమ జీవిత కథ మరొకరితో వ్రాయిస్తారు. మరొకరు వ్రాసిన స్క్రీన్ ప్లేకి అనుగుణంగా తమ జీవితాన్ని మలుచుకొంటారు. నా స్నేహితుడు కొడుకు రమేష్. నామ విధ్వంసంలో పేరుపొందిన న్యూమరాలజిస్టుకి అయిదువేలు ఫీజు చెల్లించి తన పేరులోని e అనే అక్షరాన్ని uగా మార్చుకున్నాడు. వెంటనే జపాన్ కాంట్రాక్ట్ వచ్చింది. 'నేములో ఏముంది' అనే మాలాంటి ఛాదస్తంగాళ్ళ వైపు విజయ పూర్వకంగా ఓ లుక్కు పారేసి విమానం ఎక్కాడు. నెల తరువాత వచ్చాడు. వచ్చీ రాగానే తిరిగి ఒరిజినల్ పేరు పెట్టేసుకున్నాడు. ముందు చెప్పలేదు. తరువాత తెలిసింది. జపనీస్ భాషలో 'రమూష్' అంటే మూర్ఖుడు, బ్రోకరూ, దేనికీ పనికిరానివాడూ ఆట.

ఈ విషయాల గురించి ఒక నాస్తికసంస్థ సెక్రెటరీతో మాట్లాడినప్పుడు, "ఒకప్పుడు ఇలాంటి విషయాల గురించి నేను చాలా పోరాడేవాడ్ని. కానీ తరువాత నాకొక విషయం అర్థమైంది. ఇవన్నీ మనుషులకి సంతృప్తినిస్తాయి. రాత్రి పూట స్లీపింగ్ టాబ్లెట్ వేసుకోవటం లాంటిది. కనీసం తాత్కాలికంగానైనా నిద్ర పడుతుంది. కొత్త పేరు తనకి లాభం చేకూరుస్తుందనే సంతృప్తి కొంతకాలం పాటు అతడిని ఆనందంగా వుంచుతుంది" అన్నాడు.

నేనాయనతో ఏమీ వాదించలేదు. ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాడు గడ్డిపోచని పట్టుకోవటం సహజం. కానీ, ఒడ్డున కూర్చున్న వాడు ఆ గడ్డిపోచని వెయ్యి రూపాయలకి అమ్ముతుంటే దాన్ని కొనటం స్టుపిడిటీ కాదా? దాన్ని కొనవద్దని చెప్పాల్సిన బాధ్యత లేదా? అది సామాజిక స్పృహ కాదా? మరో మార్గం వెతుక్కోకుండా ఆ గడ్డిపోచ అన్ని మార్గాల్నీ మూసెయ్యటం లేదా?

నమ్మకం వేరు. నమ్మకం గెలుపుకి దారి చూపించాలి. ఎస్కేపిజానికి కాదు.

ఒక సమస్య నించి పారిపోవటం తాత్కాలిక సంతోషాన్ని ఇవ్వొచ్చు గాక. కానీ సమస్యను నిర్మూలించటం శాశ్వతమైన ఆనందాన్ని ఇస్తుంది కదా...! పొడుగ్గా అవటం కోసం కాస్త పొడరు మింగో, చేతికి ఒక రంగురాయి ధరించో, పేరులో ఒక అక్షరాన్ని మార్చో తాత్కాలికంగా సంతృప్తి చెందటం కన్నా... పొడుగ్గా వుండకపోతే నష్టం లేదన్న భావన; కష్టాలని రంగురాయితోనో, అక్షరం మార్పుతోనో ఎదుర్కోవటం కన్నా స్వశక్తితో ఎదుర్కొంటే పరిష్కారం లభిస్తుంది అన్న జ్ఞానసముపార్జనే మంచిది కాదా? ముఖ్యంగా దబ్బుకి ఇబ్బంది ఉన్న వారికి.

***

"పదిహేనేళ్ళు వచ్చినా ఇంకా ఆ బార్బీ బొమ్మను ఉయ్యాలో పడుకోబెట్టి ఊపుతూ చిన్నపిల్లలా ఆ పాటలేం వింటమ్మా?" అని కూతుర్ని మందలించాడు తండ్రి.

"దేవుడ్ని ఉయ్యాలలో వేసి పాటలు పాడుతూ ఊపటాన్ని పదివేలు ఖర్చు పెట్టి వెళ్ళి చూసొచ్చాముగా నాన్నా" అన్నదా అమ్మాయి.

***

చాలాకాలం క్రితం కృష్ణవంశీ "నిన్నే పెళ్ళాడతా" సినిమా తీసాడు. అందులో హీరోయిన్ (టాబు అనుకుంటా) నాగార్జునతో "ఎప్పుడు నువ్వింత హాయిగా నవ్వుతూ ఏ బాదర్బందీ లేకుండా, ఫ్రెష్‌గా ఎలా ఉండగలుగుతున్నావు?" ఒక డైలాగ్ అంటుంది. ఆ డైలాగ్ నాకు చాలా నచ్చింది.

దర్శకుడు కృష్ణవంశీతో ఆ మాట చెప్పినప్పుడు అతడు నవ్వి "ఆ వాక్యం మీ పుస్తకంలోనిదే గురువు గారూ" అన్నాడు. గుర్తొచ్చింది. ప్రియురాలు పిలిచె అనే నవల్లో హీరోకి భవబంధాలు పట్ల, డబ్బు పట్ల అభిప్రాయాలు భిన్నంగా ఉంటాయి. కష్టం, బాధ, పగ, ద్వేషం మొదలైన పదాలు అతడి డిక్షనరీలో ఉండవు.

మనం ఈ విధంగా బ్రతకడం సాధ్యమేనా? పూర్తిగా సాధ్యం కాకపోవొచ్చేమో కానీ ప్రయత్నిస్తే కొంతవరకు మన జీవిత విధానాన్ని మలచుకోవచ్చు. నా మిత్రుడు జనార్ధన మహర్షి (ఇదే పత్రికలో మినీ కవితలు వ్రాస్తున్నాడు) సూచించిన ఒక పద్ధతి నాకు ఎంత బాగా నచ్చిందంటే, చాలా కాలం నుంచీ మనసులో మెదులుతూనే ఉంది.

తాము దోచింది చాలక, భార్యాబిడ్డల్ని కూడా రాజకీయాల్లోకి దింపి, తరతరాలకు డబ్బు సంపాదించి మరణించిన ఒక పొలిటీషియను శవపేటిక వీడియో క్లిప్పింగ్ ఇంటర్నెట్లో చూడండి. దాని ఎదుట అంజలి ఘటిస్తున్న వారిలో మరో దోపిడీదారుని గుర్తించండి. అతడు కూడా మరణించినవాడై ఉండాలి. ఈసారి అతడి శవపేటికపై పూలగుచ్ఛం పెడుతూ నిలబడ్డ మరొక రాబందుని గుర్తుపట్టండి. అతడి శరీరం శ్మశానంలో దహనం కాబడటం చూడండి.



మరణించిన తరువాత వారి స్థితి ఏమిటో, ప్రపంచం వారిని ఎంత తొందరగా మర్చిపోయిందో తెలుస్తుంది.

"కారే రాజులు? వారేరీ? సిరి మూటగట్టుకొని పోవంజాలిరే? భూమిపై బేరైనన్ గలదే" అన్న పద్యం హృదయంమీద ముద్ర వేస్తుంది. తాపత్రయం తొలగించుకోవడానికి ఇదొక ఉత్తమమైన మార్గంగా కనబడుతోంది.

ఎందుకూ పనికి రాని పాత సామాన్లూ, పాత కాలం నాటి పోస్ట్ కార్డులు కూడా తాపత్రయంలో ఇది కూడా ఒక భాగమే. తనకి తెలిసిదంతా చెప్పాలన్న రచయిత తాపత్రయం కూడా మీకు ఈ వ్యాసాల్లో కనబడుతూ ఉంటుంది.

మనిషికి ఎందుకింత తాపత్రయం? అసలు మనం బ్రతికేది ఎన్నాళ్ళు? ఆ మాటకొస్తే ఈ ప్రపంచం బ్రతికేది ఎన్నాళ్ళు? జీవితం క్షణ భంగురం అంటారు. కానీ ప్రపంచం కూడా క్షణ భంగురమే. ధర్మరాజు మార్కండేయుని "మహర్షీ! నీవు చిరంజీవివి. ఎన్నో ప్రళయాలు చూసావు. ఈ లోకాలు ప్రళయకాలంలో ఎలా ఉంటాయి?" అని అడుగుతాడు.

"ధర్మజా! బ్రహ్మాదివసము ఆఖరున తీవ్రంగా ప్రళయకాల ఝంఝామారుతాలు వీస్తాయి. నదులు, సముద్రాలు నిండి పోతాయి. గాఢాంధకారం భూమండలమంతా వ్యాపిస్తుంది. ఈ విధంగా కల్పాంతం ఔతుంది" అంటాడు మార్కండేయుడు.

పెట్రోలు వనరులు అయిపోతున్నాయి. ఈలోపు సూర్యుడినుంచి ఎనర్జీ సృష్టించటం కనుక్కుంటే తప్ప, లేకపోతే మనం నిర్మించుకున్న ఈ వ్యవస్థ అంతా అల్లకల్లోలమయి పోతోంది.

ఇటీవలి కాలంలో మండుటెండలు, చలిగాలులు, సునామీలు కొత్తగా పరిచయమవుతున్నాయి. దాదాపు మూడొందల రకాల జలచరాలు ఇప్పటికే అంతరించిపోయాయి. ఎండ భరించలేని కప్పలు దాదాపు అంతరించి పోతున్నాయి. మీరు గమనించారో లేదో కప్పల బెకబెక శబ్దం ఎక్కడా వినబడటం లేదు. రెండు వందల సంవత్సరాల తరువాత విశాఖ పట్టణం లాంటి పట్టణాలు పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కోబోతున్నాయి. ఇదంతా మనిషి చేసుకుంటున్న స్వయంకృతాపరాధమే. విదురుడు చెప్పిన మాటలు నిజమవుతున్నాయి అనిపించటం లేదూ?

భయపెట్టటం ఉద్దేశం కాదిక్కడ. విరక్తి అన్నా రావాలి లేక భయం అన్నా కలగాలి. అప్పుడే కోరిక నశిస్తుంది. జీవితం చాలా చిన్నది. అనవసర భయాలతో, బలహీనతలతో దాన్ని వృధా పర్చుకోవద్దు. ఉన్నంతలో కాస్త దయాగుణం అలవర్చుకుంటే ఆ తృప్తి అనిర్వచనీయం.

చాలా గొప్పవాళ్ళు అనుకున్న వాళ్ళు ఎంత లేకిగా ప్రవర్తిస్తారో చూడండి. వివిధ రంగాల్లో పేరున్న వారిని అమెరికా వారు ఆహ్వానించినప్పుడు మార్గమధ్యంలో అందరం ఒక రాత్రి న్యూయార్క్ హోటల్లో బస చేయవలసి వచ్చింది. నా ఎదురు గదిలో దక్షిణ భారతదేశపు ప్రసిద్ధ గాయని ఉంది. అప్పటికి నేను చాలా చిన్నవాణ్ణి. ప్రొద్దున్న ఆరింటికి వరండాలో పచార్లు చేస్తూ ఉండగా, ఆమె తలుపు తెరచి "నాకు కొంచెం కాఫీ కావాలి. చెప్పగలవా నాయనా" అని అడిగింది.

"రూమ్ సర్వీస్‌కి ఫోన్ చేస్తే తీసుకు వస్తారండి" అన్నాను. ఆమె "అది నాకు తెలియటం లేదు బాబూ. కొంచెం తెప్పించు" అన్నది.

ఆమె మీదున్న గౌరవంతో నేను నా రూంలోంచి ఫోన్ చేసి చెప్పాను. పది నిమిషాల తరువాత వెయిటర్ బిల్లు తీసుకుని వచ్చాడు. ఆమె దానికి డబ్బివ్వటం లేదనీ, అయిదు డాలర్లు ఇమ్మనీ నన్ను కోరాడు. నేనామెకి ఫోన్ చేస్తే "అదంతా నాకు తెలియదు బాబూ. మనని ఇక్కడకు తీసుకువచ్చిన ఆర్గనైజర్‌లు చూసుకోవాలి" అని ఫోను పెట్టేసింది. అయిదు డాలర్లు ఆ రోజుల్లో నాకు పెద్దది. ఇది నిజంగా ఒక యదార్థ సంఘటన.

"రాగం లేని భోగం. త్యాగం లేని మనస్సు నిరర్థకం" అన్నది జీవిత సత్యాన్ని తెలియజెప్పే జాతీయం. మనకు కావల్సింది పారమార్థిక ఆనందం అన్నప్పుడు ఆ ఆనందాన్ని ఎవరూ సృష్టించలేరు. మనకి మనమే సృష్టించుకోవాలి. ఆనందాన్నిచ్చే ప్రతి సౌందర్యమూ మనసులోంచి వచ్చిందే. మనసు తళతళలాడుతుంటే ప్రపంచమంతా కళకళలాడుతూ ఉంటుంది. ప్రేమకు అదే తొలి మెట్టు. చివరి సోపానం కూడా.

(ఇంకావుంది)

'ప్రేమ ఒక కళ' లేఖలపోటీ



నవ్యవీక్లిలో కొత్తగా మొదలయిన 'ప్రేమ ఒక కళ' శీర్షికను పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. వారం వారం వెలువడుతున్న వ్యాసాలపై వారి ప్రతిస్పందన అద్భుతంగా ఉంటోంది. వారి స్పందనను అభినందిస్తూ పాఠకులను కూడా ఈ వ్యాసావళిలో భాగస్వాములను చేసేందుకు సరికొత్త పోటీని నిర్వహిస్తున్నాం. 'ప్రేమ ఒక కళ' శీర్షికన వారం వారం వెలువడే వ్యాసాలపై మీ అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా పదిలైన్లకు మించకుండా రాసి మాకు పంపండి. ఇ-మెయిల్‌లో కూడా మీ అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఉత్తమలేఖకి వెయ్యిరూపాయలు విలువగల పుస్తకాలను బహుమతిగా అందుకోండి!!

మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా

నవ్యవీక్లి

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్,
హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.

email: weeklynavya@yahoo.com

ఒక పుస్తకం మనిషి జీవితాన్నే మార్చేస్తుంది

ఉత్తమ లేఖ

యండమూరి వీరేంద్రనాథ్ గారి గురించి రాయడమంటే కాస్త బెరుగ్గానే ఉంది. వెన్నెల్లో ఆడపిల్లలను చూపిస్తూ ఆనందోబ్రహ్మ, అనుకునేలా చేసి, విజయ పథంలో ఐదు మెట్లు ఎక్కించేసి, నెంబర్ వన్‌గా నిలవమంటూ భుజంతడుతున్న ఆయన తెలుగువారికి అదృష్ట కానుక. ఒక పుస్తకం మనిషి జీవితాన్ని మారుస్తుందా అని అడిగితే - అందుకు నేనే ఒక ఉదాహరణ. పాతికేళ్ళ క్రితం ఆయన నవలలోని ఒక వాక్యం నా జీవిత గమనాన్నే మార్చి వేసింది. నవ్య, జూన్ 18 సంచికలో ఆయన చెప్పిన ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఎమోషన్ నిజంగా ఒక దివ్య ఔషధం. స్నేహితులైనా, బంధువులైనా ఒకానొక దశలో విడిపోవడం జరిగితే - దుర్భరమైన వేదన. అలా విడిపోయే వాళ్ళు మంచి స్నేహితులెలా అవుతారు. ఇది భగవద్గీత. దుఃఖ కారణం వెతకండి. దాన్ని నిర్మూలించండి. ఇది చాలు. నిజంగా ప్రేమ ఒకకళ.

-నాగేందర్, ఇల్లందు, ఖమ్మం జిల్లా



మీరు మంచి స్నేహితుడేనా?

ఆప్యాయతని ఇంగ్లీషులో ''అఫెక్షన్'' అంటారు. లాటిన్ పదం 'యాడ్‌ఫాసర్' అంటే 'అవతలి వారికి సాయం చేయటం' అని అర్థం. ఎక్కడ ప్రేమ వున్నదో అక్కడ అవతలి వారికి సహాయపడాలనే గుణం ఉంటుంది.

చాలామందికి ప్రేమ ఒక బహిర్గతమైన అవసరం. కొందరికి అది అంతర్గత అవసరం. మొత్తానికి అందరికీ అది అవసరమే. పార్కు ప్రేమ నుంచి మదర్ ప్రేమ వరకూ ఇది వర్తిస్తుంది.

స్నేహంలో గౌరవం ఉండదని, కేవలం ఆత్మీయతే ఉంటుందనీ కొందరు వాదిస్తారు. అన్నివేళలా అది నిజం కాకపోవచ్చు. మంచి స్నేహితుడెప్పుడు అవతలి వారి అభిరుచికీ/ఆత్మగౌరవానికీ మర్యాదిస్తాడు.

క్రమశిక్షణా, ప్రిన్సిపుల్సూ ఉన్నవారికి ఆత్మగౌరవం ఎక్కువ ఉంటుంది. అందుకే ఇద్దరు విజేతల మధ్య స్నేహం అంటీ ముట్టనట్టు ఉంటుంది. సిద్ధాంత విభేదాలూ, అభిప్రాయ బేధాలూ ఎక్కువ ఉండటమే దానిక్కారణం. ఇద్దరు జూదగాళ్ళూ, లేక తాగుబోతులూ కేవలం కామన్ ఇష్టాల ప్రామాణికంగానే స్నేహం చేస్తారు కాబట్టి, కొట్టుకున్నా తిట్టుకున్నా మరుసటి రోజుకి కలిసిపోతారు.

స్నేహించాలన్నా, ప్రేమించాలన్నా ఇద్దరిలో కనీసం ఒకరికి కాస్త అమాయకత్వమో, సర్దుబాటు తత్వమో ఉండాలి. ఈ సూత్రం భార్యాభర్తలకి కూడా వర్తిస్తుంది.

స్నేహం జాగ్రఫీ:

మనుష్యుల మనస్తత్వం భౌగోళిక పరిస్థితులపై ఆధారపడినట్టే, స్నేహం తాలూకు సాంద్రత కూడా ఆ ప్రాంతపు నాగరికత, గత చరిత్రపై ఆధారపడి ఉంటుంది. రాయలసీమ కరువు ప్రాంతం కాబట్టి ప్రజలు పైకి కరుగ్గా ఉంటారు. లోలోపల స్నేహానికి ప్రాణం ఇస్తారు. తెలంగాణా ప్రాంతం బానిసత్వం కింద బ్రతికింది కాబట్టి అక్కడి ప్రజలు అమాయకంగా, లేక విప్లవాత్మకంగా ఉంటారు. కోనసీమ సంపన్నమైన ప్రాంతం కాబట్టి, స్నేహం కన్నా లౌక్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు.

ఎస్కిమోలు చిన్నపిల్లల్లాగే చాలా వేగంగా స్నేహం చేస్తారు. అమెరికన్లకి ఫ్రెండ్‌షిప్ చాలా తేలిక పదం. ఒక్కసారి దూరం అయ్యాక చిన్న పిల్లలు స్నేహితుల్ని ఎంత వేగంగా మర్చిపోతారో, అమెరికన్లూ అలాగే మర్చి పోతారు. రష్యన్లు శతాబ్దాలుగా యుద్ధాలో గడిపిన వారు. కొత్త పరిచయాల పట్ల భయం ఎక్కువ. జర్మన్లకి చాలాతక్కువ మంది స్నేహితులు ఉంటారు.

జండర్ విషయానికొస్తే పురుషుల కన్నా స్త్రీలు తొందరగా సాటి స్త్రీలతో పరిచయం పెంచుకుంటారు.

ఎంతమంది స్నేహితులు ఉండాలి?:

''నువ్వు అందమైన దానివి. నిన్ను చాలామంది ఇష్టపడుతూ ఉండొచ్చు. నేను ఛస్తున్నాను. నా కన్నా చచ్చేవాళ్ళు ఇంకా ఉండొచ్చు....'' అని ముఖేష్ పాట ఒకటుంది. యవ్వనంలో చాలామంది చేత ప్రేమించబడవచ్చు. కనీసం కొన్నైనా నిలుపుకోలేకపోతే, వయసు అయిపోయాక స్నేహాలు కేవలం జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.

కొందరు ఎక్కువమంది స్నేహితుల సర్కిల్లో ఉండటానికి ఇష్టపడితే, కొంతమంది ఒంటరిగా ఉండటానికి మొగ్గుచూపుతారు.

మన పెళ్లికి (పద ప్రయోగానికి క్షమించాలి) ఎక్కువమంది జనాల్ని ఆశిస్తే, మనం కూడా అన్ని పెళ్ళిళ్లకీ వెళ్ళవలసి ఉంటుంది. మనం హాస్పటల్లో ఉన్నప్పుడు ఎక్కువమంది విజిటర్స్ వస్తే సంతృప్తిగానూ, మానసికంగా బలంగానూ ఉంటుంది. కాని ఆ తరువాత వారూ, వారి బంధువులూ ఆసుపత్రిలో ఉన్నప్పుడు పరామర్శించటానికి, మరణిస్తే దహనకార్యాలకు వెళ్ళవలసి ఉంటుంది. రాజకీయ నాయకుడికి, ఇన్సూరెన్స్ ఏజెంట్లకి ఇదంతా చెల్లుతుందేమోకానీ, కెరియర్‌ని మల్చుకొనే వ్యక్తికి మాత్రం అభిలాషణీయం కాదు.

తనకి ఎంతమంది స్నేహితులు కావాలో ప్రతీ వ్యక్తి తానే నిర్ణయించు కోవాలి.

ఒక సినిమా తీస్తున్నప్పుడు దర్శకుడు, హీరో, నటులూ ఎంత గొప్పగా స్నేహితులు అయిపోయినప్పటికీ, సినిమా రిలీజ్ అయిన తరువాత చాలా అరుదుగా కలుసుకుంటారు. వాళ్ళు మళ్ళీ వేరే గ్రూప్‌తో పని చేస్తున్నప్పుడు ఆ సభ్యులు దగ్గిర స్నేహితులు అవుతారు.

నాయకులకి, పెద్దపెద్ద వ్యాపారవేత్తలకి కూడా వృత్తిపరమైన సహచరులు ఉంటారే తప్ప స్నేహితులు తక్కువమంది ఉంటారు. ఇక్కడ ప్రధాన సమస్య 'సమయం'. వ్యాపార నిమిత్తం ఏ ఊరెళ్తే ఆ వ్యక్తులతోనే ఆ సాయం కాలం గడపవలసి ఉంటుంది.


విజేతలు కేవలం గెలుపుతో మాత్రమే స్నేహం చేస్తారు. విజయపు నిచ్చెన ఎక్కుతున్న కొద్దీ స్నేహితులు తక్కువైపోతారు.

స్నేహం అన్నది 'భావాలు పంచుకోవటానికి', 'సమస్యలో ఉన్నప్పుడు ఆదుకోవటానికి' అనేదే నిర్వచనం అయితే, ఒక దేశపు రాష్ట్రపతికి తన భావాలు తీరికగా పంచుకొనేటంత సమయం ఉండదు. వారు సమస్యలో ఉంటే ఆదుకోవటానికి చుట్టూ చాలామంది ఉంటారు.

ఆసుపత్రిలో ఆదరించేది నిజమైన స్నేహితుడే అన్న నిర్వచనం కరెక్టయితే, ప్రముఖ వ్యక్తులు అలాంటి పరిస్థితుల్లో ఉన్నప్పుడు సపర్యలు చెయ్యటానికి కొన్ని వందల మంది సిద్ధంగా ఉంటారు. పాడె మొయ్యటానికి నలుగురైనా నిజమైన స్నేహితులు ఉండాలనేది నిర్వచనమైతే, ఒక నాయకుడి అంతిమ యాత్రకి కొన్ని వేలమంది శ్మశాన వాటికకి హాజరౌతారు. వాళ్ళంతా స్నేహితులు కాదు. అభిమానులు, అనుచరులు.

దబ్బూ, హోదా, కీర్తి, గౌరవం పదవీ పెరిగే కొద్దీ మనం ప్రేమించే వారూ, మన ప్రేమని ప్రకటించడానికి కేటాయించే సమయాలూ తగ్గిపోతాయి. మనని ప్రేమించేవారూ, ప్రేమిస్తున్నట్టు నటించే

ప్రేమ ఒక కళ 13



-యండమూరి వీరేంద్రనాథ్

సెల్: 92465 02662

ఒక అమెరికన్ యూనివర్సిటీ నిర్వహించిన తాజా సర్వే ప్రకారం, రెండు దశాబ్దాల క్రితం ఆత్మీయ విషయాలు, రహస్యాలను పంచుకోవడానికి మనిషికి సగటున ముగ్గురు స్నేహితులు ఉండేవారట. ఇప్పుడది రెండుకి పడిపోయింది. ప్రతీ నలుగురిలో కనీసం ఒకరికి ఒక 'నమ్మకస్తుడైన స్నేహితుడు' లేరని సర్వే వెల్లడించింది.

వారూ పెరుగుతారు.

ఒక అమెరికన్ యూనివర్సిటీ నిర్వహించిన తాజా సర్వే ప్రకారం, రెండు దశాబ్దాల క్రితం ఆత్మీయ విషయాలు, రహస్యాలను పంచుకోవడానికి మనిషికి సగటున ముగ్గురు స్నేహితులు ఉండేవారట. ఇప్పుడది రెండుకి పడిపోయింది. ప్రతీ నలుగురిలో కనీసం ఒకరికి ఒక 'నమ్మకస్తుడైన స్నేహితుడు' లేరని సర్వే వెల్లడించింది. ఐతే మంచి పరిణామం ఏమిటంటే, స్నేహితుల్ని వదిలేసి కుటుంబ సభ్యులతో కాలం గడిపే వారు 50 నుంచి 80 శాతానికి పెరిగారట. స్నేహితులు తగ్గిపోవటానికి కారణాలు.. 'పుస్తకాలతో గడపడం, ఒంటరిగా టీ.వి. ఛాటింగ్, పని ఒత్తిడి, సమయం లేకపోవడం, అన్నిటికన్నా ముఖ్యంగా ఇతరుల మీద విశ్వాసాన్ని కోల్పోవటం' అని సర్వే వెల్లడించింది.

బాధల్లోనూ, అనారోగ్యంలోనూ ఉన్నప్పుడు, మనుషుల ఆర్థిక, మానసిక, శారీరక అవసరాలు రకరకాలు. నిస్సహాయస్థితిలో ఉన్నప్పుడు మనం వీటిని స్నేహితుల దగ్గర నుంచి ఆశిస్తాం. మనం కూడా స్నేహితులకి వాటిని ఇస్తాం. ఇచ్చే శక్తి తగ్గిపోయే కొద్దీ స్నేహితులు కూడా ఆటోమేటిక్‌గా తగ్గిపోతారు.

ఇచ్చే శక్తి మనకి తగ్గిపోయినా, మనకిచ్చే ఆసక్తి ఉన్న వాళ్ళుంటే, అదే నిజమైన స్నేహం.

ఒకరి కష్టాల్లో మరొకరు పాలుపంచుకోవటం, కబుర్లు చెప్పటం, కలిసి సినిమాలకి వెళ్లటం, కలవనప్పుడు ఎస్సెమ్మెస్‌లు పంపటం, కలవగానే సంతోషించడం, దూరమైనప్పుడు మర్చిపోవటం - సాధారణ స్నేహం...!

అవతలి వారు తీర్చలేని బాధలు వారికి చెప్పకపోవటం, పరిష్కరించలేని కష్టాలకు సలహాలు ఇవ్వకపోవటం, తప్పు మార్గాల్ని సరిదిద్దటం, కబుర్లు తగ్గించి కాలం విలువ అవతలివారికి చెప్పటం - నిజమైన స్నేహానికి తార్కాణం.

కొన్నిసార్లు మీ స్నేహితుడు ఇతరులకు సన్నిహితుడై, మీకు దూరం కావచ్చు. మీ స్నేహితుడు మీతో మాట్లాడటం తగ్గించినా, లేక పూర్తిగా మాట్లాడడం మానేసినా, మీనుండి దూరంగా ఉంటున్నా అది అమితమైన బాధ కలిగించటం సహజం. యువతీ యువకులు (ముఖ్యంగా అమ్మాయిలు) దీని గురించి చాలా బాధపడతారు. కొందరైతే తన ఫ్రెండ్ మునపటిలా మాట్లాడటం లేదని ఏడ్చేస్తారు కూడా.

బాధ పడకండి. అటువంటి ఫ్రెండ్ మిమ్మల్ని వదిలేసినందుకు మీరు అదృష్టవంతులని అనుకోండి.

కొన్ని స్నేహాలు, ప్రేమలు ఎంత తొందరగా మొదలవుతాయో అంత వేగం గానూ ముగిసిపోతాయి. ''.... నా స్నేహితుడు (లేక స్నేహితురాలు) అకస్మాత్తుగా నాతో మాట్లాడటం మానెయ్యటం జరిగింది. ఫోన్ నెంబరు మార్చెయ్యటంతో నేను చాలా బాధపడుతున్నాను. కనీసం ఒక మాట చెప్పి ముగింపు పలకవచ్చుగా'' అని ఫిర్యాదు చేసే వాళ్ళు ఎందరో ఉన్నారు.

అయితే దీనికి అవతలివారి వాదన మరోరకంగా ఉంటుంది.

శాశ్వతంగా 'బై' చెప్పి స్నేహానికి ముగింపు పలికేటప్పుడు, అవతలి వారి రియాక్షన్ ఎలా ఉంటుందో తెలియదు. కొందరు 'సర్లే' అనొచ్చు. కొందరు యాసిడ్ పోయొచ్చు.

పాతస్నేహాల వల్ల సంసార జీవితంలో ముందు ముందు కష్టాలు రాకుండా జాగ్రత్త పడటం కారణం అయి ఉండవచ్చు. అందుకే బహుశా కొందరు అడ్రస్సు కూడా ఇవ్వకుండా అకస్మాత్తుగా స్నేహానికి పుల్‌స్టాప్ పెడతారేమో.

మీరెవరైనా ఒక వ్యక్తిని కలిసినప్పుడు, అతనితో సాంగత్యం క్యాజువల్ అయినప్పుడు (ఒక పని కోసం అయినప్పుడు) అవసరమైన దానికన్నా ఎక్కువ స్నేహపూర్వకంగా నటిస్తూ, అవతలి వారికి తప్పుడు ఇంప్రెషన్ ఇవ్వొద్దు. కేవలం మీరు మీ బాధ్యతలని నిర్వహిస్తున్నారని అవతలి వ్యక్తికి తెలిసేలా చెయ్యండి. అనవసరమైన నటన అపోహలని సృష్టిస్తుంది.



మన నటులు విదేశాలకి వెళ్ళినప్పుడు అభిమానులతో చాలా సఖ్యతగా ఉండి వారిచ్చే డిన్నర్లు ఆనందిస్తూ ఉంటారు. అక్కడ సెటిలైనవారు వీరికి గొప్పగా ఆతిథ్యం ఇస్తారు. ఎన్నో ప్రదేశాలకి తిప్పుతారు. వెళ్ళిపోయేటప్పుడు మంచి మంచి గిఫ్ట్‌లు ఇస్తారు. వారు ఇక్కడికి వచ్చినప్పుడు. వీరి నుంచి కూడా అదే ఆప్యాయతనీ, సమయాన్నీ ఆశిస్తారు. కానీ షూటింగ్ బిజీలో ఉన్న నటులు కేవలం విష్ చేసో, పక్కన కూర్చోపెట్టుకుని పావుగంట కబుర్లు చెప్పో పంపించటంతో భంగపాటు చెందుతారు.

ఇందులో నటీనటుల తప్పు ఉన్నదని భావించనవసరం లేదు. వాళ్ళ చెప్పుల్లో కాళ్ళు పెట్టి ఆలోచించాలి.

నేను చాలా చిన్న ఉద్యోగంలో ఉన్నప్పుడు, విదేశంలో పెద్ద వ్యాపారం చేస్తున్న నా బాల్యమిత్రుడు ఇండియా వచ్చాడు. ఖరీదైన హోటల్లో విందు ఇచ్చాడు. ఆ బిల్లు చూసి నాకు అప్పట్లో కళ్లు తిరిగినట్టయింది. బజార్లో మంచి బహుమతి కొనిచ్చాడు. అక్కణ్ణుంచి ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళాం. నన్ను ఇంటి దగ్గర దింపమని చెప్పి, క్యాజువల్‌గా లోపలికి వెళ్ళిపోయాడు. టాక్సీకి ఇవ్వటానికి నా నెల జీతం సరిగ్గా సరిపోయింది. మావాడి తప్పు లేదు. అతడు తన స్థాయిలో ఆలోచించాడు.

మంచి స్నేహితుడి యొక్క లక్షణాలు:

మీ స్నేహితులు మీకు మంచి చేస్తారా లేక చెడు చేస్తారా? 'హితులు' అంటే మంచి సలహా ఇచ్చేవారు. కానీ నేటి సమాజంలో స్నేహం కేవలం గాసిపింగ్, ఎస్ఎంఎస్ మరియు ఇంటర్నెట్ చాట్‌లకు మాత్రమే ఆపాదించబడింది. మీ స్నేహితులు ఎటువంటి వారో చూద్దాం. మీ స్నేహితుల్లో ఈ క్రింది లక్షణాలు ఉన్నాయో లేదో గమనించండి.

నిజమైన స్నేహితుడు మీ క్రమశిక్షణని, విలువల్ని అర్థం చేసుకుంటాడు. మీ సమయానికి ప్రాముఖ్యత ఇస్తాడు. అతడు మీకు ఎంత దగ్గర వాడైనప్పటికీ మిమ్మల్ని కలిసే ముందు అపాయింట్‌మెంట్ తీసుకుంటాడు. మీ సమయంలోకి చొరపడడు. అన్నిటికన్నా ముఖ్యంగా–

1. వింటాడు. ఒక పాయింట్ వద్ద తన వాదనను అదుపు చేస్తాడు.

2. అడగనిదే అనవసరమైన సూచనలు ఇవ్వడు.

3. ముఖ్యంగా పరిష్కారం లేని సమస్యలకు సూచనలు చెప్పడు. కేవలం బాధలను చెప్పుకోవడం వల్ల మీరు స్వాంతన పొందుతున్నారు అని అతనికి బాగా తెలుసు.

4. ''నేను ఇది నీకు చెప్పి ఉండకూడదు కానీ'' అని గానీ ''ఇది నీకు చెప్తే అతను నన్ను చంపేస్తాడు. కానీ నేను నీకు చెప్తున్నాను.'' లాంటి మాటలను ఎన్నటికీ వాడడు.

5. మీ స్వయం నిర్ణయశక్తికి దోహదపడతాడు. పూర్తిగా అతనిపై ఎమోషనల్‌గా ఆధారపడనివ్వడు. అలా చేయడం వల్ల మీ ఎమోషనల్ బ్యాలన్స్ అభివృద్ధి ఆగిపోతుందని అతనికి తెలుసు.


6. అభినందిస్తాడే తప్ప పొగడడు.

మానవ సంబంధాల్లో మంచి, చెడు అనేవి ఏమీ ఉండవు. ఒకరికి నచ్చింది మరొక జంటకి నచ్చకపోవచ్చు. కొంతమంది దుఃఖంలో దగ్గర వాళ్లు తమ పక్కన కూర్చుని ఓదార్చాలని కోరుకుంటారు. మరి కొందరు దుఃఖంలో ఒంటరితనాన్ని అభిలషిస్తారు.

''నా భర్త నన్నెప్పుడూ తిట్టడు, పొగడడు. అదే చాలా చిరాగ్గా ఉంటుంది. ఒక చెంపదెబ్బ వేసినా పర్లేదు. కనీసం కూర బావుందనైనా చెప్పాలిగా'' అని ఒకామె కౌన్సిలరు దగ్గర వాపోయింది.

''మిగతా అన్ని విషయాల్లోనూ భలే బావుం

'ప్రేమ ఒక కళ' లేఖలపోటీ



నవ్యవీక్లిలో కొత్తగా మొదలయిన 'ప్రేమ ఒక కళ' శీర్షికను పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. వారం వారం వెలువడుతున్న వ్యాసాలపై వారి ప్రతిస్పందన అద్భుతంగా ఉంటోంది. వారి స్పందనను అభినందిస్తూ పాఠకులను కూడా ఈ వ్యాసావళిలో భాగస్వాములను చేసేందుకు సరికొత్త పోటీని నిర్వహిస్తున్నాం. 'ప్రేమ ఒక కళ' శీర్షికన వారం వారం వెలువడే వ్యాసాలపై మీ అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా పదిలైన్లకు మించకుండా రాసి మాకు పంపండి. ఇ-మెయిల్‌లో కూడా మీ అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఉత్తమలేఖకి వెయ్యిరూపాయలు విలువగల పుస్తకాలను బహుమతిగా అందుకోండి!!

మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా

నవ్యవీక్లి
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్,
హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.
email: weeklynavya@yahoo.com

టాడు. కోపమొస్తే మాత్రం చేతిలో ఏముందో చూసుకోకుండా కొడతాడు'' అని కోర్టులో మరొకామె విడాకులు కోరింది.

''మీరు కష్టాల్లో ఉన్నప్పుడు స్నేహితులు రాలేదేం? అని బాధపడకండి. రావాలా? వద్దా? అన్నది వాళ్ళ ఇష్టం. ఎప్పుడైతే ఒక అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని స్నేహం చేసామో ఆ మాటకి ద్రోహం చేస్తున్నట్టు'' అంటాడు ఒక ప్రవక్త. నాకు మంచి స్నేహితులు ఉన్నారా? అని ఎప్పుడూ మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోకండి. నేను మంచి స్నేహితుడినా? అని ప్రశ్నించు కోండి. మీరు మంచి స్నేహితులైతే, ఈ క్రింది ప్రశ్నలకు మీకు మీరే సమాధానం చెప్పుకోండి:

1. మీ స్నేహితుడికి మీరు కేవలం సినిమాలకు, గాస్సిప్పింగ్‌కు కాక ఇంక దేనికైనా ఉపయోగపడుతున్నారా? వారి భవిష్యత్తు గురించి మీరిద్దరూ ఎప్పుడైనా చర్చిస్తారా?

2. వారి స్మోకింగ్, డ్రింక్స్, రాష్ డ్రైవింగ్, గ్యాంబ్లింగ్ మొదలైన అలవాట్ల గురించి మందలిస్తారా? లేక అది వారి స్వవిషయమనీ, వారికి ఆ మాత్రం ఆలోచించుకునే విచక్షణ ఉన్నదనీ వదిలేస్తారా?

3. సుదీర్ఘమైన సెల్‌ఫోన్ సంభాషణలు జరుపుతూ ఉంటే వద్దని సలహా ఇస్తారా? తరచూ రెస్టారెంట్లకు వెళ్లడం గురించి, నైట్-అవుట్‌ల గురించి వారిస్తారా?

4. మీ స్నేహితుడిలో మీకు నచ్చని వాటి గురించి ఎప్పుడైనా వారికి చెప్పారా?

5. మిమ్మల్ని ప్రభావితం చేసిన కనీసం ఒక మంచి లక్షణం చెప్పగలరా?

స్నేహానికి ఇలాంటి మాయలన్నీ అవసరమా? కాదు. ఇవి మాయలు కావు. ప్రతీ సంబంధానికీ ఒక వ్యక్తిత్వ లక్షణం ఉంటుంది. దాన్ని బట్టి ఇద్దరు వ్యక్తుల మధ్య స్నేహపు సాంద్రత బలపడుతుంది. ఒక వ్యక్తి 'స్నేహలక్షణం' అతడి అభిరుచుల్లోనూ, సాంగత్యంలోనూ, సమావేశాల్లోనూ, చివరికి ఫోన్ సంభాషణల్లో కూడా ప్రతిబింబిస్తుంది.

అవగాహన:

అయిదు స్వీట్లు తిన్న తరువాత ఆరో స్వీట్ తియ్యగా అనిపించదు. స్వీట్ తిన్న తరువాత తియ్యటి కాఫీ కూడా చేదుగా అనిపిస్తుంది.

నిశ్శబ్ద నీరవం ప్రశాంతంగా బాగుంటుంది. కాని సస్పెన్స్ సినిమాలో అదే నిశ్శబ్దం భయపెడుతుంది.

టీ.వీ. సీరియల్ చూసిన తరువాత చదవటం బోరింగ్‌గా ఉంటుంది.

విత్తనాలు నాటే సమయంలో ఆకాశంలో నల్లటి మేఘం రైతుకి సంతోషం కలిగిస్తుంది. కానీ అదే మేఘం, వరి కోత సమయంలో భయం కలిగిస్తుంది.

పెళ్లి సమయంలో వర్షం ఒక శాపం. హనీమూన్ జంటకి అదే వర్షం ఒక వరం.

సైకాలజీలో పరిచయం చేయబడిన అతి పురాతన పదాల్లో ''అవగాహన'' (పెర్సెప్షన్) ఒకటి.

మన ప్రవర్తన పట్లా మన అవగాహన చాలా ముఖ్యం. మనం ఎప్పుడూ ప్రపంచాన్ని మన కళ్ళద్దాల్లోనే చూస్తాం తప్ప. ఎదుటివాడి కోణం నుంచి చూడటానికి ప్రయత్నించం. ఒక విషయం పట్ల మన జ్ఞానేంద్రియాలు స్పందించినప్పుడు మన అవగాహన ఆధారంగానే ప్రతిస్పందిస్తాం. దీనినే స్వీకారం-జ్ఞానం-ప్రతిస్పందనగా వివరించవచ్చు. జ్ఞానేంద్రియాలు వాస్తవాన్ని ఎలా స్వీకరిస్తాయో చెప్పటానికి ఈ ఉదాహరణ చూడండి.

నాలుగేళ్ళ కొడుకుతో రైలు కోసం ఎదురు చూస్తున్నారు. ఎప్పటి నుంచో కొందామని అనుకుంటున్న పుస్తకం అక్కడ షాపులో కనిపించింది. సంతోషంతో అటువైపు అడుగులు వేశారు. పుస్తకం కొంటూ ఉండగా రైలు కూత వినిపించింది. వేగంగా మీ లగేజీ దగ్గరకు వచ్చారు. అక్కడ పిల్లవాడు లేడు. షాక్ తగిలినట్టు అయింది. అచేతనంగా అలాగే నిలబడిపోయారు. రైలెక్కేటందుకు అందరూ పరుగులు తీస్తున్నారు. మీరు నిస్సహాయంగా ఉండిపోయారు.

ఇంతలో రైలు బయలుదేరుతున్నట్టు మైకులో ప్రకటన వినిపించింది. మీకు దుఃఖం ఒక్కటే తరువాయి. పిల్లవాడెక్కడా కనిపించటం లేదు. కదలడానికి సిద్ధంగా ఉన్నట్టు రైలు కూత వినిపించింది. అప్పుడు కనిపించాడు మీ పిల్లవాడు. ఆట బొమ్మల షాపు వద్ద నిలబడి వాటిని చూస్తున్నాడు. ఒక్క ఉదుటన అక్కడకి వెళ్ళి వాడిని ఒక చేత్తోనూ, లగేజీని మరో చేత్తోను పట్టుకొని కదులుతున్న రైలు కంపార్ట్‌మెంట్‌లోకి లగేజీని, వాడినీ విసిరేసి లోపలికి దూకారు. పిల్లవాడి చెంప మీద పెళ్ళేల్మని కొట్టి ''ఎన్నిసార్లు చెప్పాను నీకు అటూ ఇటూ వెళ్ళొద్దని'' అని అరిచారు.

కొంచెం సేపటికి కోపం తగ్గింది. పిల్లవాడు ఇంకా ఏడుస్తున్నాడు. వాడిని ఓదారుస్తూ ''రైలు రావడం చూడలేదామ్మా? బొమ్మలు ఎప్పుడూ బాగానే ఉంటాయి. కానీ అంతమంది జనంలో నువ్వు నాకు కనబడక పోయుంటే ఏం జరిగుండేది?''

చాలా అద్భుతంగా వాదిస్తున్నారు మీరు. రైలు రావటం పిల్లాడు చూడ లేదు. కాని 'మీరూ' చూడలేదుగా? అంతమంది జనంలో పిల్లాడ్ని వదిలి, మీకు ఇంట్రెస్ట్ ఉన్న పుస్తకాన్ని కొనేటందుకు వెళ్ళటం కరెక్టేనా?

(ఇంకావుంది)

యండమూరి 'ఫీవర్' టాబ్లెట్ అంటే అదీ!

ఉత్తమ లేఖ

యండమూరివారి ఫీవర్ - టాబ్లెట్ థెరపీలో రాకేశ్ లాగానే మా అబ్బాయి కూడా దీప అనే ఒక అమ్మాయిని ప్రేమించాడు. అమ్మాయిని మా ఇంటికి తీసుకువచ్చాడు. అమ్మాయి అందంగా, వినయంగా ఉంది. కానీ ఆమె ప్రవర్తన తెలుసుకోవాలనిపించింది. ఈ తరం అమ్మాయిలకు అత్తమామల పొడగిట్టదు. ఈ అమ్మాయి ఎలా ప్రవర్తిస్తుందో తెలియక మల్లగుల్లాలు పడ్డాం.

మా అమ్మ ఏం చేసిందో, ఎలా చేసిందో గానీ దీప తమ్ముణ్ణి, ఆమె స్నేహితురాలు శ్యామలను వేరు వేరుగా పిలిపించి ఆమె గురించి అడిగి తెలుసుకుంది.

దీప ఇంట్లోనివారంతా కోడళ్ళతో వేరింటి కాపురాలు పెట్టించే టీ వీ సీరియల్స్ ఇష్టంగా చూస్తారని దీప తమ్ముడు చెప్పాడు. కొత్త కోడళ్ళు వేరింటి కాపురాలు పెట్టించడానికి వేసే ఎత్తులూ జిత్తులూ వారు చూసే సీరియల్స్‌లో పుష్కలంగా ఉన్నాయి!

ఇక దీప, శ్యామల బీటెక్ ఒకే రూమ్‌లో ఉండి చదువుకున్నారు. దీప ఎలాంటిదో శ్యామల వివరంగా చెప్పింది. తన మాటే చెల్లాలనే పంతం దీపకు ఎక్కువ. తన పంతం నెగ్గడానికి స్నేహితుల మధ్య కూడా చిచ్చు పెట్టేది దీప. ఇది విన్నతర్వాత మా అబ్బాయి కళ్ళు తెరుచుకున్నాయి. ఆ విధంగా మా కుటుంబం రక్షించబడింది.

మా అమ్మ పెద్దగా చదువుకోకపోయినా, యండమూరివారు నవ్య సంచికలో చెప్పినట్టు వారి 'ఫీవర్' టాబ్లెట్ అంశాలన్నీ మా అమ్మ తనకు తెలియకుండానే పాటించింది అనిపిస్తోంది!

-శుభలక్ష్మి పట్నాయక్, కాకినాడ

స్నేహం ఓ అవసరం ఓ ఆనందం



'ఎవరి సమక్షంలో నువ్వు నువ్వులా ఉంటావో, వారే నీ బెస్ట్ ఫ్రెండ్'' అని ఒక పుస్తకంలో రాశాను. కొంతమంది వ్యక్తులు మన జీవితాలని ఎంత అద్భుతంగా స్పృశిస్తారంటే ఆ తరువాత మనం మామూలుగా ఉండలేము. ఒక అనిర్వచనీయమైన పాజిటివ్ మార్పుకి, అనుభూతికి లోనవుతాము.

మీకలాంటి స్నేహితులెవరైనా ఉన్నారా? లేదా మీరు ఎవరికైనా అలాంటి స్నేహితులా?

లెక్కలు, సైన్సు, మెడిసిన్ లాంటివి మానవజాతి సుఖంగా, సౌఖ్యంగా బ్రతకటానికి దోహదం చేస్తాయి. కానీ ఫిలాసఫీ, లిటరేచర్, ఆర్టు లాంటివి మనిషికి ఆనందాన్ని ఇస్తాయి.

స్నేహం కూడా అంతే.

మెడిసిన్ లాగా అది ఒక 'అవసరం' కాదు. లిటరేచర్‌లాగా అది ఒక 'ఆనందం'.

యుగయుగాలుగా, శతాబ్దాలుగా మానవజాతిని కాపాడింది ఇటువంటి స్నేహమే. జంతువుల్లో కూడా స్నేహం ఉంటుంది కానీ, అది కేవలం తమ 'ప్రే'ని (ఆహారాన్ని) చుట్టుముట్టి చంపటానికి మాత్రమే. కానీ మనుష్యులు అలా కాదు. కష్టాల్లో ఉన్న వ్యక్తుల్ని ఆదుకోవటానికి స్నేహితులెప్పుడూ రెడీగా ఉంటారు. ఆ విధంగా మానవజాతికి స్నేహం అనేది ఒక సర్వైవల్-ఇన్‌స్టింక్ట్‌గా మారింది.

స్నేహం నాలుగు రకాలుగా పరిణితి చెందుతుంది.

1. **ఫేస్‌బుక్ (ఛాటింగ్) స్నేహం:** అవతలి వారెవరో తెలియదు. అయినా కూడా బలంగా స్నేహం చెయ్యాలని, తరచూ మాట్లాడాలని అనిపించటం.

2. **సాధారణ స్నేహం:** తనకి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా నష్టం రానంతవరకు చేసే స్నేహాన్ని ''ఫెయిర్ వెదర్'' ఫ్రెండ్‌షిప్ అంటారు. చిన్నచిన్న సహాయాలు చేసుకోవటం, కర్టసీ కాల్స్, తీరిక వేళలో కబుర్లు చెప్పుకోవటం, భావాలు పంచుకోవటం, మాట సాయం చేయటం, మొదలైనవి ఈ విభాగంలోకి వస్తాయి. దాదాపు 90% స్నేహాలు ఇలాంటివే. పెళ్ళయితే భోజనానికీ, మరణిస్తే శ్మశానానికి వెళ్ళటం లాంటి స్నేహాలన్న మాట.

3. **మంచిస్నేహం:** అవతలివారి కష్టంలో లోతుగా పాలు పంచు కోవటం, ఎమోషనల్‌గా సపోర్ట్ చేయటం, సానుభూతి చూపించటం, అనారోగ్య, ఆర్థిక అవసరంలో సహాయపడుతూ, మరోవైపు అవసరాలు వచ్చినప్పుడు వారి నుంచి సహాయం పొందటం. చాలామంది దీన్నే నిజమయిన స్నేహంగా భావిస్తారు.

4. **ఉత్తమ స్నేహం:** అవతలివారికి సహాయం చెయ్యటం కోసం తాను నష్టపోయినా, ఉదాత్తగుణంతో సరిహద్దులు లేని స్నేహం. ప్రాణానికి ప్రాణం ఇవ్వటం. ఎంత కష్టమైనా, నష్టమొచ్చినా సహాయ పడటం, గాఢమైన స్వచ్ఛమైన స్నేహం. అదే అసలైనది.

కొందరు మెటీరియలిస్టులు ఇటువంటి స్నేహాలు అనవసరం అంటారు. ''...నాకొక మంచిస్నేహితుడు ఉన్నాడన్న నమ్మకం సంతోషాన్నిస్తుంది. కానీ పరీక్షకి ఎందరు నిలబడతారు? ఒక అర్ధరాత్రి మీకు బెస్ట్ ఫ్రెండ్స్ అనుకున్న వారికి ఫోన్ చేసి '... పోలీస్ స్టేషన్‌లో వున్నాను. లాయర్‌ని తీసుకురా' అనో '.... హాస్పిటల్‌లో వున్నాను. అర్జంటుగా 'ఓ' నెగెటివ్ రక్తం కావాలి' అనో చెప్పండి. ఎందరు వస్తారో చూడండి. నిజానికి అలాంటి సాయాలు చేయటానికి స్నేహమే అవసరం లేదు. మానవత్వం చాలు'' అంటారు.


మరి కొందరు, స్నేహానికి అసలు ఇటువంటి పరీక్షలు అనవసరం అనీ, అది అనిర్వచనీయమనీ వాదిస్తారు. ఎవరి భావాలు వారివి.

స్నేహితుల్లో రకాలు

1. **ఇంటిలిజెంట్:** వీళ్ళు సాధారణంగా తమ పని మీదే ఎక్కువ ఏకాగ్రత నిలుపుతారు. నిరంతరం తమకేది లాభమో ఆలోచిస్తూ, కాస్త స్వార్థపూరితంగా, అహంభావంగా కూడా ఉంటారు. అవతలి వారికి తెలియని విషయాలు చెప్పటంలో ఎక్కువ సంతృప్తి పొందుతారు. వినరు. తమ వాదనే నెగ్గాలనుకుంటారు.
2. **అథారిటేరియన్స్:** అవతలివారిని తమ అందంతోనూ, సంస్కారం, చాతుర్యం, ఆకర్షణతోనూ మెస్మరైజ్ చేస్తారు. తెలియకుండానే వారికి అనుచరులు అవుతారు. ఏ రకం దుస్తులు వేసుకోవాలి అన్న విషయం దగ్గిర నుంచి వారే నిర్ణయిస్తారు. అవతలి వారి ఆధీనంలో ఉంటూ, ఎమోషనల్‌గా వారి మీద ఆధారపడ

ప్రేమ ఒక కళ

14



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 92465 02662

టానికి ఇష్టపడే వారికి ఇలాంటి స్నేహాలు బాగుంటాయి.

3. **ఎక్స్‌ప్లాయిటర్స్:** మీ స్నేహితుడు మీ దగ్గిర ఒక పుస్తకం తీసుకొని మళ్ళీ మీకు తిరిగి ఇవ్వడు. మీ బలహీనతమీద ఈ విధంగా ఆడుకుంటాడు. అవతలివాళ్ళతో 'మంచి అనిపించు కుందాం' అనుకొనే వాళ్ళకి ఇలాంటి వారు ఎక్కువ స్నేహితులౌతారు.
4. **దొంగలు:** వీరు మీదగ్గరకు వచ్చి కొంచెం సేపు ఉండి వెళ్ళిపోతే మీ గదిలో ఒక వస్తువు మాయమౌతుంది. వీళ్ళని దొంగలు అంటారు.
5. **బందిపోట్లు:** ఒక దొంగ మీతో స్నేహం చేసినప్పుడు, మీ నష్టం అతడికి లాభం. కానీ బందిపోట్లు మీ పర్సు దొంగతనం చేస్తే, రుజువు దొరకకుండా ఉండేటందుకు దాంట్లో ఉన్న మీ అమ్మగారి ఫొటో చింపి నాశనం చేస్తారు. పూర్వకాలం బందిపోట్లు సాక్ష్యాలు దొరకకుండా ఉండటం కోసం బాటసారుల్ని ఈ విధంగానే చంపే వారు.
6. **సాలె పురుగులు:** హాస్టల్ గదిలో ఇద్దరు అమ్మాయిలు నిలబడి బయటికి చూస్తున్నారు. అవతల వర్షం పడుతోంది. కిటికీలోంచి ఒక అమ్మాయి బయటికి చూస్తూ, ''వర్షం పడుతోంది కదే'' అంటుంది. రెండో అమ్మాయి, ''అవునే చాలా పెద్దవర్షం'' అంటుంది. ''మోకాళ్ళ వరకు నీళ్ళొచ్చాయి'' అంటుంది మొదటి అమ్మాయి. ''అవును బయటికి వెళ్తే తడిచిపోతాము'' అంటుంది రెండో అమ్మాయి. తెలిసిన విషయాన్నే ఇద్దరూ మాటల ద్వారా పంచుకుంటే, వారిని ఈ విభాగంలో చేర్చవచ్చు. ఫీలింగ్స్‌ని పంచుకోవటమే స్నేహం. అందులో ఏ అనుమానం లేదు. కానీ ఈ మనస్తత్వం ఉన్నవారు మాటల విరోచనాల్తో బాధపడుతూ ఉంటారు.
7. **క్రూక్స్:** మీరు లేనప్పుడు పరోక్షంలో మీ గురించి చెడుగా మాట్లాడేవాళ్ళని క్రూక్స్ అంటారు. ఇలాంటి స్నేహితులకి వీలైనంత వరకు దూరంగా ఉండాలి. దొంగలు, బందిపోట్లు కనీసం తమ చర్యల వల్ల తాము లాభపడతారు. కాని వీళ్ళు కేవలం మానసిక సంతృప్తి కోసం చెడుగా ప్రచారం చేస్తారు. కాస్త శాడిజం, మరింత ఆత్మన్యూనత భావం ఉన్న వాళ్ళు ఈ విధమైన క్రూక్స్‌గా తయారవుతారు.
8. **స్పాయిలర్స్:** ''...పద్నాలుగేళ్ళు వచ్చాయి. ఇంకా ఒక్క సిగరెట్ తాగలేదా? పన్నెండేళ్ళు వచ్చాయి. బోయ్‌ఫ్రెండ్ లేడా?'' అని రెచ్చగొట్టి, చెడువైపు మళ్ళించే వారిని స్పాయిలర్స్ అంటారు. జీవితాన్ని ఆనందించడం అంటే వీరికి ప్రత్యేకమైన నిర్వచనాలు ఉంటాయి. మీలో ఉన్న హీరోనో, హీరోయిన్నో నిద్రలేపే ప్రయత్నం చేస్తున్నట్టు కనబడతారు. వారిలాంటి స్నేహితులు ఉన్నందుకు మీరెంతో గర్వంగా ఫీలయ్యే పరిస్థితుల్ని కల్పిస్తారు. వెనక్కి తిరిగి చూసుకుంటే, అప్పటికే బద్ధకం, చెడు అలవాట్లు, మాదక ద్రవ్యాలు అన్నీ అలవాటు అయిపోయి ఉంటాయి.

క్రూక్స్, సాలెపురుగులు, స్పాయిలర్సు ఎంత ఆకర్షణీయంగా ఉంటారంటే, చూడగానే వారితో స్నేహం చెయ్యాలనిపిస్తుంది. బాగా చదువుకునే గ్రామీణ విద్యార్థులు, పట్టణానికి వచ్చిన కొత్తలో, హాస్టల్‌లో స్వేచ్ఛకి కొత్త అర్థాన్ని అనుభవిస్తూ ఇలా పాడవటం మనం చూస్తూనే ఉంటాము.

స్వాత్కోర్ష అనుకోకపోతే, స్నేహితుల ప్రభావం ఎలా ఉంటుందో తెలిపేటందుకు, నా కొడుకు తాలూకు కొందరు స్నేహితులని ప్రస్తావిస్తాను. మొత్తం నలుగురైదుగురు ఉండేవారు. ఒకరు తప్ప మిగతా అందరూ మధ్య తరగతి నుంచి వచ్చిన వారే. ప్రతీ వారాంతంలోనూ వీళ్ళంతా మా ఇంట్లోనే కలుసుకునేవారు. నాకు తెలిసినంతవరకు వాళ్ళలో ఏ ఒక్కరికీ స్మోకింగ్, డ్రింకింగ్, గ్యాంబ్లింగ్ లాంటివి అలవాటవలేదు. వాళ్ళు క్రమంగా ఎదగటం చూసాను. ప్రస్తుతం వాళ్ళలో ఒకరు యుబియయస్ డైరెక్టర్, మరొకరు నాగార్జున ఫెర్టిలైజర్స్ మేనేజింగ్ డైరెక్టర్, మూడో వ్యక్తి ఎర్నెస్ట్ ఎండ్ యంగ్లో పార్టనర్, ఒకరు జెన్ సెక్యూరిటీస్‌లో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్. చివరివాడు బెయిన్ కన్సల్టెన్సీలో ఏడాదికి రెండు కోట్ల పైగా జీతంతో పని చేస్తున్నాడు.

స్నేహరాహిత్యం

'లోన్లీనెస్' అనే పదాన్ని మొట్టమొదటిసారి 1608లో విలియం షేక్స్పియర్ ''కొరియోలేనస్'' అనే నాటకంలో వాడాడు. ఒంటరితనం, ఏకాంతం వేరు. 'నాకెవరూ లేరే' అని బాధ పడటం ఒంటరితనం.



'నాకు నేనున్నాను' అని సంతోషించటం ఏకాంతం.

ప్రకృతి అందాల్ని, గాలి సంగీతాన్నీ, ముఖేష్ పాటనీ, తన ఉనికిని తాను ఆనందించడమే ఏకాంతం.

వ్యక్తుల్ని ప్రేమిస్తే, మనం ప్రేమించినంత గాఢంగా అవతలవారు మనల్ని ప్రేమించటం లేదన్న అనుమానాలు; అభిప్రాయ భేదాలు, సిద్ధాంత విభేదాలు మనల్ని బాధపెడతాయి. ప్రకృతిని ప్రేమిస్తే అటువంటి బాధలేమీ ఉండవు. అందుకే భావకులు నిరంతరం సంతోషంగా ఉంటారు.

మనం ప్రేమించే వ్యక్తి సాంగత్యంలో సంతోషంగా ఉండటం కోసం నిరంతరం కష్టపడటం కన్నా, మనల్ని ప్రేమించే వారి సాంగత్యంలో సంతోషంగా ఉండటం... ప్రేమలో సంతోషం పొందటానికి ముఖ్యసూత్రం.

ఒక అభిరుచి అంటూ లేని వారు వృద్ధాప్యంలో ఒంటరితనంతో బాధపడే అవకాశం ఎక్కువ. చిన్నప్పుడు రికామీగా తిరిగిన కుర్రాడు ఇంటర్‌లో సినిమాల కెళ్ళి, వయసొచ్చాక పబ్‌లలో డాన్స్‌లు చేసి.... చేసి... ఆపైన ఏం చేస్తాడు? యాభై ఏళ్ళు దాటాక? గంటల తరబడి టివి చూడటం, క్లబ్‌లో పేకాడటం, లేదా ఇంకెవరో చెప్పే ప్రవచనాలు వినటం లాంటివి చేస్తాడు. అవీ సంతోషాన్ని ఇచ్చేవే...! కానీ మనమంటూ ఏమీ చేయకపోతే జీవితాంతం ఇంకొకరు కట్టిన ట్యూన్‌కి నాట్యం చేస్తూనే వుంటాం.

చిన్నప్పటి నుంచీ ఒక అభిరుచి పెంచుకున్న వారు దాని వల్ల సంతోషంగా వుంటారు. విశ్వనాథన్ ఆనంద్ (చదరంగం), ఎమ్మెస్ సుబ్బులక్ష్మి (సంగీతం) లాంటి వారెప్పుడూ జీవితంలో రిటైర్ అవలేదు. ఒంటరితనం ఫీలవ్వలేదు.

ఒంటరితనానికి ఈ క్రింది కారణాలు మూలకాలు

1. మానసిక కారణాలు (ప్రాపంచిక ఆనందాల నుంచి సంతోషాన్ని వెతుక్కోలేకపోవటం, రిటైర్‌మెంట్ తరువాత మరే స్కిల్స్ లేక పోవటం వగైరా).
2. సంబంధాల్లో మార్పు (పెళ్ళైన కొత్తలో తొందరగా వచ్చే భర్త తరువాత ఆలస్యంగా రావడం, ప్రేమించిన కొత్తలో చుట్టూ తిరిగిన లవర్ కమిటయ్యాక నిరాసక్తంగా మారటం, చిన్నప్పుడు ఒళ్ళో కూర్చొని గోరుముద్దలు పెట్టించుకున్న పిల్లలు తరువాత స్నేహితులతో తమ కొత్త ప్రపంచాన్ని సృష్టించుకోవటం).
3. బలవంతంగా వేరుపడటం (పిల్లలను చదివించేందుకు భార్యాభర్తలు దూరంగా వుండటం, చదువు కోసం పిల్లలు తల్లిదండ్రుల నుంచి దూరంగా హాస్టల్లో వుండటం)
4. కొత్త వాతావరణం (ఉద్యోగం కోసం కొత్త ప్రదేశానికి వెళ్ళవలసి రావటం).
5. దీర్ఘకాలిక సంబంధం నుంచి వీడ్కోలు (భార్యా లేదా భర్త మరణం, విడాకులు)
6. వయసు (నన్నెవ్వరూ అర్థం చేసుకోవటం లేదని యవ్వనం లోనూ, నన్నెవరూ పట్టించుకోవటం లేదని అని వృద్ధాప్యంలోనూ ఫీలవ్వటం).

ఒంటరితనం మూడు రకాలు. మొత్తం ప్రపంచంతో విడిపోయిన ఒంటరితనం; ఎవరో కొంత మంది వ్యక్తులకు దూరమైన ఒంటరి తనం; నీ నుంచే నువ్వు విడిపోయిన ఒంటరితనం.


మూడోది అన్నిటికన్నా తీవ్రమైనది. ''నీకు నువ్వు స్నేహితుడివి కానంతవరకు ఎవరికీ స్నేహితుడివి కాలేవని'' మాక్స్‌వెల్ పేర్కొంటారు. నీకు నీవు స్నేహితుడివి కావడం అంటే, నీలోని సామర్థ్యాన్ని గుర్తించి, నీలోని లోపాలను క్షమించుకోవడం.

మానసిక ఆనందం సరిగ్గా లేనివారు సినికల్‌గా మారతారు. కరెంటు ఫెయిల్యూరు, క్రికెట్‌లో ఇండియా ఓడిపోవడం, రైలు ఆలస్యంగా నడవడం లాంటి చిన్న చిన్న విషయాలక్కూడా వీరు చిరాకుపడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థనీ, సమాజాన్నీ తిడుతూ ఉంటారు. ఈ దేశంలో పుట్టడమే తమ దురదృష్టంగా భావిస్తారు. వీరిని ఇన్‌ఫెక్టర్స్ అంటారు. వీరితో ఉంటే మనం కూడా వీరిలాగే నిరాశావాదులుగా తయారవుతాము.

ఇన్సులిజం

ఎంతమంది స్నేహితులున్నా మనం ఒక్కోసారి ఒంటరిగా ఫీలౌతాము. ఐతే అది తాత్కాలికం. దీర్ఘకాలికమైన ఒంటరితనాన్ని 'ఇన్సులిజం' అంటారు. ఇన్సులిజంతో బాధపడుతున్న ఒక అమ్మాయి చెప్పిన మాటలివి: ''.... నాకు తప్ప అందరికి స్నేహితులున్నారు. నిజానికి నేనొక మంచి స్నేహితు(రాలిని)డిని కూడా కాను. ఫేస్‌బుక్‌లో ఫొటోలు చూస్తూంటే వాళ్ళంతా స్నేహితులతో ఆనందంగా గడుపుతున్నట్టు అనిపిస్తుంది. నేను కనీసం సరిగ్గా మాట్లాడలేను. ఒకరోజు నా పరిచయస్తుల దగ్గర ఏదో జోక్ వేస్తే 'ఐతే ఏంటి' అన్న సమాధానం వచ్చింది. నా బాధ మరింత ఎక్కువైంది''.

'ప్రేమ ఒక కళ' లేఖలపోటీ



నవ్యవీక్లీలో కొత్తగా మొదలయిన 'ప్రేమ ఒక కళ' శీర్షికను పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. వారం వారం వెలువడుతున్న వ్యాసాలపై వారి ప్రతిస్పందన అద్భుతంగా ఉంటోంది. వారి స్పందనను అభినందిస్తూ పాఠకులను కూడా ఈ వ్యాసావళిలో భాగస్వాములను చేసేందుకు సరికొత్త పోటీని నిర్వహిస్తున్నాం. 'ప్రేమ ఒక కళ' శీర్షికన వారం వారం వెలువడే వ్యాసాలపై మీ అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా పదిలైన్లకు మించకుండా రాసి మాకు పంపండి. ఇ-మెయిల్‌లో కూడా మీ అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఉత్తమలేఖకి వెయ్యిరూపాయలు విలువగల పుస్తకాలను బహుమతిగా అందుకోండి!!

మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా

నవ్యవీక్లి

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్,
హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.
email: weeklynavya@yahoo.com

జోకులు వేస్తూ, స్నేహితులతో నవ్వుతూ గడిపే ఎక్స్‌ట్రావర్ట్‌లు కూడా లోలోపల ఒంటరిగా ఫీలవుతారు. కొంతమంది గుంపులో మాట్లాడుతూ, జోకులు వేస్తున్నా కూడా తను ఆ గ్రూప్‌లో భాగంగా ఫీలవరు. ఇదంతా కూడా ఇన్సులిజం ఛాయలే.

ఉత్సాహమా... సారీ... వెళ్ళిరా... నేను బిజీగా ఉన్నాను:

ఉదాసీనత వైరస్ లాంటిది. ఇలాంటి ఉదాసీనతకి కారణం 'జీవితం రొటీన్' అన్న భావన రోజురోజుకీ ఎక్కువ అవటం.

గృ: నాకు జీవితం చాలా విసుగ్గా ఉంది. చనిపోవాలనిపిస్తుంది.

సై: మీకేదైనా సమస్య ఉందా?

గృ: పెద్ద సమస్యలేమీ లేవు. ఇద్దరు పిల్లలు. ప్రొద్దున్నే స్కూలుకి వెళ్తారు. రాత్రి పదింటివరకూ ట్యూషన్లు ఉంటాయి. భర్త చాలా మంచాయన. కానీ తన ప్రపంచంలోనే బ్రతుకుతారు.

సై: అంటే?

గృ: ఆయన ఒక రోజు ప్రొద్దున్నే ఎనిమిదింటికి ఆఫీసుకి వెళ్ళారు.

సై: అందులో తప్పేముంది.

గృ: ఆ రోజు ఆదివారం అని అక్కడి వాచ్‌మేన్ చెప్తే తిరిగి వచ్చేశారు.

సై: మీ భర్తా, పిల్లలు ఇంట్లో లేనప్పుడు రోజంతా మీరేం చేస్తారు?

గృ: రోజు ఒక సినిమా, మూడు లేక నాలుగు సీరియల్సు చూస్తాను. అది కూడా ఉత్సాహంగా ఉండదు.

సై: మీ రోజువారీ పనులు గురించి చెప్పండి.

గృ: ఉదయాన్నే అందరూ వెళ్ళిపోతారు. నేను ఇంటి పనులు పూర్తిచేసి మధ్యాహ్నం టీ.వీ చూస్తాను. కొంత సేపు ఫోన్లో మాట్లాడతాను. తరువాత పిల్లల్తో బిజీ అయిపోతాను. తినటం, పడుకోవటం. అంతే.

సైకాలజిస్ట్‌కి విషయం అర్థమయింది. విమానాశ్రయాల్లోనూ, రైల్వే స్టేషన్లలోనూ విధ్వంసకర పదార్థాలను పట్టుకోవటానికి 'మెటల్ డిటెక్టర్' ఉన్నట్టే. మనిషిలోని ప్రమాదకర పరిణామాల్ని పట్టుకోవటానికి 'మెటల్ డిటెక్టర్' ఉంటుంది. గృహిణి విషయంలో పిల్లలు ఒక బాధ్యత, భర్త ఒక నిరాసక్తత. ఆ వృత్తం అవతల ఏ సంతోషాలూ లేకపోవడంతో ఆమె 'మెంటల్ డిటెక్టర్' ఫెయిల్ అయిపోయింది.

సైకాలజిస్ట్ ఆమెతో 'మళ్ళీ నెల రోజుల తరువాత కలుసుకుందామని, ఈ లోపు తనకి ఆసక్తి ఉన్న ఏదో ఒక అభిరుచిని గుర్తించమని' చెప్పాడు. మళ్ళీ ఆమె రాలేదు.

ఎందుకు కొంతమంది ప్రయాణికులు రైల్వే టాయిలెట్‌ని క్లీన్‌గా ఉంచరు? ఎందుకు కొంతమంది ఇళ్లలో వంటిల్లు దుర్వాసన వస్తుంది? ఎందుకు ఎంక్వైరీ క్లర్క్ చిరునవ్వుతో సమాధానం ఇవ్వడు? ఎందుకు కొందరు ఉద్యోగులు ఎక్కువసేపు కేంటీన్లో గడిపి, తొందరగా ఇళ్లకి వెళ్ళిపోతారు? ఎందుకు ఈ ప్రపంచంలో మనుష్యులందరూ మెదడుల్ని షార్ప్‌గా, ఫలవంతంగా వుంచుకోరు? ఎందుకు బద్ధకంతో బాధపడుతూ, ఆ అలవాటు నుంచి బయటకు రాలేరు? ఎందుకు కొందరు పని చెయ్యకుండా రిజల్టు వచ్చెయ్యాలని ఆశిస్తారు?

కారణాలు రెండు. ఒకటి: వారి జీవన విధానం ఇటువంటి ఛాలెంజీలని కోరకపోవటం. రెండు: వారి ఆలోచనా విధానంలో 'ఆనందించటం' అంటే, జీవితాన్ని తేలిగ్గా గడిపేయటం.

ఒక ఉద్యోగి వున్నాడనుకొందాం. పిల్లలకు పాఠాలు చెప్తాడు. అది టీచర్ల బాధ్యత అని వాదించడు. పిల్లల బట్టలు ఉతికి, ఇస్త్రీ చేస్తాడు. అది భార్య బాధ్యత అనుకోడు. పుస్తకాలు చదువుతాడు. జనరల్ నాలెడ్జి పెంచుకుంటాడు. గేమ్స్ ఆడతాడు.

మరో బ్యాచిలర్ కంప్యూటర్ ఇంజనీర్ వున్నాడు. మేధావి. ఆఫీసులో అతని తెలివి తేటలకి అందరూ అబ్బురపడతారు. డబ్బులు ఎలా మానేజ్ చేయాలో తెలీదు. నెల చివర్లో బాగా ఇబ్బంది పడతాడు. వంట మనిషిగానీ, పని మనిషిగానీ ఒక రోజు మానేస్తే బ్రతకలేడు. బట్టలు ఉతకడం చేతకాదు. ఇస్త్రీ చేసుకోలేడు.

ఈ వ్యక్తి మొదటి వ్యక్తిగా ఎందుకు మారడు? ఉదాసీనత.

పిల్లల్ని గమనించండి. ఒక పిల్లవాడి కళ్ళలో మెరుపుకి చిన్న చెక్క ముక్క, మూడు వెదురు కర్రలు, ఒక రబ్బరు బంతి చాలు. అంతవరకూ ఎందుకు? నాన్నతో షాపింగ్, అమ్మ చేతిలో చాక్లెట్ చాలు...! అలా కళ్ళు మెరిసే అవకాశం అతనికి రోజుకి పదిసార్లు వస్తుంది. రాజకీయ నాయకుడి కళ్ళలో అలాంటి మెరుపు రావటం కష్టం. ఇరవై నాలుగు గంటల కాలంలో, ఒక వ్యాపారవేత్త కళ్ళలో కనిపించే 'మెరుపుల' కన్నా, అతడి 'బీ.పీ.' ఎక్కువసార్లు పెరుగుతుందంటే మీరు అంగీకరిస్తారు కదా.

గౌతమబుద్ధుడు ఉదాసీనతని జైలుతో పోలుస్తాడు. ''ఒక ఖైదీ చిన్నప్పటి నుంచీ కారాగారంలో ఉన్నాడనుకుందాం. అది పండుగ రోజు. బయట జనాలు చాలా సరదాగా పండుగ గడుపుతున్నారని మిగతా వారు అతనితో చెప్తున్నప్పుడు, దాని గురించి తెలీదు కాబట్టి అతడు మౌనంగా ఉంటాడు. మరుసటి సంవత్సరం జైలు నుంచి బయటికి వచ్చి ఆ పండుగని ఆనందిస్తున్నప్పుడు, అతడు గతాన్ని గుర్తుచేసుకొని కేవలం తన తప్పు వల్ల ఇన్నాళ్ళూ ఇన్ని పండుగల్ని అనుభవించలేకపోయాను అనుకుంటాడు. మనిషి కూడా అంతే. జీవితం అనే పండుగని ఆనందించకపోవటానికి 'నిద్ర మత్తు, సోమరితనం, బద్ధకం' తప్పులు అతని జైల్లో బందీగా ఉంచుతాయి' అంటాడు.

(ఇంకా వుంది)

సాహిత్యంలో యండమూరి నాటౌట్ ఇన్నింగ్స్!

ఉత్తమ లేఖ

క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్‌ది 'సుదీర్ఘమైన ఇన్నింగ్స్'. అతను భారతీయుల ఆరాధ్యదైవంగా వుండడానికి అతని ప్రతిభ కారణమైనా, అభిమానుల ప్రేమ అసలైన కారణం. తెలుగు సాహిత్యంలో అటువంటి నాటౌట్ ఇన్నింగ్స్ కొనసాగిస్తున్న ఎవర్‌గ్రీన్ రచయిత యండమూరి వీరేంద్రనాథ్.

'చీమ కుట్టిన నాటకం' తో ప్రేక్షకులనీ, 'తులసిదళం' తో ఊపిరి సలుపని ఉత్కంఠతో వారం రోజులు నిరీక్షింపజేస్తూ పాఠకులనీ, వ్యక్తిత్వ వికాస రచనలతో భవిష్యత్తు మీ చేతుల్లోనే వుందని యువతనీ అలరింపజేసిన వీరేంద్రనాథ్ రచయితగా ఎప్పటికప్పుడు తన ప్రమాణాలను పెంచుకుంటూ, పరిమాణాలను విస్తృత పరచుకుంటూ 'ప్రేమ ఒక కళ' అని ఏ వారానికి ఆ వారం చెప్తున్నది సీరియల్ రచన కాదు. సీరియస్ రచన. ఆలోచింపజేసే సిద్ధాంత రచన.

మానవాభ్యుదయం కోసం సుఖాన్ని వదిలిన గాంధీజీ వంటి వారే ఋషులని ఈ వారం (జూలై 2,2014) సంచికలో చెప్పడం ద్వారా 'ప్రేమ ఒక కళ' ని యండమూరి కొత్త పుంతలు తొక్కించారు.

'నోబెల్ బహుమతి పొందడం కంటే మహాత్మా గాంధీ జీవించిన కాలంలోనే తానూ జీవించడమే తనకు ఎంతో గర్వకారణం' అని ఐన్‌స్టీన్ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవాలి.

-బోడపాటి కృష్ణవేణి, టి.నగర్, చెన్నై



ప్రేమించేస్తే చాలదు
ఆ ప్రేమను నిలబెట్టుకోవాలి

ఫస్ట్ ఇంప్రెషన్ ప్రతిసారీ బెస్ట్ ఇంప్రెషన్ అవ్వదు. మొదటి ఇంప్రెషన్ గొప్పగా ఉండటం మంచిదే కానీ, ప్రేమకి అది పాస్‌పోర్ట్ మాత్రమే. వీసా కాదు.

స్నేహం సాయంకాలం నీడలా పెరగాలే తప్ప, ప్రొద్దుటి పూట నీడలా తగ్గిపోకూడదు.

అలా పెరుగుతూ పోవాలంటే ప్రేమించిన వ్యక్తిని బాగా చదివి అప్పుడు ప్రేమలో పడాలి. "వ్యక్తిని చదవటం" అంటే వ్యక్తిగత డైనమిక్స్ అర్థం చేసుకోవడం.

కొంతమంది ఈ థియరీ ఒప్పుకోరు. ప్రేమ అనేది ఆటోమాటిక్‌గా జరిగిపోతుంది గానీ, దానికి ఇన్ని లెక్కలుంటాయా అంటారు. ఉండవు. అవసరం లేదు కూడా.

ప్రేమించటానికి ఏ అర్హతా అవసరం లేదు. కానీ ప్రేమని చాలాకాలం పాటు నిలుపుకోవాలంటే మాత్రం కావాలి.

తేడా అర్థం అయిందనుకుంటాను. పెట్టుబడిని పెట్టి ఒక షాపుని తెరవడం సులభం. మూతపడకుండా నడిచేలా చెయ్యటం కష్టం. ప్రేమకి కూడా ఈ సూత్రం వర్తిస్తుంది.

1970 ప్రాంతాల్లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రశ్నలూ-జవాబులూ శీర్షికలో "ప్రేమంటే ఏమిటి?" అని ఎవరో అడిగిన ప్రశ్నకు "అవకాశం" అని నేను ఏకపద సమాధానం ఇవ్వటం ఇప్పటికీ గుర్తుంది. కారణం అందులోని వాస్తవం.

కాలేజీలో అబ్బాయి అమ్మాయిని చూస్తాడు. అమ్మాయి నవ్వుతుంది. మాట్లాడుకుంటారు. ప్రపంచం అద్భుతంగా కనపడుతుంది. హృదయక్షేత్రం మీద ప్రేమబీజం పడుతుంది. అంతేగా.


కాని వారికి పెళ్ళయిన తరువాత, ఆ ప్రేమ వృక్షం పెరగాలంటే మాత్రం ఇద్దరికీ కొంత సామర్థ్యం ఉండాలి. లేకపోతే సైకాలజిస్టుల్నీ, కౌన్సిలర్స్‌నీ, లాయర్లనీ కలుసుకోవలసి వస్తుంది.

అటువంటి సామర్థ్యాన్ని నిర్మించుకునేటందుకు ఆరు నైపుణ్యాలు కావాలి.

1. **శ్రద్ధగా వినటం:** ప్రేమించిన కొత్తలో ఇంప్రెస్ చెయ్యటం కోసం ఎక్కువ మాట్లాడతాం. కానీ అవతలి వారిని అర్థం చేసుకోవాలంటే మాట్లాడటం తగ్గించి, వినటం బెటరు.
2. **స్పష్టంగా గమనించటం:** ప్రేమలో పడబోయే ముందు అవతలి వ్యక్తి మనస్తత్వాన్ని, అలవాట్లని, వ్యక్తిత్వాన్ని స్పష్టంగా గమనించాలి. కానీ ఇది అనుకున్నంత సులభం కాదు. తొలి ఆకర్షణలో ఒక రకమైన మైకం కమ్మేస్తుంది. అది నయనాలకు అంధత్వాన్నీ, కర్ణాలకు బధిరత్వాన్నీ, మెదడుకు మత్తునీ, వంటికి తిమ్మిరినీ కలిగిస్తుంది. అందుకనే కొంతమంది ప్రేమికులు వివాహమైన తరువాత "ఈ వ్యక్తి కోసమా నేను అన్నిటినీ వదులుకున్నది" అని బాధ పడతారు.
3. **మొదటి ఇంప్రెషన్‌ను రెండోసారి పరిశీలించటం:** ఒక వ్యక్తి పరిచయమై, మంచి ఇంప్రెషన్ కలిగి, అది ప్రేమ వైపుకు దారితీస్తోంది అన్న అనుమానం రాగానే ఆ వ్యవహారాన్ని అక్కడితో ఆపి, ఆ ఆకర్షణ వలయం బయటకొచ్చి, బయట వ్యక్తిగా దాన్ని పునః పరిశీలించుకోవాలి. దీన్ని 'బర్డ్స్ ఐ వ్యూ' అంటారు.
4. **ముందే ప్రేమకి లొంగి పోవటం:** "ప్రేమ దాహంతో జీవితపుటెడారిలో అలమటిస్తూండగా ఒయాసిస్సులా ఈ వ్యక్తి పరిచయమవటం జరిగింది. ఈ మాత్రం కూడా నాకెవ్వరూ దొరక్కపోబట్టి నేను ఈ వ్యక్తితో ప్రేమలో పడ్డాను" అన్న పరిస్థితి చాలా దారుణమైనది. బెగ్గర్స్ ఆర్ నో ఛూసర్స్ (అడుక్కుతినేవాళ్ళకి అడిగే అధికారం ఉండదు) అన్న సామెత ప్రేమలో నిజమైతే, అంతకన్నా దౌర్భాగ్యపు స్థితి మరకోటి ఉండదు. అవతలి వారికి 'టోటల్ సబ్మిషన్' అనేది ప్రేమ చివరిలో జరగాలే తప్ప ప్రారంభంలో కాదు.
5. **ప్రేమ vs ఆకర్షణ:** ప్రేమకి ఫెయిల్ అవటం అంటూ ఉండదు. ఆకర్షణకి ఉంటుంది. ప్రేమలో ఉన్న వాళ్ళెవ్వరూ తమది ఆకర్షణ అని అనుకోరు. ప్రేమ అంత బలంగా ఉండటం బాగానే ఉంటుంది కానీ, ఆ కోట బీట వారినప్పుడు ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తుంది. "ఆకర్షణ తగ్గి ప్రేమ పెరిగే వరకూ డిటాచ్‌మెంట్‌తో ఉండండి" అని ఎవరన్నా అనుభవజ్ఞుడైన 'ప్రేమగురూ' చెప్తే ప్రేమికులు అతడి మీద విరుచుకు పడతారు.

15

ప్రేమ ఒక కళ



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 92465 02662


6. **విచక్షణ:** అవతలి వ్యక్తి మనకి ఎంత ఫ్రెండ్ అయినా, ఆ వ్యక్తి దూరంగా ఉంటే మనసు 'అంతగా' బాధపడదు. అదే ప్రేమించిన వ్యక్తి దూరం అయితే అల్లలాడి పోతుంది. స్నేహానికి, ప్రేమకి అదే తేడా. తమది ప్రేమో, స్నేహమో ముందు గుర్తించాలి. స్నేహం నెమ్మది నెమ్మదిగా, కొద్దికొద్దిగా, మల్లెతీవెలా ప్రేమగా మారుతోందని అనుమానం వచ్చినప్పుడు, ఆ ప్రేమ తాలూకు అంతిమ పరిణామం ఏమిటని భవిష్యత్తు గురించి ఒక నిర్దుష్టమైన అభిప్రాయం ఏర్పరచుకోవాలి. చాలామంది పిల్లలు చేసే తప్పు ఇక్కడే.

అవతలి వారి మీద నమ్మకం ఉంటే మంచిదే కానీ కాలక్రమేణా ఆ నమ్మకం మరింత బలంగా మారవచ్చు లేదా బలహీనం అవ్వొచ్చు. ఇద్దరి నమ్మకమూ బలమై. అది వివాహానికి దారి తీస్తే, అది సుఖాంతం....! లేదా, ఇద్దరిలోనూ నెమ్మదిగా బలహీనమై, ఇద్దరూ స్నేహపూర్వకంగా విడిపోతే, చేదు జ్ఞాపకం. అదీ ఒక రకంగా సుఖాంతమే.

అలా కాకుండా, ఒకరి నమ్మకం రోజురోజుకీ బలమై, మరొకరు ఎలా తప్పించుకుందామా అని చూస్తేనే వస్తుంది గొడవ! మౌనపోరాటాలు, యాసిడ్ దాడులూ అప్పుడే జరుగుతాయి.

"నన్ను ప్రేమలోకి దింపి ఆ తరువాత వదిలేశాడు" అని బాధపడే వారిలో మొగవారి కన్నా ఆడపిల్లలే ఎక్కువ. "...ఏదో ప్రేమించేశాం, కాలేజీ డేస్‌లో 'సరదాగా ఒక అనుభవం మిగిలింది' అని దులుపుకు వెళ్ళిపోయే మనస్తత్వం ఉన్న వారికి ఫర్వాలేదు కానీ, నైతిక విలువలపట్ల విలువ లున్న వారూ, సాంప్రదాయాన్ని గౌరవించాలనుకునే సున్నిత హృదయులు మాత్రం పై సూత్రాలు తప్పక పాటించాలి. జాగ్రత్తలు తీసుకోవాలి.

'.. ప్రేమ ఒక పాయసం లాంటిది. దాన్ని ఆనందంగా ఆస్వాదించాలే తప్ప నల్లగా కనబడుతున్నవి ఏలకులా? నలకలా? అని వెతుక్కుంటూ కూర్చుంటే పాయసం యొక్క ఆనందం ఏమి మిగుల్తుంది?" అని కొందరు ప్రశ్నించవచ్చు. నల్లగా కనబడుతున్నవి ఏలకులా - నలకలా - దోమలా? అని తెలుసుకున్నప్పుడే ప్రేమ కలకాలం నిలుస్తుంది.





ప్రేమ-నమ్మకం

స్నేహానికి, ప్రేమకీ పునాది నమ్మకం. ఈ ప్రపంచంలో మిమ్మల్ని ఎంతమంది పూర్తిగా నమ్ముతారు? సమాధానం తెలిస్తే మీరూ ఆశ్చర్యపోతారు. ఒక్కరు కూడా ఉండి ఉండరు. ఎక్కడో ఒక చోట, ఎప్పుడో ఒకప్పుడు మనం ప్రతీ ఒక్కరితోనూ కనీసం ఒక్కసారైనా అబద్ధం చెప్పి ఉంటాము. అలా అబద్ధం చెప్పిన సంగతి చాలా సందర్భాలలో అవతలి వారికి కూడా తెలిసి ఉంటుంది.

వైజాగ్‌కి సంబంధించిన సంఘటన ఇది. ఒక అబ్బాయి, అమ్మాయి పదో క్లాసులో ప్రేమించుకున్నారు. ఇంటర్మీడియెట్‌లో కూడా వారి ప్రేమ నిరాటంకంగా సాగింది. అయితే ఆ తరువాత అమ్మాయికి చెన్నై ఐ.ఐ.టి.లో సీటు వచ్చింది. కుర్రవాడు ఇంటర్ ఫెయిలయ్యాడు. ఎడబాటుని ఇద్దరూ భరించలేకపోయారు. వాళ్ళు మొట్టమొదటిసారి కలుసుకున్నది రాత్రి 7 గంటలకి. సరిగ్గా ఆ సమయానికే అమ్మాయి చెన్నైలోనూ, అతడు వైజాగ్‌లోనూ ఒకేసారి ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నారు. అమ్మాయి మరణించింది. అతడు కనీసం ప్రయత్నం కూడా చెయ్యలేదు. ఆఖరి నిముషంలో భయమేసిందని పోలీస్ ఇంటరాగేషన్‌లో చెప్పాడు.

మీలో ఉండే నమ్మకాన్ని గుర్తించిన వాళ్ళే మంచి స్నేహితులవుతారు. వారితో వీలైనంతవరకూ నిజాయితీగా ఉండండి. వారికి నష్టం జరిగే సందర్భాలలో తప్ప, సదా సత్యమే చెప్పండి.

ప్రేమ - ఈర్ష్య

ప్రేమని చీల్చే క్రిములు ఐదు:

- అపార్థాలు,
- అభిప్రాయ బేధాలు,
- పంతాలు, కోపాలు,
- ఈర్ష్యలు,
- డబ్బు, స్వార్థాలు

ప్రేమంటే నమ్మకం. ప్రేమంటే ఈర్ష్య కూడా. ఈ రెండూ కూడా పరస్పర విరుద్ధమైన స్టేట్‌మెంట్స్ మన ఫ్రెండ్‌కి మరో నలుగురైదుగురు స్నేహితులుంటే పట్టించుకోము. ప్రేమలో మరో లవర్ని మాత్రం సహించలేము.

ప్రేమ, ఈర్ష్య మూడు స్టేజీల్లో పయనిస్తాయి. ఈ మూడు స్టేజీల గురించి ఉదాహరణ ద్వారా బాగా అర్థమౌతుంది.

ప్రేమ ప్రారంభమైనప్పుడు ఈర్ష్య అంతగా ఉండదు. ఒక అబ్బాయి ఒక అమ్మాయిని ప్రేమించిన కొత్తలో ఆ అమ్మాయి స్నేహితురాళ్లతో కలిసి తిరిగినా, మగ స్నేహితుల్తో మాట్లాడినా పెద్దగా పట్టించుకోడు. ఆ అమ్మాయి తాలూకు మగస్నేహితుల టాపిక్ వచ్చినప్పుడు చాలా ఉదాత్తంగా ప్రవర్తిస్తున్నట్టు మాట్లాడతాడు.

కానీ క్రమక్రమంగా కాలం గడిచేకొద్దీ అధికారం, దానితో పాటే ఈర్ష్య కూడా పెరుగుతుంది. అధికారం చూపించడం మొదలుపెడతాడు. కట్టుదిట్టం చేస్తాడు. ఆ అధికారానికి ప్రేమ అని పేరు పెడతాడు. గాఢమైన ప్రేమలో ఉన్నప్పుడు తాను ప్రేమించిన అమ్మాయి ఆడవారితో మాట్లాడుతున్నా, స్నేహితురాళ్లతో సినిమాలకు వెళ్ళినా కూడా భరించలేడు. 'నేను నీ దగ్గర లేనప్పుడు కూడా నువ్వంత ఆనందంగా ఎలా ఉండగలవు' అని ఎక్కడో రాశాను. ఇది రెండో స్టేజి.

మూడో స్టేజ్‌లో 'ఎక్కడున్నా తను నా



మనిషే' అన్న నమ్మకం బలంగా ఏర్పడుతుంది. పరస్పర విశ్వాసాలు గాఢంగా పెనవేసుకుంటాయి.

వచ్చిన చిక్కల్లా రెండో స్టేజి గురించే.

తన గర్ల్‌ఫ్రెండ్ ఫోను చాలా సేపటి నుంచి బిజీగా ఉంటే, ఆ అబ్బాయి కోపం పట్టలేక తిడతాడు. తర్కం లేని అభియోగాలు చేస్తాడు. వ్యంగ్యంగా మాట్లాడతాడు. ఆ అమ్మాయి చెప్పే జవాబులు అసలు వినడు. కన్విన్స్ అవ్వడు.

".... మా అమ్మతో మాట్లాడుతున్నాను" అని చెప్తే "... గంటల తరబడి అమ్మతో మాట్లాడవలసిన అవసరం ఏముంది? నా మిస్డ్ కాల్స్ చూడలేదా?" అని దెప్పి పొడుస్తాడు.

".... నా ఫోను పని చెయ్యడం లేదు" అని చెప్తే "ఆ విషయం కాయిన్ బాక్స్ నుండి ఫోన్ చేసి చెప్పుండాల్సింది" అని నిష్ఠూరమాడతాడు.

"ఫోను మరో ఫ్రెండు దగ్గర ఉంది అని చెప్తే" ... మీ ఫ్రెండ్స్ అందరూ స్టుపిడ్స్. ఫోను కూడా కొనుక్కోలేరా? 'ఇవ్వను' అని నువ్వు ఎందుకు చెప్పలేదు? నీ కోసం నేనిక్కడ ఎదురు చూస్తుంటానని తెలియదా? అయినా ఈ మధ్య నన్ను సరిగ్గా పట్టించుకోవట్లేదు. గమనిస్తూనే వున్నాను. నేను ప్రేమించిన దాంట్లో సగం కూడా నీకు ప్రేమ లేదు" అని తిట్టొచ్చు. మరీ ఆవేశపరుడైతే కొట్టొచ్చు. లేకపోతే ఏడవొచ్చు. ఈ పరిస్థితులలో అమ్మాయి కూడా అంతే ఆవేశ పరురాలైతే "....నువ్వొక ఇడియెట్‌వి. నీతో స్నేహం చెయ్యడం నాదే బుద్ధి తక్కువ..." అని అక్కడి నుంచి వెళ్ళిపోవచ్చు. మళ్ళీ బ్రతిమాలుకోవటాలూ, నిద్రలేని రాత్రులూ మామూలే.

ప్రేమ vs పెద్దలు కుదిర్చిన వివాహాలు

ప్రేమ అనేది రెండు మనసుల సమ్మేళనం అంటారు. అంత గొప్ప కలయిక కేవలం కొన్ని సందర్భాలలో, కొందరి జీవితాల్లో మాత్రమే సాధ్యమౌతుంది. చాలా సంసారాలు సర్దుబాటుగానూ లేదా రెండు భిన్న మనస్తత్వాల సంఘర్షణగానూ కొనసాగుతూ ఉంటాయి. భార్యాభర్తల్లో ఒకరు ఆధిపత్యం చూపించేవారు. మరొకరు విధేయత కలవారు అయితే అది 'సర్దుబాటు' అవుతుంది. లేకపోతే అవతలివారూ లొంగే వరకూ గొడవలు, విమర్శలు, దెబ్బలాటలు సాగుతూనే ఉంటాయి.

చిత్రమేమిటంటే, చాలా దాంపత్యాల్లో '...నేను కాబట్టి సర్దుకుపోతున్నాను' అని ఇద్దరూ మనసులో గొణుక్కుంటూనే ఉంటారు.

ఒక మంచి భార్య, మంచి భర్త కలిసి ఒక మంచి జంట అవుతారనే రూలేమీ లేదు.


పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళలో ఒకరి ఇష్టాయిష్టాలు మరొకరికి తెలియవు. ఊటీకి హనీమూన్ వెళ్తే, నీలగిరి పర్వతాల అందాన్ని భార్య ఆస్వాదించాలనుకోవచ్చు. హోటల్ గది లోనే ఆమెతో సన్నిహితంగా కాలాన్ని గడపాలి అని భర్త అనుకోవచ్చు. అది చాలు ఘర్షణ మొదలవ్వటానికి.

ఒక పౌర్ణమి రాత్రి "... ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధంలో నిదురించు జహాపనా! పండు వెన్నెల్లో, వెండి కొండల్లే.... తాజ్‌మహల్ ధవళ కాంతుల్లో..." అని ఒకరు పాడటం పూర్తవగానే, ".... నా మొహంలా వుంది. 'రాక్-స్టార్', 'రాక్-ఆన్' పాటలు రావా' అని అవతలివారంటే, అది చాలు వారిని దూరం చేయటానికి.

ఇలాంటి ఘర్షణలు ప్రేమపెళ్ళిళ్ళలో కూడా సాధారణమే. ఎరేంజెడ్ మేరేజ్‌లకన్నా ప్రేమ జంటలే తమని ఎక్కువ ఆశ్రయిస్తున్నారని సైకాలజిస్టులు చెప్పినప్పుడు ఆశ్చర్యంగా ఉంటుంది.

ప్రేమికులిద్దరూ కేవలం బాహ్య లక్షణాలను చూసి దగ్గిరవుతారు. పెళ్ళైన తరువాత క్రమక్రమంగా ఆ ముసుగులు తొలగిపోతాయి. లేదా కొత్త అలవాట్లు వస్తాయి. ఒక్కసారి వికర్షణ మొదలైతే ప్రతీ కదలిక నిస్పృహతోనే నిండి పోతుంది. ప్రారంభ దశలో శారీరక అవసరాల వల్ల

"నేను నీకు కాల్ చేసినప్పుడు, ఫోన్‌లో నీ గొంతు బాధగా వినిపిస్తే, ఇన్‌కమింగ్ కాల్ 'నాది' అయినప్పుడు ఎందుకు అలా ఉందని నేను ఇబ్బందిగా ఫీలవుతాను. అదే సంతోషకరంగా ధ్వనిస్తే, నేను నీ ప్రక్కన లేనప్పుడు అది ఎలా సాధ్యం అని నాకు అనుమానం. చూశావా, ప్రేమ ఎప్పటికీ ప్రజల్ని సంతోషంగా ఉండనివ్వదు.



ఇటువంటి ఘర్షణ కప్పబడి పోయినా, కాలక్రమేణా ఈ శూన్యత ఎక్కువ అవుతుంది.

భావోద్వేగాలు సర్వసాధారణం. హేతుబద్ధమైన చర్చల ద్వారా సర్దుబాటు, రాజీ పడటం ఒకటే సరైన మార్గం.

భార్యాభర్తలిద్దరూ తెలుసుకోవలసిన ఒక గొప్ప సూత్రం ఏమిటంటే... అవతలి వారిలో తాము 'తక్కువ' అనుకుంటున్నది వారి తప్పుకాదు. తాము ఎప్పటికీ ఒప్పుకోలేని తమ బలహీనత మాత్రమే.

ప్రేమ-అవగాహన

ఒకే అనుభవానికి ప్రతిస్పందన వేర్వేరు పద్ధతుల్లో ఎలా ఉంటుందో చూద్దాం. ఒక ఇంట్లో భర్త భార్యకి నెల ఖర్చులు సరిగ్గా ఇవ్వడనుకుందాం. గీసిగీసి ఇస్తాడు. జీతం ఎంతో కూడా చెప్పడు. ఈ విషయంలో భార్య ప్రవర్తన నాలుగు రకాలుగా ఉండొచ్చు.

1. భర్తతో గొడవ పెట్టుకోదు. కానీ ఎల్లప్పుడూ ఉదాసీనంగా ఉంటుంది. ఉదాసీనులు తమ మనసులోని భావాలను వ్యక్తీకరించక హక్కులని కోల్పోతూ ఉంటారు. ఇంతకన్నా వేరే దారి లేదు అని అడ్జస్ట్ అయిపోతారు. చుట్టూ ఉన్న వాళ్ళు వీరి బలహీనతకి 'మంచి' అని పేరు పెట్టి పైకి పొగుడతూ,, వీరి బలహీనతలను కేష్ చేసుకుంటారు. వారు తమను పొగిడే విధానాన్ని తమ గొప్పతనంగా భావిస్తూ (ఒకవైపు సంతోషిస్తూ, మరొకవైపు తాము కోల్పోతున్న దానికి చింతిస్తూ) ద్వైదీభావంతో ఈ మొహమాటస్తులు డిప్రెస్ అవుతారు. ఆత్మగౌరవం తక్కువ.

2. భార్య చాలా ఎగ్రెసివ్‌గా ఉంటుంది. "నువ్వు ఇరవై నాలుగ్గంటలూ తాగుతున్నావని మీ పుట్టింట్లో చెపుతాను. క్లబ్బు కొచ్చి నీ స్నేహితుల ముందే నిలదీస్తాను. నన్ను కొట్టావనుకో. కొడుతున్నావని పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ ఇచ్చి నీ బతుకు తెనాలి మురిక్కాలువ చేస్తాను. ఆ తరువాత ఏమౌతుందో నీకూ తెలుసు" అని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తుంది. పై ఉదాహరణలో కాకపోయినా, నిత్య జీవితంలో ఇటువంటి మనస్తత్వం ఉన్న వాళ్ళు తమ హక్కుల పరిధి పెంచుకోవడం కోసం ఇతరుల హక్కుల్ని కాలరాస్తారు. ఆవేశంగా మాట్లాడటం, అవమానించటం, అధికారాన్ని ప్రదర్శించటం వీరి ఆయుధాలు. తమను ఆనందంగా ఉంచటం కోసమే చుట్టూ ఉన్న వారు పుట్టారని వీరు మనస్ఫూర్తిగా నమ్ముతారు.

3. మూడో రకం వాళ్ళు తమ హక్కుల కోసం పోరాడరు. ఆ అసహనాన్ని వేరే మార్గాల్లో చూపిస్తారు. పిల్లల్ని కొడతారు. లేదా టీ.వీలోనో, భక్తి మార్గంలోనో, భజనల్లోనే శాంతి వెతుక్కుంటారు.

4. సానుకూల ఆలోచనా ధోరణులున్న వ్యక్తులు ఇతరులని కించపరచకుండా తమ హక్కులు వెల్లడి చేస్తారు. "... మన రాబడి తక్కువ. పిల్లలు ఎదుగుతున్నారు. నీ ముఖ్యావసరాల కోసం నేను అడ్డు చెప్పను. కానీ మా అవసరాలని కూడా నువ్వు గమనించాలి" అని క్లియర్‌గా చెపుతారు.

చివరి పాయింటు చదివి కొందరికి నవ్వు రావొచ్చు. 'అంత సులభంగా వింటే అతడు మొగుడెందుకు అవుతాడు' అనుకోవచ్చు. ఇక్కడ విషయం సారాంశం అది కాదు. ముందు సానుకూల ధోరణితో ఉండాలి. ప్రతివారూ మన సానుకూలతని అర్థం చేసుకోలేక పోవచ్చు. అప్పుడు హక్కుల కోసం పోరాడాలి. అంతే తప్ప ఆశించింది దొరకలేదన్న కారణంగా డిప్రెషన్లోకి వెళ్ళకూడదు. లేదా దూర్వాసుల్లా మారకూడదు. మనస్తత్వ శాస్త్రంలో, Games people play అన్న అధ్యాయంలోని నాలుగు అంశాలు ఇవి.

మనిషి ప్రశాంతత కోల్పోవటానికి కారణం అనారోగ్య వైవాహిక సంబంధాలు.

మూడు రాత్రుల దాంపత్యంలో ఉండేది దాహం. దాన్ని మూడు నెలల పాటు నిలబెట్టేది మోహం. మూడేళ్ళ కాలంలో అది ఇష్టంగా మారి, ముప్ఫై సంవత్సరాల పాటు అదే సాంద్రతతో నిలవగలిగితే అది ఆప్యాయత. మొదటి రోజు ఉన్నంత బిలాంగింగ్‌నెస్‌తో జీవితపు చివరి రోజు వరకు ఉంటే అదే ప్రేమ.


పెళ్ళి అంటే చేతిలో చేయి వేసుకుని నడవడం అయితే, ఇద్దరూ కుడి చేతినే పట్టుకుని నడుస్తానంటే కుదరదు. ఎవరో ఒకరు అవతలి వారి ఎడమ చేతిలో సర్దుకోవాలి.

ప్రేమంటే ఒకరికొకరు మంచి భవిష్యత్తు ఇవ్వగలమనే నమ్మకం!

భూమి తగాదాల్లో ఒక మోతుబరి తన శత్రువుని చంపేసి జైలుకు వెళ్తాడు. అతడు బెయిలుపై బయటికి రాగానే ఆ ప్రత్యర్థి కొడుకు అతన్ని చంపి తాను జైలుకి వెళ్తాడు. పెళ్ళయి పాతిక సంవత్సరాలైనా ఒకరి తప్పుల్ని మరొకరు ఎత్తి పొడుచుకునే భార్యా భర్తలకీ, ఈ భూస్వాములకీ తేడా లేదు. పబ్లిక్‌లో ఒకరినొకరు అవమానించుకోవటానికి కూడా మీరు సందేహించరు. వీరి సిద్ధాంతం ఒక్కటే. "నేను సంతోషంగా లేను, నిన్ను కూడా సంతోషంగా ఉండనివ్వను".

(ఇంకా వుంది)

'ప్రేమ ఒక కళ' లేఖలపోటీ



నవ్యవీక్లిలో కొత్తగా మొదలయిన 'ప్రేమ ఒక కళ' శీర్షికను పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. వారం వారం వెలువడుతున్న వ్యాసాలపై వారి ప్రతిస్పందన అద్భుతంగా ఉంటోంది. వారి స్పందనను అభినందిస్తూ పాఠకులను కూడా ఈ వ్యాసావళిలో భాగస్వాములను చేసేందుకు సరికొత్త పోటీని నిర్వహిస్తున్నాం. 'ప్రేమ ఒక కళ' శీర్షికన వారం వారం వెలువడే వ్యాసాలపై మీ అభిప్రాయాలను విశ్లేషణాత్మకంగా పదిలైన్లకు మించకుండా రాసి మాకు పంపండి. ఇ-మెయిల్‌లో కూడా మీ అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఉత్తమలేఖకి వెయ్యిరూపాయలు విలువగల పుస్తకాలను బహుమతిగా అందుకోండి!!

మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా
నవ్యవీక్లి
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్,
హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.
email: weeklynavya@yahoo.com

జీవనమార్గాన్ని సరిదిద్దే యండమూరికి హేట్సాఫ్

ఉత్తమ లేఖ

నవ్య వీక్లీ రాగానే నేను మొట్టమొదట చదివేది 'ప్రేమ ఒక కళ'. మధురిమ ముఖచిత్రంతో వెలువడిన తాజా సంచికలో స్నేహం గురించి యండమూరివారు రాసినవ్యాసం ఇంతకు ముందువాటికంటే ఎంతో గొప్పగా ఉంది. మనసులోని కష్టాలు,సంతోషాలు పంచుకోవడానికి స్నేహితులు కరువైపోతున్న రోజులివి. స్నేహం కృత్రిమత్వం సంతరించుకుంది. ఆర్థిక అవసరాలతో ముడిపడిపోతోంది స్నేహం. వ్యక్తిత్వ వికాసం, మానసిక విశ్లేషణ కలగలిసిన ఈ వ్యాసంలో మనం మంచి స్నేహితుడిగా ఉండటానికీ, మంచి స్నేహితుణ్ణి సంపాదించుకోవడానికి, మంచి స్నేహితుణ్ణి తయారు చేసుకోవడానికీ ఎన్నో అద్భుతమైన మార్గాలను చూపించారు. నిజమైన స్నేహితుడు మనల్ని అర్థం చేసుకుంటాడు. మన నిర్ణయాలకు దోహదపడతాడు. ఎన్నో గొప్ప విషయాలు చెప్పి మా జీవనమార్గాన్ని తన రచనలతో సరిదిద్దుతున్న యండమూరికి హేట్సాఫ్!

-టి. లక్ష్మీ రఘునాథశర్మ, శివాలయంవీధి, శ్రీకాళహస్తి



నాన్నతలకి ఎప్పుడైనా నూనె రాశారా?

ప్రేమని ప్రదర్శించడం చిన్నతనం కాదు!

ప్రేమ VS. కామ :

'ప్రేమ దేనినీ ఆశించదు' అంటారు. ప్రేమలో తామేం ఆశిస్తున్నారో లిస్టు వ్రాసుకుంటే, ప్రతి వారికీ కనీసం పది కోరికలు దొరుకుతాయి.

జిడ్డు కృష్ణమూర్తి దృష్టిలో 'ప్రేమ' అనే పదాన్ని మనం వ్యక్తిగతంగానూ, సామాజికంగానూ చాలా సంకుచితంగా అన్వయించుకుంటున్నాం. స్త్రీ పురుషుల మధ్య ఏర్పడే ప్రేమ ఒక ఆకర్షణ మాత్రమే. 'నేను', 'నాది' అనే స్వార్థ భావనకి పరిమితం కాని కరుణతో కూడినది ప్రేమ. ప్రేమకి పరిధి లేదు.

బుద్ధిజంలో 'కామ' అంటే కోరికతో కూడిన ప్రేమ. అది స్వార్థపూరితమైనది. వివేక రహితమైనది. విశ్వజనీయమైన ప్రేమంటే స్వార్థం లేనిది. ఇతరుల బాధలను తగ్గించటానికి దోహదపడేది. సంబంధం లేకపోయినా సేవ చేసేది.

"ఇస్తూనే ఉండు దానాలు. మర్చిపో ఇచ్చాక.
చేస్తునే ఉండు వాగ్దానాలు. మర్చిపో నెరవేర్చాక"

అంటాడు బుద్ధుడు.

కర్ణాటక రాష్ట్రంలో దావణగెరె పక్కన హరపనహల్లి అనే పల్లెటూరుంది. ఆ జిల్లా విద్యాధికారి పేరు వీరన్న జెత్తి. చదువుకునే పిల్లలకి సేవ చేద్దామనే మంచిగుణం ఉంది ఆయనకి. తమ రాష్ట్రం వచ్చి అక్కడ నాలుగైదు గ్రామాల విద్యార్థులకి 'చదువు-ఏకాగ్రత' మొదలైని అంశాలు బోధిస్తే బావుంటుందని, వసతి తాను ఏర్పాటు చేస్తానని, ఫోన్ చేసి చెప్పినప్పుడు ఆయన ఒక మంచి కార్యం మనస్ఫూర్తిగా చేయటం చాలా ముచ్చటేసింది. కర్ణాటక వెళ్ళాను.

మరుసటి రోజు ప్రొద్దున్న ఆ స్కూల్‌లోకి ప్రవేశిస్తున్నప్పుడు హాల్ బయట కేవలం ఇరవై జతల చెప్పులు మాత్రమే ఉండటంతో "ఇంత తక్కువమంది పిల్లల కోసం ఇంతదూరం పిలిచారా?" అని అడిగాను.

"లేదండి. వాళ్ళలో చాలామందికి కాళ్ళకి చెప్పులుండవు" అని ఆయన సమాధానం ఇచ్చాడు. లోపల దాదాపు రెండొందలమంది పిల్లలున్నారు. కాకినాడ సరస్వతి విద్యాపీఠంలో బీద పిల్లలకి చెప్పులు ఇస్తూ వుంటాము. ఆ విధంగా అక్కడ కూడా చేయాలని నిర్ణయించుకుని దావణగెరె నుంచి వ్యానులో చెప్పులు తెప్పించాము.

లోపల రెండొందల మంది పిల్లలు ఉన్నారు. బయట ఇరవై జతల చెప్పులున్నాయి కాబట్టి దాదాపు నూట ఎనభై జతలు సరిపోతాయి అనుకున్నాము.


కొత్త చెప్పులు చూసేసరికి పిల్లలు వాటిమీద ఎగబడ్డారు. రెండొందల జతలు అయిపోగా ఇంకొన్ని తక్కువ వచ్చాయి. ఈ విషయంలో పిల్లల్ని కూడా తప్పు పట్టటం లేదు. కానీ మాకు సహజంగానే కోపం వచ్చింది. ప్రతి సెమినార్‌లోను ఉత్తమ విద్యార్థికి ఇవ్వటం కోసం, సరస్వతి బొమ్మ ముద్రించబడి ఉన్న గోల్డ్ మెడల్ ఒకటి నా దగ్గర ఎప్పుడూ ఉంటుంది. విద్యార్థులందర్నీ నిలబెట్టి ఒక్కొక్కరిని ఆ సరస్వతి బొమ్మ మీద చేయివేసి 'తనకి చెప్పుల జతలేదని అందుకే తీసుకున్నాన'నీ వాగ్దానం చేయమన్నాము. దాంతో ఇరవై జతలు వెనక్కి తిరిగివచ్చాయి.

అయితే ఒక జత తేడా వచ్చింది. మా విద్యాధికారికి పంతం హెచ్చింది. ఇంతమంది పిల్లలు నిజాయితీగా తిరిగి ఇచ్చేసినప్పుడు ఒక జత తేడా ఎలా వస్తుంది? అంటే... వారిలో ఒకరు సరస్వతిని కూడా నమ్మటం లేదన్నమాట. ఈ విధమైన పంతంతో ఆయన మరింత కటువుగా శోధించినప్పుడు ఒక పాప దొరికిపోయింది. చెప్పులుండి కూడా మరొక జత దాచుకొంది.

నిలదీస్తే వెక్కివెక్కి ఏడుస్తూ "నేను వేసుకొచ్చిన చెప్పులు మా అక్కవి. అక్క కొట్టింది కూడా. అయినా ఈ రోజు స్పెషల్ డే అని దెబ్బలాడి వేసుకున్నాను. అందుకే సరస్వతి మీద ఒట్టు వేయమన్నప్పుడు చెప్పులు లేవని చెప్పాను" అంది. మేము చాలా గిల్టీగా ఫీల్ అయ్యాము.

జత చెప్పుల కోసం ఇంట్లో అక్కా చెల్లెళ్ళు దెబ్బలాడుకోవడం, కాళ్ళకు చెప్పుల్లేకుండా ఒక చిన్నపాప పొలాల్లోంచి నడుచుకు రావటం... ఇవన్నీ చదివి మీరు స్పందిస్తే, స్కూలుకు వెళుతున్న పిల్లల కాళ్ళకి చెప్పులు లేకపోతే, ఈసారి ఎప్పుడైనా అక్కడికక్కడే ఒక జతకొని బహూకరించండి. కనీసం ఏడాదికి ఒకసారయినా

ప్రేమ ఒక కళ



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 92465 02662

చేయండి. వాళ్ళ కళ్ళల్లో కనపడే సంతోషం, మీ హృదయంలో ఆనందం నింపుతుంది. ఒక సినిమా ఖరీదు చేయదు మీకది.



తండ్రీ కొడుకుల అనుబంధం (ఒక యదార్థ గాథ):

హాయ్...! నా పేరు రిక్. నా తండ్రి పేరు డిక్. హాస్యాస్పదంగా ధ్వనిస్తుంది కానీ నా జీవితం అంత వినోద భరితమైనది కాదు. గర్భంలో ఉన్నప్పుడు, తల్లి ప్రేవు మెడ చుట్టూ చుట్టుకుపోవడం వల్ల, మెదడుకు సరైన ఆక్సిజన్ అందక నేను Cerebral Palsyతో పుట్టాను.

నేను నడవలేను, మాట్లాడలేను. అలా 'ఉడకబెట్టిన కూరగాయలాగా జీవితాంతం బతకాల్సిందే' అని డాక్టర్లు చెప్పినప్పుడు, మా అమ్మ ఆ వాస్తవాన్ని అంగీకరించటానికి ఇష్టపడలేదు. ఇసుక అట్టతో అక్షరాలను నేర్పించటానికి రాత్రింబవళ్ళు గంటల తరబడి కష్టపడింది. ఆ విధంగా ఆల్ఫాబెట్లు నేర్చుకున్నాను.

ఇంట్లో ఉన్న ప్రతీ వస్తువుపై గుర్తులు పెడుతూ, నాకు కొస్త జ్ఞానం నేర్పటానికి ప్రయత్నించింది. పదకొండేళ్ల వయసులో, ఇతరులతో కమ్యూనికేట్ చేసేందుకు వీలు కల్పించే కంప్యూటర్‌కు అమర్చబడ్డాను. ఈ పరికరం సాయంతో, మొదటిసారి వికలాంగుల స్కూల్‌కు వెళ్లగలిగాను.

ఆ సమయంలో 2007లో ఐరన్ మేన్ మారథాన్ రేస్ టెలివిజన్‌లో చూశాను.

ప్రపంచంలో కెల్లా అతి కష్టమైన ఈ రేస్ మూడు భాగాలుగా సాగుతుంది. సముద్రంలో 4 కిలోమీటర్లు ఈది, వెంటనే సైకిల్ మీద 180 కిలోమీటర్లు వేగంగా పూర్తి చేసి, ఆ తరువాత ఎక్కడా ఆగకుండా 42 కిలోమీటర్లు పరుగెత్తాలి. ప్రొద్దున్న 7 గంటలకు మొదలైతే అర్ధరాత్రి లోపు మొత్తం 17 గంటల్లో మూడూ ముగించేయాలి.

సాధారణ మనుష్యులకు సాధ్యం కాని ఈ ప్రయత్నం చెయ్యాలని నా తండ్రిని, "నాన్నా, నేనీ పోటీలో పాల్గొనాలనుకుంటున్నాను. సహకరిస్తారా?" అని అడిగాను.

ఆయన సందేహించకుండా "యస్" అని చెప్పారు.

ముప్పై ఏడేళ్ల నా తండ్రి రన్నర్ కాదు. చక్రాల కుర్చీలో సిమెంట్ బస్తాను పెట్టుకుని సంవత్సరం కఠిన సాధన చేసారు. తర్వాత మేమిద్దరమూ కలిసి మారథాన్‌కు సిద్ధమయ్యాము.

ప్రథమంగా నన్ను బోట్‌లో కూర్చోపెట్టి, నడుముకు తాడు కట్టుకుని, నా తండ్రి సముద్రంలో 2 గంటల్లో 4 కిలోమీటర్లు లాగారు.

తరువాత తన సైకిల్‌తోపాటు నా సీటర్‌ను లాగుతూ తొమ్మిది గంటల్లో 180 కిలో మీటర్ల దూరం పూర్తి చేసేందుకు తను ఎంత వేగంగా పెడల్స్ తొక్కారో నాకు ఇప్పటికీ గుర్తుంది.

తరువాత నన్ను చక్రాల బండిలో కూర్చోపెట్టి నెట్టుతూ 7 గంటల్లో 42 కిలోమీటర్లు పరిగెట్టారు.

రేస్ ముగియగానే కళ్ళనిండా నీళ్ళతో "నాన్నా! కాళ్ళు లేవన్న విషయాన్ని మర్చిపోయాను. నేను ప్రపంచాన్ని చుట్టి వచ్చినట్టుంది" అన్నాను.



ఒక వ్యక్తి చెయ్యాలనుకుంటే ఏం చెయ్యగలడో నాన్న చూపించాడు. అంతేకాదు. ఒక తండ్రి కొడుకు కోసం ఏమైనా చేస్తాడని నిరూపించాడు.

తల్లితండ్రుల పట్ల, బామ్మా తాతయ్యల పట్ల ఎప్పుడైనా మీరు ప్రేమని ప్రదర్శించారా? నాన్న తలకి కొబ్బరి నూనె రాయడం, బామ్మతో సినిమాకి వెళ్ళడం, వంటింట్లో కూర్చుని అమ్మతో కబుర్లు చెప్పడం వంటి వ్యక్తీకరణల్ని చిన్నతనంగా భావించకండి. ఇవన్నీ అనుబంధాన్ని పెంచేవే. పిల్లలకి అడిగింది కొనివ్వటం ప్రేమకాదు. మంచి టచ్ ఉండాలి.

ఈ నాటి ఈ బంధమీనాటిదే:

ప్రేమ ఒక పవిత్ర బంధం అంటారు. కాదు. బంధం అంటే అటాచ్‌మెంట్. ప్రేమకి అటాచ్‌మెంట్ ఉండదు. ఉండకూడదు కూడా. ప్రేమ ఒక బంధం కాదు. అది స్వార్థరహితం. కొంత మంది దాన్ని పరస్పర ఆధారితం అంటారు. అయ్యుండవచ్చు. ప్రేమకు, బంధానికి మధ్య తేడా తెలుసుకోవటం చాలా కష్టం.

ఓషో ఒక చోట... "ప్రేమించటం అంటే అన్-కండిషనల్‌గా అవతల వారికి లొంగిపోవటం" అంటాడు. "...చిన్న కండిషన్ ఉన్నా సరే అది ప్రేమ కాదు. అలాంటి కండిషన్లు ఉంటే, మీకు మీరే ముఖ్యం అన్నమాట. మీకు మీరే కేంద్రం. మిగతా వాళ్ళు కేవలం మీకు ఆనందాన్ని ఇచ్చే సాధనాలుగా మిగిలిపోతారు. సంతృప్తిని, సంతోషాన్ని పొందేటందుకు వారిని వాడుకుంటున్నారన్న మాట. చాలా మంది మొగవాళ్ళు బంధాలకి ఇష్టపడరు. అందుకే వారు ఎవర్నీ ప్రేమిం

చరు. లేదా, "నేను నా భార్యని తప్ప ఇంకెవర్నీ ప్రేమించను. ప్రేమ వేరు. సెక్సు వేరు. మిగతా వారు కేవలం టైంపాస్" అన్న థియరీని కన్వీనియంట్‌గా బిల్డప్ చేసుకుంటారు..." అంటాడు ఓషో.

అవతలి వారు మనల్ని ప్రేమించాలని ఆశించటం కూడా స్వార్థమే అని నేను 'థ్రిల్లర్' అనే నవల్లో రాశాను. అదే తరువాత "ముత్యమంత ముద్దు" అనే సినిమాగా వచ్చింది. ఆ రోజుల్లోనే అది ఒక ఆఫ్-బీట్ అబ్సర్డ్ సినిమా.



ప్రేమని ప్రదర్శించాలా?

రాబర్ట్ బ్రౌనింగ్ ఒక పద్యంలో "ప్రేయసీ...! నేను నిన్ను ఎలా ప్రేమిస్తున్నాను?... చెప్పే మార్గాలు వెతకనివ్వు" అంటాడు. ప్రేమ అర్థం చేసుకోబడుతుందా? వ్యక్తీకరించాలా? తప్పక వ్యక్తీకరించాలి. ప్రేమని ప్రకటించటానికి రకరకాల పద్ధతులున్నాయి. కరచాలనం చెయ్యటం, కౌగలించుకోవడం, చేతిలో చేతులు వేసుకొని నడవటం, ముద్దు పెట్టుకోవటం మొదలైనవి. ఎస్కిమోలు ముక్కుని ముక్కు మీద రాయటం ద్వారా తమ ప్రేమని ప్రకటిస్తారు. దీన్ని ఎస్కిమో కిస్ అంటారు. ముక్కూ, కళ్ళూ తప్ప మిగతా శరీర భాగాలన్నీ కప్పబడి ఉండడం చేత ఈ విధమైన ఆచారం అమల్లోకొచ్చింది.

"ప్రేమకు సంబంధించిన మీ అనుభవాన్ని ఒకటి చెప్పండి" అని ఒక ఇంటర్వ్యూలో అడిగినప్పుడు చాలామంది అభ్యర్థులు తడబడ్డారు. కొందరి మొహాలు ఎర్రబడ్డాయి. ఒక అమ్మాయి చెప్పిన దానికి కొంత నాటకీయత కలిపి చెప్తాను.

".... నా ఎనిమిదేళ్ల వయసులో ఒకరోజు మా అమ్మ నడుం నొప్పితో ప్రొద్దున్నే పక్క మీద నుంచి లేవలేక పోయింది. నా స్కూలు ఏడింటికి. మా అన్నయ్య నాకన్నా ఆలస్యంగా లేస్తాడు. కానీ ఆ రోజు ముందే లేచి నాకోసం వేడి నీళ్ళు పెట్టి, తల దువ్వాడు. జడేసి, మొహానికి అమ్మ రాసినట్టే పౌడర్ రాసాడు. లంచ్‌బాక్స్‌లో అన్నీ సర్ది నన్ను బస్ స్టాప్‌కి తీసుకొచ్చాడు. మా అమ్మ ప్రతిసారీ నన్ను అక్కడ వదిలేసి వెళ్ళిపోతుంది. కానీ వాడు మాత్రం బస్సు వచ్చేవరకు నిలబడ్డాడు. బస్సు కదులుతూ ఉంటే బస్సుతో పాటూ పరుగెత్తుతూ '... ఏమీ వదలొద్దు. అంతా తిను, సాయంత్రం వచ్చి నా వంట ఎలా ఉందో చెప్పు' అని కిటికీలోంచి అరిచాడు. నేనెప్పటికీ మర్చిపోలేని అనుభవం ఇది" అని చెప్పింది.

చిన్నదైనా, సజీవమైన అనుభూతి ఇది.

కుక్కగానీ, పిల్లిగానీ, గాడిద కానీ పిల్లల్ని ప్రేమిస్తుంది. కానీ మనుష్యులు రకరకాలుగా దాన్ని ప్రదర్శించగలరు. ప్రేమని ప్రకటించడానికి మనిషికి ఇచ్చినన్ని అవకాశాలు ప్రకృతి మరే ప్రాణికీ ఇవ్వలేదు. మాట ద్వారా, వ్రాత ద్వారా, చేత ద్వారా, బాడీ లాంగ్వేజీ ద్వారా ప్రేమని ప్రదర్శించగలిగే సౌలభ్యం కేవలం మనిషికే వుంది. కానీ దురదృష్టవశాత్తూ మనం 'ప్రదర్శనం' మర్చిపోతున్నాం.

పాత బంధాలు కొత్తగా ఉండాలంటే:

ఇతరులచే తానెలా ట్రీట్ చెయ్యబడాలని అనుకుంటాడో, తాను కూడా ఇతరులను అలా ట్రీట్ చేస్తే జీవితం ప్రేమమయం అవుతుంది.

తాను అవతలివారి నుంచి ఏమి ఆశిస్తే, వారికి కూడా అది ఇవ్వాలి. రాత్రి ఆలస్యంగా ఇంటికి వెళ్తే, మనకోసం అక్కడ ఒక వ్యక్తి ఎదురు చూస్తున్నారు అన్న భావనే ప్రేమైతే, అవతలి వారి కోసం మనం కూడా ఎదురు చూడాలి.

తనని ఎవరైనా ప్రేమించాలనే కాకుండా, అది అవతలివారి ద్వారా తెలుసుకోవాలని కూడా ప్రతీ మనిషి అనుకుంటాడు. చిన్నచిన్న గిఫ్టుల నుంచి, రక్తంతో రాసే ఉత్తరాల దాకా ఏదైనా కావొచ్చు. ప్రేమ ప్రదర్శన కేవలం మాటల ద్వారా కాకుండా, చేతల ద్వారా బాగా సాధ్యం అవుతుంది.


టీనేజ్ పిల్లలు తమ తల్లిదండ్రుల పట్ల ప్రేమను ప్రకటించడానికి ఇబ్బందిగానూ, అహంభావంగానూ ఫీలవుతారు. తండ్రి మంచం మీద పడుకొని ఉండగా పక్కన కూర్చోవటం, ఆయన వేళ్ళు చేతుల్లోకి తీసుకుని ప్రేమగా విరుస్తూ మాట్లాడటం, తమ్ముడికి తల దువ్వటం, తాతయ్యతో కబుర్లు చెప్పటం మొదలైన పనులకి తాము వయసు 'మీరిపోయినట్టు' నామోషీగా ఫీలవుతారు.

తల్లితో ఆరోగ్యకరమైన స్నేహంతో, తండ్రి ప్రేమపూరిత మార్గదర్శకత్వంతో, అన్నదమ్ముల ఆప్యాయతతో పెరిగిన పిల్లలు సాధారణంగా 'ఇబ్బంది కలిగించే' బయటి ప్రేమల్లో పడరు.



ప్రేమ ప్రదర్శనకి చాలామంది ప్రాముఖ్యత ఇవ్వక పోవటానికి కారణం 'Take it granted' మనస్తత్వం! అవతలి వ్యక్తి ప్రేమని "టేక్ ఇట్ ఫర్ గ్రాంటెడ్"గా తీసుకున్నప్పుడు ఈ వ్యక్తీకరణ తాలూకు సాంద్రత తగ్గిపోతుంది. దురదృష్టం ఏమిటంటే భార్యా భర్తల మధ్య నిరాసక్తత క్రమంగా పెరగటానికి కారణం కూడా ఇదే. పెళ్ళవక ముందు పది నిమిషాలకు ఒకసారి 'ఐ లవ్యూ' అనుకొనే ప్రేమికులు, భార్యా భర్తలు అయిన తర్వాత ఆ మాట అనటం తగ్గిస్తారు.

స్కూల్ నుంచి ఇంటికొచ్చి, అక్కడి విషయాలన్నీ తల్లి పక్కన కూర్చొని కబుర్లు చెప్పే కుర్రాడు, కాలేజీ స్థాయికి వచ్చాక చెప్పడు. తన వయసుకు తగ్గ చర్య కాదనుకొంటాడు.



ప్రేమని వ్యక్తీకరించటానికి ఒక నవ్వు, చిన్న స్పర్శ చాలు. ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ తల్లిదండ్రులకి ఉత్తరాలు వ్రాయమని టీచర్లు పిల్లల్ని ప్రోత్సహించాలి. కొన్ని భావాలు మాటల్లో చెప్పటం కంటే, రాస్తేనే అందంగా ఉంటాయి.

ఒక తండ్రి తన పాతికేళ్ళ కొడుకు భుజం మీద చేయివేసి మాట్లాడగలిగితే అది అద్భుతమైన ప్రేమ ప్రకటన.

ఇంజనీరింగ్ చదివే కుర్రాడు... అక్క చీర ఇస్త్రీ చేయటం, చెల్లి పక్కబట్టలు సర్దటం, సరదాగా నాయనమ్మ తల దువ్వటం - అన్నీ ప్రేమ ప్రకటనలే.

కొందరు పెద్దలు పిల్లలు అడిగినవన్నీ కొని ఇవ్వటం ప్రేమ అనుకుంటారు. కాదు. ప్రేమ వేరు. గారాబం వేరు.

వీలైనంతవరకూ చిన్నపిల్లల్ని టచ్ చేస్తూ వుండాలి. వారు నిద్రపోతున్నా సరే, 'గుడ్‌నైట్ కిస్' ఇవ్వటం మర్చిపోకూడదు. చిన్నపిల్లల్ని తరచూ హగ్ చెయ్యటం, హత్తుకోవటం, తల నిమరటం, కథలు చెప్పటం లాంటి చర్యలు వారిలో అంతర్లీనంగా వున్న భయాల్నీ కాంప్లెక్సులనీ తొలగిస్తాయి.

బెడ్ టైం స్టోరీస్ చెప్పటం ఇటీవల పూర్తిగా తగ్గిపోయింది. పిల్లల్ని చెరోవైపూ పడుకోబెట్టుకుని చెప్పే కథలు ఆత్మీయతని పెంచుతాయి. ఆలీబాబా నలభై దొంగలు, డేవిడ్ అండ్ గోలియత్, గలివర్, సింద్‌బాద్ సాహసయాత్రల్లాంటి కథలు టీనేజర్స్‌ని కూడా ఆకర్షిస్తాయి.

"మీరు మీ తల్లిదండ్రుల పట్ల ప్రేమను ఎలా వ్యక్తపరుస్తున్నారు?" అని విద్యార్థులని అడిగినప్పుడు చాలామంది '... కష్టపడి చదువుతాము, వారి కలలని నిజం చేస్తాము' అని చెప్తూ ఉంటారు. అది ప్రేమ కాదు బాధ్యత.

ప్రేమను ప్రకటించడం ఎలాగో పెద్దలే పిల్లలకి నేర్పాలి.

ఒక తండ్రి తన పన్నెండేళ్ళ కొడుకుతో "మనం ఈ వేసవి సెలవుల్లో తాతగారింటికి వెళ్ళినప్పుడు మా నాన్నకి నువ్వు తల దువ్వాలి. నాయనమ్మతో క్రికెట్ ఆడాలి" అన్నప్పుడు ఉత్సాహంతో తలూపి 'తప్పకుండా' అనడా?

మీ వయసు ప్రస్తుతం ఇరవై సంవత్సరాలు అయితే ఒకసారి గతం గుర్తు తెచ్చుకోండి. చిన్నప్పుడు ఒడిలో కూర్చోబెట్టుకుని అమ్మ చెప్పిన కథలు, పక్కలో పడుకో బెట్టుకొని నాన్న పుస్తకాలు చదివి వినిపించిన విధానం గుర్తు తెచ్చుకోండి. అవన్నీ తిరిగి మీరు వారికి ఇవ్వాలని అనిపించటం లేదా? అంత పెద్దవాళ్ళయిపోయారా మీరు? మీరు ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నా సరే, అంత గొప్పగానూ ప్రేమని ప్రకటించవచ్చు.

అమ్మ వంట చేస్తూ ఉంటే పక్కన నిలబడి ఉల్లిపాయ తొక్కలు తీస్తూనో లేదా కూరగాయలు కోస్తూనో ఆమెతో మాట్లాడితే, ఆమెకి ఎంత సంతోషంగా ఉంటుందో మీకు తెలియదా? ఆమె సొంతంగా చేసుకోలేదని కాదు కానీ, అప్పుడప్పుడు అలా పనిలో సాయపడితే అది గొప్ప తృప్తినిస్తుంది.

మీకు పాతికేళ్ళు దాటివుంటే...

పక్క మీద నాన్న పడుకుని వుండగా పక్కన కూర్చొని ఇటీవల కబుర్లు చెప్పారా?

చేతివేళ్ళు విరుస్తూ ఆ చప్పుడు ఎంజాయ్ చేశారా? ఎన్ని చిటుక్కుమంటాయో పందెం కట్టారా?

మీరెప్పుడయినా నాన్న తలకి నూనె రాశారా?

ఒక్కసారైనా అమ్మ గోళ్ళు తీసారా?

చెల్లి ముగ్గేస్తూ వుంటే మెట్ల మీద కూర్చొని చూసారా?

మీకు పాతికేళ్ళు వచ్చినా, నాన్న జుట్టుకి రంగెయ్యటం ప్రేమని ప్రకటించే చర్యే.

అమ్మకి గానీ, నాన్నకి గానీ, చెల్లికి గానీ, అన్నకి గానీ ఇటీవలి కాలంలో అమృతాంజనం రాశారా? నాన్న వెన్నుకి మసాజ్ చెయ్యటం శారీరకం రిలీఫ్ కన్నా ఆయనకి గొప్ప మానసిక తృప్తినిస్తుంది.

నాయనమ్మ, మీరూ... ఇద్దరే సినిమాకెళ్తే... ఎలా ఉంది ఈ ఆలోచన? ఇంకెవర్నీ తీసుకెళ్ళకుండా కేవలం నాయనమ్మ ఒక్కర్తెతోనే సినిమాకెళ్ళటం ఒక గ్రాడ్యుయేట్ మనవడు ఆమెకి ఇవ్వగలిగే గొప్ప బహుమతి.

మేరేజ్ డే రోజున అమ్మని, నాన్నని సినిమాకి పంపించి మీరే మొత్తం వంట చేసి, వారొచ్చేసరికి డైనింగ్ టేబుల్ మీద అన్నీ అమర్చి, ఒక కొవ్వొత్తి వెలిగించి ఆహ్వానిస్తే, వాళ్ళ జీవితంలో అదొక మంచి అనుభవంగా మిగిలిపోదా?

డాక్టర్ చదివే కొడుకు అమ్మని కుర్చీలో కూర్చోబెట్టి తాను కింద కూర్చుని, ఆమె చేతులకి గోరింటాకు పెడుతూ చెల్లిని ఫోటో తీయమని, పెద్దయ్యాక డ్రాయింగ్ రూంలో వెంకటేశ్వర స్వామి ఫోటో తొలగించి, ఈ ఫోటో తగిలించి తన కొడుకులకి చూపిస్తే, ప్రేమని అద్భుతంగా ప్రకటించటం అంటే ఏమిటో ఆ తరువాత తరాలకి తెలుస్తుంది.

(ఇంకావుంది)

జీవితాన్ని మలుపు తిప్పిన ప్రేమ ఒక కళ

ఉత్తమ లేఖ

ఏడాది కాలంగా నవ్య చదువుతున్నాను. యండమూరి వారి ప్రేమ ఒక కళ మొదటి నుండీ ఫాలో అవుతున్నాను. ఈ శీర్షిక జీవితాన్ని మలుపు తిప్పింది. ఇది నా స్వీయానుభవం. భార్యాభర్తల మధ్య అన్యోన్యతానుభవం.

వాస్తవానికి మా వారు నన్ను ప్రేమగా చూసుకోవడం లేదు. తిన్నావా? ఉన్నావా? అని ఏనాడూ అడిగినపాపాన పోలేదు. ఎందుకిలా జరుగుతోందని నేను ఏడ్చేదాన్ని. గొడవపడేదాన్ని. అతన్ని అర్థం చేసుకోలేకపోయేదాన్ని. ఇది నా ఒకప్పటి జీవితం. ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నం. నేను వాస్తవాన్ని గుర్తించాను. నేను బెగ్గర్ లాగా అతడి ప్రేమను అడుక్కోవడం ఏమిటి? అని ప్రశ్నించుకున్నాను. నేను మహాదాతను. నా దగ్గర ప్రేమ చాలా ఉంది. కనుక అన్ని సంబంధాల్లో అతడికి ప్రేమను ఇవ్వడం మొదలుపెట్టాను. అతడు తిట్టినా మాట్లాడకుండా నా తప్పు సరిదిద్దుకునేదాన్ని. క్షమించడం, సంయమనంగా ఉండటమే నిజమైన ప్రేమకు అర్థం. 'ఇది ఒక కళ'. ఇప్పుడు నా జీవితంలో పరివర్తన జరిగింది. నాకు ప్రేమ లభిస్తోంది. ఇంత కంటే నాకు ఏం కావాలి? నా అంత అదృష్టవంతురాలు ఈ ప్రపంచంలో ఎవరూ ఉండరు! కావచ్చు అని అప్పుడప్పుడు నాలో ఒకింత గర్వం!

-మాధవి అనుములు, కరిమాబాద్ వరంగల్ జిల్లా-2

ప్రేమ ఒక కళ

17

-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 9246502662





నొప్పించని తానొవ్వని వ్యక్తీకరణే గొప్పకళ

ఆ డాక్టరు అద్భుతమైన సర్జన్. అందులో ఏ మాత్రం సందేహం లేదు. కానీ అతడు వృత్తికి సంబంధించిన వాడు. అంతేతప్ప పేషెంట్స్‌కి కాదు. అవతలివారిని సంతృప్తి పరిచే సంభాషణా చాతుర్యం అతనికి లేదు.

'మాట్లాడటం సిల్వర్... మౌనం బంగారం' అన్న ఇంగ్లీషు సామెత కన్నా మించిన సూక్తి '... సరైన సందర్భంలో సరిగ్గా మాట్లాడటం ప్లాటినం...!' తప్పు సంకేతం వచ్చేలా మాట్లాడటం దారుణం.

"నీ భార్య చనిపోయిందని తెలిసి చాలా సంతోషంగా ఉంది" అన్నాడు ఓ స్నేహితుడు. అసలే భార్య మరణించి రోదిస్తున్న వ్యక్తి ఈ మాటలకు నిర్ఘాంతపోయాడు. స్నేహితుడు కొనసాగించాడు. "నీకు క్యాన్సర్ అనీ, ఇంకో నాలుగైదు నెలలకన్నా ఎక్కువ బ్రతకవని డాక్టర్లు నిర్ధారించారట. పిల్లలు కూడా లేరు కదా. ఎంతో సంతోషంగా ఉంది..." వింటున్న వ్యక్తి సాచి పెట్టి కొట్టాడు.

పై సంఘటనలో స్నేహితుని ఉద్దేశ్యం ఏమిటంటే, "నీవు ఇంకో ఆరునెలల్లో మరణించబోతున్నావు. నీకెలాగో పిల్లల్లేరు. ఇప్పుడు నీ భార్య కూడా మరణించింది. ఆ విధంగా నీకు అన్ని భవబంధాలూ నశించాయి. నీ భార్య ఎంతో అదృష్టం చేసుకుంది కాబట్టే, నీ అంతిమదినాల్లో కష్టాలు చూడకుండా, నీ మరణం తరువాత కష్టాల్ని భరించకుండా, ఈ లోకం నుండి వెళ్ళిపోయింది" ఇది సరిగ్గా చెప్పలేక అతడు ఒక స్నేహాన్ని పోగొట్టుకున్నాడు.

ప్రైవేట్ కమ్యూనికేషన్‌లో నాలుగు అంశాలు దృష్టిలో పెట్టుకోవాలి.

1. మన మూడ్, మాట్లాడటానికి తగిన విధంగా ఉందా?
2. అవతల వారి మూడ్, వినటానికి సరైన స్థితిలో ఉందా?
3. అవతల వారి మూడ్‌ని, మన మాటల్తో మార్చగలిగే పరిస్థితి ఉందా.
4. అవతలవారి పరిస్థితిని బట్టి మన మూడ్ మార్చుకొనే అవసరం ఉందా?

ఈ చివర దాన్ని భావోద్వేగ నియంత్రణ (ఎమోషన్ కంట్రోల్) అంటారు. ఎమోషన్‌లో సంభాషణ పట్ల జాగ్రత్తగా వుండాలి.

మధురం మంచి సంభాషణం

ట్రైన్‌లో ఒక ప్రయాణికురాలు అరగంట సేపు ఆపకుండా తన గురించి చెప్పి చివరికి "మీవారేం చేస్తుంటారు?" అని అడిగింది.

విసిగిపోయిన ఎదురుగా ఉన్నామె "ప్రొద్దున్నే లేచి బ్రష్ చేసుకుంటారు. స్నానం చేసి డ్రస్ వేసుకొని బ్రేక్‌ఫాస్ట్ చేసి ఆఫీసుకు వెళ్తారు. ఆఫీసు నుంచి వచ్చాక కొంచెం సేపు టీ.వీ. చూసి భోజనం చేస్తాము. తరువాత బెడ్‌రూంలోకి వెళ్తాము" అందామె. ఆవిడ బిత్తరపోయి, "ఇదంతా నాకెందుకు చెప్తున్నారు" అంది. "మా వారేం చేస్తుంటారని మీరేగా అడిగారు" అన్నది ఎదురామె. "అవన్నీ నాకెందుకు? ఆయన వృత్తి తెలుసుకుందామని అడిగానంతే" అంది. "అది మాత్రం ఎందుకు?" ఎదురు ప్రశ్న వేసింది ఆ ప్రయాణికురాలు.

ట్రైన్‌లో మూతి ముడుచుకొని సీరియస్‌గా ఉండమని చెప్పటం ఇక్కడ ఉద్దేశం కాదు. కానీ ఊకదంపుడు ఉపన్యాసాలివ్వడం, మరో రెండు గంటల్లో విడిపోతాం అని తెలిసీ తమ అభిప్రాయాలతో అవతలవారిని ఒప్పించటానికి గొంతు చించుకొని వాదించటం అనవసరం. సంభాషణం వేరు. మంచి సంభాషణం వేరు. రైల్లో సమయం గడపడానికి పుస్తకాలు చదవటం, పజిల్స్ నింపటం లాంటి మంచి అభిరుచులు చాలా ఉన్నాయి. రైల్లో సంభాషణల వల్ల కమ్యూనికేషన్ స్కిల్ పెరుగుతుందని కొంతమంది వాదిస్తారు కానీ అందులో ఏ మాత్రం వాస్తవం లేదు.

విద్యార్థులు గుర్తించని నిజం ఏమిటంటే,

మూడేళ్ళ పాపకి ఆరు గంటల పాటు అత్యంత క్లిష్టమైన మెదడు ఆపరేషన్ చేసి ఒక న్యూరో సర్జన్ థియేటర్ నుంచి వస్తూంటే, గది బయట నిలబడ్డ తల్లిదండ్రులు ఎలా ఉందని ఆత్రంగా అడిగారు.

అలసటతో పాటు మొహంలో విజయగర్వం తొంగి చూస్తుండగా, "రేర్ కేస్. చాలా కాంప్లికేటెడ్ సర్జరీ... మీ అబ్బాయి తొందరలోనే కోలుకుంటాడు" అన్నాడు సర్జన్.

షాక్‌తో తల్లిదండ్రులు "అబ్బాయి కాదు.. అమ్మాయి.. అమ్మాయి" భయంగా అరిచారు.

మరో క్లిష్టమైన ఆపరేషన్ చేయటానికి వెళ్ళేముందు కాఫీ తాగటం కోసం హడావిడిగా కేంటీన్ వైపు నడుస్తూ "ఓహ్! అమ్మాయి కదూ, అవును. అమ్మాయి... ఆపరేషన్ మొత్తం వీడియో తీశాము. స్టూడెంట్స్‌కి బాగా ఉపయోగపడుతుంది. మీ అమ్మాయిని పది రోజుల్లో డిశ్చార్జి చేస్తారు" అన్నాడు.

ప్రేమించటానికి అవతలివారి అభిప్రాయాల్తో ఏకీభవించనవసరం లేదు. ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి అభిప్రాయాలూ ఒకలా ఉండవు. కానీ, అభిప్రాయ భేదం వేరు. గొడవ వేరు. అవతలివారి అభిప్రాయం గానీ, ప్రవర్తన గానీ, పని గానీ నచ్చకపోతే, గొడవ పడకుండా తన భావాన్ని చెప్పగలగటం, ప్రేమకి సంబంధించిన ఒక గొప్ప కళ.

'అనవసరమైన' సంభాషణ ఎంత ఆనందాన్ని ఇస్తుందో, 'అవసరమైన' సంభాషణ కూడా అంతే ఆనందాన్ని ఇస్తుంది. ఒక ఉదాహరణ ద్వారా దీన్ని పరిశీలిద్దాం.

రాంబాబు మహేష్ ఫ్యాన్. 'పోకిరీ' సినిమా చూసొచ్చి సోంబాబుకి ఫోన్ చేసాడు. కథ పూర్త య్యేసరికి రాత్రి పన్నెండయింది. సోంబాబు ప్రభాస్ ఫ్యాన్. మరుసటి రోజ 'డార్లింగ్' సినిమా చూసి స్నేహితుడికి కథ చెప్పాడు. ఒంటి గంట అయింది. ఇద్దరూ ఆ విధంగా ఆరు గంటలు టైమ్ వేస్ట్ చేసుకున్నారు.

ఇదే సంభాషణ ఇంకోలా ఊహిద్దాం... "విలన్‌తో హీరోయిన్ పెళ్ళి ఇంకో రెండు గంటల్లో జరగబోతోంది. దాన్ని ఆపటం కోసం ప్రభాస్ వంతెన మీద ఉరుకులూ పరుగుల్తో వస్తుండగా, కట్టటానికి తెచ్చుకున్న మంగళసూత్రం కాలువలో పడిపోయింది. ప్రవాహ వేగం గంటకు 5 మైళ్ళు ప్రభాస్‌కి ఈత రాదు. మిత్రుడు మహేష్ బాబుకి ఫోన్ చేసాడు. మహేష్ ఆగమేఘాల మీద (సారీ.. మోటార్ సైకిల్‌మీద) వచ్చేసరికి సరిగ్గా అరగంట పట్టింది. నీళ్ళల్లో దూకి.. గంటకి పది మైళ్ళ వేగంతో ఈదుకుంటూ వెళ్ళి మంగళసూత్రం తెచ్చాడు. తరువాత వాళ్ళిద్దరూ పెళ్ళి మండపానికి వెళ్ళటానికి పది నిమిషాలు పట్టింది. హీరోలిద్దరూ పెళ్ళి ఆపగలిగారా లేదా? ఇదీ లెఖ్ఖ..." అని అడిగాడు.



"నీళ్ళలో పడిన మంగళసూత్రం ముఖ్యమా? ప్రియురాలి పెళ్ళి ఆపటం ముఖ్యమా? మంగళసూత్రం నీళ్ళలో కొట్టుకుపోతుందా? మునిగిపోతుందా?" అని జోకులేసుకుంటూ ప్రోబ్లం సాల్వ్ చేశారు. మహేష్‌బాబు నీటిలో దూకే సమయానికి, పర్సు 2.5 మైళ్ళు వెళ్ళిపోయింది. అతడు దాన్ని ('ఈత వేగం' మైనస్ 'బ్యాగు వేగం'తో వెళ్ళి) పట్టుకోవటానికి అరగంట, తిరిగి రావటానికి మరో అరగంటా పడుతుంది.

ఇలా చేస్తూంటే రాంబాబు "తిరిగి వస్తూంటే మహేష్ ప్రవాహానికి ఎదురు ఈదాలి కాబట్టి వేగం తగ్గిపోతుంది కదా" అన్నాడు. మరుసటిరోజు ఇద్దరూ తండ్రి దగ్గరకో, టీచర్ దగ్గరకో వెళ్ళి తమ డౌట్ నివృత్తి చేసుకున్నారు. ఇది కూడా బాగానే ఉంది కదా.

ఇక్కడ ఉద్దేశం "ఎప్పుడూ చదువే" అని కాదు. ఇలా కూడా టైం పాస్ చేయవచ్చు కదా అని..! దీనివల్ల లెక్కల్లో ఉండే ఉత్సాహం తెలుస్తుంది. 'ఆర్థర్ క్లార్క్' చదివితే ఆస్ట్రానమీ, 'ఆసిమోవ్'ని చదివితే సైన్సు ఎంత బావుంటుందో తెలుస్తుంది. మల్లాది వారి గిరిజా కల్యాణంలో 'చిలుక తత్తడి రౌత' అంటే మన్మధుడని తెలిస్తే, తెలుగు ఇంత బావుంటుందా అనిపిస్తుంది. మొత్తానికి 'చదువు'లో ఉండే ఆనందం తెలుస్తుంది. బుద్ధి వికసిస్తుంది.

దృక్పథం

దృక్పథం, అవగాహన వేర్వేరే గానీ ఒకదానితో ఒకటి ముడిపడి వుంటాయి. మీ స్నేహితుడితో మీకు వచ్చిన గొడవ శాశ్వతంగా మీ ఇద్దరినీ విడదీయవచ్చు. లేదా మీ ఇద్దరినీ అంతకుముందు కన్నా బలంగా కలపవచ్చు. అవగాహనకి, దృక్పథానికి ఉన్న సంబంధానికి ఇంతకన్నా పెద్ద ఉదాహరణ ఏం కావాలి?

ఇద్దరు మనుష్యుల మధ్య గానీ, భార్యాభర్తల మధ్యగానీ ప్రేమ తగ్గిపోవటానికి కారణం వాళ్ళ దృక్పథాల్లో తేడా ఎక్కువ అవటమే.

భార్య: అమ్మ ఉత్తరం రాసారు. ఇల్లు బాగు చేయించుకునేందుకు 5 లక్షలు కావాలట.

భర్త: మనకు చాలా ఖర్చులున్నాయి. సమ

స్యను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. వాళ్ళకున్న ఒక్క బిడ్డవు నువ్వేననీ, నువ్వు కూడా సంపాదిస్తున్నావని తెలుసు. కానీ అంత అర్జెంట్ ఏముంది.

భార్య: మా అమ్మ కాదు. మీ అమ్మ...!

భర్త: అవునా! చాలా కాలం క్రితమే ఇల్లు లీకవుతోందని చెప్పింది.... వాళ్ళు ఇంకెవరిని అడుగుతారు? ఒకే ఒక బిడ్డను. మనమే ఏదో ఒకటి చేసి పంపాలి.

వాదనలు చాలావరకు అర్థరహితం. అవి కేవలం మన అధికృతను చాటుకొనేందుకు మాత్రమే. తరచూ వాదించేవాడు మంచి స్నేహితుడు కాలేడు.

ప్రేమంటే అవతలివారిని అర్థం చేసుకోవటం ఒకటే కాదు. అవతలి వారిచేత అర్థం చేసుకోబడటం కూడా!

మీరు చెప్తున్నది కరెక్టని మీకు తెలిసినా, మీ స్నేహితుడు దాన్ని ఒప్పుకోనప్పుడు మీరేం చేస్తారు? అక్కడి నుండి వెళ్ళిపోతారా? మీరే కరెక్టని నిరూపించేవరకూ వాదిస్తారా? చేతిలో వస్తువులను విసిరేస్తారా? అవతలివారితో వాదించి వాదించి చివరికి తలనొప్పి తెచ్చుకుంటారా? అవతలి వ్యక్తిని ఓడించలేనప్పుడు డిప్రెస్డ్‌గా ఫీల్ అవుతారా? లేదా అవతలి వారి పాయింట్ ఆఫ్ వ్యూ అర్థం చేసుకుని, బహుశా మీదే తప్పేమో అవతలివారు కరెక్టేమో అని గ్రహిస్తారా?

"నీ దగ్గర రెండు గోళీలున్నాయి. నేను రెండిచ్చాను. మొత్తం ఎన్నున్నాయి?" పాఠం చెబుతూ తల్లి అడిగింది.

"అయిదు" అన్నాడా కుర్రవాడు.

సరిగ్గా అర్థం కాలేదేమోనని, "ముందు ఒకటి ఇచ్చాను. తరువాత ఇంకొకటి ఇచ్చాను. అప్పుడు ఎన్ని ఉంటాయి?" అని అడిగింది.

"మూడు" అన్నాడు.

తల్లికి కంగారు పుట్టింది. గోళీలంటే ఏమిటో అర్థం కాలేదనుకొని, "నీ దగ్గరొక పెన్నుంది. నేనింకోటిచ్చాను. మొత్తం ఎన్నుంటాయి?" అంది.

క్షణం కూడా ఆలోచించకుండా "రెండు" అన్నాడు పిల్లవాడు.

తల్లి గర్వంగా నవ్వింది. "ఇప్పుడు పెన్నులకి బదులు గోళీలనుకో. ముందొకటి, తరువాత ఇంకొకటి ఇచ్చాను. ఇప్పుడెన్నుంటాయి?"

కుర్రవాడు ఆలోచించకుండా "మూడు. ఎందుకంటే నా దగ్గర ఆల్రెడీ ఒకటుంది కాబట్టి" అని అన్నాడు.

ఇద్దరు వ్యక్తులు వేర్వేరు దృక్పథాలతో ఉన్నప్పుడు





ఎదుటివారిని హర్ట్ చేయకుండా తాను హర్ట్ కాకుండా చాకచక్యంగా చేసే భావవ్యక్తీకరణ ఓ గొప్పకళ అంటారు యండమూరి వీరేంద్ర నాథ్. ఎదుటివారిని నొప్పించే రకరకాల వ్యక్తీకరణల వల్ల కలిగే నష్టాలు ఏమిటో, ఎలా చాకచక్యంగా మాట్లాడాలో ఈ వారం ఇంకా చక్కగా వివరించారాయన. చదవండి.

ఇలాంటి కమ్యూనికేషన్ గాప్స్ మామూలే.

సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతోందని కోపర్నికస్ కనుక్కొన్నప్పుడు మేధావులైన అరిస్టాటిల్ లాంటివారే దాన్ని ఒప్పుకోలేదు. "ప్రపంచంలో పొడవైన నది ఏది?" అంటే 'నైల్' అంటారు. ఉపగ్రహాలొచ్చి ఫొటోలు తీసిన తరువాత, కొండల మీద అమెజాన్ మరొక వంద కిలోమీటర్లు సన్నటి పాయగా వున్నదని నిర్ధారితమయ్యింది. అయినా నైల్ నదే పెద్దదని కొందరు వాదిస్తారు.

మనం చూసే కళ్ళతోనే అందరూ చూడాలని భావించటం తెలివితక్కువతనం. ఒక చలి రాత్రి ఫుట్‌పాత్ మీద వణుకుతున్న కుర్రాణ్ణి చూస్తే బిల్‌గేట్స్ "తాను కోట్లు వెచ్చించి నడుపుతున్న అనాథాశ్రమంలో ఆ అబ్బాయిని చేర్పించి చదువు చెప్పమని' సెక్రటరీని ఆదేశిస్తాడు. అదే మదర్ థెరిస్సా చూస్తే స్వయంగా తన చేతుల మీదే ఎత్తుకొని అతడిని తీసుకెళుతుంది. బిన్‌లాడెన్ అయితే 'తనకి ఇటువంటి పరిస్థితి కల్పించిన ఈ సమాజం మీద ద్వేషం పెంచుకునే ఒక టెర్రరిస్టుని' ఆ కుర్రవాడిలో చూడవచ్చు. దృక్పథాలు ఇలా విభిన్నంగా వుంటాయి.

అవతలి వారి దృక్పథం గురించి ఆలోచించినప్పుడు, వారి పొజిషన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి. వాళ్ళ చెప్పుల్లో తమ కాళ్ళు పెట్టి ఆలోచించాలి. మనకి నచ్చిన టాపిక్ అవతలి వారికి నచ్చాలని లేదు.

ఒకరోజు విమానం కిటికీలోంచి ఒక అద్భుతమైన దృశ్యం కనబడింది. కొన్ని కిలోమీటర్ల తరబడి, ఆకాశమంతా మబ్బులు దూది పింజల్లా పేరుకొని ఉన్నాయి. వాటిపైన విమానం వెళుతోంది. దూరంగా సూర్యుడు అస్తమిస్తూంటే, ఆ కిరణాలు తెల్లటి మబ్బుల్ని మరింత ఆహ్లాదంగా చిత్రీకరిస్తున్నాయి. నిద్రకి తూలుతున్న నా ప్రక్కన ప్రయాణికుడిని తట్టి లేపి, కిటికీలోంచి బయట కనబడుతోన్న ఆ మనోహరమైన దృశ్యాన్ని చూడమన్నాను. అతడు కళ్ళు చిట్లించి, "మీరు విమానంలో ప్రయాణం చేయటం ఇదే మొదటిసారా?" అన్నాడు.

సినిమా ఫీల్డ్‌లో వ్యక్తుల స్నేహాలు వేరుగా ఉంటాయి. అక్కడ కృతజ్ఞతతో కూడిన స్నేహాలు తక్కువ. అది వ్యాపారానికి సంబంధించిన ఫీల్డు. వ్యాపారంలో ఎక్కువ కృతజ్ఞత పనికి రాదు.

ఒప్పుకోబుద్ధి కావటం లేదు కదూ.

ఆలోచించి చూడండి. ఒక డైరెక్టరూ, నటుడి కాంబినేషన్‌లో రెండు సినిమాలు సక్సెస్ అయ్యాయనుకోండి. ఇద్దరూ చెట్టపట్టాలేసుకుని తిరుగుతారు. ఆ దర్శకుడి తరవాతి రెండు మూడు సినిమాలు ఫెయిల్ అయ్యాయనుకుందాం. ఈ లోపులో మరో కుర్ర దర్శకుడు ఫీల్డులోకి తారాజువ్వలా దూసుకు వచ్చాడనుకుందాం. ఆ దర్శకుడిని పెట్టుకోమని నిర్మాతలకి సలహా ఇస్తాడు నటుడు.

ఇందులో తప్పు కూడా వున్నదనుకోనవసరం లేదు. ఎవరి సర్‌వైవల్ వారికి ముఖ్యం. ఒక సంస్థకి ఏళ్ళ తరబడి పనిచేసిన మ్యూజిక్ డైరెక్టర్లూ, నృత్య దర్శకులూ అలాగే నిర్దాక్షిణ్యంగా



తప్పించబడ్డారు.

వాదన vs చర్చ:

స్నేహాలు అయిదు కారణాల వల్ల చెడిపోతాయి:

1. తరచు చెప్పే అబద్ధాలు వలన.
2. నమ్మకం పోగొట్టుకోవటం వలన
3. స్నేహాన్ని స్వార్థానికి వాడుకోవటం వలన
4. భావోద్వేగాలు కంట్రోలు చేసుకోలేకపోవటం వలన.
5. మాట తూలటం వలన.

"నువ్వు కరెక్ట్ అని ప్రూవ్ చేసుకోవటం కంటే, అవతలవారిది తప్పు అని నిరూపించటం చాలా సులభం" అని ఒక సామెత ఉంది. వాదన మరీ శృతిమించుతుందని తెలిసినప్పుడు అక్కడితో ఆ టాపిక్ వదిలెయ్యటం విజ్ఞత.

స్నేహాలన్నీ చాలావరకు భావేద్వేగాల మీదే ఆధారపడి ఉంటాయి. మిమ్మల్ని బాధించిన ఒక ఉత్తరానికి గాని, మెయిల్‌కిగాని మీరెలా ప్రతిస్పందిస్తారు.? మీరొక రచయిత్రై, "....ఫలానా పత్రికలో నీ కథ దరిద్రంగా ఉంది. ఆ పాత్రని ఎందుకు చంపేసావ్? అంతకుముందు కథలో పాత్రని ఎందుకు చంపెయ్యలేదు? నువ్విక పెన్ను వదిలెయ్యటం మంచిది. వద్రంగి పని చేసుకో...' అని ఒక పాఠకుడు ఉత్తరం వ్రాశాడనుకోండి. అర్థం లేని సంస్కారరహితమైన ఆ ఉత్తరానికి మీరు ఏ విధంగా స్పందిస్తారు? తిరిగి ఘాటుగా సమాధానం ఇస్తారా? వ్యంగ్య పూరితంగా వ్యవహరిస్తారా? లేక మర్యాద పూర్వకంగా ప్రతిస్పందిస్తారా? ఏం చేసినా కూడా వెంటనే జవాబు ఇవ్వకండి. ఎమోషన్ చల్లారనివ్వండి. రియాక్ట్ అవ్వొద్దు. రెస్పాండ్ అవ్వండి.

పాఠకుడు మీ కథ చదివాడు. మీ మీద అతడు పెట్టుకున్న నమ్మకాన్ని మీరు వమ్ము చేసినట్టు అతడు ఫీలవటం వల్ల అంత ఘాటుగా ఉత్తరం వ్రాసాడు. అతడికి మీ మీద ప్రేమ ఉంది. అందుకే మరింత సమయాన్ని వెచ్చించి మీకు ఉత్తరం వ్రాసాడు. అది మీకు సంస్కార రహితంగా కనపడింది. అది కేవలం మీ మీద ప్రేమ వల్ల వచ్చిన డిస్సప్పాయింట్‌మెంట్ మాత్రమే.

మన తప్పుల్ని మనం కనుక్కోగలిగితే నిశ్చయంగా గొప్ప వాళ్ళమే. కానీ అవతలి వారిని, వారి తప్పులతో సహా ఒప్పుకోగలిగితే మనం అంతకన్నా గొప్ప వాళ్ళం అవుతాము.

సినిమాలో హీరో 'సమాజం నమ్మిన సత్యం' గురించి పోరాడతాడు. విలన్ కూడా 'తాను నమ్మిన సత్యం' గురించి పోరాడతాడు. నిజ జీవితంలో ప్రతిసారి మనం హీరోలు అవ్వలేం. కొన్నిసార్లు మనం నిజం అనుకున్నది కాకపోవచ్చు. అందుకనే ఒక వాదనని వీడ్కోలుకు దారి తీసేటంతగా గొడవ పడకండి.

మీ స్నేహితుల్తో పిక్నిక్‌కి అఖరి నిముషంలో మీ తండ్రి 'నో' అంటే ఎలా స్పందిస్తారు?

పెళ్లికి తీసుకెళ్లిన మీ సెల్‌ఫోన్‌ని స్నేహితుడు అక్కడ పారేసి,దాని ఖరీదు చెల్లించే ప్రయత్నం చేయకపోతే ఏ విధంగా రియాక్ట్ అవుతారు?

అలాగని వాదనలు ఉండకూడదని, అవతలివారు చెప్పేదంతా ఒప్పుకోమని, భిన్నాభిప్రాయాలు ఉండకూడదని కాదు. సంసార జీవితంలో ఒక జంట ఏడాదిలో కనీసం ఒక్కసారైనా గొడవ పడలేదంటే, వారి సంబంధంలో ఏదో లోటుందని అర్థం.

తిరిగి ప్రశ్నించకుండా మత గురువులూ, బాబాలూ చెప్పేది 'గుడ్డిగా' నమ్మేవాడు. ఎన్నటికీ స్వంత అభిప్రాయాలు నిర్మించుకోలేడు

ఒక కుర్రవాడు తల్లితో కలిసి వెళ్ళి ఒక స్వామీజీ దగ్గర నమస్కరించాడు. "భగవంతుడు నీతో ఉండు గాక" అని ఆశీర్వదించాడు స్వామి. ఆ కుర్రవాడు, "క్రితం సారి వచ్చినప్పుడు భగవంతుడు మనలోనే ఉన్నాడని అన్నారు. ఆయన నాలో ఉన్నాడా? నాతో ఉన్నాడా?" అని ప్రశ్నించాడు అనుమానంగా.

తల్లి భయపడింది. స్వామీజీ కూడా కంగారు పడ్డాడు. కానీ అనుభవం ఉన్న వాడు కాబట్టి వెంటనే సర్దుకొని, "నాయనా నువ్వేదైనా తప్పు చేస్తే భగవంతుడు నీ నుంచి వెళ్ళిపోతాడు" అని తెలివిగా సమర్థించుకున్నాడు. కుర్రవాడు కొంచెం సేపు ఆలోచించి, "భగవంతుడు శక్తిమంతుడా?" అని అడిగాడు. ఇంత చిన్న విషయం కూడా చెప్పాలా అన్నట్టు "నిశ్చయంగా శక్తిమంతుడే" అన్నాడు స్వామీజీ. "ఆయనకి దయ ఉందా?" బాలుడు ప్రశ్నించాడు. "సర్వేశ్వరుడు దయామయుడు" చిరు మందహాసంతో సెలవిచ్చాడు స్వామీజీ.

అప్పుడా బాలుడు "భగవంతుడు శక్తిమంతుడైతే తప్పుచేసిన నన్ను శిక్షించాలి. దయామయుడైతే నన్ను మార్చాలి. అంతే కానీ నా నుండి 'దూరంగా' వెళ్ళిపోవటం ఏమిటి?" అని ప్రశ్నించాడు. బిత్తరపోయిన స్వామి దగ్గర సమాధానం లేదు.



అదీ లాజిక్. అలాంటి లాజిక్ కోల్పోయిన వ్యక్తులు, కేంద్ర మంత్రులు అయి కూడా గతంలో బ్లాక్ మార్కెట్ టిక్కెట్లు అమ్ముకున్న బాబాల కాళ్ళమీద పడి మొక్కుతారు...!

(ఇంకా వుంది)



మీ గురించి పిల్లలకి బాగా తెల్సు వాళ్ళ గురించే మీకు అసలు తెలియదు!

'.... పిల్లలకి రెండేళ్ళు వచ్చేవరకూ నడవమని, "... మ్... మమ్మ' అంటూ మాట్లాడమనీ ప్రోత్సహిస్తాం. ఆ తరువాత ఇరవై ఏళ్లు కుదురుగా కూర్చోమని, మౌనంగా ఉండమనీ ప్రార్థిస్తాం" అంటుంది, 69 మంది పిల్లల్ని కని, ప్రపంచ రికార్డ్ సృష్టించిన తల్లి మిస్సెస్ ఫియొడెర్...

తల్లిదండ్రులకి 'పేరెంటింగ్' మీద ఇచ్చే ఉపన్యాసాల్లో, 'అల్లరి' అంటే ఏమిటో నిర్వచించమని అడిగినప్పుడు, చాలామంది తల్లితండ్రులు సరి అయిన సమాధానం చెప్పలేరు. తమకి విసుగు కలిగించే ప్రతీ పనినీ అల్లరి అంటారు. "తాము చెప్పిన మాట వినకపోవటమే అల్లరి" అంటారు మరికొందరు. నిర్వచనానికి ఇది కాస్త దగ్గరగా ఉన్నా, నూరుపాళ్ళు కరెక్ట్ కాదు. 'తిను' అంటే తినకపోవటం, 'ఆడు' అంటే ఆడకపోవటం అల్లరి ఎలా అవుతుంది?

బద్ధకం, అలస్యంగా నిద్ర లేవటం, చెప్పిన మంచి మాట వినకపోవటం, ఎప్పుడూ పక్క మీదే పడుకొని ఉండటం, అబద్ధాలు చెప్పటం, చిన్నచిన్న దొంగతనాలు చెయ్యటం, గట్టిగా అరుస్తూ గెంతులెయ్యటం, గెస్ట్‌లని డిస్టర్బ్ చెయ్యడం, బయట తిళ్ళతో ఇంట్లో అన్నం తినకపోవటం, గంటల తరబడి టి.వి. చూడటం, పెద్ద గొంతుతో వాదించటం... అన్నీ అల్లరిలోకే వస్తాయి.

క్రమశిక్షణా రాహిత్యంతో కూడిన పనులని అల్లరి అంటాము. తల్లితండ్రుల బలహీనత మీద పిల్లలు ఆడుకునే గేమ్‌తో అది మొదలవుతుంది.

అల్లరిపై యుద్ధం:


ఆహారం కోసం చెట్టుని తొలవటం వడ్రంగి పిట్టకి తెలిసినట్టు, గుడ్డులో నుంచి బయటకు రాగానే నీటి వైపు వెళ్ళాలని తాబేలు పిల్లకి తెలిసినట్టూ, పెద్దల వీక్ పాయింట్సు పిల్లలకి పుట్టుకతోనే తెలిసిపోతాయి. ఎంతసేపు ఏడిస్తే తనకి కావలసింది దొరుకుతుందో, దొరకదని తెలిసాక ఎంత సేపటికి ఏడుపు మానేయాలో వారికి తెలిసినంతగా పెద్దలకి తెలీదు.

డ్రయివింగ్‌కి కూడా ట్రయినింగూ, టెస్టింగూ వున్నాయి కానీ దురదృష్టవశాత్తు పిల్లల పెంపకానికి ఎటువంటి కోచింగూ లేదు. నిన్న మొన్నటి వరకూ అల్లరిచేసే తల్లిదండ్రులతో చివాట్లు తిన్న పిల్లలు, అకస్మాత్తుగా పెద్దలై, తమ పిల్లల్ని అవే తిట్లు తిడుతూ ఉంటారు.

సూపర్ మార్కెట్‌లో తాను అడిగిన చాక్లెట్ కొనివ్వలేదని పదిమందీ మీవైపు 'అదోలా' చూసేలా మీ అబ్బాయి గొంతెత్తి ఏడుస్తున్నాడా? తన మాట మీరు కాదన్నప్పుడు మీ పద్నాలుగేళ్ళ కూతురు తలుపు ధడేలున వేస్తూ బయటకు వెళ్ళిపోతోందా?

18

ప్రేమ ఒక కళ



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 9246502662

ఇదంతా అబ్బాయి దుఃఖమూ, అమ్మాయి కోపమూ అనుకుంటున్నారా?

కాదు... కానే కాదు....!!! అదంతా ఎమోషనల్ బ్లాక్‌మెయిల్.

పిల్లలకి ఈ ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్ తల్లిదండ్రులే నేర్పుతారు అంటే ఓ పట్టాన నమ్మబుద్ధి కాదు.

అమ్మచేసిన కూర నచ్చకపోతే ధడేలున ప్లేటు విసిరేస్తాడు కుర్రవాడు. బయట రూమ్‌లో పేపర్ చదువుతున్న తండ్రి వినగ్గా "ఎందుకే వాడినలా విసిగిస్తావు? వాడికి ఇష్టమయిందేదో చేసి పెట్టొచ్చు కదా" అని తిడతాడు. తనకి కావలసింది చేయించుకోవాలంటే నాన్నని విసిగించాలి అన్న విషయం కుర్రవాడికి అర్థమవుతుంది.

ముగ్గురూ బజారు వెళ్ళినప్పుడు, క్రికెట్ బ్యాట్ కొనిపెట్టమంటే, 'మొన్నేకదా కొనిచ్చాను' అని తిడతాడు తండ్రి. అప్పుడు ఆ కుర్రవాడు తల్లి దగ్గరకి వెళ్లి 'అమ్మా బ్యాటు... అమ్మా బ్యాటు' అంటూ అందరూ వినేలా రాగం తీస్తాడు. ఈమెకీ బ్యాటుకీ సంబంధం ఏమిటా? అని చుట్టూ ఉన్న వారందరూ వింతగా చూడటంతో ఆమె ఇబ్బంది పడి భర్తతో 'వాడికి బ్యాట్ కొనిస్తారా... లేకపోతే ఇంటికి వెళ్ళాక మీ వెన్నెముకని బ్యాట్‌గా చేసి వాడికి ఇమ్మంటారా?" అని బెదిరిస్తుంది. తండ్రి వచ్చినట్టు దాన్ని కొనిపెడతాడు.

అప్పుడా కుర్రవాడికి ఒక విశ్వరహస్యం అర్థమవుతుంది. ఇంట్లో నాన్నని విసిగించటం ద్వారా, బయట అమ్మని విసిగించటం ద్వారా,



మొత్తం మీద అమ్మా నాన్నలని ఆ విధంగా విడగొట్టటం ద్వారా తనక్కావలసిన పనులు చేయించుకోవచ్చు అని ఒక పాఠం నేర్చుకుంటాడు.

పిల్లల్లో అల్లరి తగ్గాలంటే భార్యాభర్తల మధ్య అవగాహన అవసరం. ఒకరు తిడుతున్నప్పుడు మరొకరు మాట్లాడకూడదు. 'నువ్వు మమ్మల్ని విడగొట్టి మా బలహీనతల మీద ఆడుకోలేవు' అన్న విషయం పిల్లవాడికి స్పష్టంగా అర్థమయ్యేలా ప్రవర్తించాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు ఇద్దరూ క్రమశిక్షణతో ఉండాలి. తాము టివి చూస్తూ, పిల్లల్ని వేరే గదిలో కూర్చుని చదువుకోమంటే అది సాధ్యం కాదు.

ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ టాపిక్ వచ్చింది కాబట్టి మరో విషయం కూడా చర్చిద్దాం. టీనేజర్స్‌కి పిక్నిక్‌లంటే బహుసరదా. దీన్ని కొన్ని కాలేజీలు క్యాష్ చేసుకుంటాయి. "ఫలానా కాలేజీలో చేరితే అక్కడ ప్రతీ ఏడాది ఎడ్యుకేషన్ టూర్లకి తీసుకెళ్తారట" అన్న సంగతి ఈనోటా ఆనోటా ప్రాచుర్యం చెందితే, కొత్త విద్యార్థులు ఆకర్షితలవుతారని ఈ సంస్థలకి బాగా తెలుసు. దీన్ని ఓ పెర్క్(perk)లా ఉపయోగిస్తారు. స్టడీ టూర్లని చెప్పి పర్వతాల్లోకీ, ఎడారుల్లోకీ, ఓడల్లోకి తీసుకెళ్తారు. మీరు ఒప్పుకోకపోతే పిల్లలు ఇంట్లో ప్రళయాన్ని సృష్టిస్తారు. (తనని కొట్టి ఇంట్లోంచి డబ్బు తీసుకెళ్ళడని విధవరాలైన ఒక తల్లి నా దగ్గర ఏడ్చింది).

డబ్బున్న పిల్లలు వెళ్తారు. లేని పిల్లలపై ఇది మానసికంగా ప్రభావం చూపిస్తుంది. పిల్లల్ని పంపబోయే ముందు యాజమాన్యాన్ని కొన్ని ప్రశ్నలు అడగండి. ఇది స్టడీ టూరా? పిక్నిక్కా? ఈ టూరు కంపల్సరీనా? అయితే చేరేముందే ఎందుకు చెప్పలేదు? డబ్బులేని పిల్లల పరిస్థితి ఏమిటి?

వారి దగ్గిరనుంచి సమాధానం వచ్చిన తరువాత నిర్ణయం మీదే. పరిణామాలకి బాధ్యత కూడా మీదే.

కమ్యూనికేషన్:

చిన్నప్పుడు తాము వారితో ఎక్కువ సమయం గడపలేదన్న విషయాన్ని మర్చిపోయి చాలామంది పెద్దలు, టీనేజర్స్‌గా మారుతున్న తమ పిల్లలు "ఒకప్పటిలాగా" తమతో మాట్లాడటం లేదని, ప్రేమగా ఉండటం లేదనీ కంప్లెయింటు చేస్తూ ఉంటారు. పునాది సరిగ్గా తవ్వితేనే కదా భవనం కరెక్టుగా నిలిచేది.

ఎక్కువ సమయం గడపటం వేరు. ప్రౌఢ క్టివ్‌గా గడపటం వేరు. పిల్లల దగ్గర కూర్చుని వారికి తెలియని విషయాలు చెప్పటం కన్నా ఆనందం ఏముంటుంది?

మీ పిల్లల్ని, మీ ఇంట్లో సభ్యులు ఒక్కొక్కరి గురించీ నాలుగు ప్లస్, నాలుగు మైనస్ పాయింట్లు 'కామెడీ'గా వ్రాయమనండి. గమ్మత్తుగా ఉంటుంది.

విజయవాడలో ఒక స్కూల్ పిల్లల్ని.. 'మీ పేరెంట్స్‌లో మీకు నచ్చిన, నచ్చని మూడు పాయింట్స్ వ్రాయమని' సూచించినప్పుడు, కొంతమంది వ్రాసిన కామన్ పాయింట్స్: "నా తండ్రి అభిమానంగానూ, స్నేహపూర్వకంగానూ వుంటారు. వారాంతాలలో బయటికి తీసుకువెళ్తారు. కానీ ప్రొద్దున్న ఆఫీసుకు వెళ్ళే ముందు రెండు గంటల సేపు న్యూస్‌పేపర్ చదువుతారు. రాత్రుళ్ళు తన బెడ్‌రూమ్‌లో టీ.వి. చూస్తూ గడుపుతారు. వంట గదిలో అమ్మకు ఎప్పుడూ సాయం చెయ్యరు. బాల్కనీలో సిగరెట్లు తాగుతారు. టీ.వి. న్యూస్ పేపర్, సిగరెట్‌లు తన ప్రాముఖ్యాలు.

మా అమ్మ ఎప్పుడూ తాజాగా, చురుకుగా నవ్వుతూ ఉంటుంది. ఆమె ఎన్నడూ పనిచెయ్యడం మానదు. కోపం వచ్చినట్లు నటిస్తుంది. కానీ ఎన్నడూ కోప్పడదు. నాకు నచ్చని లక్షణాలు: సెలవు రోజుల్లో కూడా నన్ను వేగంగా నిద్ర లేపేస్తుంది. నాకు నచ్చని కూరలు వండుతుంది. రాత్రుళ్ళు నన్ను టీ.వి. చూడనివ్వదు. డ్రింక్ చేసిన రోజు నాన్న ఆలస్యంగా వస్తారు. మేము నిద్రపోయామనుకుని ఇద్దరూ గొడవ పడతారు".

జ్ఞానం స్కూల్లో నేర్పరు:

ఒక తండ్రి, గంటకి వెయ్యి సంపాదిస్తే పదేళ్లలో కోటీశ్వరుడవుతాడు. అదే వారానికి ఒక గంట కొడుకుతో 'ప్రయోజనకరంగా' గడిపితే, ఆ కుర్రవాడిని జ్ఞానంలో కోటీశ్వరుడిని చేస్తాడు.

ఒక తండ్రి మదర్స్‌డే నాడు తన ఏడేళ్ళ కొడుకుతో అత్తగారికి ఒక మెసేజ్ పంపించాడు: "థాంక్స్ గ్రానీ! నాకో అద్భుతమైన అమ్మని ఇచ్చినందుకు..."

ఎంత గొప్పగా ఉందో చూడండి ఈ ఎక్స్‌ప్రెషను.

పిల్లల్ని రకరకాల ప్రశ్నలడుగుతూ వాళ్ళలో తెలివి, తర్కం పెంపొందించాలి. కార్లో తిరుపతి వెళ్తున్నప్పుడు అకస్మాత్తుగా "కన్యాకుమారి ఎటువైపుందిరా?" అని అడిగి, వాడు కరెక్టుగా చెప్తే, అక్కడికక్కడ కారు ఆపి చాక్లెట్ కొని పెట్టాలని ఏదో పుస్తకంలో వ్రాశాను.




భవిష్యత్తు ఎలా వుంటుందో రూపకల్పన చేస్తూ మీ చుట్టుపక్కల పిల్లల్ని నాలుగైదు వాక్యాలు వ్రాయమనండి.. బాగా రాసిన వాళ్ళకి మంచి బహుమతులు ఇవ్వండి. మనం ఊహించ లేని బోలెడు విషయాల్ని వాళ్ళు చెప్తారు. ఒక సెమినార్‌లో కాలేజీ విద్యార్థులకి పరీక్ష పెట్టి "భవిష్యత్తు ఎలా ఉంటుందో ఊహించి వ్రాయండి" అని అన్నప్పుడు ఆ విద్యార్థులు ఆలోచించి రాసిన పరిణామాలు:


భవిష్యత్తులో రోడ్లు ఇంత బిజీగా (రద్దీగా) వుండవు. పెట్రోలు ఖర్చు విపరీతంగా పెరిగిపోవడంతో కొనుగోళ్ళన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయి. ప్రజలు ఆఫీసులకి వెళ్ళే అవసరం లేకుండా ఇంటర్నెట్ లోనే సర్టిఫికెట్లు, పేపర్లూ పంపించబడతాయి. 3-డిలో కూరగాయల్ని, మిగతా వస్తువుల్ని చూస్తూ ఇంట్లో వాళ్ళు ఆర్డర్ చేస్తారు. ప్రస్తుతం క్రికెట్ గ్రౌండ్ చుట్టూ మనకి అడ్వర్టైజ్‌మెంట్లు కనబడుతున్నాయి కదా, కొంతకాలం పోయాక గ్రౌండు మీద కూడా వాటిల్ని పెయింట్ చేస్తారు. థియేటర్లు దాదాపు ఉండవు. అందరూ ఇళ్ళలోనే సినిమాలు చూస్తూ ఉంటారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయిన తరువాత ఇన్ని కోట్లు ఖర్చుపెట్టి సినిమా తీయాల్సిన అవసరం ఉండదు. అంతా కంప్యూటర్ గ్రాఫిక్స్‌లోనే జరిగిపోతూ ఉంటుంది.

తపన ఉండాలే గానీ, పిల్లల్ని ఎన్నోరకాలుగా ఎంగేజ్ చెయ్యవచ్చు.

'నీ బెడ్‌రూమ్ బొమ్మ గీస్తూ ఏ ఏ వస్తువులు ఎక్కడున్నాయో జ్ఞాపకం తెచ్చుకొని చెప్పగలవా? గత సంవత్సరంలో నీవు సాధించిన చిన్నచిన్న విజయాలు ఏమిటి? ఎంత చిన్నవైనా పర్లేదు. నాలుగు వ్రాయి. క్రితం ఏడాది నీ పుట్టిన రోజునాడు ప్రొద్దున్నుంచి సాయంత్రం వరకూ ఏం జరిగింది? గుర్తున్నవి వ్రాస్తే, ఒక్కో ఐటమ్‌కీ ఒక్కో బహుమతి.." అంటూ ప్రోత్సహిస్తే, హాల్లో టీ.వీ. చూడటం కన్న, బెడ్‌రూమ్‌లో నాన్నతో వుండటమే బావుంటుందన్న భావం పిల్లల్లో పెరుగుతుంది.

జ్ఞానం పట్ల కుతూహలం ఎంత బావుంటుందో ఈ క్రింది ఉదాహరణలో చదవండి:







తన రెండో భార్య సీమంతం సందర్భంగా ఒక రాజుగారు సామంతులకు విందు ఇద్దామనుకున్నాడు. పది సంవత్సరాలు భూమిలో పాతి పెట్టబడిన (కనీసం సీసాల మీద ఆ విధంగా వ్రాసి ఉన్న) 8 సీసాల ద్రాక్ష సారాని ప్రత్యేకంగా తెప్పించాడు. అదే సమయానికి వేగులవారు బంధించి తెచ్చిన పక్క దేశపు గూఢచారి బాంబు లాంటి వార్త పేల్చాడు. శత్రువు ఒక సీసాలో విషాన్ని కలిపేసాడు. అందులో ఒక చుక్క తాగినా 60 నుంచీ 90 నిముషాల్లో మరణం ఖాయం.

ఈ విషయం మరో గంటలో విందు ప్రారంభం అవుతుందనగా తెలిసింది. ఎలా? రాజుగారు ఆ విధంగా సతమవుతూ ఉండగా, మంత్రి ఒక ఆలోచన స్ఫురించినట్టు, "రాజా! ఎలుకల మీద ప్రయోగించి మనం ఆ కల్తీ సీసాని పట్టుకోవచ్చు" అన్నాడు.

రాజు మంత్రిని వెర్రివాడిని చూసినట్టు చూసి, "ఇంకో అరగంటలో మనకి ఎనిమిది ఎలుకలు ఎలా దొరుకుతాయి?" అని ప్రశ్నించాడు.

పక్కనున్న విదూషకుడు, "ఎనిమిది అక్కర్లేదు. ఏడు చాలు" అన్నాడు తన లిమిటెడ్ తెలివితేటలు ప్రదర్శిస్తూ.

ఇప్పటి మంత్రుల్లా అప్పటి మంత్రి అజ్ఞాని కాదు. నవ్వి, "అవసరం లేదు రాజా! 3 చాలు" అన్నాడు.

సాయంత్రం 7 గంటలకి విందు అనుకుందాం. 6 గంటలకి విషం సంగతి తెలిసింది. ఒక ఎలుకకు అప్పుడు ఒక సారా చుక్కపోస్తే, 7.30 వరకూ వేచి ఉండాలి. మరి ఏ ధైర్యంతో మంత్రి '3 ఎలుకలు చాలు' అని హామీ ఇచ్చాడు? (ఇలాంటి 350 పైగా ప్రశ్నలకి సమాధానాలు "బేతాళ ప్రశ్నలు" అన్న నా పుస్తకంలో దొరుకుతాయి)

జ్ఞానసముపార్జన కన్నా కుతూహలమైనది ఇంకేమీ లేదన్న విషయ నిరూపణకి ఇంతకన్నా ఇంకేమీ ఉదాహరణకావాలి?

శరీరంలోని ప్రతి అవయవమూ పని చేసే కొద్దీ అలసిపోతుంది. పని చేసే కొద్దీ మరింత చురుగ్గా పని చేసేంది మెదడు ఒక్కటే.

సైన్సు, చరిత్ర, ఆంత్రోపాలజీ మొదలైన సబ్జక్టులు ఎంత వుత్సాహకరంగా వుంటాయో చిన్న వయసులోనే పిల్లలకి చెప్తే, వారికి చదువు పట్ల ఇంటరెస్టు కలుగుతుంది. 'అలలు ఒడ్డు వైపు ఎందుకు కొట్టుకొస్తాయి? అన్నం ఉడకగానే ఎలక్ట్రిక్ కుక్కర్ దానంతట అదే ఎలా ఆగిపోతుంది?' లాంటి తర్కసహితమైన ప్రశ్నలు పిల్లల్లో ఉత్సుకత, ఆసక్తి రేపుతాయి. 'జెడ్' నుండి 'ఎ' వరకు నెమ్మది నెమ్మదిగా వెనుక నుంచి చెప్పటం లాంటి చిన్నచిన్న గేమ్స్ వల్ల హైపరాక్టివిటీ తగ్గుతుంది.

పిస్టల్ పేలినప్పుడు శబ్దం వస్తుంది. అణచి పెట్టబడి వున్న గన్‌పౌడర్ ఒక్కసారిగా మండి, బుల్లెట్ని బయటికి తోయడంతో వచ్చే శబ్దం అది. సోడా కార్క్ తీసినప్పుడు కూడా గ్యా ఇటువంటి

మొదటి మూడు రాత్రుల దాంపత్యంలో ఉండేది ఆకర్షణ. దాన్ని ఆరునెలల పాటు నిలబెట్టేది ఆప్యాయత. ఆరేళ్ల కాలంలో అది ఇష్టంగా మారుతుంది. అరవై సంవత్సరాల పాటు అదే స్థాయిలో నిలవగలిగితే అది 'ప్రేమ'.



పిల్లలు మనకంటే తెలివైనవారు. వారి తెలివికి సాన పెట్టాల్సింది పెద్దలే! కానీ దురదృష్టవశాత్తు పిల్లల పెంపకానికి ఏ ట్రైనింగూ లేదట! అసలు విషయం తల్లిదండ్రుల్ని ఎలా బ్లాక్‌మెయిల్ చెయ్యాలో పిల్లలకి బాగా తెలుసట!

శబ్దమే వస్తుంది. ఇది అందరికీ తెలిసిందే. అయితే సౌండ్ ప్రూఫ్ పిస్టళ్ళలో ఈ శబ్దం రాదు. ఎందుకు?

ఇలాంటి సందేహాలు పిల్లలకి వచ్చినప్పుడు, ఇంటర్నెట్ వెతికి, శోధించి చెప్పటం ప్రారంభిస్తే పిల్లలకి జనరల్ నాలెడ్జి పట్ల ఉత్సాహం పెరుగుతుంది. 'ఇవన్నీ మాకెక్కడ తెలుస్తాయండీ' అని దాటేయద్దు. ఈ పుస్తకం చదువుతున్నారు కదా. కనీసం ఇందులో ప్రశ్నలు మీ పిల్లలతోనో, మనవళ్ళతోనో చర్చించవచ్చు కదా.

ఒక పాప తండ్రిని, 'రోదసీలో ప్రయాణం చేసే వారు ముక్కు దురదపెడితే ఎలా గోక్కుంటారు?" అని ప్రశ్నించింది. తండ్రికి సమాధానం తెలియలేదు. అయితే ఆయన అక్కడితో ఆగలేదు. రోదసిలో ప్రయాణం చేసిన ఆరుగురి అడ్రస్సులు కనుక్కొని వారికి ఉత్తరాలు వ్రాశాడు. ఆశ్చర్యమేమిటంటే అందులో అయిదుగురు తిరిగి సమాధానం ఇచ్చారు. పదహారు రోజుల పాటు భూమి చుట్టూ తిరిగిన విండీ లారెన్స్ అనే రోదసీ యాత్రికుడు, "రోదసీలో కేవలం మూడు సార్లు మాత్రమే సూట్ ధరించవలసి వుంటుంది. ప్రవేశించేటప్పుడు, దిగేటప్పుడు, స్పేస్ వాక్‌లోనూ, కాబట్టి సమస్య పెద్దగా రాదు" అని చెప్పాడు. విలియం పోక్ అనే మరో యాత్రికుడు, "కేవలం ముక్కే కాదు, చెవి వెనుకకూడా దురద పెడుతూ వుంటుంది. మొహానికి ఎదురుగా వున్న హెల్మెట్‌కి శరీరాన్ని రుద్దటం ద్వారా దురద తగ్గించుకొనే ప్రయత్నం చేస్తాము. కానీ అది అంత గొప్ప ఫలితాన్ని ఇవ్వదు"



అని వ్రాసాడు. మరో యాత్రికుడు "దురద పెట్టినప్పుడు ఆ బాధ నుంచి బయటపడాలంటే, అది మరచిపోయి ఇంకో విషయం ఆలోచించటమే మార్గం" అని వ్రాశాడు.

ఇక్కడ సమాధానాలు ముఖ్యం కాదు. ఒక కూతురి సమస్య తీర్చేందుకు తండ్రిచేసిన ప్రయత్నం గురించి చెప్పటమే ఇక్కడి ఉద్దేశ్యం. (దీని గురించి ఇంకా వివరాలు కావాలంటే విలియం ప్రోగ్ వ్రాసిన 'హౌ డు యు గోటు బాత్రూం ఇన్ స్పేస్' అన్న పుస్తకం చదవండి). దాని ముందు మాటలో రచయిత ఒక గొప్ప వాక్యం వ్రాస్తాడు. "నాలెడ్జి కరెంట్, కానీ కుతూహలం దాని స్విచ్".

తరచి చూస్తే, పిల్లల్లో గొప్ప తెలివి తేటలూ, కుతూహలమూ ఉంటాయి. దీనికి సంబంధించిన ఒక గమ్మత్తయిన సంఘటన మీతో పంచుకుంటాను. మాస్టర్ మైండ్స్ వారు తెనాలిలో నిర్వహించిన సెమినార్ పూర్తయ్యాక, పదో క్లాసు అమ్మాయి ఒక కవిత తీసుకొచ్చి చూపించింది.

"అడగక అడిగినదేమిటో... లిపి చిలిపిగ ముదిరిన కవితగా...

అది విని అదిమిన సోకులో.. పురి విడిచిన నెమలికి సవతిగా"

- అని ఉంది అందులో. నాకేమీ అర్థం కాలేదు.

"దీని అర్థం ఏమిటో చెప్పమని మా నాన్నగారు మిమ్మల్ని అడగమన్నారు" అంది. 'అర్థం పర్థం లేని దానికి వివరణ కూడానా' అందామనుకుని "... ఎవరు వ్రాశారు? మీ నాన్నగారా?" అని అడిగాను.

"కాదు. మీ సినిమాలోదే.." అంది.

మొహం మీద చరిచినట్టయింది. అప్పుడు గుర్తొచ్చింది. జగదేకవీరుడులో 'అబ్బ నీ తీయని దెబ్బ' పాటలో చరణం అది.

సరస్వతీ పుత్రుడు వేటూరి వారి రచనకి ఏమి వంక పెడతాము?

"చిన్నపిల్లలకి అంతగా అర్థం కాదు. 'చిలిపిగా ముదిరిన కవిత' అనేది కొత్త ప్రయోగమని మీ నాన్నగారికి చెప్పు. ఆయనకి అర్థం అవుతుంది" అని సర్ది చెప్పాను. ఆ చిన్న పిల్ల అంతగా సంతృప్తి పడినట్టూ లేదు.

"ఇంకో అనుమానం" అంది.

"ఏమిటి మీ నాన్నగారికి ఇన్ని అనుమానాలు? ఏం పని చేస్తూ వుంటారు?"

"పరిషత్ స్కూల్లో టీచరు. ఈ అనుమానం వచ్చింది ఆయనకి కాదు. నాకు"

"ఏమిటది?"

"పురి విప్పేది మొగ నెమలి కదా. దానికి సవితి ఏమిటి?"

నిజమే కదా. చాలా సేపు స్థబ్దుగా ఉండిపోయాను.

వేటూరి వ్రాసినప్పుడు మాకు అనుమానం రాలేదు. ఇప్పుడు సమాధానం తెలీదు. చెప్పాల్సినాయన హడావుడిగా ఏదో పనున్నట్టు ఇంద్ర సభని భువన విజయం చేయటానికి వెళ్ళిపోయాడు.

ఒకటి మాత్రం గుర్తుంచుకోండి. మనం అనుకునే దాని కన్నా మన పిల్లలు చాలా తెలివైన వారు. ఆ తెలివిని సానపట్టవలసినది మనమే.



ప్రేమకి మించినదేది?

ఇతరులు మనల్ని ఇష్టపడాలంటే మూడు ముఖ్య లక్షణాలుండాలి.

1. పెదాలమీద చిరునవ్వు. చాలా సులభంగా దీన్ని ప్రాక్టీస్ చెయ్యవచ్చు. ప్రతి ఉదయాన్నీ నవ్వుతో ప్రారంభించటం, ఆటోడ్రైవర్‌కి నవ్వుతూ డబ్బులివ్వటం, హోటల్లో మంచినీళ్లు టేబుల్‌పై పెట్టిన వెయిటర్‌కి 'థాంక్స్' చెప్పటం కొన్ని ఉదాహరణలు.

చిరునవ్వు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఎవరినైనా కలవగానే, వారు మొదట మన ముఖంలోకి చూస్తారు. ఏవైనా బాధ్యతలను అప్పగించడానికి, 'స్పందించే గుణం ఉండే వ్యక్తులు' కావాలని కోరుకుంటారు. ముఖంలో చిరాకు, అసహనం, భయం, బాధ, టెన్షన్లు ఉన్నప్పుడు ఓ బాధ్యతాయుతమైన పనిని అప్పగించటానికి ఎవ్వరూ ఇష్టపడరు. చిరునవ్వు 'ఏ పని అప్పగించినా ఆనందంగా చేస్తాను' అనే దానికి సంకేతం.

సీరియస్‌గా ఉంటే అది 'మీతో సాంగత్యం నాకిష్టం లేదు' అన్న అసహనానికి సంకేతం.

కొంతమంది ముఖంలో అసలు ఏ భావాలూ వుండవు. అది మరీ దారుణం. "నేన్నిన్ను ప్రేమిస్తున్నాను" అని హీరోయిన్‌తోనూ, "నేన్నిన్ను చంపేస్తాను" అని విలన్‌తోను ఒకే ఎక్స్‌ప్రెషన్‌తో డైలాగే చెప్పే సినిమా ఆర్టిస్టులకే అది చెల్లుతుంది.

2. ఇతరులు మనల్ని ఇష్టపడే రెండో లక్షణం మన ప్రవర్తన/సంభాషణ. మీ చెల్లెలు తన స్నేహితుల్తో కలిసి సినిమాకి వెళ్తూ మిమ్మల్ని తోడుగా రమ్మంటే అంత 'చిన్న' పిల్లల్తో వెళ్ళటం ఇష్టం లేకపోతే, ఆ విషయాన్ని తనకి ఏ విధంగా చెపుతారు?

మీ అమ్మ మిమ్మల్ని "బాబూ. కాస్త మార్కెట్‌కి వెళ్ళి ఉల్లిపాయలు తీసుకురా" అంటే 'అబ్బా ఇప్పుడా' అన్నట్టు చూసి, "సరే, ఆ డబ్బులు మొహాన కొట్టు" అంటారా? "ష్యూర్ మమ్మీ" అంటూ ఛెంగున గెంతేసి వెళ్తారా?

3. ఇతరులు మనల్ని ఇష్టపడే మూడో లక్షణం ప్రశాంతత. మనిషి ప్రశాంతంగా ఉండాలంటే తన మనసుతోనూ, ఇతరులతోనూ గొడవ తగ్గించాలి. ప్రశాంతత లేక పోవటమంటే మనిషి నిరంతరం తన మనసుతో తాను "ఛీ! ఇలా చేశానేమిటి? ఇలా బ్రతుకుతున్నానేమిటి" అని గొడవ పడుతూ వుండటం.

Job కీ Joy కీ తేడా ఒక అక్షరమే.

తప్పనిసరి బాధ్యతగా చేస్తే అది జాబ్. ఆడుతూ పాడుతూ చేస్తే అది జాయ్.


ఆనందం ఇచ్చే వృత్తిలో గెలిస్తే కళ్లు వెలుగుతో నిండుతాయి. 'నానో' కారు ఓపెనింగ్ సమయంలో రతన్‌టాటా కళ్ళలో మెరుపు, గ్రాండ్‌స్లామ్ నెగ్గినప్పుడు టెన్నిస్ బ్యాటు గాలిలో విసిరిన ఆండ్రూ అగాస్సీ ఆనందం, చంద్రుడి మీద తొలి అడుగు పెట్టినప్పుడు ఆమ్‌స్ట్రాంగ్ నవ్వులో విజయగర్వం సజీవ ఉదాహరణలు.

రాయలసీమ ప్రాంతంలో ఒక మారుమూల పల్లెటూరు దగ్గర ఇంజనీరింగ్ కాలేజీలో సెమినార్‌కోసం వెళ్ళినప్పుడు, అక్కడ ఒక యువ లెక్చరర్ ఈ విధంగా అన్నాడు. "నేను ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ చదువుకుంటున్న రోజుల్లో బిల్‌గేట్స్ గాని, నారాయణమూర్తి గాని కార్లో మా కేంపస్‌కి వచ్చి నన్ను ఉద్యోగంలోకి తీసుకుంటారని కలలు కన్నాను సర్. నా కలలు కల్లలై పోయాయి. నేను ఊహించిన జీతంలో కేవలం పది శాతానికి నేనిక్కడ పని చేస్తున్నాను. పెళ్ళి, సంసారం పక్కన పెట్టండి. అసలెందుకు బతుకుతున్నానో నాకే అర్థం కావటం లేదు".

ఇది చాలామంది యువకుల గాథ. జీవితపు క్రాస్ రోడ్‌లో ఇటువంటి సందిగ్ధం తప్పదు. బ్యాంకులో పనిచేసే రోజుల్లో నేనూ ఇదే విధంగా బాధ పడేవాడ్ని. నా ప్రవృత్తి క్రియేటివిటీ. బ్యాంకు ఉద్యోగంలో సంతృప్తి దొరికేది కాదు. మరి దీనికి పరిష్కారం ఏమిటి?

బ్రేక్-త్రూ వచ్చేవరకూ మానసికంగా, ఆర్థికంగా వచ్చే ఒత్తిడిని తట్టుకొనే సామర్థ్యం పెంచుకోవాలి. ఆ గ్రామీణ ప్రాంతంలో ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌కీ ఈ విషయమే చెప్పాను. "మీ చిరాకంతా ఈ విద్యార్థుల మీద చూపించవద్దు. వర్తమానాన్ని ప్రేమిస్తే భవిష్యత్తు బాగుంటుంది. చేస్తున్న పనికి నూరుశాతం న్యాయం చెయ్యండి. మరో పక్క సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించుకోండి . జీవితంలో పైకి రావటానికి ప్రయత్నం చెయ్యండి".

చాలామంది విద్యార్థులు "నేను బి.టెక్ చదువుతున్నాను. కానీ నా ఆశయం సినిమా డైరెక్టర్ అవ్వాలని... నేను పాటలు బాగా పాడగలను. ఈ చదువు నాకసలు ఎక్కటం లేదు... క్రికెట్ ప్లేయర్



అవ్వాలని నా ఉద్దేశ్యం. మా రావులపాలెం ఊళ్లో నన్ను మించిన బ్యాట్స్‌మన్ లేడు. మా వాళ్ళు నన్ను బలవంతంగా ఈ కాలేజీలో చేర్పించారు" అని ఉత్తరాలు వ్రాస్తూ ఉంటారు.

జీవితపు ప్రారంభదశలో మనకిష్టమైన వృత్తిని చేపట్టడం కుదరకపోవచ్చు. ఆర్థికంగా నిలదొక్కుకోడం కోసం ఒక ఉద్యోగంలో చేరండి. తరువాత మీకిష్టమైన వృత్తిలోకి మారండి. కానీ మీకిష్టమైన వృత్తి మీకు ఆర్థిక వసరుల్ని సమ కూర్చేదయ్యుండాలి.

ఒక కుర్రవాడికి పాటలు పాడే అభిరుచి వుంది. ఆ వృత్తిలో సెటిల్ అవుదాం అనుకొన్నాడు. కానీ ఒక చిన్న పల్లెటూర్లో టైపిస్టుగా ఉద్యోగం వచ్చింది.

1. ఉద్యోగానికి రాజీనామా చేసి నగరానికొచ్చి ప్రయత్నాలు ప్రారంభిస్తే మొత్తం రెంటికి చెడ్డ రేవటి అయిపోతాడు.

2. కొంతకాలం ఉద్యోగం చేసి, కొంత డబ్బు సమకూర్చుకొని మధ్యమధ్యలో నగరానికి రావాలి. దర్శకుల్ని, నిర్మాతల్నీ కలుసుకొని టాలెంటు, అదృష్టం పరీక్షించుకోవచ్చు. పాటలు పాడే ట్రూపుల్లో చేరి పార్ట్‌టైంలో పాటలు పాడొచ్చు. డబ్బింగ్ అకవశాలు కూడా పరీక్షించుకోవచ్చు. నగరంలో సెటిలవటం ముఖ్యం.

3. త్వరలోనే అతనికి తనలో వున్న విద్య, ఒక ప్రొఫెషనల్‌గా మారటానికి సరిపోతుందా, లేక అది భ్రాంతా, తన గురించి తాను ఎక్కువగా అంచనా వేసుకుంటున్నాడా, అన్న విషయం తెలిసిపోతుంది.

4. ప్రొఫెషనల్ అవటానికి కావలసినంత టాలెంటు తన దగ్గర లేని పక్షంలో అతడు మరింత సాధన చేయవలసి వుంటుంది. బ్రేక్-త్రూ వచ్చేవరకూ గెలుపు గది బయట వేచి వుండక తప్పదు.

ప్రపంచంతో ప్రేమించబడటం

ఇప్పటివరకూ మనం 'ఇతరులు మనల్ని ప్రేమించటం' గురించి చర్చిస్తున్నాము. మన దగ్గర వాళ్ళు అంటే భార్యా/భర్త, పిల్లలు, స్నేహితులు, తెలిసిన వాళ్ళు, ఆత్మీయులు మనల్ని ఇష్టపడటానికి ఇష్టపడటం వేరు. ప్రపంచం ఇష్టపడటం వేరు. రెండో రకం ఇష్టం (దీనినే కీర్తి అంటారు) అంటే, ప్రపంచంలో 'మనకు తెలియని' మనుష్యులు మనల్ని ఇష్టపడటం. 'మనకు తెలియని ఒకరు మన విజయాన్ని ఇష్టపడుతున్నారు' - అన్న ఫీలింగ్ చాలా బావుంటుంది.



అదే మనిషికి ప్రేరణ. "అవిగో వినరా చప్పట్లు. అవేకదరా ఆకలిగొన్న కళాజీవికి పంచభక్ష్య పరమాన్నాలు" అన్నారు కీర్తి శేషులు నాటకంలో భమిడిపాటి వారు.

ఇతరుల నుంచి ఇలాంటి ప్రేమ సంపాదించాలంటే చాలా శ్రమించాలి. మనలో ఏదో ఒక ఆర్ట్ ఉండాలి. పెయింటింగ్, స్పోర్ట్స్, మానవసేవ లాంటిది ఏదైనా సరే.

దంర దృష్టం ఏమిటంటే, ఇటువంటి రెండో రకం ప్రేమ (విజయం) వైపు పయనించే వాళ్ళు సాధారణంగా సంసారం, పిల్లలు, భవబంధాలు మొదలైన వాటికి అంత ప్రాముఖ్యత ఇవ్వరు. అటు ప్రాపంచిక విజయాన్నీ, ఇటు వైవాహిక విజయాన్నీ సాధించటం ఎవరో కొందరు అదృష్టవంతులకు మాత్రమే సాధ్యమౌతుంది.

ఈ రెంటిలో దేనికి ప్రాముఖ్యత ఇవ్వాలీ అనేది ఎవరికి వారు నిర్ణయించుకోవాలి.

ఎందరో కవులు ప్రేమ తాలూకు విశిష్టత గురించి ఆలాపించినా, కొందరు దాని పరిణామాల్ని అంతే ఘాటుగా వ్యతిరేకించారు.

"...హమ్ తేరే ప్యార్‌మే సారా ఆలం ఖో బైఠే హై... తుమ్ కెహతే హో కే ఐసే ప్యార్ కో భూల్ జావో..."అని దిల్ ఏక్‌మందిర్ సినిమాలో పాట ఒకటి ఉన్నది. "... నేను నీ ప్రేమలో ప్రపంచాన్ని కోల్పోయాను. నువ్వేమో 'అటువంటి ప్రేమ వద్దు. మర్చిపో" అంటావు" అని అర్థం వచ్చే పాట. మరో కవి ఇంకా ముందుకెళ్ళి సరస్వతీ చంద్ర అనే సినిమాలో "ఛోడ్‌దే సారీ దునియి కిసీకే లియే... యే మునాసిబ్ నహీ ఆద్మీ కే లియే... (ఒకరి ప్రేమకోసం ఈ ప్రపంచాన్నంతా వదిలెయ్యటం... మనిషికి అంతకన్నా ముఖ్యమైన పనులు ఇంకేమీ లేవని భావించటం... తగదు గాక తగదు)" అని అన్నాడు.

విజయ శిఖరం చేరటానికి నిచ్చెన వేసుకొని ఎక్కే నరేంద్ర మోడీలాంటి వారు, కిందకి చూసి "... గమ్యాన్ని చేరటం కోసం ప్రేమని వదిలెయ్యాలి, త్యాగం చెయ్యాలి" అని హెచ్చరిస్తారు.

చలం లాంటి డైహార్డ్ ప్రేమికులు మాత్రం తల పైకెత్తి "... ప్రేమే అల్టిమేట్.. దానికి మించింది మరొకటి లేదు. దాని కోసం అన్నీ వదిలెయ్యాలి" అని అంటారు.



మీరు ప్రేమని వదిలేసి గమ్యం కోసం నిచ్చెన ఎక్కుతున్నా, లేదా గమ్యాన్ని వదిలేసి ప్రేమ సముద్రంలో ఈదుతున్నా, మీరు తీసుకున్న నిర్ణయం పట్ల ఖచ్చితంగా ఉండకపోతే, ఎప్పుడూ నిరాశగానే ఉంటారు.

ప్రేమలో గానీ, విజయంలో గానీ సందిగ్ధత, అసంతృప్తి ఉండకూడదు. అవతలి వారు ఒప్పుకుంటారా లేదా అని సందిగ్ధం, ఒప్పుకున్నాక ఈ ప్రేమకు పరిణామం ఏమిటి అని సందేహం, పెళ్ళయ్యాక తరువాతేమిటి అన్న సందేహం... ఇన్ని సందేహాలుంటే సంతోషాలెప్పుడు?

ప్రస్తుతం మన సబ్జెక్టు మొదటిదే కాబట్టి, రెండో దాన్ని ఇక్కడితో వదిలిపెడదాం.

కుటుంబ సభ్యులతో గొడవలు

కొందర్ని చూస్తే కోపం వస్తుంది. లేదా వారి నుంచి దూరంగా వెళ్ళి పోవాలనిపిస్తుంది. దూరంగా ఉన్నా, వారి ఆలోచన రాగానే అకారణంగా మనసు వికలమౌతుంది. తప్పనిసరిగా వారితో కలిసి ఒకే ఇంట్లో ఉండవలసి వచ్చినప్పుడు మాత్రం, జీవితం నరకం అవుతుంది. వారిని క్షమిస్తే, ఆ 'క్షమ' మనశ్శాంతినిస్తుంది. (చెప్పటం సులభమే కానీ అదంత సులభం కాదు. అయినా ప్రయత్నించటంలో తప్పు లేదు కదా). ఈ సందర్భంగా ఒక ప్రాచీన నేపాలీ కథ చదవండి. ఈ కథకు నాదైన రీతిలో బాగా నాటకీయత, సంభాషణలూ చేర్చటం జరిగింది.

చిన్నప్పుడే తల్లిని కోల్పోయిన పరిణీత చాల అందమైన, నెమ్మదస్తురాలైన అమ్మాయి. తాను ఇలా మారిపోతుందనీ, అసలిలా ఆలోచిస్తుందనీ ఆమె కలలో కూడా అనుకోలేదు. వివాహం జరిగి అత్తారింటికి వెళ్ళిన మొదటి పదిరోజులు బాగానే ఉంది కానీ, ఆ తరువాత ఆమె కష్టాలు ప్రారంభం అయ్యాయి.

భర్త మంచివాడు. కానీ నోట్లో నాలుక లేదు. అతని తండ్రి చిన్నప్పుడే చనిపోవటంతో తల్లే పెంచింది. దానివల్ల అతనిపై తనకే పూర్తి అధికారం ఉన్నదని ఆమె అనుకుంటూంది. అతను కూడా తల్లి పట్ల అదే భావంతో ఉంటాడు. దాంట్లో ఎవరికీ ఏ అభ్యంతరమూ లేదు గాని, పరిణీత ఆ ఇంట్లో అడుగు పెట్టగానే, తన కొడుకు ఎక్కడ చేతిలోంచి జారిపోతాడో అన్న భయం ఆమె అత్తగారికి పట్టుకుంది. అందుకని, కొడుకు చుట్టూ ఒక వృత్తం గీసేసింది.

బయటవారికి ఆమె చాలా మంచిది. కానీ అసలు విషయం పరిణీతకే తెలుసు. ప్రతి చిన్న పనికీ దెప్పిపొడవటం, పుట్టింటివారిని విమర్శించటం, కొడుకుతో గంటల తరబడి గుసగుసలాడటం ఆ అమ్మాయిని చాలా బాధ పెట్టేవి.

రోజులు వారాల్లోకి, వారాలు నెలల్లోకీ మారేకొద్దీ, ఎన్నో కలల్తో ఆ ఇంట్లో అడుగు పెట్టిన ఆమె కలలు కల్లలయ్యాయి. నేపాల్ దేశపు కట్టుబాట్ల ప్రకారం ప్రతీ కోడలూ అత్తగారి మాట వింటూ అణిగిమణిగి ఉండాల్సిందే. కానీ పరిణీత



వ్యక్తిత్వం కలది. దాంతో ఎదురు తిరిగింది.

ఎదురు జవాబులు చెప్పటం, ధిక్కారం, పెడసరిగా మాట్లాడటంతో చిన్నగా మొదలైన కలహం త్వరలోనే తీవ్రస్థాయికి చేరుకుంది. ఈ పరిణామాల్తో అందరికన్నా నలిగిపోయిన వాడు భర్త. ఇటు తల్లికీ, అటు భార్యకీ చెప్పలేక ఇంటి పట్టున ఉండటం మానేసాడు.

ఆ ఇంట్లో అత్తగారితో పాటు తాను ఉండలేనని ఆమెకు అర్థమైపోయింది. ఒక్కగానొక్క కొడుకుని వదిలి ఆ ముసల్ది ఎక్కడకూ వెళ్ళదని కూడా రూఢీ అయింది.

ఏదో ఒక నిర్ణయం తొందరగా తీసుకోవాలని తెలుసు. కానీ ఏం తీసుకోవాలో తెలీదు. ఆమె ఇటువంటి కన్‌ఫ్యూషన్‌లో ఉండగా ఆమె ఇంటికి ఆమె మామయ్య వచ్చాడు.

ఆయన ఒక ఆయుర్వేద డాక్టరు. తల్లి అన్నయ్య.

చిన్నప్పటి నుంచీ ఆయన ఆమెని ఎత్తుకుని పెంచాడు. పరిణీత ఆయనకి ఏ విషయమూ దాచకుండా చెప్పేసింది. ఆయన కూడా ఇంట్లో రెండు రోజులు ఉండి, జరుగుతున్నదంతా గమనించి ఒక నిర్ణయానికి వచ్చినట్టూ "ఆమె చనిపోతే గానీ నీ సమస్య పరిష్కారం కాదు" అన్నాడు.

తాను ఇలా మారిపోతుందనీ, అసలిలా ఆలోచించగలదనీ ఆమె కలలో కూడా అనుకోలేదు. "అవును ఆమె చనిపోవాలి" అన్నదామె ఒక నిశ్చయానికి వచ్చినట్టుగా. తరువాత ఇద్దరూ ఆ విషయమ్మై చాలా సేపు మాట్లాడుకున్నారు.

ఆయన రెండు రోజులపాటూ అడవి అంతా తిరిగి కొన్ని మూలికలు తెచ్చి వాటితో మాత్రలు తయారుచేసాడు. ఆమెకి వాటిని ఇస్తూ రహస్యంగా, "ఇవి రోజుకొకటి చొప్పున ఆర్నెల్ల పాటు వాడాలి. నీ అత్తగారు మొదటిరోజే చనిపోతే అందరికీ అనుమానం వస్తుంది" అన్నాడు.

పరిణీతకి కూడా ఈ ఆలోచన బాగానే ఉన్నదని అనిపించింది. అతడి దగ్గర నుంచి ఆ పొట్లాలు తీసుకుంది.

ఆ మరునటి రోజు తిరిగి తన గ్రామం వెళ్ళిపోతున్నప్పుడు "నా మూలికలు ఆమెని రోజురోజుకీ బలహీనం చేసి కొద్ది కొద్దిగా చంపుతాయి. ఆమె బలహీనం అవుతున్న సమయంలో ఏ మాత్రం ఉద్వేగం చెందినా, కోపం వల్ల ఆవేశపడినా గుండె ఆగిపోతుంది. అటువంటి పరిస్థితులు రానివ్వకు" అన్నాడు.

"కానీ ఆమె మరణించటమేగా మనకి కావాలి" అన్నది పరిణీత.

"పిచ్చిదానా. ఒక్క విషయం గుర్తుపెట్టుకో. ఈ విషప్రయోగం వల్ల, ఆమె మరణించిన అరగంటలో శరీరం నల్లగా కమిలిపోతుంది. నీకూ ఆమెకూ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని ఈ గ్రామంలో అందరికీ తెలుసు. ఎవరికైనా అనుమానం వచ్చి శవంపై పరీక్షలు జరిపితే నీతో పాటూ నేను ఉరికంబం ఎక్కక తప్పదు. ఆర్నెల్ల వరకూ ఆమె మరణించకూడదు కానీ బలహీనం అవ్వాలి. చుట్టుపక్కల వారికి ఆమె అనారోగ్యం పాలవుతోంది అన్న అభిప్రాయం కలగాలి. అన్నట్టు మరో విషయం. ఈ ఆర్నెల్ల కాలం ఎవరికీ అనుమానం రాకుండా నువ్వు ఆమెతో స్నేహంగా ఉండు" అన్నాడు.

మామయ్య చెప్పింది పరిణీతకి స్పష్టంగా అర్థమయింది. చుట్టుపక్కల వాళ్ళు చూస్తుండగా అత్తగారితో చాలా ప్రేమగా ఉండటం సాగించింది. ఆవిడ ఆవేశం చెందకుండా, ఉద్వేగపడకుండా జాగ్రత్తలు తీసుకుంది. వాదన ఏ మాత్రం శృతి మించుతోందని అనుమానం వచ్చినా దాన్ని అక్కడితో ఆపు చెయ్యటం, తిట్టినా తల దించుకొని అక్కడినుంచి వెళ్ళిపోవటం, కొడుకుతో ఎంతసేపు గడిపినా యాగీ చెయ్యక పోవటం, ఆ ముసలిదానికి ఇష్టమైనవి చేసి పెట్టటం ప్రారంభించింది.

అత్తగారు అనుకున్న దానికన్నా తొందరగా బలహీనమవటం, వయసు తొందరగా మీద పడటం తెలుస్తోంది.

కొన్ని వారాలు గడిచాయి.

పరిణీత తన ప్రవర్తనని ఇంకా మార్చుకుంది. వాదనలు పూర్తిగా తగ్గించింది. మరి కొన్ని రోజులు గడిచేసరికి ఆ ఇంట్లో ఆశ్చర్యకరమైన మార్పులు రావటం ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా తన భర్తలో....! అతడు ప్రశాంతంగా ఉంటున్నాడు. తొందరగా ఇంటికి వస్తున్నాడు. ఇంటిపట్టున ఉంటున్నాడు.

అత్త కూడా మునపటిలాగా ఉండటం లేదు. "పరిణీత నా కోడలు కాదు. కూతురు" అని పక్కింటివాళ్ళతో చెప్పసాగింది. కూర్చోబెట్టి ఎన్నో కబుర్లు చెప్పటం ప్రారంభించింది. ఆవిడలో ఇంత జ్ఞానం ఉన్నదని గ్రహించి పరిణీత ఆశ్చర్యపోయింది. తన బాల్యం గురించి విశేషాలు చెప్పేది. ముఖ్యంగా, మామగారు చనిపోయిన తరువాత కొడుకుని పెంచటానికి ఆమె పడిన కష్టాలూ, వరి చేలో కూలి పని చేస్తున్నప్పుడు పాము కుట్టిన వైనం చెప్తుంటే పరిణీత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అకస్మాత్తుగా ఆ ఇంట్లోంచి నిశ్శబ్దం పారిపోయినట్టూ అనిపించసాగింది. ముగ్గురూ కలిసి మొదటిసారి ప్రసిద్ధ నేపాలీ కవి భానుభక్త ఆచార్య ప్రవచిత భాను రామాయణ బొమ్మలాటకి కూడా వెళ్ళారు.

మరి కొన్నిరోజులు గడిచాయి. ఆ రోజు ఒక తుఫాను రాత్రి. ఆమెకి మరణం సమీపించింది. పరిణీత తల మంచానికి బాదుకుంది. మామయ్య కోసం ప్రయత్నించింది. తుఫాను అని కూడా చూడకుండా తన వూరికి పరుగెత్తింది. మధ్యలో పెద్ద అడివి. అయినా అధైర్యపడలేదు. పరుగెడుతూనే ఉంది. మధ్యలో ఒక పాడుబడిన బావి. చీకట్లో ఆమె చూసుకోలేదు. అందులో జారిపడిపోయింది. ఆమె తనకోసం బాధపడలేదు. తల్లి లాంటి అత్తగారి కోసం దుఃఖించింది.

అంతలో ఆమెకి మెలకువ వచ్చింది. వచ్చిన కలకి కలతచెంది, మామయ్యని ఆగమేగాల మీద రమ్మని కబురు చేసింది. ఆయన రాగానే కన్నీళ్ళతో, "నా అత్త మరణించటానికి వీల్లేదు. ఇప్పుడు ఆమెని నా తల్లికన్నా ఎక్కువ ప్రేమిస్తున్నాను. ఆమె చాలా మారిపోయింది" అంది.

ఆమె మామయ్య నవ్వి, "మారింది ఆమె కాదు. నువ్వు" అన్నాడు. ఆమెకు ఆ మాటలు వెంటనే అర్థం కాలేదు. ఈ లోపులో ఆయన తిరిగి అన్నాడు "నీ అత్త మరణించదు".

"మరి విషం?"

"విషం నీ ఆలోచల్లో ఉండేది. ప్రేమ వల్ల పోయింది. కోపం, ద్వేషం తగ్గించుకోవడం వల్ల అత్తగారూ నీకు కొత్తగా కనపడింది. ఆమెకి నేను ఇచ్చింది విషగుళికలు కావు. బలానికి మాత్రలు".

(ఇంకా వుంది)





టీన్స్‌లో కోర్ కాంపిటెన్సీని ప్రోత్సహించాలి

టీన్స్ పెంపకం (parenting a teenager):

పిల్లలు పెద్దవాళ్లుగా పరిణితి చెందే వయసుని 'టీనేజ్' అంటారు. ఇంటర్మీడియేట్ అంటే లాటిన్‌లో 'ఇన్ ద మిడిల్' అని అర్థం. బాల్యానికీ పెద్దతనానికి మధ్య జంక్షన్ ఇది. ఇది చాలా హుషారైన, సమర్థ వంతమైన, ఆకర్షణీయమైన, అపురూపమైన (క్షమించాలి. ఇంకే విశ్లేషణలూ లేవు... ఆఁ మర్చిపోయాను.. ప్రమాదకరమైన, అయోమయమైన) వయసు. ఈ వయసులోనే విద్యార్థి భవిష్యత్తు అటో ఇటో తేలి పోతుంది.

ఇంట్లో వారికి అమ్మాయి ఇంకా చిన్నపిల్లగానే కనపడుతుంది. మార్పు కనపడేది బయటవాళ్ళకే. ఆ గుర్తింపు, ఆ పాపని చాలా గర్వంగా ఫీలయ్యేలా చేస్తుంది. అందుకనే నిర్ణయాలు తీసుకునేటప్పుడు వారికి ప్రాముఖ్యతనిస్తే, పెద్దవారు తమను సలహా అడుగుతున్నారన్న ఫీలింగ్ టీనేజర్స్ అహాన్ని చాలా సంతృప్తి పరుస్తుంది.

టీన్స్ సాధారణంగా రెండు రకాల స్టేజ్‌లలో ఉంటారు. 1. నువ్వు బాగాలేవు. 2. నేను బాగా లేను. కొంతమంది పెద్దయ్యాక కూడా అదే స్టేజిలో కొనసాగుతారు గానీ, ప్రస్తుతం మన టాపిక్ అది కాదు.

1. మొదటిరకం పిల్లలు పెద్దల పట్ల రెక్‌లెస్‌గానూ, అహంభావంతోనూ ఉంటూ, చూపించవలసినంత మర్యాద చూపించకుండా నిర్లక్ష్యంగా ఉంటారు. ఎక్కువ సమయం స్నేహితులతో, ఫోన్లలో గడపటానికి ఆసక్తి చూపుతారు.

మీకు తెలుసా? ఒక సర్వే ప్రకారం పదహారేళ్ళు వచ్చేసరికి టీనేజర్స్ సగటున పది వేల క్రైం, హార్రర్, టెర్రర్, వయలెన్స్ సంఘటనలు చదివిగానీ, విని గానీ ఉంటారుట. సినిమాల్లో, టీవీల్లో సీరియల్సూ టాక్ షోసూ చూసిచూసి "... పెద్దవాళ్ళకి అస్సలు తెలివితేటలు వుండవనీ, తండ్రులు తిట్టటానికీ, తల్లులు ఏడవటానికీ, తాతలు పనికిరాని సలహాలు, అమ్మమ్మలు ఆచరణయోగ్యం కాని నీతులు చెప్పటానికి మాత్రమే పనికి వస్తారనీ... వారికో నిశ్చయమైన అభిప్రాయం ఏర్పడిపోయి ఉంటుందిట.

పదహారేళ్ళు దాటాక కూడా తల్లిదండ్రులు ఫ్రెండ్లీగా ఉంటే పిల్లలు ఈ మొదటి రకంగా తయారవరు.

2. రెండో రకం పిల్లల్లో కాస్త డిప్రెషన్ ఉంటుంది. ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. మూడ్ అకస్మాత్తుగా మార్పుచెందుతూ ఉంటుంది. అప్పటి వరకూ బాగా వచ్చిన మార్కులు సడన్‌గా తగ్గిపోవటం మొదలు పెడతాయి. 'అందరూ బాగానే వున్నారు, నాలోనే ఏదో లోపముంది' అన్న న్యూనతా భావంతో, లేదా 'నాకన్నా నా బ్రదర్‌నో సిస్టర్‌నో బాగా చూసుకుంటున్నారు' అన్న ఫీలింగ్‌తో వీరుంటారు. ఈ స్టేజ్‌లో వాళ్ళని అర్థం చేసుకోవలసింది, రక్షించవలసింది తల్లిదండ్రులే.

టీనేజ్‌లో పై స్థితి నాక్కూడా సంభవించింది. పొట్టిగా వుంటానన్న ఫీలింగ్‌తో నేను వ్యాకులపాటు (డిప్రెషన్)కి గురవుతున్న సమయంలో మా తండ్రి నన్ను రచనలు చేయమని ప్రోత్సహించారు. ఆయన కూడా ఒక రచయిత. మా అమ్మ తండ్రి కూడా రచయిత అవడంతో రెండు వైపుల నుంచీ అది దోహద పడింది. పిల్లల్లో వుండే అంతర్గతశక్తిని (Core-competency) తల్లిదండ్రులే గుర్తించి ప్రోత్సహించాలి. ఎంత తొందరగా పిల్లల్లో ఈ శక్తిని గుర్తిస్తే, అంత చిన్న స్టేజి నుంచి వారు తమని తాము ప్రేమించుకోవటం మొదలు పెడతారు.

స్నేహం-ఆకర్షణ:

వయసొచ్చిన పిల్లల్తో మరొక సమస్య వారి ప్రైవసీ...! వారికి విడిగా ఒక గది వుండాలి. అందులో రకరకాల ఫొటోలు గోడలకి అతికించబడి వుంటాయి. ఆ ఫొటోలు ఎవరివో, ఎందుకో కూడా మనకి తెలియదు. ఆ 'పర్సనల్ గది' అని పిలవబడే ప్రమాదకరమైన ప్రాంతంలోకి పొరపాటున మ్యూజిక్ తగ్గించటానికో, గంట నించీ కొనసాగుతున్న ఫోన్ సంభాషణ ఇక ఆపమని చెప్పటానికో వెళితే, పేలబోతున్న అగ్నిపర్వతాన్ని మీరు ఎదుర్కోబోతున్నారన్నమాట.

"అదియొక రమణీయ పుష్పవనము. ఆ వనమందొక మేడ... మేడపై అది యొక మారుమూల గది..." అని జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు. అంత సీనులేదు గానీ, కొందరి ఇళ్ళల్లో మూలగదిలో కూర్చొంటారు పిల్లలూ, వారి స్నేహితులూ...! అకస్మాత్తుగా ఒక్కసారి పెళ్ళున లోపల్నుంచి నవ్వులు వినపడతాయి. వంటింట్లో పని చేసుకుంటున్న తల్లి ఉలిక్కి పడుతుంది. స్నేహబృందంలో ఎవరో జోకు వేసారన్న మాట.

కొంచెం చాదస్తం గల తల్లి అయితే, "ఏమిటే. ఇంత వయసొచ్చాక అబ్బాయిలతో ఏమిటే ఆ ఇక ఇకలూ పకపకలూ" అని మందలించబోతుంది. అంతే.

ప్రేమ ఒక కళ

20



-యండమూరి వీరేంద్రనాథ్
సెల్: 92465 02662

టీనేజ్‌లో ఉన్న పిల్లలతో తల్లితండ్రులు వాదించకూడదు. వారి సలహాలు తీసుకోవాలి. వారిలోని కోర్ కాంపిటెన్సీని గుర్తించి ప్రోత్సహించాలి. మీరు వారిపై వాదనలో గెలిచేకొద్దీ వారిలో అభద్రతా భావం పెరుగుతుంది. మీకు దూరంగా జరుగుతారు. అందుకే వారి అంతర్ శక్తిని గుర్తించాలి.

సునామీ విరుచుకుపడుతుంది.

"గత శతాబ్దంలో పుట్టాల్సిన దానివమ్మా నువ్వు. ఇంట్లో కాబట్టి చూస్తున్నావ్. అదే మేమందరం బైట తిరుగుతే మీకసలు తెలీదు కదా. వియ్ ఆర్ జస్ట్ ఫ్రెండ్స్ అంతే" అంటుంది. అనుభవజ్ఞుడైన తండ్రి నమ్మడు గానీ చేసేదేముంది?

ఆ వయసులో ఆపోజిట్ జెండర్‌పై ఆకర్షణ రాలేదంటే పుట్టుకలోనే ఏదో లోపం ఉన్నదన్నమాట. అయితే అవధులు దాటితేనే ప్రమాదం. అప్పుడే పై పద్యం నిజమయ్యే ఛాన్సుంది. చుట్టూఉన్న వాతావరణం దానికి దోహదం చెయ్యకుండా చూసుకోవాలి.

తమ ఇంట్లో ఇలాంటి వాతావరణం నెలకొనటం ఇష్టం లేని పెద్దలు, తరచు వారి ప్రైవసీని ఏదో ఒక మిషమీద భగ్నం చేస్తే, మిగతా పక్షులు వేరే గూడు వెతుక్కుంటాయి.

- మరీ గూఢచారిలా కాకుండా పిల్లల స్నేహితుల ద్వారా బయట ఏం జరుగుతుందో తెలుసుకోవటం.
- పిల్లల స్నేహితుల పేరెంట్స్‌తో పరిచయం పెట్టుకోవటం.
- అప్పుడప్పుడు మెయిల్స్ చెక్ చేస్తూ ఉండటం.
- ఒకరోజు పాటు సెల్ తమ దగ్గరే ఉంచుకోవటం.
- గదిలోకి వెళ్ళగానే ఫోన్ సంభాషణ ఆపుచేస్తే, వివరాలు ఎంక్వయిరీ చెయ్యటం కొన్ని పద్ధతులు.

కానీ ఇవన్నీ అంత ఆరోగ్యకరమైనవి కావు. చూసీచూడనట్టూ పూరుకుంటే ఈ స్నేహాలు వాటంతట అవే తగ్గి పోతాయంటారు కొందరు. ఈ వివాదాస్పద చర్చ ఇక్కడితో ముగిద్దాం.

వాదించే పిల్లలు:

పిల్లలకి, పెద్దలకి మధ్య ఏదో ఒక వాదన లేని రోజుగానీ, ఇల్లుగానీ వుండదంటే అతిశయోక్తి కాదు.



ప్రతీ చిన్న విషయాన్నీ ఒక అంతులేని వాదనగా మార్చే ధోరణి, ఎవరూ నేర్పకుండానే పిల్లల్లో ఎలా వస్తుందో పెద్దలకి ఎప్పటికీ అర్థం కాదు.

కానీ మీకు తెలుసుకదా, వాదించడానికి ఇద్దరు కావాలి. అనుభవం వున్న పెద్దవాళ్ళుగా మీరు వాదనని ఏ సమయంలోనైనా ఆపేయవచ్చు. అయినా వాదిస్తున్నారంటే మీలో ఇంకా చిన్న పిల్లల మనస్తత్వం పోలేదన్న మాట.

ఇలా తరచు వాదిస్తూ ఉండటం వలన కొంత కాలానికి మీ పిల్లల దగ్గర నుంచి.. "... సర్లే... కూల్... కూల్. ఇహ నన్ను ఒంటరిగా వదిలేసెయ్" అన్న సమాధానాలు మాత్రమే వింటూ ఉంటారు.

అధికారంతో కాకుండా తర్కం(లాజిక్)తో వాళ్ళను జ్ఞానుల్ని చేయండి. వాదన మితి మీరుతున్నప్పుడు లేదా పరిస్థితి మితిమీరుతున్నప్పుడు వెంటనే దాన్ని ఆపుచేయండి. ఇదంతా చదివి మీకు చిరాకు వెయ్యొచ్చు.. '...అంతా మాకే చెబుతున్నాడేమిటి?' మమ్మల్నే మారమంటాడేమిటి? వారికీ చెప్పొచ్చు కదా' అని మీరు అనొచ్చు.

కానీ చదువుతున్నది మీరు. వారు చదవరు. వారికి అంత ఓపికలేదు. తెలుగు కూడా వస్తుందని అనుకోను. పైగా, బాధపడుతున్నది మీరు. వారిని ఇంకా బాగా పెంచుదామనుకుంటున్నది మీరు. సమస్య వారిది కాదు. మనది.

కాబట్టి ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, పిల్లల్ని వాదనలో గెలవటానికి ఎప్పుడూ ప్రయత్నించకండి. మీరు గెలుస్తున్న కొద్దీ వాళ్ళు మరింత అభద్రతా భావానికి లోనవుతారు. ఫలితంగా మీరు వాళ్ళను కోల్పోతారు. పక్కింటి ఆంటీయో అంకులో వాళ్ళకి దగ్గరవుతారు.

టీన్స్ తమ అందం, స్టైల్, సంభాషణ, ఛార్మ్‌తో ఇతరులని ప్రభావితం చేసేందుకు అమితంగా ఇష్టపడతారు. తాము ఎత్తైన స్టేజిపై వున్నామనీ, యావత్ ప్రపంచం తమ వైపు కళ్ళప్పగించి చూస్తుందనీ 'నిజాయితీ'గా నమ్ముతారు. అందుకే అద్దం ముందు గంటల కొద్దీ గడుపుతారు. పెద్దలు ఎగతాళి చేసినప్పుడు వారు అమితంగా భయపడతారు. హర్ట్ అవుతారు. లేదా రివోల్ట్ అవుతారు. విమర్శించినా, ఏడిపించినా అది వాళ్ళని ఎంతగా బాధిస్తుందంటే, వారు తమ గుహలోకి వెళ్ళిపోతారు. ఇక బయటికి రారు.

దానికన్నా చిన్నచిన్న మానసిక సూత్రాలు వివరించండి. "... ఎల్లప్పుడూ నువ్వు నీ గురించే ఆలోచించడం వల్ల నీ పట్ల నీకు అవసరమైనదానికన్నా ఎక్కువ అభిమానం (నెగెటివ్ సెల్ఫ్-ఈగో) ఏర్పడుతుంది. అవతల వారికి నువ్వు ఎంతో స్పెషల్ అయితే తప్ప, నీ గురించి ఆలోచించడానికి ఎవరికీ అంత సమయం వుండదు" అనే వాస్తవాలు వారికి అర్థం అయ్యేలా చెప్పండి.

మరొక ముఖ్యవిషయం ఏమిటంటే, మీ పిల్లల స్నేహితుల గురించి వాళ్ళు హర్ట్ అయ్యేలా ఎప్పుడూ కామెంట్ చెయ్యొద్దు. "... నీ ఫ్రెండ్ ఆ టింటూ గాడు, నెత్తి మీద రూపాయి పెడితే పైసాకి అమ్ముడుపోడు. వాడితో నీకు స్నేహం ఏమిట్రా? నువ్వు అలాగే తయారవుతావు' అని మొదలెట్టారనుకోండి. మీ టీనేజర్ కొడుకు వెంటనే స్నేహితుడిని సపోర్ట్ చేస్తాడు. మిమ్మల్ని యుద్ధంలో చీల్చి చెండాడినట్టు మాటల్తో ఎదుర్కొంటాడు. ఒక్క విషయం గుర్తించండి. బయటివాళ్ళు ఎవరైనా మిమ్మల్ని విమర్శించినా, వాడు అదే విధంగా మిమ్మల్ని కూడా రక్షించడానికి ప్రయత్నం చేస్తాడు.

మీ పిల్లల స్నేహితుల తాలూకు ఏదైనా మీకు నచ్చకపోతే ఆ విషయాన్ని మీ పిల్లలకు సున్నితంగా చెప్పండి. లేదా కొత్త స్నేహితుల వలయంలోకి ప్రవేశపెట్టటానికి ప్రయత్నం చేయండి.

ఒక తల్లి ఫిర్యాదు:

పద్నాలుగేళ్ళ నా కూతురు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన మరుక్షణంలోనే ఫోన్ మోగుతుంది. నేను స్పందించేలోపే, మా అమ్మాయి ఎగిరి గంతేసి రిసీవరు అందుకుని మాటల్లో మునిగిపోతుంది. తను మాట్లాడేది, అప్పటివరకూ స్కూల్‌బస్‌లో తన ప్రక్కనే కూర్చున్న స్నేహితురాలితో.

బస్ మా వీధి చివర్లోనే ఆగుతుంది. మా అమ్మాయి స్నేహితురాలు పక్క వీధిలో వుంటుంది. ఈ కొద్ది సమయంలోనే ఏం ముంచుకొచ్చిందో అని భయపడుతుంటాను. కానీ వాళ్ళ సంభాషణ, "యూ... కూల్... నీకు తెలుసుకదా.. అవునా? నిజంగా? అద్భుతం. ఓ... ఫైన్..."లతో ధ్వనిస్తుంది.

నాకు వళ్ళు మండి, "ఒక ముఖ్యమైన కాల్ కోసం ఎదురు చూస్తున్నాను" అని అరుస్తాను. తను అయిష్టంగా సంభాషణను కేవలం పదిహేను నిమిషాలకు పరిమితం చేసి ఫోన్ పెట్టేస్తుంది. అంతలో అది తిరిగి రింగ్ అవుతుంది.

మళ్ళీ తనకే.

పళ్ళ మధ్య ఆవేశం అదిమిపట్టి, "ఇరవై నాలుగ్గంటల పాటూ మళ్ళీ ఫోన్ వస్తే ఊరుకోను" అని కోపంగా హెచ్చరించి, స్నాక్స్ కోసం వంటింట్లోకి వెళ్తాను. తిరిగి వచ్చేసరికి తను డయల్ చేస్తూ ఉంటుంది. దాంతో ఒక్కసారిగా నాకు బీ.పీ. రైజ్ అయి ".... ఇరవై నాలుగ్గంటల వరకూ ఫోన్లు వద్దని చెప్పాను కదా!" అని అరుస్తాను.

"రేపటి వరకూ ఫోన్ చెయ్యొద్దని స్నేహితులు అందరికీ ఫోన్ చేసి చెప్తున్నాను.." అని తను కూడా బిగ్గరగా అరుస్తుంది. తల దేనికేసి కొట్టుకోవాలో తెలియక విసురుగా లోపలికి వెళ్ళిపోతాను. ఇదే విషయం మా పక్క ప్లాటు ఆవిడకి చెప్తే, తన కొడుకు గురించి చెప్పింది. ఫోన్లో మాట్లాడతాడట కానీ, రాగానే టీ.వీనో, కంప్యూటర్ ఆన్‌చేసి కూర్చుంటాడట. మళ్ళీ భోజనానికే లేవటం. ఏమైనా అంటే, "మిగతా పిల్లల్లా అర్ధరాత్రి వరకూ బయట తిరగటం లేదు కదా. సంతోషించు" అంటాడట.

•••

పిల్లలిచ్చే ఇలాంటి మొండి సమాధానాలతో

మీరు చాలాసార్లు బాధపడి ఉంటారు. కోపం నషాళానికి అంటుతూ ఉంటుంది. మీ కోపానికి ముఖ్య కారణం.. మంచి ఉద్దేశ్యంతో మీరిచ్చే సలహాలను వాళ్ళు ఎప్పటికీ అర్థం చేసుకోవటం లేదనేది. అవును..! అక్షరాలా నిజం..! పిల్లలు మీ జ్ఞానం, అనుభవం మరియు వివేకానికి చిల్లి కాణీ విలువనివ్వరు.

కానీ ఒక్కసారి వెనుతిరిగి ఆలోచిస్తే, జస్ట్.. జస్ట్ పాతిక సంవత్సరాల క్రితం మీ అమ్మ కూడా మిమ్మల్ని సరిగ్గా ఇలాగే తిట్టి ఉంటుంది.. '...మా రోజుల్లో ఇలా కాదు' అని ఆత్మవంచన చేసుకోవద్దు. ఫోను కాకపోతే మరో విషయంలో తిట్టి ఉంటుంది.



పిల్లలు ఎందుకింత ఎక్కువ మాట్లాడతారు? లోపల్నుంచి పెల్లుబికే శక్తిని ఏం చేసుకోవాలో తెలియక..! చిన్నతనం నుంచి తనని తాను ఒంటరిగా ఎంగేజ్ చేసుకునే ఒక అభిరుచి అలవాటు కాక.

తాము బాగానే ఉన్నట్టు హుషారుగా, కేర్‌ఫ్రీగా పైకి కనపడుతూ ఉంటారు కానీ, లోలోపల చాలా కన్‌ఫ్యూజన్‌తోనూ, అయోమయంతోనూ ఉంటారు. ఆ సమయంలో వారిని ఆదుకొనేది. అంతే కన్‌ఫ్యూజన్‌లో ఉన్న వారి స్నేహితులు మాత్రమే...!

ఆ కోణంలోంచి గానీ మీరు చూడగలిగితే, వారి చిరాకుకి కారణం వారికి వీరిచ్చే '...

ఆచరణకు సాధ్యం కాని సలహాలే...' అని మీకు అర్థం అవుతుంది.

జాగ్రత్తగా గమనిస్తే, పిల్లలకి తల్లిదండ్రులు రోజుకి సగటున పాతికపైగా సలహాలిస్తారు. అందులో సగం వారికి వారి పెద్దలు గతంలో ఇచ్చినవి. మిగతా సగం ఆచరణకు సాధ్యం కానివి.

సాధ్యం కానివి అంటే ఏమిటి? రివర్సులో ఆలోచిద్దాం.

మీ కొడుకు మీకు, '...నెలకో కిలో పెరుగుతున్నావు. మందూ, సిగరెట్లూ మానేసి, తిండి సగం తగ్గించి, రోజూ గంటసేపు యోగా చెయ్యి..' అని సలహా ఇస్తే ఎలా ఉంటుంది? 'నాకు చెప్పొచ్చేటంత పెద్ద వాడివయ్యావా?' అంటారు.

'.... ఆ చెత్త సీరియల్స్ చూడటం మానేసి వంట మీద కాన్సన్‌ట్రేట్ చెయ్యి. ఇంటర్నెట్‌లో ఎన్నెన్ని కొత్త వంటకాలు వస్తున్నాయో చూడు..' అని మీ కూతురు చెప్తే మీరు పాటిస్తారా? 'నువ్వు పుట్టకముందు నుంచీ వండుతున్నాను. నా వంటకేమయింది? గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించటమంటే ఇదే!' అంటారు.

'... ఆ అయ్యప్ప భజనలూ, సాయి-కోటీ మానేసి పేద పిల్లలకి చదువు చెప్పొచ్చు కదా..' అని మీ మనవరాలు సలహా ఇస్తే మీరు వింటారా? 'నాకేది బావుంటుందో నాకు బాగా తెలుసు. నువ్వేం చెప్పక్కర్లేదు' అంటారు.

ఒక సలహా ఇచ్చేముందు మీ స్నేహితుడు/స్నేహితురాలు మీరిచ్చే ఉచిత సలహాను ఏ విధంగా తీసుకుంటారో, మీ టీనేజ్ పిల్లలకీ మీ సలహాలు అలాగే ధ్వనిస్తాయి.

అలా అని వారికి మంచి అలవాట్లు నేర్పవద్దనీ, చెడు వ్యసనాలు మాన్పించవద్దనీ చెప్పటం కాదు.

వాళ్ళు అత్యంత సున్నితంగా ఉంటారు. వాళ్ళ మూడ్ పాడు చేయటానికి ఒక చిన్న కామెంట్ చాలు. లేదా స్కూల్‌లో తలెత్తిన సమస్య కావచ్చు. తమ ఆవేశాన్ని, దిగులునీ అక్కడ బహిర్గతపర్చలేక, ఇంట్లో వెలిగిక్కుతారు. వాళ్ళిచ్చే అహంభావ పూరిత సమాధానాలకి అదే కారణం.

పిల్లలు తమ ఆలోచనలు, సమస్యలు ఇంట్లో వారితో పంచుకోకుండా, మావయ్య పిన్ని లాంటి బంధువులతోనో, లేదా పక్కింటి ఆంటీతోనో చెప్పుకుంటూంటే తల్లిదండ్రులకి కష్టంగానే వుంటుంది. కానీ ఇది చాలా సాధారణం. ఒక వయసు వచ్చాక వాళ్ళ దృష్టిలో మీరు గౌరవనీయులే తప్ప ఆత్మీయులు కాదు. బయటికెళ్ళినప్పుడు అయిదు నిమిషాలకు ఒకసారి జాగ్రత్తలు చెప్పే బాడీ గార్డులే తప్ప హుషారైన స్నేహితులు కాదు.

ఎంత వయసొచ్చిన మీరు పిల్లల్ని పిల్లలుగానే చూస్తారు. బయటివారు అలా కాదు. వారిని 'స్వంత అభిప్రాయాలున్న వారిగా' చూస్తారు. అందువల్లే పిల్లలు మీ దగ్గర కన్నా వారి దగ్గర ఎక్కువ చర్చిస్తారు. కాబట్టి... మీతోకన్నా వారు ఇతరులతో దగ్గరగా వున్నారని బాధగానో, ఈర్ష్యగానో ఫీలవకండి.

ప్రేమని చీల్చే ఐదు క్రిములు:
అపార్థాలు, కోపాలు, ఈర్ష్యలు,
పంతాలు, అభిప్రాయ భేదాలు
వాటికన్నా ముఖ్యమైనవి
డబ్బు, స్వార్థాలు.

కొన్నిసార్లు ఈ 'బయటివారు' ఆత్మీయంగా సలహా చెప్పే బాబాయిలాగానో మావయ్య లాగానో దగ్గిరవటానికి ప్రయత్నిస్తే మాత్రం జాగ్రత్తగా ఉండండి. మితిమీరిన విశ్వాసం ఎవరి మీదా పనికిరాదు.

టీనేజర్ల సంభాషణ వింటే అందులో ఒక ముక్కమనకి అర్థం కాదు. మీ తరం సంభాషణకీ, వారి కబుర్లకీ హస్తిమశకాంతరం తేడా వుంటుంది. అందుకని వారు తమ ఈడు పిల్లలతోనే కలిసి తిరగటానికి ఉత్సాహ పడుతుంటారు. మీ నాన్నగారి అమ్మ, మీ అత్తగారి అమ్మగారితో లేటెస్ట్ కాశీ యాత్ర గురించి మాట్లాడుతూ కూర్చుంటే మీకెలా ఉంటుందో, మీ మాతామహులు పితామహులు గారితో మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఆవకాయ ఎలా పెట్టేవారో చర్చిస్తూ ఉంటే, శ్రోతగా మీకెలా ఉంటుందో, మీ కంపెనీ కూడా మీ పిల్లలికి అలానే ఉంటుంది. ఈ చేదు సత్యాన్ని ఒప్పుకోక తప్పదు. అందుకే సినిమాలకు, బయట ఫంక్షన్లకి పిల్లలు తమతో రావటానికి నిరాకరిస్తూ వుంటారని తల్లిదండ్రుల మరో ఫిర్యాదు.



"పిల్లలూ, వారి తాతలు మంచి స్నేహితులు అవుతారు. ఎందుకంటే వారిద్దరి ఉమ్మడి శత్రువు ఒక్కరే.." అన్నది చాలా పాత జోక్. తండ్రులు కనీసం వారానికి ఏడు గంటలు పిల్లలతో గడిపి నట్టైతే ఆ పాత సామెత అబద్ధం అవుతుంది. వారి నిశ్శబ్దాన్ని ఛేదించటానికి ప్రయత్నించకండి. ఏ తీర్పూ ఇవ్వకుండా వారి వెర్షన్ను వినటం ఒకటే మార్గం. వారి హృదయాన్ని తెరిచేందుకు ఇదొ కృటే తాళం చెవి.

డ్రైవింగ్‌కి కూడా ట్రైనింగూ, టెస్టింగూ వున్నాయి కానీ దురదృష్టవశాత్తూ పిల్లల పెంపకానికి ఎటువంటి కోచింగూ లేదు. నిన్న మొన్నటి వరకూ అల్లరిచేసి తల్లిదండ్రులతో చివాట్లు తిన్న పిల్లలు, అకస్మాత్తుగా పదేళ్ళలో పెద్దలై పెళ్ళి చేసుకుని, తమ పిల్లల్ని అవే తిట్లు తిడుతూ ఉంటారు.

(ఇంకావుంది)



ఫ్రెండ్-గైడ్-ఫిలాసఫర్

'మన జీవితాలలో మొదటి సగం తల్లి దండ్రులచేత, రెండవ సగం పిల్లల చేత వ్యర్థమవుతుంది' అని స్కాండనేవియన్ సామెత ఉంది. ఉద్రిక్తత తగ్గించడం (Difuse), విశ్వాసాన్ని విస్తరించడం (Enhance), కమ్యూనికేషన్ గ్యాప్ నివారించడం (Avoid), సమస్యలను పరిష్కరించడం (Resolve) అనే నాలుగు బాధ్యతల చేత, ఆ స్కాండినేవీన్ సామెత రెండవ భాగాన్ని తల్లిదండ్రులు కచ్చితంగా మార్చ వచ్చు. ఇదే 'DEAR' సిద్ధాంతం.

టీనేజ్‌లో పిల్లల్లో నిరంతరం అంతర్గత సంభాషణ జరుగుతూనే వుంటుంది. కొన్ని వేల నిర్ణయాలు తీసుకుంటూ, వాటిలో ఏది కరెక్టో తెలుసుకోలేని గందరగోళంలో ఉంటారు. పైకి చెప్పరు గానీ, పరోక్షంగా మరొకరి మార్గదర్శకత్వం కోరుకుంటారు. ఆ 'ఒకరు' మీరు అవటానికి ప్రయత్నించండి. కానీ జాగ్రత్త...! వాళ్ళకు మీ సలహా కావాలే తప్ప తీర్పు కాదు. వాళ్ళు వాళ్ళలాగే ఉండాలనుకుంటారు. తమకు రక్షణ కావాల్సినప్పుడే పెద్దల వద్దకు వస్తారు తప్ప, సలహా కోసం ఎన్నటికీ రారు.

వారి వాదన ఇమ్మెచ్యూర్‌గా, అమాయకంగా కనిపించినా సరే వినండి. వాళ్ళు చెప్పేది అర్థం చేసుకోండి. ఒక ముఖ్యమైన నిర్ణయం గురించి వాళ్ళకి చెప్పేటప్పుడు సరైన సమయంలో, సరైన స్వరంతో, వారు సరైన మానసిక స్థితిలో ఉన్నప్పుడు చర్చించండి. వాళ్ళు కోపంగా, ఇరిటేటింగ్‌గా ఉన్నప్పుడు కనుక మీరు సలహా ఇస్తే, మీరు వారి టార్గెట్ కాకుండా ఎవ్వరూ కాపాడలేరు.

తగాదా పరిధిని తగ్గించండి. నిజాయితీగా ఒప్పుకోండి. లేదా సుకుమారంగా ఒప్పించండి.

వాళ్ళని మంచివాళ్ళుగా తయారుచేయాలన్న మీ ఉద్దేశ్యం మంచిదే కాని, అందుకోసం వాళ్ళను అధ్వాన్నంగా ఫీలయ్యేలా చెయ్యక్కర్లేదు. 'గాస్సిప్ చెయ్యద్దు' అని కఠినంగా వ్యాఖ్యలు చేసే బదులు 'చెల్లిని ఇంతకుముందులా చదివించకుండా ఈమధ్య నువ్వు ఫోన్లో ఎక్కువ మాట్లాడుతున్నావేమిట్రా? కొంచం దాని పక్కన కూర్చుని చదివించరా. నీ గైడెన్స్ బావుంటుంది' అనండి.

అన్నిటికన్నా ముఖ్యవిషయం ఏమిటంటే, నెమ్మది నెమ్మదిగా వారి నిర్ణయాన్ని వారే తీసుకునే విధంగా తయారుచేసి, మీరు పై ఎత్తున పరిశీలకుడిగా ఉండటానికి ప్రయత్నించండి. అవతలివారికి సలహాలిస్తూ కంట్రోల్‌లో ఉంచుకోవటం ఎప్పుడూ బాగానే ఉంటుంది. చాలామంది పెద్దలు చేసే తప్పు ఇక్కడే. ఆ 'యావ' నుంచి గౌరవప్రదంగా బయటపడండి.

పిల్లల్ని పోషించటంలో తల్లిదండ్రులు ఆరు రకాల బలహీనతలతో బాధ పడుతూ ఉంటారు.

1. అతి నమ్మకం:

తమ పిల్లలు మిగతా వాళ్ళలా కాదని ప్రతి తల్లీతండ్రీ చాలా నిజాయితీగా నమ్ముతారు. అలాంటి నమ్మకాలు పటాపంచలైనప్పుడు వారు దిగ్భ్రాంతికి గురవుతారు. ఇళ్ళ నుంచి దూరంగా పట్టణాలలో హాస్టల్స్‌లో వుంటూ కొందరు చదువుకుంటూ ఉంటారు. కొన్ని వేల మంది పిల్లలు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ వుంటారు. చాలా సమయం ఖాళీగా ఉండటం, మరొకవైపు ఉద్యోగం రాకపోవటం వల్ల కలిగే విసుగు, ఇంటి మీద బెంగ, వాళ్ళను ఒంటరివాళ్ళను చేస్తాయి. చిన్న ఓదార్పుమాటతో వాళ్ళు తాత్కాలికమైన తోడుకి ఆకర్షితులవుతారు.

ఒక పేరెంట్స్ మీట్‌లో ఈ టాపిక్ చర్చిస్తున్నప్పుడు, ప్రేక్షకుల్లో ఒకరు 'దానిలో తప్పేముంది? ఆనందించే వయసు అదే కదా' అని కామెంట్ చేశారు. కావచ్చు... అది విషాదాంతం కానప్పుడు.

నాలుగు సంవత్సరాల క్రితం, కరీంనగర్ దగ్గర అర్ధరాత్రి పూట వ్యాన్ కాలువలో పడిపోయి కొట్టుకుపోయింది. దాంట్లో తొమ్మిది మంది చిక్కుకుపోయి, లోపల్నుంచి బయటకు రాలేక అక్కడికక్కడే మరణించారు. కాలేజీ తరఫున విహార యాత్రకి వెళ్తున్నామని తల్లిదండ్రులకి చెప్పి వచ్చిన నలుగురు అమ్మాయిలు ఆ వ్యాన్‌లో ఉన్నారు. (కాలేజీ యాజమాన్యం తమకేమీ సంబంధం లేదని పత్రికా ముఖంగా తోసి పుచ్చింది) శవాలతోపాటు ఆ వ్యాన్లో ఖాళీ విస్కీబాటిల్స్ దొరికాయి. ఆ అమ్మాయిల సగటు వయసు పదిహేను సంవత్సరాలు.


2. ఆత్మత-అవిశ్వాసం:

పిల్లల సామర్థ్యాన్ని, ధైర్యాన్ని, ప్రతిభా నైపుణ్యాలను ఎల్లప్పుడూ అనుమానించే తల్లిదండ్రులు ఈ కేటగిరీలోకి వస్తారు. పై విభాగం వారిది అతివిశ్వాసం. వీరిది అవిశ్వాసం, లేదా అతి భయం.

దశాబ్దం క్రితం ఒక ఏజెన్సీ కొన్ని కళాశాలల నుండి కొంతమంది టాపర్లను, పూర్తి ఖర్చులను భరించి ఎడ్యుకేషనల్ టూర్‌కు నేపాల్ పంపించేందుకు ఎన్నుకున్నారు. పూర్తిగా మెరిట్ ఆధారంగా వచ్చే చాలా అతి అరుదైన అవకాశం అది. కేవలం అబ్బాయిలతో కలిసి వెళ్లాలన్న కారణంగా ఒక అమ్మాయిని పంపేందుకు ఆమె తల్లిదండ్రులు నిరాకరించారు.

LOVE ప్రేమ ఒక కళ

(21)



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 92465 02662



డ్రైవింగ్‌పై పిల్లలకున్న అత్యుత్సాహానికి తల్లిదండ్రులు చాలా కఠినంగా పరిమితులు విధిస్తారు. వాహనం ముట్టుకోవటానికి అస్సలు అనుమతి ఇవ్వరు. ఒక టీనేజర్‌కీ, డ్రైవింగ్ అంటే బండి నడపటం కాదు. స్వేచ్ఛ...! ఒక సింబాలిక్ గెలుపు...! మనస్తత్వానికి సంబంధించిన అంశం ఇది. అప్పటి వరకూ వారు చెప్పిన మాటలు వినే వారు ఎవరూ ఉండరు. తాము చెప్పినట్లు వినే దానికోసం వారు ఉవ్విళ్ళూరుతూ ఉంటారు. ఇప్పుడు ఒక వాహనం దొరికింది. ఆక్సిలేటర్ పెంచితే, వేగం పెరుగుతుంది. స్టీరింగ్ ఎటు తిప్పితే, వాహనం అటు తిరుగుతుంది. సింబాలిక్ గెలుపు అంటే అది. అందుకే వారు బైక్ కోసం వేధిస్తారు. మీరు కాదంటే వాళ్లు దొడ్డి దారిలో వెళ్తారు. స్నేహితుల్ని బ్రతిమాలతారు.

అందుకు బదులుగా, వెహికల్‌లో మీరు కూడా వెళ్లండి. వారి పక్కన కూర్చుని వారికి నమ్మకాన్ని ఇవ్వండి. సలహాలివ్వండి. రాష్ డ్రైవింగ్ వల్ల వచ్చే పరిణామాల గురించి చెప్పండి. అన్నిటికంటే ముఖ్యంగా, మీరు కూడా వాళ్ల థ్రిల్‌లో పాలు పంచుకోండి. "మా అమ్మ నాకు డ్రైవింగ్ నేర్పింది. మా నాన్న నా వెనుక కూర్చుని బైక్ నడపటం చెప్పాడు" అన్న ఫీలింగ్ బావుంటుంది. ఒకేసారి వచ్చే జీవితకాలపు ఇన్వెస్ట్‌మెంట్ ఇది. రోజుకో గంట పని అది. ఆ పని నెల రోజుల పాటు చేయటం వల్ల, వారు జీవితాంతం మిమ్మల్ని గుర్తుపెట్టుకుంటారు. తరువాత డ్రైవింగ్ స్కూల్స్ ఎలానూ ఉన్నాయి.

అవిశ్వాసం, అతిభయం గల పేరెంట్స్ తమ పిల్లల్నీ, వారి శక్తినీ ఒక పట్టాన నమ్మరు.

ఒక అమ్మాయి పెళ్లికి ఆసక్తి చూపటం లేదని కౌన్సిలింగ్‌కు తీసుకువచ్చారు. అది ఏ మానసిక గాయమో లేదా లవ్-ఫెయిల్యూరో అనుకున్నాము. కానీ తన అకడమిక్ రికార్డ్ చూశాక మా అభిప్రాయం మార్చుకోవాల్సి వచ్చింది.

ఆమె పదవ తరగతి టాపర్. న్యూక్లియర్ ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడలిస్ట్. అటామిక్ న్యూక్లియర్, రేడియో ఏక్టివ్ వేస్ట్ మరియు ప్రొలిఫరేషన్‌లో రీసెర్చి చేయాలనుకుంటుంది. తన లక్ష్యం నోబెల్ ప్రయిజ్ అని చెప్పింది.

మేము నవ్వలేదు కానీ, "నోబెల్ ప్రయిజ్ విజేతలు కూడా పెళ్లి చేసుకున్నవాళ్లే కదా" అని చెప్పాము. తల్లిదండ్రులు మా వాదనను ప్రశంసించారు. కానీ ఆమె 'ఒక అబ్బాయి రీసెర్చి కోసం అమెరికా వెళ్తానంటే మీరు ఇదే సలహా ఇస్తారా?" అని అడిగింది. కౌన్సిలర్ ఏదో చెప్పబోతూంటే, "... వైవాహిక జీవితానికి న్యాయం చెయ్యలేను. నేను ఫ్యామిలీ టైప్ కాదు. నన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి" అని అన్నది.

ఆమె వాదనలతో ఏకీభవించి, ఆమెను రీసెర్చ్‌కి పంపించమని తల్లిదండ్రులకు సలహా ఇచ్చాడు కౌన్సిలర్. నాకు గుర్తున్నంతవరకూ, పదేళ్ల క్రితం ఆమె **Centre for Engineering Applications of Radioisotopes, North Carolina State University**లో ఉన్నది. అంతవరకూ తెలుసు. ప్రస్తుతం తెలీదు.

3. అత్యాశ:

సర్కస్‌లో ట్రెయినర్ ఎలుగుబంటిని కొడతాడు. చెప్పింది నేర్చుకునేవరకూ హింసిస్తాడు. తనకి కావలసినట్టూ తయారుచేస్తాడు. ఎందుకిలా దాన్ని వేధిస్తున్నావంటే, "అడవిలో వేటాడే అవసరం లేకుండా దానికి తిండి పెడుతున్నాను. మిగతా జంతువుల నించి ప్రమాదం లేకుండా రక్షిస్తున్నాను" అంటాడు.

"కాని దాని స్వేచ్ఛని హరిస్తున్నావు కదా" అంటే, "ఇందులో నా స్వార్థం ఏమీ లేదు. ఏనాడూ పుణ్యం చేసుకుందో నా పాల పడింది. దాని విన్యాసాలు చూసి ఎందరు ప్రేక్షకులు చప్పట్లు కొడుతున్నారో చూడండి. అడవిలో దానికా అదృష్టం దొరకుతుందా?" అని సమర్థించుకుంటాడు.

అడవిలో హాపీగా తిరగాలని ఉంటుంది తప్ప, ఎలుగుబంటికి చప్పట్ల అవసరం ఏముంది అని ఆలోచించడు. జీవితంలో భవిష్యత్తు హాయిగా ఉండటానికి, పిల్లల్ని వర్తమానంలో ఇంత కష్టపెట్టనవసరం లేదంటే చాలామంది ఆ వాదనను ఒప్పుకోరు. 'అందరూ మీవాళ్ళంత తెలివైనవాళ్ళుండరు కదా' అంటారు. పిల్లల్లో తెలివి పెంచాల్సింది ఇంట్లో పెద్దలే తప్ప, స్కూల్లో టీచర్లు కాదు అన్న విషయాన్ని కూడా అంగీకరించరు.

అంతగా తెలివితేటలు లేని ఒక సగటు పిల్లాడి నుండి ఎక్కువగా ఆశించడం అత్యాశ కాదంటారా?

ప్రతిభను మెరుగుపర్చడం వేరు, బలవంతంగా దానిని ఇంజెక్ట్ చెయ్యడం వేరు. తుని ప్రాంతానికి చెందిన ఒక యదార్థ సంఘటన చెపుతాను. "Sin θ + cos θ" ఎంత?" అన్న ప్రశ్నకి, సందేహంగా 'ఒకటి' అని సమాధానమిచ్చిన ఇంటర్‌మీడియేట్ విద్యార్థిని తల్లిదండ్రులు ఐఐటి ప్రిపరేషన్ కోసం ఇంటిని తనఖా పెట్టి కార్పొరేట్ కాలేజీలో చేర్పించారు. క్లాస్‌లో లెక్చరర్లు 'స్టుపిడిటీ'కి పర్యాయపదంగా అతడిని నిరంతరం ఎగతాళి చెయ్యడం వల్ల డిప్రెషన్‌కి గురయ్యాడు. మతి భ్రమించిన స్థితిలో విజయవాడలో డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి దగ్గరకు తీసుకురాగా, బాగు చెయ్యటానికి ఆర్నెల్లు పట్టింది.

అసలు తప్పు ఎక్కడుందో తెలుసుకోకుండా తల్లిదండ్రులు స్కూలు యాజమాన్యాలను నిందిస్తే, యాజమాన్యాలు తిరిగి తల్లిదండ్రులను నిందించి, ఇద్దరూ కలిసి ఉమ్మడిగా క్రికెట్, వీడియో గేమ్స్, ఇంటర్నెట్లు, సెల్‌ఫోన్‌లను తిడుతుంటారు.

సాధారణ స్టాండర్డ్ ఉన్న వారు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసాక ఉద్యోగస్తులవుతారు. చదివిన చదువుకీ, చేసే ఉద్యోగానికి ఏ సంబంధమూ ఉండదు. ఈ మాత్రం దానికి జీవితంలో ఒకే ఒకసారి వచ్చే అపురూపమైన బాల్యాన్ని లాగేసుకోవాలా అన్నది సందిగ్ధం. కార్పొరేట్ స్కూళ్ళవారు ఆకర్షణీయమైన గాలాలకి e-స్కూల్స్, టెక్నో ఎరలు కట్టి రెడీగా ఉంటారు. అక్కడ చేరటం లాటరీ.. "ఇంకో మార్గం ఏది?" అన్న ప్రశ్నకి సమాధానం తరువాతి అధ్యాయాల్లో చర్చిద్దాం.

కొంతమంది తల్లిదండ్రులు దీనికి వ్యతిరేకంగా వాదిస్తారు. "... ప్రస్తుత జనరేషన్ బాల్యాన్ని కోల్పోతుందని అంటారు. అలాంటిదేమీ లేదు. ఇంతకు ముందు పిల్లలు కబడ్డీ, ఖో-ఖో, బ్యాడ్‌మింటన్ ఆడేవారు, కాలువలో ఈత కొట్టేవారు, చెట్లపై నుండి దూకేవారు. కానీ ఇప్పుడు పిల్లలు కూడా కంప్యూటర్ గేమ్‌లు ఆడుతున్నారు. మరింత తెలివైన పజిల్స్‌ను విప్పుతున్నారు. క్విజ్‌లలో పాల్గొంటున్నారు. కాలంతో పాటూ మనమూ మారాలి" అని వాదిస్తుంటారు.

నిజమే. పూర్వకాలం అభిరుచులకీ, అలవాట్లకీ - ఇప్పటివాటికీ చాలా తేడా వున్నది. అప్పటి విద్యార్థులు కబడ్డీలూ, కోతి కొమ్మచ్చులూ ఆడేవారు. చెరువులో ఈతలు కొట్టేవారు. కానీ రాత్రయ్యేసరికి కూర్చుని చదువుకునేవారు. చదువుకొనే సమయంలో దృష్టి దేని మీదకీ పోయేదికాదు.



సాయంత్రం ఆడిన ఖో-ఖో గురించి గానీ, కబడ్డీ గురించి గానీ మాట్లాడటానికి, ఆలోచించటానికి ఏమీ వుండేది కాదు. సాయంత్రపు టి.వీలూ, అర్ధరాత్రి క్రికెట్ మ్యాచ్‌లూ ఉండేవి కావు. చదువు కొనే సమయాల్లో విరాట్‌కోహ్లీలూ, మిస్టర్ బీన్లూ, ఛోటాభీమ్‌లూ గుర్తుకు వచ్చేవారు కాదు. అదీ తేడా.

చదువుతో 'స్నేహం' చేసే విద్యార్థి జీవితంలో పైకి వస్తాడు. 'విద్య నిగూఢ గుప్తమగు విత్తము, రూపము పూరుషాళికిన్' అన్నాడు ఏనుగు లక్ష్మణ కవి. స్నేహితుడు అంటే ఎవరు? జీవితాంతం నీతో కలిసి వుండేవాడు. కష్టాల్లో నిన్ను ఆదుకొనే వాడు. నీ అభివృద్ధిని కాంక్షించేవాడు. నీ తెలివిని పెంచే వాడు. బ్రతుకులో ఆనందం తెలిపేవాడు.

దీన్నంతా 'విద్య'కు ఆపాదించండి! సరిగ్గా సరి పోతుంది. అందుకే విద్యతో స్నేహం చేస్తే విజయం తథ్యం.

మీకు 12 నుంచి 20 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలున్నట్లయితే, నేలపై ఉన్న పెన్‌ను వంగొని (కూర్చోకుండా) తీయమని చెప్పండి. లేదా 100 స్కిప్పింగులు చెయ్యమని, 500 మీటర్లు ఆగకుండా పరుగెత్తమని, రెండు ఫ్లోర్లు ఆయాసపడకుండా ఎక్కమని చెప్పండి. చెయ్యగలమని అంటారు. కానీ చాలామంది చెయ్యలేరు.

బాల్యం కోల్పోవటం గురించి ఈ క్రింది ఉదాహరణతో మీరు ఏకీభవించకపోవచ్చు. అదే కరెక్ట్ అనుకోవచ్చు. అయినా చదవండి.

నాకు తెలిసిన ఒక నిర్మాత, సూర్యుడింకా పైకి రాకముందే తన కొడుకుని టెన్నిస్ కోచింగ్‌కు తీసుకెళ్ళేవాడు. ఆ కుర్రవాడు టెన్నిస్ ప్రాక్టీస్ తరువాత ఇంటికొచ్చి, మళ్ళీ అరగంటలో ఆదరాబాదరాగా తయారై, ఊరికి ఇరవై కిలోమీటర్ల దూరంలో నగరంలోని ప్రతిష్టాత్మకమైన స్కూల్‌కు వెళ్ళేటందుకు బస్‌లో గంటసేపు ప్రయాణం చేసేవాడు. సాయంత్రం వచ్చీ రాగానే సంగీతం క్లాసుకి వెళ్ళి ఎనిమిదింటికి తిరిగి వచ్చేవాడు. అతను వచ్చేసరికి ఇంట్లో ట్యూషన్ టీచర్ వెయిట్ చేస్తూ ఉండేది.

ఆ అబ్బాయి కాళ్ళకు మసాజ్ చేసేందుకు స్విస్ నుండి ఆయిల్ దిగుమతిచేసుకునే వారు. ఎత్తు పెరగడం కోసం రోజుకు రెండు మూడుసార్లు బూస్ట్, కాంప్లాన్ ఇచ్చే వారు. ఏకాగ్రతను కోల్పోతాడేమో అన్న భయంతో కేబుల్ కనెక్షన్ కూడా తీసుకోలేదు. వకాబులరీ స్టాండర్డ్స్ పెరగడం కోసం సమ్మర్ క్యాంప్‌లకు పంపించేవారు. పిన్ని, మావయ్య, తాతయ్యలు కేవలం 'హలో' అంటే 'హలో' అనే పరిచయస్తులుగానే అతడికి తెలుసు.

క్రమంగా ఆ అబ్బాయి ఇంట్రావర్ట్‌గా అయిపోయాడు. పై చదువులకు విదేశాలకు వెళ్ళి, ఉండలేక ఆర్నెల్లలో తిరిగి వచ్చేసాడు. బాల్యాన్ని కోల్పోవటమంటే ఇదేనో కాదో తెలీదు కానీ, ఇంత జరిగినా సరే, పేరెంట్స్ అంటే అలానే ఉండాలనీ, తాము రోల్-మోడల్ తల్లిదండ్రులమని వాళ్ళు నమ్మేవారు. చిత్రమేమిటంటే ఆ వీధిలో ఇప్పటికీ అందరూ అలానే నమ్ముతారు.

4. మన పిల్లలు-పొరుగు వారికి అసూయ:

డ్రాయింగ్ రూమ్‌లో లక్షలు ఖరీదు చేసే మోనాలిసా చిత్రం, పోర్టికోలో బి.ఎం.డబ్ల్యూ. కారు, పెళ్ళికి ఖరీదైన ముత్యాలహారం లాగే, కొందరికి పిల్లలు స్టాటస్ సింబల్స్. ఎదుటవారికి పరిచయం చేస్తున్నప్పుడు, తమ పిల్లలు 'పాపులర్', 'ఇంటెలిజెంట్', 'అథ్లెటిక్' లాంటి అందమైన టైటిల్స్ ఉన్న బాక్సుల్లోకి చక్కగా ఇమిడి పోవాలని ఈ టైపు తల్లిదండ్రులు కోరుకుంటారు. అలా ఉండలేని వారిని "... ముద్దపప్పు...





వంశంలో తప్పు పుట్టాడు... వీడి బ్రదర్ బ్రిలియంట్...' అంటూ వాడి ముందే పరిహారం చేస్తారు.

Our child-neighbour's envy అన్నది వీరి స్లోగన్. పిల్లల్ని status-enhancers లాగా తీర్చిదిద్దటమే వీళ్ళ లక్ష్యం.

ఈ ర్యాట్ రేస్ ఎంత వేగంగా మొదలవుతుందంటే, పదిహేనేళ్ల వయసు వచ్చే సరికి పిల్లలు బర్నౌట్ అయిపోతారు. తెలివైన, చురుకైన చాలా మంది పిల్లలు జీవితపు తరువాతి దశలో విఫలమవడానికి కారణం శక్తికి మించి వారితో పని చేయించటమే.

తమ స్వంత అకడమిక్ కెరీర్‌లో విజయం సాధించలేని తల్లిదండ్రులు, తమ పిల్లల్ని 'థరో బ్రెడ్'గా తయారు చేస్తారని సైకాలజిస్టుల అంచనా. (అత్యంత కఠినమైన శిక్షణ ఇచ్చి, రేస్‌లో పాల్గొనటానికి అనువుగా తయారుచేసిన గుర్రాన్ని 'థరో బ్రెడ్' అంటారు). ఈ విధంగా ర్యాట్-రేస్‌లో పాల్గొనేందుకు శిక్షణ పిండదశ నుండే మొదలవుతుంది.

'ముందు చూపుగల నేను, ప్రహ్లాదుడు అభిమన్యుడు మొదలైనవారి కథలతో ప్రేరణ చెంది, గర్భం వద్ద టేప్ రికార్డర్ పెట్టి నా కడుపులోని ఆర్నెల్ల వయసు గల పిండానికి సాహిత్యం, చరిత్ర మరియు సైన్స్ వంటి సబ్జెక్టులను నేర్పించాను. కిండర్-గార్డెన్ దశనుండే మిగతా విద్యార్థుల కన్నా నా బిడ్డ ముందుంటాడని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని చెప్పింది ఒక తల్లి. "... మా అయిదేళ్ల బాబుకు కూడా అదే విధంగా శిక్షణ ఇచ్చాం...! 'బేబి ఐన్‌స్టీన్ డివిడి కాన్సెప్ట్', 'జంట (ట్విన్) బ్రెయిన్ డెవలప్‌మెంట్ (?)', 'బేబీ యోగ, మరియు 'కాన్సంట్రేషన్ గేమ్ టెక్నిక్'లను తర్ఫీదు ఇచ్చే స్కూల్‌లో చేర్పించాం. ఫలితాలు అద్భుతంగా ఉన్నాయి" అని ఆమె భర్త గర్వంగా చెప్పాడు.

చాలామందికి యాజమాన్యాలకి ఇంకా ఆలోచన రాలేదు కానీ, తమ స్కూల్లో ఇవన్నీ ఉన్నాయని బోర్డు పెడితే క్యూలో నిలబడి పిల్లల్ని చేర్పిస్తారు.

పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించడంలో తప్పేమీ లేదు కానీ వాళ్ళ బాల్యాన్ని నాశనం చేయకూడదు కదా. మీకు తెలుసా? ప్రతిష్టాత్మక ఐఐటిలో ప్రవేశ పరీక్షకి పదో తరగతి పిల్లల్ని తయారుచేసే హైదరాబాద్‌లోని ఒక కోచింగ్ సెంటర్‌లో ప్రవేశానికి కోచింగ్ ఇవ్వటం కోసం ఆరో తరగతి పిల్లలకి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుంది ఒక స్కూలు.

అటువంటి స్కూల్‌లో చదువుతున్న ఒక అబ్బాయితో మాట్లాడటం జరిగింది. ఆ అబ్బాయి కచ్చితంగా గణాంకాలలో దిట్ట. నాలుగంకెల నంబర్‌ను మూడెంకల నంబర్‌తో ఒక్క క్షణంలో గుణించేశాడు. "ఒక ఊళ్ళో ఒక తల్లికి 13 మంది పిల్లలుంటే, ఆ ఊళ్ళో 165 మంది తల్లులకు ఎంత మంది పిల్లలుంటారు?" అన్న ప్రశ్నకు తడుముకోకుండా "2145" అని సమాధానమిచ్చాడు.

(ఇంకా వుంది)

మీ పిల్లల్ని మీరే చెడగొడుతున్నారా? జాగ్రత్త!

ప్రేమ ఒక కళ



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 92465 02662

అతడు పుట్టకముందే తండ్రి చనిపోయాడు. ఏడాది వయసులో అతడి తల్లి అతడిని శరణాలయంలో వదిలి, రెండో పెళ్ళి చేసుకుంది. భార్యాభర్తలు ఇంట్లో ఘోరంగా కొట్టుకునేవారు. శలవులకి ఇంటికి వచ్చినప్పుడు అతడు అదంతా చూసేవాడు. కొంతకాలానికి తల్లి రెండో భర్తతో విడాకులు తీసుకుంది. బాగా తాగి బాయ్‌ఫ్రెండ్స్‌ని ఇంటికి తీసుకొచ్చేది. తరువాత మూడో పెళ్ళి చేసుకుంది.

ఇంటి వాతావరణం పడక 17వ ఏట అతడు కమ్యూనిజంపై వ్యామోహం పెంచుకుని, రష్యా వెళ్ళి సెటిల్ అవుదామనుకున్నాడు. అక్కడ ఒక సార్జెంట్‌ని గాయపర్చి శిక్ష పొందాడు. ఆపై బలవంతంగా వెనక్కి అమెరికా పంపి వేయబడ్డాడు. అడవిలో తిరుగుతూ అనవసరంగా గాలిలోకి తుపాకీ పేల్చినందుకు మళ్ళీ శిక్షింపబడ్డాడు.

తల్లి ప్రవర్తన వల్ల ఇలా రకరకాల మానసిక వైపరీత్యాలకి గురైన ఆ కుర్రవాడి పేరు లీ ఆస్వాల్డ్. 23వ ఏట అమెరికన్ ప్రెసిడెంట్ కెన్నెడీని హత్య చేసి మరణ శిక్ష పొందాడు.

•••

ఇంకొక కుర్రవాడి తండ్రి కూడా చిన్నతనంలోనే చనిపోయాడు. తల్లి అతడిని కంటికి రెప్పలా పెంచింది. అతడి కాలేజీ చదువు కోసం ఊళ్ళోని పెద్ద భవంతిని వదులుకుని, పట్నం వచ్చి అతడితో పాటే గదిలో ఉండి చదివించింది. ఆ కుర్రవాడు బ్రిలియంట్. కాని దురదృష్టం వెక్కిరించి పోలియో వచ్చి చూస్తూండగనే రెండు కాళ్ళూ చచ్చుపడి పోయాయి. తల్లి అతడికి దన్నుగా నిలబడింది.

ఆమె ఇచ్చిన మానసిక స్థైర్యంతో అతడు అమెరికా ప్రెసిడెంట్ అయ్యాడు. అతడి పేరు ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్.

పిల్లలపై పెద్దల ప్రభావం చెప్పటానికి ఇంత కన్నా ఏమి ఉదాహరణ కావాలి?

పిల్లలకి పెద్దలు ఇచ్చే రెండు అపూర్వమైన బహుమతులు: వేళ్ళు, రెక్కలు. చిన్న వయసులో గట్టి పునాదితో వాళ్ళపట్ల వారికి కలిగించే నమ్మకమే 'వేళ్ళు', యవ్వనదశలో భవిష్యత్తుపై నమ్మకంతో ధైర్యంగా ఎత్తుగా ఎగరటానికి 'రెక్కలు'.

అతి మురిపెం (Pampering):

ప్రేమ వేరు. గారాబం వేరు. పిల్లల్ని గారబంగా పెంచటాన్ని హైపర్-పేరెంటింగ్ అంటారు. వృత్తి పరమైన ఇబ్బందుల వల్ల పిల్లల్ని చాలాసేపు ఇంట్లో ఒంటరిగా వదిలేస్తున్నందుకు పెద్దలు గిల్టీగా ఫీలవుతారు. దానిని కప్పిపుచ్చుకునేందుకు వాళ్లకు మరింత స్వేచ్ఛ, ఇంటర్నెట్, ఎక్కువ పాకెట్‌మనీ, డబ్బున్న వాళ్ళయితే ఖరీదైన కార్లను ఇస్తారు.

హైపర్-పేరెంటింగ్‌కి సాధారణంగా నాలుగు కారణాలున్నాయి

- చదువుకునే రోజుల్లో తమ 'స్వంత వైఫల్యం'.
- పిల్లలతో ఎక్కువ సమయం గడపలేక పోతున్నామనే 'అపరాధ' భావం.
- పిల్లల విజయాలను ఇతరులకు ప్రదర్శించడంలో వచ్చే 'కిక్'.
- 'నా బాల్యంలో నేను చాలా బాధ పడ్డాను. వాళ్ళని ఆనందించనీ' అన్న సిండ్రోమ్.

పిల్లలు ఏదైనా ఖరీదైనది అడిగినప్పుడు కొనివ్వకపోతే, వాళ్ళు తమని దూరం చేసి చూస్తారేమో అన్న భయం పెద్దలకి ఉంటుంది. అలా కాకుండా, వారికి కాస్త అర్థం చేసుకునే వయసు రాగానే, లేనిపోని హెచ్చులకి పోకుండా పిల్లలకి తమ స్థాయి తెలిసేలా చెయ్యటం మంచిది. 'మనకి అంత స్తోమత్తు లేదమ్మా' అని చెప్తే, పెద్దల ఆర్థిక స్థితిలో వాళ్ళు కూడా భాగస్వాములుగా ఫీలవుతారని సైకాలజిస్టులు చెపుతున్నారు. ఇది నిజమే అనిపిస్తుంది. కోరిక తీర్చుకోవటం కన్నా, నమ్మకంలో పాలు పంచుకోవటం ఇంకా సంతోషాన్ని ఇస్తుంది కదా.

సర్దుకుపోవడం, రాజీ పడడం వంటి పదాలను చిన్న వయసులోనే మీ పిల్లలకు నేర్పండి. అడిగిన కోరికలన్నిటినీ తీరుస్తూ, స్పెషల్‌గా ఫీలయ్యేటట్టు చేస్తే, అటువంటి పిల్లవాడు ఇగోయిస్టిక్‌గానో, లేదా అటెన్షన్ సీకర్‌గానో తయారవుతాడు. ఆ విధంగా పెరిగిన పిల్లాడు, ఆ తరువాత తండ్రి అయినప్పుడు, కచ్చితంగా అతడు కూడా తన పిల్లలను అదే విధంగా అవధులు దాటిన మురిపెంతో పెంచుతాడు. అప్పుడు 'గారాబం' అనేది, సువర్ణభూమి వారి అడ్వర్టయిజ్‌మెంట్‌లా తరతరలా తరగని







చిరునామా అవుతుంది.

నేనొక మిత్రుడి దగ్గర ఉన్నప్పుడు, అక్కడికి ఒక డాక్టర్ దంపతులు వచ్చారు. చిత్రమైన సమస్య

వారిది.

వాళ్ళ అబ్బాయిని ముగ్గురు అమ్మాయిలు ప్రేమిస్తున్నారు. ఒకమ్మాయి అయిదు నిముషాలకొకసారి మెసేజ్ పంపుతుంది. మరొక అమ్మాయి గంటలకొద్దీ చాట్ చేస్తుంది. మూడో క్లాస్‌మేటు రక్తంతో ఉత్తరాలు వ్రాస్తోంది.

నా సైకాలజిస్ట్ మిత్రుడు కొస్త అయోమయం చెందినమాట నిజమే. 'ముగ్గురు అమ్మాయిలు ప్రేమించేటంత హీరోయిగ్గా ఆ అబ్బాయిలో ఏముంది?' అని అడిగాడు. ఆ జంట కూడా అదే అనుమానంతో ఎన్నో నిద్రలేని రాత్రులు కారణాలు చర్చిస్తూ గడిపి ఉంటారు. అందుకని సమాధానం వెంటనే చెప్పారు. "మా అబ్బాయి వద్ద అత్యంత ఖరీదైన సెల్ ఫోన్ ఉంది. పైగా తన స్కూటర్ తనే డ్రైవ్ చేస్తాడు".

ఈసారి ఆశ్చర్యపోవటం నావంతయింది.

"ఈ రోజుల్లో అందరికీ సెల్-ఫోన్, వెహికల్ సర్వసాధారణం కదా. దీంట్లో ప్రత్యేకత ఏముంది."

"మా అబ్బాయి ఏడవ తరగతి చదువుతున్నాడు" అని తల్లి అన్నది.

ఏడవ తరగతి చదువుతున్న అబ్బాయి స్కూటర్ డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళడం ఏమిటా అని మేము ఆశ్చర్యపోయాము. అబ్బాయికి బస్ అలర్జీ అట. స్కూల్‌కి క్షేమంగా చేరాడో లేదో తెలుసుకునేందుకు సెల్‌ఫోన్ ఇచ్చారట. కౌన్సిలర్ మిత్రుడు ఏమి సలహా ఇచ్చాడో నాకు తెలీదు. నో కామెంట్.

'కొంచం తేడా' పెద్దలు:

పిల్లల్ని తమ దార్లో పెట్టుకోవటానికి పెద్దలు రెండు రకాలుగా ప్రయత్నిస్తారు. శిక్షించటం (శాడిజం) ద్వారా, శిక్షించుకోవటం(మెసోసిజం) ద్వారా..!

"ఇంట్లోంచి గెంటేస్తాం.. భోజనం పెట్టం..." లాంటి భయంకరమైన పరిణామాలతో పిల్లలను బెదిరిస్తూ ఉంటారు. కొందరు తలుపులు వేసి బెల్టుతో కూడా కొడతారట. వాతలు పెడతారట.

ఇవన్నీ శాడిస్టిక్ లక్షణాలు.

మరోవైపు అమ్మాయికి మెడిసిన్‌లో సీట్‌కి సరిపడా మార్కులు రాలేదని ఒక కుటుంబం పస్తు ఉన్నది. మార్కులు రాకపోతే తను ఆత్మహత్య చేసుకుంటానని పిల్లాడ్ని బెదిరించే మరో తల్లి నాకు తెలుసు.


'నా పిల్లల్ని నేను దండించను' అంటుంది ఒక తల్లి. "... తనను చదివించడానికి నా దగ్గర వివిధ పద్ధతులు ఉన్నాయి. ఒకసారి తనకు 89 మార్కులు వచ్చి, క్లాస్ సెకండ్ అయినప్పుడు నేను నా వేలిని కోసేసుకున్నాను. నా బాధను, రక్తాన్ని చూసి ఏడ్చి, బాగా చదవడం మొదలు పెట్టాడు".

ఇవన్నీ మెసోసిజపు లక్షణాలు.

పిల్లలు లోపల ఎంసెట్ పరీక్ష వ్రాస్తూంటే, బైట టెన్షన్‌తో నిలబడ్డ పేరంట్స్ దృశ్యం కొత్త కాదు. మరీ నమ్మలేని నిజం ఏమిటంటే, దాదాపు పదేళ్ళ క్రితం చెట్టు క్రింద ఒకామె ఏడుస్తుంటే గమనించాను. ఆమె కొడుకు లోపల ఎల్.కె.జి. ప్రవేశ పరీక్ష వ్రాస్తున్నాడట. వీళ్ళు మూడో రకం.

అతివృష్టి, అనావృష్టి:

శిక్షించటంలో ఉన్నట్టే, బెదిరింపుల్లో కూడా రెండు రకాలుంటాయి.





ఇంటర్మీడియెట్‌లో ఫెయిలయి మతి స్థిమితం తప్పిన కుర్రాడ్ని మానసిక వైద్యుడి వద్దకు తీసుకు వచ్చినప్పుడు హిప్నాసిస్ ద్వారా కొన్ని దిగ్భ్రాంతికి గురిచేసే నిజాలు తెలిసాయి. తల్లి బాగా డబ్బున్న ఫ్యామిలి నుంచి వచ్చిన గ్రాడ్యుయేట్. పెద్దలను కాదని రైలు ప్రయాణంలో పరిచయమైన వాడ్ని పెళ్ళి చేసుకుంది. అతడు తాగుబోతు. అంతగా చదువు లేదు. ఆమె వైవాహిక జీవితం సంతోషంగా గడవటంలేదు. మరోవైపు తన పుట్టింటి వైపు ఫ్యామిలీలో అందరూ బాగా చదువుకున్న వారు.

ఫెయిల్యూర్ వల్ల వచ్చిన నిస్సహాయత ఆమెను తరుచు ఇరిటేషన్‌కు గురి చేసేది. ఇంటర్ పాసయిన కొడుకుతో తన పుట్టింటి వారి గురించి చెప్తూ, "నా అన్నయ్య ఐ.ఐ.టి. గ్రాడ్యుయేట్, తన కూతురు బిట్స్‌లో చదువుకుంటోంది. నా అక్క కొడుకు గ్రూప్-1 పూర్తి చేసాడు. నా ఆశలన్నీ నీపైనే పెట్టుకున్నాను. మీ నాన్నలా తయారవకు. ఇంటర్‌లో ర్యాంకు తెచ్చుకో. నీకు నా గురించి తెలుసు కదా. మాటపై నిలవబడతాను. నువ్వు గనుక ఐఐటీలో సీట్ సంపాదించకపోతే, నీ కెరీర్‌కు అదే ముగింపు. నువ్వు కూడా మీ నాన్నలాగే, చదువు ఇక్కడితో ఆపి, లైన్‌మెన్‌గా వెళ్తావు" అని కొడుకుని హెచ్చరించింది.

ఆ తల్లి ఖచ్చితమైన మనిషి.. మాటంటే మాటే..! ఈ రోజు నీకు భోజనం లేదంటే లేదంతే. ఆ అబ్బాయి ఈ ఒత్తిడిని తట్టుకోలేకపోయాడు. క్రమక్రమంగా anorexia nervosa అనే వ్యాధికి గురయ్యాడు.

క్రమశిక్షణకీ, కఠినశిక్షకీ తేడా తెలియని ఇటువంటి పేరెంటింగ్‌ని 'అతివృష్టి పెంపకం' అంటారు.

మరోవైపు, "హోమ్‌వర్క్ పూర్తి చెయ్యకపోతే సినిమా లేదు" అంటుంది తల్లి. తండ్రి ఆల్రెడీ అడ్వాన్స్ బుకింగ్‌లో టిక్కెట్లు కొనేసాడని పిల్లాడికి తెలుసు. బెదిరింపుకీ, బలహీనతకీ తేడా తెలియని ఇలాంటి పేరెంటింగ్‌ని 'అనావృష్టి పెంపకం' అంటారు.

ఇలా ఊరికూరికే బెదిరించే పెద్దల మాటలు పిల్లలు పెద్ద సీరియస్‌గా తీసుకోరు. మీరు ఈ టైపు పేరెంట్ అయితే వెంటనే మారాలి. రెస్టారెంట్‌కి వెళ్ళినప్పుడు పిల్లలు బాగా అల్లరి చేస్తూంటే, "ఇలా చేస్తే లాస్ట్‌లో మీకు ఐస్‌క్రీం లేదు" అని బెదిరించారనుకుందాం. ఇలాంటి మాటలు మామూలే కాబట్టి, వారు లెక్క చెయ్యరు. ఈసారి ఏడ్చిగీ పెట్టినా వారికి ఐస్‌క్రీం ఇవ్వొద్దు. నెక్ట్స్ టైం అలా బెదిరించినప్పుడు వాళ్ళు మీ మాటలు సీరియస్‌గా తీసుకుంటారు.

ఇల్లు Vs హాస్టల్:

"లంగా ఓణీ వేసుకుని ఓ ఆడపిల్ల నట్టింట్లో కళకళలాడుతూ తిరుగుతూ వుంటే ఎంతో బావుంటుందని మీ పుస్తకాల్లో వ్రాస్తూ ఉంటారు. మా పిల్లలు అలా తిరగరు. మంచం మీద పడుకుని ఇరవై నాలుగ్గంటలూ టీ.వీ. చూస్తూనే వుంటారు" అని వ్రాసింది ఒక తల్లి.

హాస్టల్‌లో చేర్పించటమే దీనికి ఏకైక పరిష్కారం అని చాలామంది పెద్దలు నమ్ముతారు.

"...ఇంకో పదేళ్ళలో ఇంటి నుంచి అత్తారింటికి వెళ్ళిపోయే 'ఆడ-పిల్ల'ని కొన్నాళ్ళయినా ఇంట్లో 'ఈడ-పిల్ల'గా ఉండనివ్వండి" అని సలహా ఇస్తాం మేము. ముఖ్యంగా నేను.

కొన్ని మంచి స్కూల్సూ, కాలేజీల్లో తప్ప చాలా హాస్టల్స్‌లో రుచిపచీ లేని తిండీ, ఒకే రకం కూరలు, శీతాకాలం కూడా ప్రొద్దున్నే అయిదింటికి చన్నీళ్ళ స్నానం, ఇరుకు గదుల్లో పడక, ఆటస్థలం లేని నిస్తేజపు సాయంత్రాలు, అమ్మా నాన్నలపై బెంగ, ఒంటరి రాత్రులు, బాత్‌రూంల పక్క వరండాల్లో స్టడీ అవర్స్.. పిల్లలకి ఇంతకన్నా దారుణమైన శిక్ష ఉంటుందా?

కేవలం వేసవి శలవుల్లో హాస్టల్స్ నుంచి చుట్టపు చూపుగా ఇంటికొచ్చే పిల్లలు, దగ్గర బంధువుల్ని కూడా గుర్తుపట్టలేరు. తల్లిదండ్రులు కూడా అతిథులనే మనస్తత్వం డెవలప్ అవుతుంది. అందుకే సాధారణంగా పిల్లల్ని హాస్టల్స్‌కి పంపవద్దనే సలహా ఇస్తాం. కానీ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో హాస్టల్ తప్పదు.

మొక్కయి వంగనిది మానై వంగుతుందా? అనేది ఒకనాటి సామెత. ఈ సామెతలో ఓ హెచ్చరిక, ఓ ముందు జాగ్రత్త, కాస్తంత భయం. అన్నీ కలిపి పిల్లల్ని ఆచరణలో ఎంతో జాగ్రత్తగా పెంచాలనే సందేశం కనిపిస్తుంది. ఈ వారం తల్లితండ్రులకు యండమూరి చెప్పిన ఇలాంటి విషయాలు చదవండి.

ఎక్కువ మాట్లాడటం కాదు. ఎక్కువ వినటం ప్రేమ.

- ఆ వూర్లో మంచి స్కూల్ లేనప్పుడు.
- చిన్న వయసులోనే ప్రేమ వ్యవహారం మొదలవుతోందని అనుమానం వస్తున్నప్పుడు.
- చిన్నప్పుడు మీరుచేసిన అతి గారాబం వల్ల మాటకి మాట ఎదురు చెప్పే పొగరు బోతుగానో, స్కూల్ నుంచి ఇంటికొచ్చాక ఒక్కసారి కూడా పుస్తకం ముట్టుకోని నిర్లక్ష్యపరుడుగానో, క్షణం కూడా ఇంటర్నెట్ వదలని వ్యసనపరుడుగానో,
- గంటల కొద్దీ బయట ఫ్రెండ్స్‌తో తిరిగేవాడుగానో,
- పక్కబట్టలు కూడా సర్దుకోని బద్ధకస్తుడిగానో తయారైనప్పుడు.

అమ్మా నాన్నల విలువ తెలియటం కోసం ఒక ఏడాది పాటూ హాస్టల్‌లో ఉంచండి అని సలహా ఇస్తూ వుంటాము.

ఇంట్లో వాతావరణం:

ఇంట్లో వాతావరణం బావోలేనప్పుడు, అంటే... పిల్లల ఏకాగ్రత పాడుచేసే గొడవలు, బంధువుల తాకిడి... తాగుబోతు భర్త, తాతయ్య నాయనమ్మల గారాబం, భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులై, ఇద్దరి డ్యూటీ టైమ్స్ వేరుగా ఉండటం - వగైరా సమస్యలున్నప్పుడు హాస్టలే మంచిది.

ఒక అబ్బాయి, ఏడవ తరగతి వరకూ టాప్ ర్యాంకర్, తెలివైనవాడు, కష్టపడే మనస్తత్వం కలవాడు, టి.వి., చాటింగ్ వంటివి ఇష్టపడనివాడు అకస్మాత్తుగా క్రింది స్థాయికి దిగిపోయాడు. సైకాలజిస్ట్‌కి ఇది కచ్చితంగా ఒక సవాలు. మరింత శోధించిన తర్వాత తెలిసిందేమిటంటే ఆ అబ్బాయి బయటికి మామూలుగా కనబడినా, లోలోన డిప్రెషన్ అంచున ఉన్నాడు. ప్రతీరోజూ తండ్రి తాగిన మత్తులో ఇంటికి వస్తూంటాడు. అర్ధరాత్రి తల్లికి, తండ్రికీ మధ్య బిగ్గరగా గొడవలు. వారు నిద్రపోయి నిశ్శబ్దం అలుముకున్న తర్వాత, ప్రక్క గదిలో ఉన్న అబ్బాయి అరక్షిత భావంతో వెక్కివెక్కి ఏడ్చేవాడు. జీవితంపై ఆసక్తి క్షీణించింది.


పిల్లలకో సలహా:

మీ పిల్లలతో ఈ క్రింది పేరాలు చదివించండి. వారికి తెలుగురాకపోతే, మీరు చదివి వినిపించండి.

మీ ఇంట్లో మీలాంటి ఒక చిన్న కుర్రవాడిని ఊహించుకోండి. లవబుల్, ఫ్రెండ్లీ చక్కగా మాట్లాడతాడు. కానీ అతి వాగుడు కాదు. అలా అని ఇంట్రావర్టూ కాదు. తన గది నీట్‌గా ఉంచుకుంటాడు. టి.వి. బాగా ఎంజాయ్ చేస్తాడు. రోజుకి అరగంటే. సినిమాలు ఉత్సాహంగా చూస్తాడు. కానీ నటీనటుల్ని గుర్తు పెట్టుకోడు. గొప్ప తెలివైనవాడు కాదు. కాని క్రమశిక్షణతో రోజు రెండు గంటలు చదువుతాడు. అమ్మకి వంటింట్లో సాయం చేస్తాడు. నాన్నతో కబుర్లు చెప్తూ కాళ్ళు తొక్కి రూపాయి సంపాదిస్తాడు. మీకు కావల్సిన చానల్ పెట్టమంటే, తనది మార్చి మీకిస్తాడు. వెళ్ళిపోడు. మీతో కూర్చొని మీకు ఇష్టమైనదే తను కూడా చూస్తాడు. అన్నిటి కంటే ముఖ్యమైనదేమిటంటే వాడి మొహం ఎప్పుడూ చిరునవ్వుతో వుంటుంది. అలాంటి వాడు ఒకడు ఇంట్లో వుంటే ఎలా వుంటుది? బావుంటుందా?

మీ సమాధానం 'అవును' అయితే, మీరే అలా ఎందుకు వుండకూడదు?

మొదట్లో కష్టం అనిపిస్తుంది గానీ, అలవాటయితే చాలా గొప్పగా వుంటుంది. తల్లిదండ్రులందరూ పిల్లల్ని ప్రేమిస్తారు. కానీ తల్లిదండ్రుల చేత 'ప్రేమతో కూడిన గౌరవం' పొందగలగటం కొందరు పిల్లలు మాత్రమే సాధించగలిగే అద్భుతమైన అనుభవం. ర్యాంకులొచ్చే వారికీ, ఆటల్లో, వివిధ కళల్లో, సంగీత సాహిత్యాల్లో రాణించిన పిల్లలకీ ఆ విధమైన గౌరవం లభిస్తుంది. అలా రాణించిన పిల్లలకి క్రమశిక్షణ, మంచి అలవాట్లు, అభిరుచులు



ఆటోమాటిక్‌గా ఉంటాయి.

ఒక ఆదివారం మధ్యాహ్నం పదిహేనేళ్ళ వయసులో సచిన్ టెండూల్కర్ క్రికెట్ ఆడి వచ్చి పడుకున్నప్పుడు, అతడి తమ్ముడు గొడవ చేస్తూంటే, ఆ ఇంట్లో పెద్దలు ఏమంటారు? 'అన్నయ్య నిద్రపోతున్నాడు. అల్లరి చెయ్యకు' అంటారు. అవునా? అదే... మరో కుర్రాడు సెకండ్ షో చూసొచ్చి మధ్యాహ్నం నిద్రపోతూ, 'తమ్ముణ్ణి కాస్త గొడవ చెయ్యొద్దని చెప్పు' అంటే వాడితో ఏమంటారు?

ఇంట్లో తొమ్మిది మంది టీవీ చూస్తున్నారు అనుకుందాం. లోపల గదిలో ఒక కుర్రాడు పక్కింటి అబ్బాయికి తెలియని పాఠాలు వివరిస్తున్నాడు. ఆ కుర్రాడిపై అందరికీ ప్రేమతో కూడిన 'గౌరవం' ఉంటుంది. మిగతా అందరూ 'ఇంకొకరి' క్రియేటివిటి చూస్తున్నారు. అతడు తన జ్ఞానాన్ని ఇంప్రూవ్ చేసుకుంటూ ఇంకొకరికి సాయం చేస్తున్నాడు. అదీ తేడా.

మిమ్మల్ని మీరలా మార్చుకోగలిగితే, మీ గురించి చెప్పేటప్పుడు మీ పెద్దల కళ్ళల్లో గర్వంతో కూడిన మెరుపు కూడా కనపడుతుంది. 'విజయం సాధించటం కోసం సంతోషాలన్నీ పక్కనపెట్టి పని చేయాలి' అని కొందరు అనుకుంటారు. కాదు. చేస్తున్న పనిని ఆనందించటమే విజయం.

మంచి క్రికెటరు ఆట ఆనందించటానికి గ్రౌండ్‌కి వెళ్తాడు. చూడటానికి కాదు. మంచి పిల్లలు చదువు ఆనందించటానికి కాలేజీకి వెళ్తారు. **కబుర్లు చెప్పటానికి కాదు. చూడటానికి గ్రౌండుకెళ్ళే వారిని ప్రేక్షకులు అంటాము. కబుర్లు చెప్పటానికి కాలేజీకి వెళ్ళేవారిని ఏమంటారో మీరే ఆలోచించండి.**

ఇక్కడో ముఖ్య విషయం గమనించండి. ఇంకొకరి ఆట చూడటం తప్పు కాదు. కానీ మనం కూడా ఏదో ఒక ఆట ఆడాలి. ఇంకొకరి ఆట చూడటం కన్నా మనం ఆడే ఆట ఎక్కువ సంతోషాన్ని ఇస్తుంది. మనం కొట్టే చప్పట్లకన్న, మనకోసం కొట్టే చప్పట్లు ఎక్కువ సంతోషాన్నిస్తాయని ముందే చదువుకున్నాము కదా. కొందరు ఈ వాదన ఒప్పుకోకపోవచ్చు. అయితే చూస్తూనే వుండండి. సంతోషం పొందుతూనే వుండండి. కానీ ఒక్క విషయం నిజమో కాదో ఆలోచించండి.

మీరు ఒకరోజు కాలేజీకి వెళ్ళి వచ్చారంటే, ఆ రోజు కనీసం ఒకటైనా కొత్త విషయం తెలుసుకోవాలి. జ్ఞానమూ, క్రమశిక్షణా ప్లస్ అవ్వాలి. వ్యసనాలూ, అనైతిక విలువలూ మైనస్ అవ్వాలి.

"నా మానసిక ఆరోగ్యానికి నేను మాత్రమే బాధ్యుడిని" అని బలంగా నమ్మండి. మన దైనందిన జీవితంలో జరిగిన ప్రతీ సంఘటన, అనుభవం మన మనసులో ఆహ్లాదకరమైనదిగానూ, దుఃఖభరితమైనది గానూ లేక తటస్థమైనదిగానూ నిలిచిపోతుంది. ఆహ్లాదకరం కాని సంఘటనలు మనసుని కృంగదీస్తాయి. వాటి ప్రభా వం ఆరోగ్యం మీద కూడా వుంటుంది. దానివల్లే తొందరగా ముసలితనం వచ్చేస్తుంది.

చరిత్రలో నిలచిన గొప్పగొప్ప నాయకులు, శాస్త్రవేత్తలు, పుణ్యపురుషులు ఎనభై ఏళ్ళకు పైగా ఆరోగ్యంగా జీవించటానికి, వృద్ధాప్యం వరకూ ఆరోగ్యకరంగా పని చేయటానికి కారణం... వారి పనుల్లో వారికి కలిగే ఆనందమే.

(ఇంకావుంది)

మంచి పేరెంటింగ్-గ్రేట్ పేరెంటింగ్



ఆ కుర్రవాడి తండ్రి ఏడాది వయసులో మరణించాడు. పదేళ్ళ వయసు ఉన్నప్పుడు ఆ కుర్రవాడు తోటలో పళ్ళు దొంగతనం చేస్తూ వుంటే మాలి పట్టుకుని కొట్టటం ప్రారంభించాడు. "నాకు తండ్రి లేడు. దయచేసి కొట్టకు. వదిలెయ్" అని ఆ కుర్రవాడు ప్రాధేయపడ్డాడు. మాలి అతడిని వదిలేస్తూ, "అందుకే నీవు మరింత గౌరవంగా బ్రతకాలి" అన్నాడు. ఆ మాటలు కుర్రవాడి మీద ఎంత గొప్ప ప్రభావం చూపించాయంటే, ఆ తరువాత అతడు భారతదేశపు ప్రధాన మంత్రులందర్లోకి నిజాయితీ వున్న వాడుగా చరిత్రలో నిలిచాడు. అతడి పేరు లాల్‌బహదూర్ శాస్త్రి.

మంచి తండ్రి:

పిల్లల్ని గమ్యానికి తీసుకెళ్ళే వాహనం 'క్రమశిక్షణ' అయితే, దానికి పెట్రోలు 'ప్రేమ'...! ఆప్యాయతతో నిద్రలేపి, కమిట్‌మెంట్‌తో పనులు చేయించి, కబుర్లతో నిద్రపుచ్చే బాధ్యత తల్లిదైతే; గైడ్‌గా ప్రారంభించి, గురువుగా 'క్రమ'శిక్షించి, ఆపై స్నేహితుడుగా మారి తీర్చిదిద్దవలసిన బాధ్యత తండ్రిది.

భగవంతుడు అన్నిచోట్లా దీపం పట్టుకుని నిలబడి దారి చూపించలేడు. అందుకే తండ్రుల్ని సృష్టించాడు. అమ్మ మమకారం అందిస్తే, నాన్న ధైర్యం ఇస్తాడు. అమ్మలా అక్కున చేర్చుకోకపోవచ్చు. కానీ వెన్నెముక బలంగా అయ్యేందుకు తోడ్పడ్డాడు.

ఇంట్లో తండ్రి బావుంటే అబ్దుల్ కలాంలూ, తల్లి బావుంటే థెరిస్సాలూ తయారవుతారు.

తండ్రి అవటం సులభం. మంచి సంతానానికి తండ్రి అవటం కష్టం.

చిన్న పిల్లలకంటే టీనేజ్ వయసులోనే పెద్దల అవసరం ఎక్కువ ఉంటుందట. పద్నాలుగేళ్ళుదాటిన పిల్లల్లో ముగ్గురిలో ఒకరు: "ఒంటరితనం, చెడు స్నేహం, ఓవర్ కాన్ఫిడెన్స్ లేదా పిరికితనం, తాను నమ్మిందే వేదం, కోపం, బద్ధకం, అతివాగుడు, హైపర్ ఆక్టివిటి" లాంటి అలవాట్లలో కనీసం రెండు లేక మూడిటితో బాధ పడుతూ వుంటారని సైకాలజిస్టుల అంచనా. పదిలో కనీసం ముగ్గురు తల్లుల మాట వినకుండా డామినేట్ చేస్తూ ఉంటారట.



తండ్రితో (ముఖ్యంగా మగపిల్లలు) సరిగ్గా మాట్లాడరట.

తండ్రులు పిల్లలపై వారానికి ఇరవైసార్లు నెగెటివ్ కామెంట్స్ చేస్తే, కేవలం అయిదుసార్లు మాత్రమే పొగుడుతారని; సగటున రోజుకి అయిదుసార్లు తిడతారని గణాంకాలు చెపుతున్నాయి.

"నేను రాక్షసుల్నీ, భూతాల్నీ పెంచుతున్నానా?" అన్నది మీ ప్రశ్న అయితే దానికి సమాధానం.. 'కాదు'. నిశ్చయంగా కాదు...! తప్పు పిల్లలది కాదు. మనది.

ఇంట్లో కుటుంబ సభ్యులందరూ నవ్వుతూ గెంతుతూ, మధ్యలో మాటిమాటికీ ఆనంద బాష్పాలు తుడుచుకుంటూ ఉండటం, ప్రేమ ఆప్యాయతలు డ్రాయింగ్ రూం నుంచి బెడ్‌రూం ద్వారా వంటింట్లోకి ప్రవహించటం, కేవలం టీ.వీ. అడ్వర్‌టైజ్‌మెంట్‌లలోనే చూస్తాం. ఏ ఇల్లూ ఘర్షణలు లేకుండా ఉండదు. అయితే కొద్ది ప్రయత్నంతో హౌస్‌ని హోమ్ చేసుకోవచ్చు. బంధం మల్లెతీగ లాంటిది. కాలంతోపాటు అదిపెరిగి బలీయమవ్వాలి.

ఎదిగిన పేరెంట్‌కీ, ఎదుగుతున్న ఒక వ్యక్తిత్వానికీ మధ్య ఘర్షణే అల్లరి.

పిల్లల్ని పెంచే విధానం వారి వయసుతో పాటు మారాలి. చిన్నప్పుడు పక్కనపడుకోబెట్టుకుని కథలు చెప్పాలి. ఒక వయసొచ్చాక 'ది హిందూ'లాంటి వార్తా పత్రికలు చదివే అలవాటు చెయ్యాలి... TELL MY WHY లాంటి మాస పత్రిక (ఖరీదు కేవలం 25 రూపాయలు) చదివించాలి. డైనింగ్ టేబిల్ దగ్గర ఈ విషయాలన్నీ చర్చిస్తే పిల్లల్లో లోకజ్ఞానమే కాకుండా, కుటుంబ సభ్యుల మధ్య కమ్యూనికేషన్ కూడా పెరుగుతుంది.

కొంత వయసు వచ్చేవరకూ పిల్లలకి నాట్యం నేర్పటం కూడా మంచిదే. దానివల్ల కెనెటిక్ ఎనర్జీ విడుదల అవుతుంది. గ్రీకులో కెనెసిస్ అంటే 'కదలిక'. మనసుకీ, శరీరానికి ఇది అనుసంధానంగా పనిచేసి, జ్ఞాపకశక్తినీ, చురుకుదనాన్నీ పెంచి, శారీరకంగా మానసికంగా ఎదగటానికి పనిచేస్తుంది. ముఖ్యంగా ఇంట్రావర్ట్స్‌కి నాట్యం బాగా ఉపయోగపడుతుంది.


పిల్లలు ఏం చదవాలో ముందే నిర్ణయం చేసెయ్యటం మరొక ప్రమాదకరమైన పరిణామం. "మా వాడిని న్యూరోసర్జన్ చేద్దామనుకుంటున్నాము" అని స్నేహితుల దగ్గర తరచూ ప్రకటించటం వల్ల పిల్లవాడికి మిగతా అన్ని కోర్సులూ చాలా చిన్నవిగా కనపడతాయి. ప్రవేశపరీక్షలో లక్షలలో రాంకు వస్తే మానసికంగా కృంగిపోతాడు.

కొంతమంది తండ్రులు ఏదైనా అత్యంత క్లిష్టమైన నిర్ణయం తీసుకోవలసివచ్చినప్పుడు మాత్రమే చదువు విషయం పిల్లల్తో చర్చిస్తారు. చిత్రమేమి

ప్రేమ ఒక కళ

(23)

-యండమూరి వీరేంద్రనాథ్



సెల్: 92465 02662



టంటే, ఆ సమయంలో పిల్లలూ, పెద్దలూ కూడా తమతమ స్నేహితుల అభిప్రాయాలకే ఎక్కువ విలువ ఇస్తారు.

"నేను ఆస్ట్రోనాటిక్ ఇంజనీరింగ్ చదివి రోదసీ యాత్రికుడిని అవుతాను" అని పదో తరగతి చదివే కొడుకు ప్రకటిస్తాడు. "రాకెట్‌లో ప్రయాణించటానికి ఇంజనీరింగ్‌కి ఏ సంబంధమూ లేదు. అయినా ఇండియా ఇప్పట్లో ఎవర్నీ రోదసీలో పంపబోవటం లేదు. ఈ మధ్య ఏ దేశమూ అంతఖర్చుపెట్టి రోదసీ ప్రయోగాలు చేయటం లేదు..." అంటూ తండ్రి తన విజ్ఞానాన్ని ప్రదర్శించబోతూండగా కొడుకు లేచి, "అదంతా నాకు తెలీదు. నేనూ నా స్నేహితుడు అలా డిసైడ్ అయిపోయామంతే..." అంటూ అక్కణ్నుంచి వెళ్ళిపోతాడు.

నాలుగు రకాల తండ్రులు:

"మంచి" పేరెంటింగ్ కీ "గ్రేట్" పేరెంటింగ్‌కీ మధ్యనున్న గీత చాలా సన్నగా వుంటుంది.

వినయ విధేయతలూ, మర్యాద మంచితనం, సంస్కారాల్తో పెంచితే దాన్ని "మంచి" పెంపకం అంటారు. పోటీకితోడు చురుకుదనమూ, ఆటలూ, హుషారు, తెలివీ కూడా పెంపొందించగలిగితే "గ్రేట్" పెంపకం అంటాం.

పరీక్షలు ఇంకో వారం రోజుల్లో ఉన్నాయనగా ఒక కొడుకు "పక్కఊరి గుడికి మా స్నేహితులు అందరూ వెళ్తున్నారు. అక్కడ గుండు గీయించుకొని, చెరువులో మునిగి, దేవుడికి దండం పెట్టుకుంటే ఫస్టు ర్యాంకు వస్తుందట" అని చెప్పాడనుకుందాం. వివిధ రకాల తండ్రులు ఏ విధంగా ప్రవర్తిస్తారో చూద్దాం.

1. హిరణ్యకశ్యపులు: "పరీక్షలు ఇంకో వారం రోజుల్లో పెట్టుకొని గుళ్ళకీ, గోపురాలకీ తిరుగుతావా? (మధ్యలో భార్య అడ్డొస్తే) నోర్ముయ్...! నీ మూలానే వీడిలా తయారయ్యాడు" అంటారు హిరణ్యకశిపులు. పిల్లల్ని సొంతంగా ఆలోచించనివ్వకుండా ప్రతీ చిన్న విషయంలోనూ వేలు పెట్టటం, క్రమశిక్షణ పేరుతో కొట్టటం, తిట్టటం, తాముసాధించలేని పెద్దపెద్ద ఆశలు పిల్లవాడి మీద పెట్టుకోవటం, అవి తీరకపోతే నిరాశతో మరింత రాక్షసులుగా మారటం, ఇంట్లో తమ మాటే వేదవాక్కులా నడవాలి అనుకోవటం, ఈ టైపు తండ్రుల లక్షణాలు. **వీళ్ళకి తమ మీదా, తమ మేధస్సు మీదా గొప్ప నమ్మకం.** హిరణ్యకశ్యపుల పిల్లలు ఎస్కేపిస్టులవుతారు. పై ఉదాహరణలో ఆ పిల్లవాడు గాని పరీక్ష ఫెయిల్ అయితే "నా తప్పేమీ లేదు. గుడికి వెళ్తానంటే నాన్న వద్దన్నాడు. అందువల్ల భగవంతుడు నా తండ్రిపై ఈ విధంగా కక్ష తీర్చుకున్నాడు" అని ఎస్కేప్ అయిపోతాడు.

2. ధృతరాష్ట్రులు: కొంతమంది తల్లిదండ్రులు పిల్లల పట్ల చాలా భయంతోనూ, బలహీనతతోనూ ఉంటారు. "తప్పకుండా వెళ్దాం నాయనా...! రేపే వెళ్దాం...! నీతోపాటు నేనూ, మీ అమ్మ, అక్కయ్య కూడా గుండు కొట్టించుకుంటాం. నువ్వు పాసయితే మాకదే చాలు. మేమెప్పుడయినా కాదన్నామా?" అంటారు ధృతరాష్ట్రులు. వీళ్ళకి సంతానం ఏది చెప్తే అదే వేదం. పిల్లల మానసిక అవసరాలను పట్టించుకోకపోవటం, దాన్ని కప్పిపుచ్చుకోవటానికి పిల్లవాడు ఏది అడిగితే అది ఇవ్వటం ఈ రకపు తల్లిదండ్రుల అవలక్షణాలు. ఆ తరువాత పిల్లవాడు ఫెయిల్ అయితే "... భగవంతుడి మీద (చదవటం మానేసి) భారం మోపాను. నేనేం చెయ్యను" అని సమర్థించుకుంటాడు. చాలామంది తాగుబోతులూ, క్లబ్బుల్లో జూదగాళ్ళూ, రాజకీయ నాయకులూ, తమ తమ రంగాల్లో చాలా బిజీగా ఉన్నాం అనుకొనే వారూ ఈ విభాగంలోకివస్తారు. మరికొందరు పెద్దలు "నే చిన్నప్పుడు ఇవన్నీ అనుభవించలేదు. మా పిల్లలైనా అనుభవించనీ..." అన్న ఉద్దేశ్యంతో పిల్లల్ని విపరీతమైన గారాబంతో పెంచుతూ వారి భవిష్యత్తుని పాడు చేస్తారు. పిల్లలు హుక్కా హౌసుల్లో గంజాయికి అలవాటు పడటానికి, చిన్న వయస్సులోనే కారు ఆక్సిడెంట్స్‌లో మరణించటానికి ఇలాంటి తల్లిదండ్రులే కారణం.

3. దుర్యోధనులు: ధృతరాష్ట్రుడి కొడుకులు అహంభావులుగా తయారయితే, దుర్యోధనుడి కొడుకులు ఆత్మస్థయిర్యం తక్కువ ఉన్న వారుగా తయారవుతారు. పిరికితనానికి మరోపేరైన లక్ష్మణ కుమారుడు ఇతడి కొడుకు. ఇతడి ప్రస్తావన ఉదాహరణకే తప్ప వాదనకి కాదు. ఇలాంటి పేరెంట్స్ అర్థం పర్థం లేని తమ భయాలతో పిల్లలని మానసికంగా బలహీనుల్ని చేస్తారు. కూతురికి ఐ.ఐ.టి. సీటు వస్తే 'తాము నివసించే ప్రాంతానికి అది దూరం' అని వదులుకున్న తల్లిదండ్రులు కూడా నాకు తెలుసు. ఒక అమ్మాయి ఎం.ఎస్.సుబ్బలక్ష్మి స్వరంతో కర్నాటక సంగీతం అద్భుతంగా పాడుతుంది. చదువు పాడవుతుందన్న ఉద్దేశ్యంతో తల్లిదండ్రులు బలవంతంగా ఆ ట్రైనింగ్ మానిపించారు.

4. జనకమహారాజులు: చిన్నతనంలోనే పిల్లల్ని గురుకులానికి పంపించివేయటం వల్ల, పిల్లల్ని బాగా పెంచే బాధ్యత తీసుకున్న మంచి తండ్రులు పురాణాల్లో తక్కువ కనపడతారు. దశరథుడు, అర్జునుడు లాంటి వారు కొంతవరకూ మంచి ఉదాహరణలు. జనకమహారాజు తన కూతురైన సీతని గొప్పగా పెంచాడని, స్త్రీలకి ఆమె రోల్ మోడలనీ పెద్దలు చెపుతారు. ఒకవైపు స్త్రీ ధర్మాన్ని, మరొకవైపు ఆత్మగౌరవాన్నీ బోధించిన జనకుడు ఉత్తమతండ్రి అంటారు. స్త్రీ వాదుల విమర్శలు పక్కన పెట్టి, పేరెంటింగ్ గురించి చర్చిద్దాం. బాధ్యత తెలిసిన తల్లిదండ్రులు పిల్లలకి చేదోడువాదోడుగా నిలిచి, వాళ్ళ గమ్యాన్ని నిర్దేశించుకోవటానికి సహాయ పడతారు. అర్థవంతమైన భావాలున్న తండ్రి ఈ విధంగా అంటాడు. "నేను నీ నమ్మకాన్ని కాదనను. కానీ చదువుకోవటం ముఖ్యం. నమ్మకం తరువాత. పరీక్షలు ఇంకో వారం రోజుల్లో పెట్టుకొని ఇప్పుడు ఈ ప్రయాణాల్తో చదువు పాడవుతుంది. పరీక్షలయ్యాక తప్పకుండా వెళ్దాం. కానీ కేవలం చెరువులో మునిగి, గుండు గీయించుకుంటేనే ఫస్ట్ ర్యాంకు వస్తే, ఈ పాటికి ఈ చుట్టుపక్కల చాలామంది విద్యార్థులకి రావాలి కదా? తార్కికంగా ఆలోచించు'.

కూతురిపై తండ్రి ప్రభావం:

ఒక ఇల్లు కట్టడం సులభం. ఒక హోమ్ నిర్మించడం కష్టం. ఎక్కడ తండ్రి స్నేహ పూర్వకంగానూ మరియు అన్నదమ్ములు అభిమానంగానూ ఉంటా

సినిమాలు, కబుర్లు, ఇంటర్నెట్... ఇవన్నీ మత్తెక్కించే అభిరుచులు. అవే వ్యసనాలుగా మారతాయి. పిల్లలకీ అవే అలవాట్లు వస్తాయి. ఆనందం దేన్లో అయినా ఒకటే అయినప్పుడు ఉపయోగపడే అభిరుచుల్నే వ్యసనాలుగా ఎందుకు చేసుకోరు?

రో, ఎక్కడ తల్లి దయాపూరితంగానూ, ఇంట్లో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందో, అక్కడ అమ్మాయిలు అవాంఛనీయమైన ప్రేమకోసం త్వరపడరు.

ఆహ్లాదకరంగా అంటే 'వైభవంతంగా, ధనవంతంగా, సుఖవంతంగా' అని అర్థం కాదు. ఐడెంటిటీ క్రైసిస్, చెడు స్నేహప్రభావం లాంటి మనోవైకల్యాలు లేని వాతావరణం. యుక్త వయస్సులో అమ్మాయికి అతి ముఖ్యమైన వ్యక్తి తండ్రి. స్నేహితురాలు తల్లి. తండ్రి రక్షణ ఇస్తున్నప్పుడు, తల్లి మార్గనిర్దేశం చేసినప్పుడు, ఆమెకు సైకలాజికల్ మరియు ఫిజియలాజికల్గా వచ్చే మార్పులను అంగీకరించే ధైర్యం వస్తుంది.

కూతురు ప్రేమలో పడిందని తెలియగానే ఇంట్లోవారు. సమాజాన్నీ, సినిమాల్నీ తిడతారు. దానికి తామే కారణమని ఒప్పుకోరు. ఇంట్లో సంబంధాలు (ముఖ్యంగా తండ్రితో) బావుంటే ఆడపిల్లలు బయట ప్రేమని వెతుక్కోరు. స్నేహితుల ప్రభావం. సినిమాల ప్రభావం పక్కన పెడితే, 'ఈ ఇంట్లోంచి ఎంత తొందరగా బయట పడదామా' అన్న ఆలోచనే ఆడపిల్లల్ని అతి చిన్న వయసులో ప్రేమలో పడేలా చేస్తుంది.

పిల్లలపై తల్లి ప్రభావం:

పిల్లలకు మంచిమార్కులు రావటం లేదని కౌన్సిలర్ల దగ్గరకు తీసుకొచ్చే తండ్రులకు ఒకటే ప్రశ్న. "ఆఫీస్ ఎన్నింటికి అయిపోతుంది? ఎన్నింటికీ మీరు ఇంటికి వస్తున్నారు?" తల్లులకు కూడా మరో ప్రశ్న. "మీ పిల్లలు ఇంటర్ లోపువారయితే, వారు చదువుకుంటూ ఉండగా మీరు రాత్రిళ్ళు ఎంతసేపు వారి ప్రక్కన కూర్చుంటున్నారు?" వారికి చదువు చెప్పనవసరం లేదు. మీరు కూడా ఏ పుస్తకమో చదువుతూ పక్కన కూర్చుంటే, 'మేమొక్కరిమే కష్టపడుతూంటే వాళ్ళు ఎంజాయ్ చేస్తున్నారు' అన్న ఫీలింగ్ పిల్లల్లో పోతుంది.

ఇతర ఆలోచనలు ఏమీ వుండవు కాబట్టి చిన్న పిల్లల్లో వర్జిన్ తెలివీ, అసాధారణ జ్ఞాపకశక్తి వుంటుంది. ఆ సమయంలోనే వారు 'చూసేవారుగా గానీ - చేసేవారుగా గానీ'గా విడిపోతారు. వారు ఎలా మారతారు? అన్నది తల్లిదండ్రుల మీదే ఆధారపడి వుంటుంది.

పక్కన కూర్చోబెట్టుకుని పాట నేర్పిస్తే 'పాడేవారు'గా మారతారు. పక్కన కూర్చో బెట్టుకుని టివిలో పాట చూపిస్తే 'చూసేవారు'గా మారతారు.

చాలామంది తల్లిదండ్రులు పిల్లల్లో చిత్రలేఖనం, మ్యూజిక్లాంటి మంచి అభిరుచిని మొగ్గలోనే త్రుంచేస్తారు. 'ఇంకే అభిరుచి, ఆర్టూ లేని పిల్లలు స్నేహితులమీదా, అతి వాగుడుమీదా, టి.వీ. మీదా ఎక్కువ ఆధారపడతారన్న చిన్న విషయం పేరెంట్స్ తెలుసుకుంటే బావుంటుంది.

చూసేవారికన్నా చేసేవారు ఎక్కువ ఆనందంగా వుంటారని పిల్లలకి చిన్నప్పుడే అర్థమయ్యేలా ట్రైనింగ్ ఇవ్వాలి. పగలు మ్యాచ్ ఆడి, సాయంత్రం 'టీ.వీ యాడ్'లో నటించి, రాత్రి ప్రధానమంత్రి ఇచ్చిన విందులో సినిమా తారల మధ్య పాల్గొని ఒక క్రికెటర్ ఆనందంతో పాటు డబ్బూ, కీర్తి సంపాదిస్తాడు.

ప్రేక్షకుడు కేబుల్ ఆపరేటర్కి డబ్బు ఇచ్చి ముందు క్రికెట్ మ్యాచ్ చూసి, ఆ తరువాత 'నీ కొత్త మొగుడే నా పాత మొగుడు.... మనిద్దరికీ ఒకడే మొగుడు...' లాంటి సీరియల్స్ చూసి ఆనందం పొందుతాడు. ఎవరు ఎక్కువ ఆనందంగా ఉన్నారు?

ఒక పిల్లవాడి భవిష్యత్తు అతడి తల్లిదండ్రుల పెంపకం మీద ఆధారపడి ఉంటుందనటానికి వాస్తవంగా జరిగిన రెండు సంఘటనలకి కొంత నాటకీయత కలిపి వ్రాస్తాను.

నేను స్క్రిప్ట్ వర్క్చేసిన సినిమా రిలీజ్ అయిన కొత్తలో, అందులో నటించిన ఇద్దరు ముగ్గురు నటులతో కలిసి చిత్తూరు వెళ్ళటం సంభవించింది.

అక్కడ ఒక మిత్రుడు మధ్యాహ్నం విందు ఇచ్చాడు. సినిమా వారిని చూడటానికి పక్కింటాయన తన కుటుంబాన్ని తీసుకొని వచ్చాడు. తన పిల్లలు బాగా నాట్యం చేస్తారనీ, మమ్మల్ని చూడమని అడిగాడు. అదే సినిమాలో పాట, "అబ్బ నీ తీయనీ దెబ్బ... ఎంత కమ్మగా వుందిరా అబ్బ" అని మెడ వెనక చేతులు పెట్టి, ముందుకీ వెనక్కీ శరీరం కదుపుతూ ఎనిమిదేళ్ళ అమ్మాయి, "ఎంత లేతగా ఉన్నదే మొగ్గ" అని ఆ పాప అన్నయ్యా కలిసి నాట్యం చేస్తూ వుంటే, నేనూ జంధ్యాల తప్ప అందరూ ఆనందించారు - తండ్రితో సహా!



ఇది జరిగిన కొన్ని రోజులు అటు ఇటుగా నా 'వెన్నెల్లో ఆడపిల్ల' నవల ఆధారంగా కన్నడలో నిర్మించబడిన చిత్రం రిలీజయింది. ఆ చిత్రానికి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ చిత్రం అవార్డు కూడా వచ్చింది. అందులో హీరో చదరంగం ఆటగాడు. మొత్తం చిత్రం అంతా చదరంగం మీదే నడుస్తుంది.

ఆ సినీ దర్శకుడు సునీల్కుమార్ దేశాయ్ ఆహ్వానం ప్రకారం ఆ చిత్రాన్ని చూడటానికి బెంగళూరు వెళ్ళినప్పుడు తనకు తెలిసిన ఒక కుటుంబాన్ని పరిచయం చేస్తూ, "వీరి అబ్బాయి కూడా చదరంగం ఆడతాడు" అన్నాడు. తన కొడుక్కి చిన్నతనం నుంచీ ఉత్సాహంతో చదరంగం నేర్పానని చెప్పారు ఆ అబ్బాయి తల్లి. అతను మద్రాసు డాన్ బాస్కో స్కూల్లో చదివినట్టు నాకు గుర్తు.

ఇది జరిగిన పాతిక సంవత్సరాలకి ఒకామె, నా మిత్రుడు దగ్గరికి కౌన్సిలింగ్కి వచ్చింది. నన్ను గుర్తుపట్టి, "నేను జ్ఞాపకం వున్నానా సార్... మీరు చిత్తూరు వచ్చినప్పుడు మా నాయిన మీ దగ్గరికి నన్నూ, అన్నయ్యనీ తీసుకొచ్చాడు" అని గుర్తుచేసింది.

తలూపి, "అన్నయ్య ఏం చేస్తున్నాడు?" అని అడిగాను.

"ఆటో గారేజ్లో మెకానిక్గా పని చేస్తున్నాడు" అన్నది. ఆ రోజు అతని తండ్రి 'మా వాడిని ఐ.ఐ.టి. చదివించాలని వుంది' అని చెప్పటం గుర్తున్నది.

ఆమె సైకాలజిస్ట్ దగ్గరికి వచ్చింది - డిప్రెషన్ నుంచి బయట పడటం కోసం...! భర్త తాగుబోతు. బాగా కొడతాడు. పిల్లలు సరిగ్గా చదవరు. ఆర్థిక సమస్యలు. దీనికి తోడు ఆరోగ్య సమస్య. డిప్రెషన్కి అవీ కారణాలు.

ఆ రోజు నాట్యం చేసినట్టూ, కమ్మగా వుండే తీయని దెబ్బలు కావు. ఇవన్నీ జీవితం మీద వాస్తవం కొరడా ఝుళిపించిన దెబ్బలు...!

అంతకు కొన్నేళ్ళ క్రితమే నా కన్నడ దర్శక మిత్రుడు, తన స్నేహితుడి కొడుకుకి ఖేల్రత్న అవార్డ్ వచ్చిందని చెప్పాడు. ఆ తరువాత పద్మవిభూషణ్ కూడా వచ్చింది. ఆ కుర్రవాడి పేరు విశ్వనాథన్ ఆనంద్...! పాతిక సంవత్సరాల క్రితం నేను మాట్లాడింది విశ్వనాథన్ ఆనంద్ గురించి, అతడి తల్లితో... అని తెలిసి చాలా థ్రిల్లింగ్గా ఫీలయ్యాను.

పిల్లల భవిష్యత్తుపై పెద్దల ప్రభావం ఎంతవరకూ వుంటుందన్న విషయమై అప్పుడే నాకు ఒక ఆలోచన వచ్చి, దాని ఆధారంగానే "ధ్యేయం" అన్న నవల వ్రాసాను.

చాలామంది ఒక్క విషయం ఎందుకు అర్థం చేసుకోరు? సినిమాలు, కబుర్లు, ఇంటర్నెట్ ఇవన్నీ మత్తెక్కించే అభిరుచులు. ఒకమ్మాయి తల్లిగా మారేసరికి ఈ అభిరుచులు వ్యసనాలుగా మారతాయి. అవే అలవాట్లు పిల్లలకీ వస్తాయి. దేనిలోనైనా ఆనందం ఒకటే అయినప్పుడు, చాలామంది 'ఉపయోగపడే' ఆనందాన్ని వ్యసనంగా ఎందుకు చేసుకోరు? పై సంఘటనలో ఒక అన్నా - చెల్లీ చౌకబారు నాట్యంలో ఎంత ఆనందం పొందారో, మరో కుర్రవాడు చదరంగం ఆటలో అంతే ఆనందం పొందాడుకదా!

(ఇంకా వుంది)

ప్రేమ ఒక కళ

24



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 92465 02662

స్పెన్సర్ అనే బాలుడి తండ్రి 18 నెలల వయసులో చనిపోతే, అతడి అంకుల్ చేరదీసాడు. 12 ఏళ్ళ వయసులో అంకుల్ కూడా చనిపోతే తల్లినీ, ఆంటీనీ పోషించటం కోసం చదువు మానేసి చిన్న మిల్లులో బాలకార్మికుడిగా చేరాడు స్పెన్సర్. ఆ సమయంలో ఆ ఊళ్ళో 'ఎలక్ట్రిసిటీ'తో నడిచే పేపర్ మిల్లు స్థాపిస్తున్నారన్న వార్త దావానంలా వ్యాపించింది. అప్పట్లో కరెంట్ అంటే ఏమిటో ఆ ప్రాంతంలో తెలీదు. ఆ మాటకొస్తే ఆ రోజుల్లో పల్లెల్లో కొత్తగా పరిచయం అవుతున్న పదం 'ఎలక్ట్రిసిటి'...! అతడా మిల్లులో కరెంట్ డిపార్ట్‌మెంట్‌లో పనివాడిగా చేరాడు.



ఆ సమయంలో టైటానిక్ అన్న ఓడ ఒక మంచు కొండని 'ఢీ' కొని మునిగిపోయింది. దానికి కారణం 'రాడార్లు సరిగ్గా పనిచేయకపోవటం' అని తెలిసి, దాని మీద ఇంటరెస్ట్ పెరిగి, అమెరికన్ నౌకాదళం వైర్‌లెస్ విభాగంలో చేరి, తొందర్లోనే రేడియో టెక్నాలజీలో ఎక్స్‌పర్ట్ అయ్యాడు స్పెన్సర్.

ఒకరోజు అతడు రాడార్ సెట్ పక్కన నిలబడి మాగ్నెట్రాన్స్ అమరుస్తూండగా, జేబులో ఉన్న క్యాడ్‌బరీస్ చాక్లెట్ కరిగి కారిపోయింది. అంతకు ముందు చాలామందికి ఆ విధంగా జరిగింది కానీ, అలా ఎందుకు జరిగిందో పరిశోధించాలనే ఆలోచన స్పెన్సర్‌కి మాత్రమే వచ్చింది. మొక్క జొన్న గింజల్ని రాడార్ పక్కన పెడితే అవి పేలి పోతాయి.

ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిసారి మైక్రోవేవ్డ్ పాప్‌కార్న్ ఆ విధంగా సృష్టించబడ్డాయి.

ఈసారి మరో ప్రయోగం చేసాడు. టీ కాచుకునే కెటిల్‌లో కోడిగుడ్డు పెట్టి, కెటిల్ మీద మాగ్నెట్రాన్స్‌ని ఉంచాడు. పొయ్యి మీద పదినిముషాలు పట్టేది, కేవలం నిముషంలో ఉడికిలోపలి గుడ్డు పేలిపోయి ఉత్సుకంగా తొంగి చూస్తున్న తోటి కార్మికుడి మొహానికి పెరేల్మని కొట్టింది. అందరూ ఆనందంతో ఎగిరి గంతేసారు.

తన పరిశోధనల ఆధారంగా వంటింట్లో ఆడవారికి ఉపయోగపడే పరికరాన్ని తయారు చేసాడు. 1947లో మొట్టమొదటి మైక్రోవేవ్ ఆ విధంగా తయారయ్యింది. అయితే అది బట్టల బీరువా అంత పెద్దది. ఖరీదు దాదాపు రెండు లక్షల రూపాయలుగా తేలింది. అతడు మళ్ళీ భగీరథ ప్రయత్నం మొదలుపెట్టాడు.

మరికొంత కాలానికి మనం ఇప్పుడు వాడుతున్న మైక్రోవేవ్ తయారు చేసాడు. ఇక ఆపై అతడికి ఎదురు లేకుండా పోయింది. తాను పని చేసే కంపెనీ తన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో ఒకరిగా అతడిని నియమించింది. ఆపైన అతడు జీవిత

వారానికి ఒకరోజైనా
తండ్రులు పిల్లలతో గడపాలి

కాలంలో మొత్తం 300 పేటెంట్స్‌కి యజమాని అయ్యాడు.

ఎనిమిదో క్లాసు కూడా చదవని స్పెన్సర్‌కి ఎన్నో యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లు ప్రధానం చేసాయి.

వారానికి ఒక్క రోజైనా స్నేహితులతో గడపడం మానేసి, పిల్లల పక్కమీద వారి పక్కనే పడుకుని ఇలాంటి వాస్తవాలు చెప్తే బావుండదా? ఆలోచించండి.

కొన్ని ఇళ్ళల్లో తండ్రులు పిల్లల బాధ్యతనంతా తల్లులమీద వదిలేసి రికామీగా తిరుగుతూ ఉంటారు. అప్పుడే ఆదికవి నన్నయ్య మహాభారతంలో వ్రాసిన ఖాండవ దహనమూ, అందులోని భైరవ పక్షీ గుర్తొస్తాయి.

ఇది ప్రళయాగ్ని పోలె దెసలెల్లను గప్పు(గ విస్ఫులింగముల్
వదలక... ఘనపాంసుజాలముల భీమ శిఖావళి తాకకుండగన్.

అగ్నిదేవుడు అడవిని దహిస్తున్నాడు. పశుపక్ష్యాదులు సజీవంగా దహనమైపోతున్నాయి. ఒకచెట్టుమీద జరిత అనే పక్షి నాలుగు పసికూనలతో ఉన్నది. మంటలు వ్యాపిస్తున్నాయి. పిల్లలు ఎగరటానికి రెక్కలు లేవు. "నా పిల్లలను నేను ఎలా రక్షించుకోను??" అని జరిత విలపిస్తోంది. జరిత భర్త మందపాలుడు రెండో భార్య లపితతో అడవి బయట విహరిస్తున్నాడు. పిల్లలు తల్లితో, "అమ్మా! మమ్మల్ని వదిలి ఆకాశానికెగిసి సుఖంగా జీవించు. నీవు జీవించి ఉంటేనే వంశం వృద్ధి చెందగలదు. పుత్ర ప్రేమతో కులనాశనం చెయ్యవలదు. వెళ్ళకుంటే మా మీద ఆన" అని తల్లిని వేడుకున్నాయి.

అక్కడ మందపాలుడు మంటలను చూసి రెండో భార్యతో "పసివాళ్ళు.. ఈ మహా మంటల్లో ఏమయినారో! జరిత ఒక్కతే నలుగురిని సంరక్షించలేక ఎంత యాతన పడుతోందో కదా" అన్నాడు. మందపాలుడు మమకారానికి లపితకి మండిపోయింది. "నా సవతిపై నీకు ఎంత మక్కువో మాటల ద్వారా తెలుస్తోంది. నాపై నీకు మోజు తగ్గిపోయింది. ఇక నేనెందుకు" అని దెప్పి పొడిచింది.

అడవిని కాల్చిన అగ్నిదేవుడు దయతో పిల్లల్ని దహించకుండా వదిలి వెళ్ళిపోయాడు. తల్లి వచ్చి పిల్లలు బ్రతికి ఉండటం చూసి ఆనందించింది. ఈలోపులో మందపాలుడు వచ్చి పక్కన వాలి, "అందరూ క్షేమమే కదా" అన్నాడు అప్పుడు. అదీ కథ.

మొగవాళ్ళ బాధ్యతా రాహిత్యాన్ని భూతద్దంలో చూపిస్తున్న ఈ పోలిక మరీ దరిద్రంగా ఉన్నదా? క్షమించాలి. పద్యాల ప్రసక్తి వచ్చింది కాబట్టి పనిలో పనిగా మరో విషయం కూడా చర్చిస్తే ఓ పనైపోతుంది.

పిల్లల్లో సాహిత్యాభిలాష:

తెలుగు సాహితీ కళామతల్లి గళానికి రతనాల హారం ఆదికవి నన్నయ అయితే, నడుముకి వడ్డాణం వేమన. ముక్కుకి ముక్కెర నానా సూన వితాన వాసనల తిమ్మన అయితే, వేలికి ఉంగరం బమ్మెర పోతన. కాలికి పెండేరం అల్లసాని పెద్దన.

పెద్దన వలె కృతిజెప్పిన పెద్దనవలె గానీ అల్పకవిని పెద్దనవలెనా? ఎద్దనవలె మొద్దనవలె గ్రద్దనవలె.

పూ(త మెఱుంగులుం బసరుపూ(పబెడంగులు(జూపునట్టివా కైతలు?

భూమిసురుని నెపంతో అల్లసానివారు 'అట' జని కాంచిన హిమాలయాల్లో ఆకాశం నుంచి కిందకి దూకే 'శిరస్-సరజ్-ఝరీ' సెలయేళ్ళ శబ్దం, ఆ కొండరాళ్ళని తాకే నీళ్ళ 'ముహుర్-ముహుర్-లుఠ' నవ్వడీ, 'అభంగ తరంగ మృదంగ' నాదం, మనకి కనిపించడమే కాదు. వినిపిస్తాయి కూడా.

పదాల అందం 70 ఎం.ఎం.లో కనిపిస్తూ, అర్థం శబ్దాల్లో ప్రతిధ్వనించే ఇలాంటి రచనని ఇంగ్లీషులో Onomatopoeia అంటారట.

ఇహ పోతే పోతన.

ఇంతింతై వటుడింతయై ఓ యమ్మ నీ కుమారుడు
నల్లనివాడు, పద్మనయనంబులవాడు
కృపారసంబు పై జల్లెడువాడు, సిరికిం జెప్పడు
శ్రీ కుచోపరిచేలాంచలమైన వీడడు మా ఇండ్లను పాలు పెరుగు మననీడమ్మా.

ప్రతి పద్యంలోనూ ఒక మహాద్భుత రూపాన్ని ప్రత్యక్షంగా చూపించి పాఠకులను చరితార్థులను జేసి కృతార్థుడయ్యాడు పోతన.

నన్నయ్యది నారికేళపాకమైతే, పోతనది కదళీ ఫలపాకం. ఆధునిక కవుల్లో పాపాయ్యది ద్రాక్ష పాకం.


'ముగ్ధసుకుమార సుగంధ మరంద మాధురీ జీవితమెల్ల మీకై త్యజించి కృశించి నశించి పోయే'

అంటాడాయన. చదువుతూంటే సరస రస సరళ మధుర పద వరస మేఘాలపై పుష్పక విమానంలో వెళ్తున్నట్టూ లేదూ?

ప్రపంచ సాహితీ చరిత్రలో నాటకానికి షేక్స్‌పియర్‌నీ, భావుకతకి కీట్స్‌ని, కరుణకి మిల్టన్‌నీ మించినవారు లేరని అంటారు. వీరు బహుశా నన్నయ్య భారతంలో నాటకీయతనీ, పోతన భాగవతంలో భావుకతనీ, కుంతీవిలాపంలో కరుణ రసాన్నీ చవి చూసి ఉండరు. ఈ ముగ్గురి చూపుడు వేలి కొసలకు ఆ ముగ్గురూ సరి రారని అంటే, ఆంగ్ల భాషాభిమానులకి కోపం వస్తుందేమో.

తెలుగు సాహితీ వనాన్ని అందాల తోటతో పోలిస్తే, ప్రబంధాలు రసాల మామిడిచెట్లు. శతకాలు మల్లె పొదలు, అన్నమయ్య పాట చెరకు తోట. ఆ తోటలో సుస్వర సుభాషితాలనాలపించే కోకిల ఏనుగు లక్ష్మణ కవి అయితే, తోట నడుమ పద్దెనిమిది యోజనాల విస్తీర్ణమున్న మూడు మర్రిచెట్లు కవిత్రయాలు. పక్కనే కవి సామ్రాట్ కల్పవృక్షం. తిలక్ సన్నజాజిపందిరి. దేవులపల్లి జాజిమల్లి. శ్రీశ్రీ ఎర్ర గులాబి. కన్యాశుల్కం ఘాటు మెరప. గుర్రం జాషువా చెంగలువ. పైకి ముళ్ళ లోపల తీపి, వెరసి పనస చలం. ముంత మామిడి ముళ్ళపూడి. వచన సాహిత్యం వంగతోట, వన మూలికలు వేమన పద్యాలు. అనవసరంగా పేరొచ్చిన వారు గడ్డి పూలు. వారిని వదిలేద్దాం.





ఇంత అద్భుతమైన భాష... సొగసు తేనెలూరు తీపి చెరుకు తెలుగు భాష... అతి సమీప భవిష్యత్తులో అదృశ్యమైపోతుందన్న ఆలోచనే దుఃఖం కలిగిస్తోంది. మారుతున్న ప్రపంచ అవసరాలని బట్టి మనిషి మారాల్సిందే. కానీ తెలుగుని కూడా కొంచెం బ్రతికించుకుంటే బావుంటుందేమో ఆలోచించండి. "లేదు డాడీ, సంస్కృతంలో అయితే నూటికి తొంభై వస్తాయి" అని పిల్లలంటే గెడ్డం పట్టుకుని బ్రతిమాలండి. "తెలుగా? హ్హహ్హ... ఇంగ్లీషు సొగసు దానికెక్కడిది??" ని వాదించే వారిని విని తిరిగి వాదించకండి. మనసులో

'....మందార మకరంద మాధుర్యము నఁదేలు మధుపంబు వోవునే మధుపములకు, నిర్మల మందాకినీ వీచికలఁ దూగు రాయంచ చనునే తరంగిణులకు'

అనుకోండి.

'ఈజిట్ టెల్గూ? ఆర్ తెల్గూ? విచ్చీజ్ కరెక్ట్?' అని ప్రశ్నించే పిల్లలకు మాతృభాష ప్రాశస్త్యం గురించి ఎంత తెలిస్తే అంత... తెలిసిన కొంచమైనా చెప్పండి.

చిన్నప్పుడు నాకో అనుమానం వచ్చింది '.. సుక్షత్రియుడైన లక్ష్మణుడు, కోరి వచ్చిన శూర్పణఖ ముక్కూ చెవులూ ఎందుకు కోసాడని...'అని. మా తండ్రిగారిని అడిగితే ఆయన తనకీ తెలీదన్నారు. ఆ తరువాత పాతికేళ్ళకి రామాయణ కల్పవృక్షం చదివి ఆయన నాకు విశ్వనాథ వారి తార్కిక వివరణ విశదీకరించారు.

శూర్పణఖ తనని పెళ్ళాడమని కోరినప్పుడు, ఆమె నుంచి తప్పించుకోవటానికి లక్ష్మణుడు, "ఇప్పటికే అన్నా వదినల వంట కోసం వేటాడి వండలేక చస్తున్నాను. మళ్ళీ నీవొకదానివా? నీ బాన కడుపు చూస్తూంటే బేజారవుతోంది" అన్నాడట.

అప్పుడు శూర్పణఖ మనోహరమైన రాక్షస నవ్వుతో, "కంగారు పడకు నా మానస చోరా. నన్ను నీవు వివాహమాడితే అక్కకీ, బావగారికీ నేనే వేటాడి వండి పెడతాను. నా చెవులకు ఎంత శక్తి ఉన్నదంటే, వెయ్యి యోజనాల దూరంలో కుందేలు కదిలినా ఆ సవ్వడి నాకు వినిపిస్తుంది. నేను గట్టిగా గాలి పీలుస్తే, ఏనుగైనా నా ముందు వచ్చి పడాల్సిందే" అన్నదట.

అది విని మతిచెడి కలవరపడి లక్ష్మణుడు "ఓసీ! మేమీ అరణ్యవాసం చేస్తున్నదే నీలాంటి రాక్షసుల బారి నుంచి సాధు జంతువుల్నీ, సాధువులైన మునుల్నీ రక్షించటానికి" అంటూ ఆమె ముక్కూ చెవులూ కోసేసాడట. ఇందులో వాస్తవమెంతున్నదో కానీ విషయం మాత్రం తార్కికంగా ఉన్నది.

దీనికన్నా, కొడుకడిగిన ప్రశ్నని పాతిక సంవత్సరాలు గుర్తుంచుకుని తండ్రి నివృత్తి చేయటం ఇంకా బావున్నది కదా.



ప్రోత్సాహం:

పై దానికి వ్యతిరేక ఉదాహరణ కూడా చెప్తాను. నిజానికి దీన్ని రాయకూడదనుకున్నాను. కానీ ఒక వాస్తవ సంఘటన చెప్పటం ద్వారా, అది కొంతమంది తల్లులకి సహాయపడితే నష్టమేముంది? మనం కాజువల్‌గా తీసుకున్న కొన్ని విషయాలు చిన్నపిల్లల మీద ఎంతో ప్రభావాన్ని చూపిస్తాయి.

చిన్నప్పుడు నాకు మార్కులు బాగా వచ్చేవి కావు. నిజానికి ఐదవ క్లాసు ఒకసారి, ఆరో క్లాసు

ఒకసారి ఫెయిలయ్యాను. ఇదంతా మా తాత (అమ్మగారి నాన్న) గారాబం వల్ల జరిగింది. ఆయన మరణించాక మానాన్నగారి దగ్గరకు వెళ్ళి పోయాను. ప్రతీరోజు సాయంత్రాలు, దగ్గర కూర్చొని ఆయన అత్యంత శ్రద్ధతో చదువు చెప్ప డంతో ఏడవ తరగతిలో ఒక్కసారిగానాలో మార్పు వచ్చింది.

ఆ సంఘటన బాగా గుర్తు. అనంతపురం సాయిబాబా స్కూల్లో అర్ధ సంవత్సరపు పరీక్ష ఫలి తాల్లో మా లెఖ్ఖల టీచరు సమాధాన పత్రాల్ని బల్ల మీద పెట్టి ఒక్కొక్కరిని పిలిచి ఇస్తున్నారు. అందరి కన్నా తక్కువ మార్కులు వచ్చేవారి నుంచి వరు సగా పేర్చి ఆ పత్రాల్ని పెట్టారు. చివర్లో ఒకరికి తొంభై ఎనిమిది మార్కులు వచ్చాయి. ఇంక అడుగున ఒకటే మిగిలింది. అప్పటికి నన్నింకా పిలువలేదు. అయినా కూడా 'ఆ ఆన్సరు షీటు నాది' అన్న ఆలోచన నాకు రాలేదు. ఆఖరున నన్నుపిలిచారు. నూటికి నూరు మార్కులు అని ప్రకటించే సరికి పిల్లలంతా చప్పట్లు కొట్టారు. భోజన విరామ సమయంలో ఇంటికి ఒక రకమైన ఉద్వేగంతో దాదాపు పరిగెత్తుకుంటూ వచ్చాను. ఆ సమయంలో అమ్మ పక్కింటి వాళ్ళతో మాట్లాడు తోంది. ఆన్సర్ షీట్ చూపిస్తూ "...లెఖ్ఖల్లో నూటికి నూరు" అన్నాను ఆయాసంతో వగరుస్తూ. ఆమె చాలా క్యాజువల్‌గా "అలాగా. వంటింట్లో అన్నీ సర్ది పెట్టి ఉంచాను. వెళ్ళి భోజనం చెయ్యి" అని తిరిగి పక్కింటి వాళ్ళతో మాట్లాడటం ప్రారంభించింది. దాదాపు యాభై సంవత్సరాలు దాటినా ఈ సంఘ టన నాకు ఇంకా సజీవంగా గుర్తుంది. చిన్న చిన్న సంఘటనల ప్రభావం పిల్లలమీద గాఢమైన ముద్రవేస్తుంది అని చెప్పటానికి మాత్రమే ఈ ఉదాహరణ.

తల్లితండ్రులు వారానికి ఒక సారైనా పిల్లలతో గడుపుతూ తమకు తెలిసిన మంచి విషయాలు పిల్లలకు చెబుతూ వారిలో ఉత్సాహం పుట్టించేందుకు ప్రయత్నించాలి. ఆ విధంగా పిల్లలు జ్ఞానులు అవుతారు. ఇంటి పనుల బాధ్యత కూడా వారికి నేర్పాలి. పిల్లల తెలివితేటలు గుర్తించి వారికి బహుమతులు ఇస్తూ ఉండాలి.



జ్ఞానం పెంచే అలవాట్లు:

'చదువు చెప్పేది స్కూలయితే, తెలివి పెంచేది ఇల్లు' అని దాదాపు ప్రతి పుస్తకంలోనూ వ్రాస్తూ వుంటాను.

ఈ అద్భుతమైన వాస్తవ సంఘటన చద వండి. 'పది నిముషాల్లో ఈ లెఖ్ఖ చేస్తే ఎప్పటి నుంచో నువ్వు అడుగుతున్న సైకిల్ కొని పెడతాను.

ఒక వేళ చెయ్యలేకపోతే రేపు శని, ఆది వారాల్లో వంట పనంతా నువ్వు చేసి, అమ్మకి విశ్రాంతి ఇవ్వాలి" అని ఒక తండ్రి తన కొడుకుని ఉత్సాహపరిచాడు. ఆ కొడుకు పేరు జాన్. హాల్. కుర్రవాడు ఆ ఛాలెంజ్‌కి ఒప్పుకున్నాడు.

తండ్రి ఈ విధంగా ప్రశ్నించాడు "..... ఆఫ్ఘని స్తాన్ ముఖ్య పట్టణమైన కాబుల్ నుంచి ప్రొద్దున్న ఎనిమిది గంటలకి 'డిజర్ట్ ఎక్స్‌ప్రెస్' గంటకి 80 మైళ్ళ వేగంతో ఇస్లామాబాద్ వైపు బయలు దేరింది. పాకిస్థాన్ ముఖ్య పట్టణమైన ఇస్లామా బాద్ నుంచి ప్రొద్దున్న తొమ్మిదింటికి 'తుఫాన్ మెయిల్' గంటకి 60 మైళ్ళ వేగంతో కాబుల్ వైపు బయలుదేరింది. కాబుల్‌కి, ఇస్లామాబాద్‌కి మధ్య దూరం 480 మైళ్ళు అయితే, రెండు రైళ్ళూ మధ్యలో పెషావర్ దగ్గర కలుసుకున్నప్పుడు, ఏ ఇంజన్ కాబుల్‌కి దగ్గరగా ఉంటుంది?"

ఆ కుర్రవాడు 'కాలము-దూరం'పై రకరకాల లెక్కలు వేసి బుర్ర బద్దలుకొట్టుకుని, చివరికి ఆ ప్రశ్న లెక్కలకి సంబంధించినది కాదనీ, ఇంగిత జ్ఞానానికి (కామన్-సెన్స్)కి సంబంధించిందని తెలుసుకొని "ఒకే స్టేషన్‌లో ఆగి ఉన్నప్పుడు రెండూ కాబుల్‌కి ఒకే దూరంలో ఉంటాయి" అని చెప్పాడు.

ఇచ్చిన వాగ్దానం ప్రకారం కొడుక్కి సైకిల్ ఇవ్వటానికి ఒప్పుకుంటూ, "సైన్సు, లెక్కల తర్కం మీద ఆధారపడి ఉంటాయి. నేనడిగిన ప్రశ్నకి నువ్వు అనవసరంగా లెక్కలు కడుతూ సమయం వృధా చేసావు. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పా లంటే కావలసింది లెక్కలు కాదు. లాజిక్. ఆ విధంగా నువ్వు కరెక్టే. కాని ప్రశ్నని అర్థం చేసు కోవడం ఇంకా ముఖ్యం. నా ప్రశ్న నువ్వు సరిగ్గా వినలేదు. నేను ఇంజన్ గురించి అడిగానే తప్ప రైలు గురించి కాదు. కాబుల్ వైపు వెళ్తున్న రైలు తాలూకు ఇంజన్ కాబుల్‌కి దగ్గరగా వుంటుంది. నువ్వు ఇంకా బాగా ఆలోచించి వుంటే మరొక విషయం కూడా అర్థమయ్యేది. దాన్ని భౌగోళిక పరిజ్ఞానంతో కూడిన కామన్‌సెన్స్ అంటారు. ఆఫ్ఘనిస్తాన్‌లో అసలు రైళ్ళే లేవు."

తన తప్పు అర్థం చేసుకున్న ఆ కుర్రవాడు రెండు రోజుల పాటు వంటింటి పని చేపట్టాడు..!

అతడే జాన్ హాల్. పెద్దయ్యాక ఫిజిక్స్‌లో నోబుల్ ప్రైజ్ సంపాదించాడు.

తన ఆత్మకథలో ఒకచోట " .... పిల్లవాడు టి.విలో గంటల తరబడి ఫుట్‌బాల్ మ్యాచ్ చూడ కుండా వుండాలంటే 'గెలుపు కన్నా మంచి ఆనందం లేదు' అన్న విషయం అతడికి తెలిసేలా చేయాలి. ఒక లెక్క సాల్వ్ చేసినా, ఒక జోకు సొంతంగా తయారు చేసినా దానికి బహుమతి ఇస్తే, పిల్లలు మత్తు కలిగించే అభిరుచులు నుంచి, అభివృద్ధినిచ్చే అలవాటు వైపు మారతారు" అంటాడు.

పై ఉదాహరణలతో నాలుగు ముఖ్యమైన పాయింట్లు ఉన్నాయి.

1. పాఠశాలల్లో కేవలం చదువే చెపుతారు. పిల్లవాడికి జ్ఞానాన్ని పెంపొందించే విషయాలు బోధించవలసిన బాధ్యత తల్లిదండ్రులది.

2. చదువుకుంటున్న వయసులో కూడా పిల్లలు ఇంటి పనుల్లో బాధ్యత వహించేలా చేయాలి.

3. పిల్లల తెలివితేటల్ని గుర్తించి ఆ గుర్తింపుకి తగిన బహుమతులు ఇస్తూ ఉండాలి.

4. ఉత్సాహకరమైన ప్రశ్నలు వేసి ప్రోత్సహ పరిచే కొద్దీ పిల్లల్లో చదువంటే అలసత్వం, భయం పోయి చురుకుదనం పెరుగుతుంది.

ఇంటర్నెట్‌లో ఛాటింగ్ మానేసి సర్ఫింగ్ చేస్తే... సైన్సు, లిటరేచర్ మొదలైనవాటికి సంబం ధించిన బోలెడు విషయాలు దొరుకుతాయి. వాటి ని చదివి చెప్తే, చిన్నతనం నుంచే పిల్లలకి వాటి మీద ఇంటరెస్టు పుడుతుంది. స్పెన్సర్ కథ అలాంటిదే.

"మరొక 24 గంటల్లో ప్రపంచం అంతం అయి పోతుందని తెలిస్తే ఆ ఒక్క రోజు నువ్వు ఏం చేస్తావ్? ఒక ఫైర్ స్టేషన్ మంటల్లో తగలబడి పోవటం చూస్తే నువ్వు చేస్తావు? ఒకరోజు పాటు ఒక పక్షి లేదా జంతువులాగా వుండే అవకాశం వస్తే, దేనిలా ఉండాలని కోరుకుంటావు? ఎందుకు?" అడిగి ప్రశ్నలడిగి, తెలివైన సమా ధానాలకు బహుమతులను ఇవ్వండి.

(ఇంకా వుంది)

ఒకసారి ఫెయిలయ్యాను. ఇదంతా మా తాత (అమ్మగారి నాన్న) గారాబం వల్ల జరిగింది. ఆయన మరణించాక మానాన్నగారి దగ్గరకు వెళ్ళి పోయాను. ప్రతీరోజు సాయంత్రాలు, దగ్గర కూర్చొని ఆయన అత్యంత శ్రద్ధతో చదువు చెప్ప డంతో ఏడవ తరగతిలో ఒక్కసారిగానాలో మార్పు వచ్చింది.

ఆ సంఘటన బాగా గుర్తు. అనంతపురం సాయిబాబా స్కూల్లో అర్ధ సంవత్సరపు పరీక్ష ఫలి తాల్లో మా లెఖ్ఖల టీచరు సమాధాన పత్రాల్ని బల్ల మీద పెట్టి ఒక్కొక్కరిని పిలిచి ఇస్తున్నారు. అందరి కన్నా తక్కువ మార్కులు వచ్చేవారి నుంచి వరు సగా పేర్చి ఆ పత్రాల్ని పెట్టారు. చివర్లో ఒకరికి తొంభై ఎనిమిది మార్కులు వచ్చాయి. ఇంక అడుగున ఒకటే మిగిలింది. అప్పటికి నన్నింకా పిలువలేదు. అయినా కూడా 'ఆ ఆన్సరు షీటు

తల్లితండ్రులు వారానికి ఒక సారైనా పిల్లలతో గడుపుతూ తమకు తెలిసిన మంచి విషయాలు పిల్లలకు చెబుతూ వారిలో ఉత్సాహం పుట్టించేందుకు ప్రయత్నించాలి. ఆ విధంగా పిల్లలు జ్ఞానులు అవుతారు. ఇంటి పనుల బాధ్యత కూడా వారికి నేర్పాలి. పిల్లల తెలివితేటలు గుర్తించి వారికి బహుమతులు ఇస్తూ ఉండాలి.



నాది' అన్న ఆలోచన నాకు రాలేదు. ఆఖరున నన్నుపిలిచారు. నూటికి నూరు మార్కులు అని ప్రకటించే సరికి పిల్లలంతా చప్పట్లు కొట్టారు. భోజన విరామ సమయంలో ఇంటికి ఒక రకమైన ఉద్వేగంతో దాదాపు పరిగెత్తుకుంటూ వచ్చాను. ఆ సమయంలో అమ్మ పక్కింటి వాళ్ళతో మాట్లాడు తోంది. ఆన్సర్ షీట్ చూపిస్తూ "...లెఖ్ఖల్లో నూటికి నూరు" అన్నాను ఆయాసంతో వగరుస్తూ. ఆమె చాలా క్యాజువల్‌గా "అలాగా. వంటింట్లో అన్నీ సర్ది పెట్టి ఉంచాను. వెళ్ళి భోజనం చెయ్యి" అని తిరిగి పక్కింటి వాళ్ళతో మాట్లాడటం ప్రారంభించింది. దాదాపు యాభై సంవత్సరాలు దాటినా ఈ సంఘ టన నాకు ఇంకా సజీవంగా గుర్తుంది. చిన్న చిన్న సంఘటనల ప్రభావం పిల్లలమీద గాఢమైన ముద్రవేస్తుంది అని చెప్పటానికి మాత్రమే ఈ ఉదాహరణ.

జ్ఞానం పెంచే అలవాట్లు:

'చదువు చెప్పేది స్కూలయితే, తెలివి పెంచేది ఇల్లు' అని దాదాపు ప్రతి పుస్తకంలోనూ వ్రాస్తూ వుంటాను.

ఈ అద్భుతమైన వాస్తవ సంఘటన చద వండి. 'పది నిముషాల్లో ఈ లెఖ్ఖ చేస్తే ఎప్పటి నుంచో నువ్వు అడుగుతున్న సైకిల్ కొని పెడతాను.

ఒక వేళ చెయ్యలేకపోతే రేపు శని, ఆది వారాల్లో వంట పనంతా నువ్వు చేసి, అమ్మకి విశ్రాంతి ఇవ్వాలి" అని ఒక తండ్రి తన కొడుకుని ఉత్సాహపరిచాడు. ఆ కొడుకు పేరు జాన్. హాల్. కుర్రవాడు ఆ ఛాలెంజ్‌కి ఒప్పుకున్నాడు.

తండ్రి ఈ విధంగా ప్రశ్నించాడు ".... ఆఫ్ఘని స్తాన్ ముఖ్య పట్టణమైన కాబుల్ నుంచి ప్రొద్దున్న ఎనిమిది గంటలకి 'డిజర్ట్ ఎక్స్‌ప్రెస్' గంటకి 80 మైళ్ళ వేగంతో ఇస్లామాబాద్ వైపు బయలు దేరింది. పాకిస్థాన్ ముఖ్య పట్టణమైన ఇస్లామా బాద్ నుంచి ప్రొద్దున్న తొమ్మిదింటికి 'తుఫాన్ మెయిల్' గంటకి 60 మైళ్ళ వేగంతో కాబుల్ వైపు బయలుదేరింది. కాబుల్‌కి, ఇస్లామాబాద్‌కి మధ్య దూరం 480 మైళ్ళు అయితే, రెండు రైళ్ళూ మధ్యలో పెషావర్ దగ్గర కలుసుకున్నప్పుడు, ఏ ఇంజన్ కాబుల్‌కి దగ్గరగా ఉంటుంది?"

ఆ కుర్రవాడు 'కాలము-దూరం'పై రకరకాల లెక్కలు వేసి బుర్ర బద్దలుకొట్టుకుని, చివరికి ఆ ప్రశ్న లెక్కలకి సంబంధించినది కాదనీ, ఇంగిత జ్ఞానానికి (కామన్-సెన్స్)కి సంబంధించిందని తెలుసుకొని "ఒకే స్టేషన్‌లో ఆగి ఉన్నప్పుడు రెండూ కాబుల్‌కి ఒకే దూరంలో ఉంటాయి" అని చెప్పాడు.

ఇచ్చిన వాగ్దానం ప్రకారం కొడుక్కి సైకిల్ ఇవ్వటానికి ఒప్పుకుంటూ, "సైన్సు, లెక్కల తర్కం మీద ఆధారపడి ఉంటాయి. నేనడిగిన ప్రశ్నకి నువ్వు అనవసరంగా లెక్కలు కడుతూ సమయం వృధా చేసావు. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పా లంటే కావలసింది లెక్కలు కాదు. లాజిక్. ఆ విధంగా నువ్వు కరెక్టే. కాని ప్రశ్నని అర్థం చేసు కోవడం ఇంకా ముఖ్యం. నా ప్రశ్న నువ్వు సరిగ్గా వినలేదు. నేను ఇంజన్ గురించి అడిగానే తప్ప రైలు గురించి కాదు. కాబుల్ వైపు వెళ్తున్న రైలు తాలూకు ఇంజన్ కాబుల్‌కి దగ్గరగా వుంటుంది. నువ్వు ఇంకా బాగా ఆలోచించి వుంటే మరొక విషయం కూడా అర్థమయ్యేది. దాన్ని భౌగోళిక పరిజ్ఞానంతో కూడిన కామన్‌సెన్స్ అంటారు. ఆఫ్ఘనిస్తాన్‌లో అసలు రైళ్ళే లేవు."

తన తప్పు అర్థం చేసుకున్న ఆ కుర్రవాడు రెండు రోజుల పాటు వంటింటి పని చేపట్టాడు..!

అతడే జాన్ హాల్. పెద్దయ్యాక ఫిజిక్స్‌లో నోబుల్ ప్రైజ్ సంపాదించాడు.

తన ఆత్మకథలో ఒకచోట " .... పిల్లవాడు టి.విలో గంటల తరబడి ఫుట్‌బాల్ మ్యాచ్ చూడ కుండా వుండాలంటే 'గెలుపు కన్నా మంచి ఆనందం లేదు' అన్న విషయం అతడికి తెలిసేలా చేయాలి. ఒక లెక్క సాల్వ్ చేసినా, ఒక జోకు సొంతంగా తయారు చేసినా దానికి బహుమతి ఇస్తే, పిల్లలు మత్తు కలిగించే అభిరుచులు నుంచి, అభివృద్ధినిచ్చే అలవాటు వైపు మారతారు" అంటాడు.

పై ఉదాహరణలతో నాలుగు ముఖ్యమైన పాయింట్లు ఉన్నాయి.

1. పాఠశాలల్లో కేవలం చదువే చెపుతారు. పిల్లవాడికి జ్ఞానాన్ని పెంపొందించే విషయాలు బోధించవలసిన బాధ్యత తల్లిదండ్రులది.

2. చదువుకుంటున్న వయసులో కూడా పిల్లలు ఇంటి పనుల్లో బాధ్యత వహించేలా చేయాలి.

3. పిల్లల తెలివితేటల్ని గుర్తించి ఆ గుర్తింపుకి తగిన బహుమతులు ఇస్తూ ఉండాలి.

4. ఉత్సాహకరమైన ప్రశ్నలు వేసి ప్రోత్సహ పరిచే కొద్దీ పిల్లల్లో చదువంటే అలసత్వం, భయం పోయి చురుకుదనం పెరుగుతుంది.

ఇంటర్నెట్‌లో ఛాటింగ్ మానేసి సర్ఫింగ్ చేస్తే... సైన్సు, లిటరేచర్ మొదలైనవాటికి సంబం ధించిన బోలెడు విషయాలు దొరుకుతాయి. వాటి ని చదివి చెప్తే, చిన్నతనం నుంచే పిల్లలకి వాటి మీద ఇంటరెస్టు పుడుతుంది. స్పెన్సర్ కథ అలాంటిదే.


"మరొక 24 గంటల్లో ప్రపంచం అంతం అయి పోతుందని తెలిస్తే ఆ ఒక్క రోజు నువ్వు ఏం చేస్తావ్? ఒక ఫైర్ స్టేషన్ మంటల్లో తగలబడి పోవటం చూస్తే నువ్వు చేస్తావు? ఒకరోజు పాటు ఒక పక్షి లేదా జంతువులాగా వుండే అవకాశం వస్తే, దేనిలా ఉండాలని కోరుకుంటావు? ఎందుకు?" అడిగి ప్రశ్నలడిగి, తెలివైన సమా ధానాలకు బహుమతులను ఇవ్వండి.

(ఇంకా వుంది)



పిల్లల ప్రేమకి పది సూత్రాలు

ప్రేమ ఒక కళ 25



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 92465 02662

1. భౌతికంగా, మానసికంగా, నైతికంగా, చురుగ్గా, ఎమోషనల్‌గా వాళ్ళతో వుండండి:

"...మా అమ్మాయి స్కూల్ నుండి వచ్చేసరికి నేను ఇంట్లో లేకపోతే పేచీపెట్టి, నానా యాగీ చేస్తుంది. కానీ ఇంట్లో వుంటే పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంది" అని ఒక తల్లి ఫిర్యాదు.

అది చాలా సహజం.

పిల్లలు మీ ఉనికిని గ్రాంటెడ్‌గా తీసుకుంటారు.

అర్థరాత్రి యుద్ధభూమిలో టెంట్లో కూర్చొని, మరునటి రోజు సంగ్రామం కోసం వ్యూహాలు వేస్తూ ప్రశాంతంగా చదరంగం ఆడుకొనే మహారాజు తన రక్షణకు బయట పహారాకాసే భటుల ఉనికిని పట్టించుకోడు. పిలిచిన మరుక్షణం రాకపోతే మాత్రం చాలా కంగారుపడతాడు. టేకింగ్-ఇట్-గ్రాంటెడ్ అంటే అదీ అర్థం.

పిల్లల పరిస్థితిని దీనితో పోల్చవచ్చు. బయటకు కేర్‌ఫ్రీగా కనిపించినా, టీనేజర్లు లోలోపల చాలా అభద్రతా భావాన్ని కలిగి ఉంటారు. పైకి చెప్పరంతే. ఆ వయసులో వారికి చాలా ఎమోషన్స్ ఉంటాయి. దానివల్ల విడుదలయ్యే ఎడ్రినలిన్ విడుదల కారణంగా వారు తరుచు విపరీతమైన శారీరక, మానసిక బర్స్టాట్‌కు గురవుతూ ఉంటారు. వ్యక్తం చెయ్యరు గానీ పెద్దలమీద మానసికంగా చాలా ఆధారపడతారు. మీకు తెలుసా? మీరిచ్చే ప్రెజెంట్స్ కన్నా మీ ప్రెజన్స్ వాళ్ళకిష్టం.

2. మంచి అలవాట్లను అలవరచండి:

పిల్లలకు నాలుగవ సంవత్సరం నుండే కాల్పనిక నైపుణ్యాలు (Imaginative Skills) వస్తాయి. తొలి దశలోనే వారి నెగెటివ్ జీవనశైలిని మార్చడం మొదలు పెట్టండి. పిల్లలు పెద్దల నుండే నేర్చుకుంటారు. ఒకవేళ మీ ఆహారపు అలవాట్లు, సమయపాలన, కట్టుబాట్లు సరిగ్గా లేకపోతే సక్రమంగా లేని జీవనవిధానం ఇప్పటికైనా మార్చుకోండి.

ఉదాహరణకు, మీకు ఎక్కువగా టెలివిజన్ చూసే అలవాటు ఉంటే, ఆటోమాటిక్‌గా అది మీ పిల్లలకి వస్తుంది. ఆ వయసులో పిల్లల్లో పెల్లుబికే అంతర్గత శక్తిని నాశనం చేసి ఆ 'ఇడియట్ బాక్స్' వారిని ఒక జడ పదార్థంగా మారుస్తుంది.

రాత్రిళ్ళు చాలా సమయం వరకూ మీరు టీ.వీ. చూస్తూ ఉంటే, పక్కగదిలో మీ పిల్లల నుంచి ఏకాగ్రతని ఎలా ఆశిస్తారు? కొందరి ఇండ్లలో రెఫ్రిజిరేటర్ లాగే టీ.వి. కూడా ఎప్పుడూ 'ఆన్'లోనే ఉంటుంది. ఆ అలవాటు మానండి. పిల్లలు టీ.వి. చూసే సమయాన్ని వారానికి ఆరు గంటలకు పరిమితం చేయండి.

తమకిష్టమైన ఛానల్ చూసుకొమ్మని వదిలేసే బదులు, వీలైనప్పుడల్లా వాళ్లతో పాటూ కూర్చొని ప్రోగ్రాములు చూడండి. ఎప్పుడూ పోగో, క్రికెట్ ఛానల్సే కాకుండా; ఆనిమల్ ప్లానెట్, నేషనల్ జియోగ్రఫికల్ చానెల్లాంటివి అలవాటు చెయ్యండి. వాళ్ళు అంత తొందరగా అలవాటు పడరు. ముందు మీరు వాటి పట్ల ఉత్సాహం పెంచుకోండి. ఎలిగేటర్‌కీ, క్రోకడైల్‌కీ తేడా వివరించండి. పురుగుల్ని తినే మొక్కల గురించి చెప్పండి.

వారానికి ఒకరోజైనా సరే టీ.వీ. కాకుండా వేరే ఇతర ప్రోగ్రాములు ఎంపిక చేయండి. దానికి **'టెలివిజన్-ఫ్రీ డే'** అని పేరు పెట్టండి. సెల్, వీడియో గేమ్‌లతో సంబంధాన్ని తగ్గించేందుకు వాళ్ళని బయటకు తీసుకెళ్ళండి.

మీ పిల్లల్ని ఒకసారైనా... కనీసం ఒక్కసారైనా.. గుడి, మసీదు, కేతలిక్ మరియు ప్రొటెస్టెంట్ చర్చికి తీసుకెళ్ళి చూపించారా? భగవంతుడి మీద నమ్మకం ఉండటం, లేక పోవటం వేరే సంగతి. వాతావరణం ముఖ్యం. గుళ్ళో కోనేరు, కేతలిక్ చర్చిలో ప్రశాంతత, గురుద్వార భజనల్లో తన్మయత్వం, మసీదులో భక్తిభావం అనుభవిస్తే కానీ తెలీదు. ఇవన్నీ పిల్లల ఏకాగ్రత మీద అంతర్లీనంగా ప్రభావాన్ని చూపుతాయి.

వారిని దగ్గరలో ఉన్న గ్రంథాలయానికి తీసుకెళ్ళి, వారితో పాటూ మీరూ కూర్చుని వివిధ పత్రికలు చదవండి. **లైబ్రరీ విశ్ళిష్టాన్ని అలవాటు చెయ్యండి.** ఇవన్నీ చిన్నవయసు నుంచే జరగాలి. బి.టెక్ చదివే కుర్రాణ్ణి వీధి చివర్లో ఉన్న లైబ్రరీకి వెళ్దాం రమ్మంటే రాడు.

సాంస్కృతిక కార్యక్రమాలకు, ఆటల ప్రత్యక్ష వీక్షణానికీ, మ్యూజియంకి, ఇంకా ఆసక్తికరమైన ప్రదేశాలకు తీసుకెళ్ళండి. జీవితకాలంలో 'కనీసం ఒక్కసారి' కూడా ఒక పెయింట్ ఎగ్జిబిషన్ చూడని, ఒక స్టేజినాటకం వీక్షించని, ఒక సంగీత కచేరి వినని, లేదా ఒక సాహిత్యరచనను చదవని/వినని యువకులు తొంభై శాతం ఉన్నారు అంటే తప్పు వారిది కాదు. వారి తల్లిదండ్రులది.

3. సృజనాత్మకతను నేర్పించండి:

పెయింటింగ్, క్లే మోడలింగ్, స్కెర్టింగ్, క్రాఫ్టింగ్ వంటి క్రియేటివ్ కళల్లో వారిని నిమగ్నం చేయండి. పిల్లల్లో తెలివిని పెంచే ఆధునాతనమైన ఆట వస్తువులు చాలా వస్తున్నాయి. చదరంగం, వర్డ్ బిల్డింగ్, ట్రేడ్‌గేమ్స్ మొదలైన ఆట వస్తువులు కొనిపెట్టండి. ఒకసారి ఇటువంటి వాటికి అలవాటుపడితే వారిలో సృజనాత్మకత పెరుగుతుంది.

మీ లీవ్‌కోసం మీ బాస్‌ని ఉద్దేశిస్తూ మీ పిల్లల్ని ఒక లెటర్ రాయమని అడగండి. మీరో ఎగ్జిక్యూటివ్ అయినట్లైతే, మీ సబార్డినేట్ పనిని పొగుడుతూ మీరు వ్రాసినట్టూ ఒక లెటర్ డ్రాఫ్ట్ చేయమని చెప్పండి. అది పిల్లలకు ఒక అందమైన, అద్భుతమైన అనుభవం అవుతుంది.

జీవితంపై 'ఉత్పాదక ఆసక్తి (Productive Interest) పెంపొందించేందుకు ఇవన్నీ సహాయపడతాయి.

పిల్లల నుండి పెద్ద విషయాలను ఆశించడం



మానేయండి. ఒక తల్లిగా లేదా తండ్రిగా మీ చిన్నచిన్న కర్తవ్యాలు మీరు నిర్వహిస్తున్నారా అని ప్రశ్నించుకోండి.

అపరిచితుల ఎదురుగా స్టేజీపై నుండి మాట్లాడే అవకాశం వచ్చే ఒక మీటింగ్‌కి వాళ్ళని ఎప్పుడైనా తీసుకెళ్ళారా?

పిల్లల్లో ముఖ్యమైన బలహీనత పబ్లిక్ స్పీకింగ్...! చాలామంది పిల్లలు తమ వయస్సు వారితో గంటల తరబడి మాట్లాడేయగలరు. 'ఇన్-హౌస్ స్కూల్ మీటింగ్'లలో కూడా (ఎదురుగా ఉండేది స్నేహితులే కాబట్టి) చాలా బాగా ఉపన్యసించగలరు....! కానీ వాళ్ళకు స్టేజ్ ఫియర్ లేదని మీకు ఖచ్చితంగా తెలుసా? అపరిచిత ప్రేక్షకుల ముందు వాళ్ళు ప్రసగించగలరా?

బయట మీటింగ్‌లకు తీసుకెళ్ళండి. ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ స్టేజ్ ఎక్కించండి. మీకో విషయం తెలుసా? పద్నాలుగేళ్ళు వచ్చే వరకూ సాధారణంగా పిల్లల్లో ఈ రకమైన భయాలుండవు. అక్కణ్ణుంచీ మగ/ఆడ అన్న స్వీయ స్పృహ మొదలవుతుంది. ఆ వయసులోనే వారిని పది మందిలోకి దూసుకుపోయేలా చెయ్యాలి.

ఎంతో బాగా చదువుకున్న విద్యార్థులు, మంచి మార్కులు వచ్చినవారూ ఇంటర్వ్యూల్లో ఫెయిల్ అవటానికికారణం ఈరకమైన భయమే. వంద కిలోమీటర్ల వేగంతో మోటార్ బైక్ రాష్‌గా నడిపే కుర్రాడు కూడా ఇంటర్వ్యూ గదిలో టెన్షన్‌తో వణికిపోతాడు. ఈ స్టేజ్ భయాన్ని వారి యుక్తవయసులోనే తొలగించాలి.

చాలామంది యువతీ యువకులు ప్రయాణాల్లో, ఖాళీ సమయాల్లో చెవుల్లో ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని పాటలు వినటం ఇప్పుడు చూస్తూనే ఉన్నాం. ఖాళీగా ఉన్నప్పుడు, చుట్టుపక్కల చూస్తూ ప్రయాణం చేస్తున్నప్పుడు కూడా, మెదడు ఏదో ఒకటి ఆలోచిస్తూనే ఉంటుంది. మెదడుని అలా ఆలోచించనివ్వకుండా, చెవుల్లో నిరంతరం ఏదో ఒక ధ్వని వినిపిస్తూ వుంటే, కొంతకాలానికి అది (మెదడు) మొద్దుబారిపోయి జడత్వం వస్తుంది. వీలైనంతవరకూ సృజనాత్మకమైన ఆలోచనలతో గడిపితే మెదడు షార్ప్ అవుతుంది.

4. మీ పిల్లలు అద్భుతాలు చెయ్యాలని ఆశించకండి:

మీరు అనుకున్నరీతిలో మీ పిల్లల్ని తెలివిగా, సవ్యంగా వినయంగా అద్భుత భావిభారత పౌరులుగా తయారు చెయ్యగలనని మీరు నమ్ముతున్నట్టయితే; వారి ప్రవర్తన, మన్నన, మర్యాద నూరుశాతం మీకు నచ్చినట్లుగా మలచగలరని మీరు నమ్మకంగా అనుకున్నట్టయితే, ఖచ్చితంగా మీరు పద్మభూషణ్ అవార్డుకి అర్హులు.

అంచనా తక్కువ ఉన్నచోట విషాదం తక్కువ ఉంటుంది.

అలా అని మిమ్మల్ని నిరాశ పరచటం కాదు. ఎక్కువ ప్రయత్నించటం, తక్కువ ఆశించటం - ఆనందానికి హేతువు. మీ ప్రయత్నం సవ్యంగా చెయ్యండి. అలా చేస్తే, విజయశాతం తొంభై వరకూ ఉంటుంది.

మీ ఆర్థిక, సామాజిక, సాంఘిక స్థితిని మీ పిల్లలు చిన్న వయసులోనే గ్రహించేలా చెయ్యండి.

"క్లాసులో అందరికీ సెల్‌ఫోన్స్ ఉన్నాయి. నాకే లేదు" అని మీ పదోక్లాసు పిల్లవాడు పోరు పెడుతూంటే, "... నువ్వు డిఫరెంటమ్మా" అనండి. తాను గుంపులో గోవిందా అనే భావనని పోగొట్టటానికి, 'నువ్వు డిఫరెంట్' అనే మాటని పాజిటివ్ సెన్స్‌లో తరచుగా ఉపయోగించండి.

డెలాయిట్ కంపెనీలో సెమినార్ పూర్తయిన తరువాత ఒక యంగ్ ఎగ్జిక్యూటివ్ కలిసి, 'మీ ఉపన్యాసంలో చెప్పిన 'యూ ఆర్ డిఫరెంట్' కాన్సెప్ట్ బాగా పాపులర్ చెయ్యండి సర్" అంటూ తన అనుభవం చెప్పాడు.

"...ఇంటర్ చదివే రోజుల్లో మా స్నేహితులందరికీ మోటార్ సైకిల్స్ ఉండేవి. రైడింగ్ నాకు చాలా ఇష్టం. మా నాన్నని కొనమని అడిగాను. మాది మధ్యతరగతి కుటుంబం. ఇద్దరు అక్కలు. మా పేరెంట్స్ ఒప్పుకోలేదు. ఎలాగైనా కొనాల్సిందే అని తిండి మానేసి ఎమోషనల్‌గా బ్లాక్‌మెయిల్ చేసాను. మూడు రోజులు అయ్యేసరికి దిగి వచ్చారు.

ఆకలితో పడుకొని వుంటే నాన్న గదిలోకొచ్చి నా పక్కనే కూర్చున్న అమ్మతో "వాణ్ణి తినమను. రేపు కొనిస్తానని చెప్పు" అని వెళ్ళిపోయాడు. అమ్మ నన్ను వంటింట్లోకి తీసుకెళ్తూండగా, వాష్‌బేసిన్ దగ్గర నాన్న నోటికి చెయ్యి అడ్డుపెట్టుకుని ఏడుస్తూ వుండటం చూసాను. బహుశా అప్పుడే నా జీవితం మలుపు తిరిగి వుంటుంది".

పిల్లల మీద స్నేహితుల ప్రభావం చాలా ఉంటుంది. అది పాజిటివ్ అయితే ఫర్వాలేదు. తప్పుదార్లో వెళ్తున్నప్పుడు మీరు కవచంలా నిలబడాలి. అటువంటి సందర్భాల్లోనే ఈ 'నువ్వు డిఫరెంట్' అన్న సూత్రం ఉపయోగపడుతుంది. ఈ సందర్భంగా, చాలాకాలం క్రితం వ్రాసిన ఒక కథ ఇక్కడ తిరిగి ప్రస్తావించటం అప్రస్తుతం కాదనుకుంటాను. మీ పిల్లలకి తెలుగు రాకపోతే ఈ కథ చెప్పండి.

సింహప్రసాద్ చుట్టూ ఎప్పుడూ పదిమంది ఉంటారు. తన వాదనలతో అవతలివారిని ఓడించటం అతడికి వెన్నతో పెట్టినవిద్య. ఒక రకంగా చెప్పాలంటే ఆ కాలేజీలో అతడే గ్రూపు లీడరు. "స్టూడెంట్ లైఫ్ జీవితంలో ఒకేసారి వస్తుంది. తరువాత గుర్తు పెట్టుకోవటానికి కనీసం ఒక్కటయినా థ్రిల్ ఉండాలి. ఒక సిగరెట్టయినా ఆనందించకుండా అది పూర్తి చెయ్యను" అన్నాడు. ఒప్పుకుంటున్నట్టు అందరూ సిగరెట్లు వెలిగించారు. విష్ణు తప్ప.

"నా థియరీ నచ్చలేదా?" అడిగాడు ప్రసాద్.

"చాలా బావుంది. నీ మాటలు నా మీద చాలా ప్రభావం చూపిస్తున్నాయి. నువ్వు చెప్పింది కరెక్టే".

"మరి తాగవేం?"

విష్ణు మాట్లాడలేదు. ప్రసాద్ నవ్వి. "ఏదైనా పని చేయటానికి ఖలేజా ఉండాలి" అన్నాడు. చుట్టూ ఉన్న వారు చప్పట్లు కొట్టారు. విష్ణు తల వంచుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

మూడు సంవత్సరాల తర్వాత తిరిగి వాళ్ళ దగ్గరికి వెళ్లాడు. "ఒకేసారి వచ్చే స్టూడెంట్ లైఫ్‌లో గుర్తుపెట్టుకోవటానికి ఏదైనా 'థ్రిల్' ఉండాలని నువ్వన్న మాటతో ఇది సంపాదించాను" అంటూ యూనివర్సిటీ టాపర్ గోల్డ్ మెడల్ చూపించాడు.

5. ఒక కంపానియన్‌గా ఉండండి:

ఒక వయసు వచ్చాక మీ పిల్లలు మీతో ముభావంగా వుంటే అందులో ఆశ్చర్యమేమీ



లేదు. ముఖ్యంగా మగపిల్లలు తల్లిదండ్రులతో అంత క్లోజ్‌గా వుండటానికి ఇష్టపడరు. ఒక రకంగా ఇది పెంపకం మీద ఆధారపడి వుంటుంది. వారి చిన్న వయసు నుంచే వారితో ఇండోర్‌గేమ్‌లు ఆడండి. వారు పెద్దయ్యాక ఆడటం మానేయకండి. గేములు మార్చండి. పిల్లలతో స్నేహంగా వుంటూ వారిని తరచూ వివిధ ప్రదేశాలకి విహారయాత్రలకి తీసుకెళ్తూవుంటే ఈ పరిస్థితి రాదు. యాత్ర అంటే కేవలం తిరుపతి, షిర్డీ మాత్రమే కాదు.

హోమ్‌వర్క్ చేయటంలో సహకారం అందచెయ్యండి. వారి ప్రోజెక్ట్‌ల గురించి తెలుసుకోండి. మీ పిల్లలు పోస్ట్ గ్రాడ్యుయేట్‌లయితే వారితో కలిసి మూవీకి వెళ్ళేందుకు ప్లాన్ చెయ్యండి. ఈ కార్యకలాపాలు కుటుంబ సంబంధాల్ని గట్టిపరుస్తాయి.

తండ్రీ కొడుకుల ప్రేమ గురించి వీలైతే విధూ వినోద్ చోప్రా సినిమా **'ఫెరారీ కి సవారీ'** చూడండి.

తండ్రిగా మీరేం చెయ్యకుండా పిల్లల్నుంచి స్నేహం, ప్రేమ ఆత్మీయతల్ని ఆశించటం అత్యాశే కదా.

పిల్లలు చిన్న ప్లే గ్రౌండ్‌లో టెన్నిస్ బాల్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడుతున్నా, చూడటానికి వెళితే వారికి చాలా హుషారుగా వుంటుంది. స్కూళ్ళల్లో వార్షికోత్సవ సభలు నిర్వహించినప్పుడు, ప్రేక్షకుల్లో ఎక్కువమంది తండ్రులు కనపడక పోవటం, తల్లులే కనబడటం విచారకరమైన దృశ్యం.

6. పిల్లల్లో పెద్దతనాన్ని గుర్తించండి:

పెద్దలు తమను ఏదైనా సలహా అడిగినట్లయితే, టీనేజర్‌లు గర్వంగా ఫీలవుతారు. ప్రపంచాన్ని గెలిచిన అనుభూతి పొందుతారు. పెద్దలకు సలహా ఇవ్వటం కోసం మెదడుని మరింత షార్ప్‌గా ఉపయోగించటం మొదలు పెడతారు. వాళ్ళని పెద్దలుగా ట్రీట్ చెయ్యకపోతే, ఎప్పటికీ పిల్లలుగానే ప్రవర్తిస్తారు. ఆఖరి నిర్ణయం ఎల్లప్పుడూ మీదే కాబట్టి ప్రోత్సాహం ఇవ్వండి.

ఉదాహరణకి మీరు ఒక వాహనాన్ని కొనాలనుకుంటే, మీ పిల్లల్ని గూగుల్ సర్ఛ్ చేసి ఏది బెస్ట్ వెహికిల్‌లో, ఖరీదెంతో కనుక్కోమనండి. ఇల్లు కట్టుకొనేందుకు ప్లాటు వెతకటం కోసం వెళ్ళినప్పుడు మీ పిల్లల్నికూడా తీసుకెళ్ళండి. తననే ఎంపిక చెయ్యమనండి. మీరు అప్పటికే ఒక నిర్ణయాన్ని తీసుకొని వుంటారు. కానీ తన అభిప్రాయాలను వినండి, ఆ తరువాత మీ ఛాయిస్ తాలుకూ ఉపయోగాలు చెప్పి ఒప్పించండి. **మీ నిర్ణయాన్ని తనకు ఆపాదించండి.** అందరికీ అలానే ప్రచారం చేయండి. మీకు అంత అద్భుతమైన సైట్ 'తనే' సూచించినందుకు జీవితమంతా గర్వపడతాడు.

వాళ్ళు మంచి పనులు చేసినప్పుడల్లా గుర్తించడం అలవాటు చేసుకోండి. వాళ్ళు సాధించిన దానికి పొగడండి. అంతే తప్ప మీ పనులు చేసి పెట్టినప్పుడు కాదు. చాలామంది "మంచోడివి కదా, కొంచెం షాపుకెళ్ళి అరకిలో పంచదార తీసుకురామ్మా" అని బ్రతిమాలతారు. తేవటం వాడి బాధ్యత. దానికి 'మంచి' అన్న విశేషణం జోడించటం ఎందుకు? ఎవరూ అడక్కుండా వాడు తమ్ముడి తలకి నూనె రాసి దువ్వాడనుకోండి. అప్పుడా 'మంచి' అనే అడ్‌జెక్టివ్ వాడాలి.

పొగిడి పనులు చేయించుకోవటం అలవాటు చేస్తే, 'ఇతరులకు సేవ చెయ్యడమే మంచితనానికి చిహ్నం' అని పిల్లలు అనుకుంటారు. పెద్దయ్యాక మొహమాటస్తులుగానూ, పొగిడితే పొంగిపోయే వాళ్ళుగానూ తయారవుతారు. 'గుడ్ సమరిటన్' అనిపించుకోవటం కాస్త ఉబ్బెయ్యగానే చిట్‌ఫండ్ గ్యారంటీ సంతకాలు పెడతారు.

7. గత తప్పులను తరచూ గుర్తు చేయడం మానేయండి:

'పదమూడేళ్ళ వయసు వచ్చేవరకూ, నా పేరు షటప్ అనుకున్నాను' అని ఒకచోట వ్రాస్తాడు న్యూటన్. పిల్లల్ని నిరంతరం నిరుత్సాహపరుస్తుంటే వాళ్ళు సున్నితత్వం కోల్పోయి, క్రమంగా బండబారి పోతారు. నిరంతరం ఎగతాళి చేయడం, తిట్టడం, ప్రతికూల వ్యాఖ్యలను చేయడంవల్ల వాళ్ళు మానసికంగా చెవిటి వాళ్ళలా తయారవుతారు. టీనేజ్ వచ్చేసరికి, తల్లిదండ్రుల అదుపు నుండి దూరంగా వెళ్ళిపోతారు.

పిల్లవాడి ముందే అతడి గురించి అవతలి వారికి చెపుతూ "వీడు బాగానే చదువుతాడు కాని మార్కులు రావండీ. వీడి తమ్ముడు ఇంటెలిజెంట్" అని చాలా క్యాజువల్‌గా అనేస్తారు. మీరు చెపుతున్నది వాస్తవమే అయ్యుండవచ్చు. కానీ దాన్ని వాడి ముందే చెప్పనవసరం లేదు కదా. 'నువ్విది చేశావు-ఇబ్బందుల్లో పడ్డావు.. నువ్విది చెయ్యలేదు - అందుకే ఇలా జరిగింది' అని తప్పుల్ని గుర్తు చేయడం కన్నా, మీరు వారి ప్రవర్తన గురించి భయపడుతున్నప్పుడు, అది వేరే విధంగా చెప్పండి.

"నా పద్నాలుగేళ్ళ కూతురు ప్రేమలో పడుతుందన్న అనుమానం వచ్చినప్పుడు, నేను తనతో నేరుగా మాట్లాడలేదు. దిగులుగా ఉన్నట్లు కనిపించాను. కారణం ఏమిటని అడిగితే, నా కొలీగ్ కూతురు ఒక అబ్బాయితో ప్రేమలో పడిందనీ, అది మా అందరినీ బాధపెడుతోందని చెప్పాను. నేరుగా వేలెత్తి చూపకుండా, నేను తన ఆలోచనలను రాబట్టాను. కొంచంసేపు వాదనలు జరిగాయి. జీవితంలోని వాస్తవాలను తెలిపాను. అది పని చేసింది" అన్నాడు నా స్నేహితుడు.

పాతిక సంవత్సరాల క్రితం మాట ఇది. ఆ అమ్మాయి సి.ఎ . ఇప్పుడు సంవత్సరానికి ఇరవై లక్షల జీతానికి పని చేస్తూంది. ఇద్దరు పిల్లల తల్లి.

8. సమయ పాలన నేర్పించండి:

వారి సమయ నిర్వాహణ బాధ్యత మీరు స్వీకరించే బదులు, వాళ్ళకు సమయపాలన (టైమ్ మానేజ్‌మెంట్) నేర్పండి. తమని జాగ్రత్తగా చూసుకోవటానికి మరొకరుంటే, పిల్లలు తమ బాధ్యతలన్నీ వదిలేసి కేర్‌ఫ్రీగా బ్రతికేస్తారు. అన్నీ ఎవరో ఒకరు చేస్తుంటే పని నేర్చుకోరు. **తమ కోసం బాధపడే వారు మరొకరు ఉన్నారని తెలిస్తే, బాధ కూడా పడరు.** కొన్ని ఇళ్ళల్లో లేవగానే పక్కబట్టలు సర్దిపక్కన పెట్టటం నుంచీ, నాప్‌కిన్లు బిన్లో పడెయ్యటం లాంటి పనులు కూడా చెయ్యని పిల్లలు తయారవుతున్నారంటే, దానికి కారణం పెంపక లోపమే.

చదువుకునే పిల్లలు కదా అని వారిని మల్లెపూవుల్లా అపురూపంగా చూసుకునే అవసరం లేదు. పని మనిషి రానప్పుడు కనీసం కొన్ని ఇంటి పనులు అప్పగించండి. వంటలో సహాయం చెయ్యమనండి. విత్తనాలు వెయ్యగానే సరిపోదు. వాటికి ఎరువూ, నీరూ కూడా పెట్టినప్పుడే చెట్లు ఫలవంతమవుతాయి.





(ముగింపు వచ్చేవారమే)



తల్లితండ్రుల ప్రేమే పిల్లలకు శ్రీరామరక్ష



ఆశ-అత్యాశ:

ఐ.ఐ.టీ/మెడికల్ ఎంట్రెన్స్‌లో పిల్లల్ని చేర్పించాలనుకునే పెద్దల గురించి కొన్ని చేదు వాస్తవాలు ఇప్పుడు చర్చిద్దాం. ఇందులో కొన్ని పాయింట్లు మీరు ఒప్పుకోకపోవచ్చు. ఇష్టం లేకపోతే వదిలెయ్యండి. కానీ వాదనలొద్దు.

మన శక్తికి కాసింత బయట పరిధి వరకూ ఆశిస్తే అది ఆశ. అది ఉండాలి. అంతకన్నా ఎక్కువ ఆశిస్తే అది అత్యాశ. అది ఉండకూడదు. ఆశకీ, అత్యాశకీ మధ్య గీత గీయటం కష్టమే గానీ అసాధ్యం కాదు.

ఆరు/ఎనిమిది/పదో క్లాసు పిల్లల కోసం ఈ సంస్థలు వల విసురుతాయి. మామూలుగా అయితే, నుదుట దురదృష్టం వ్రాసి ఉన్న చేపలు జారి వలలో పడతాయి. ఇక్కడ అలా కాదు. పెద్దలు తామే తమ పిల్లల్ని స్వయంగా ఈ వల లోకి విసురుతారు.

ఉన్నత చదువులు ఆశించటంలో తప్పులేదు. కానీ పిల్లల్ని వారి శక్తికి మించి చెరుకుని పిండినట్టూ పిండటమే తప్పు. "ఏమో. అదృష్టం బావుంటే ఆ లాటరీ నాకే తగలొచ్చు" అని టిక్కెట్టు కొనుక్కునే మనస్తత్వానికీ, ఈ చర్యకీ తేడా లేదు. "మా వాళ్ళు ఐ.ఐ.టీ ఫౌండేషన్‌లో చదువుతున్నారు" అన్న సంతృప్తితో ఆరు సంవత్సరాలు బ్రతకటానికీ, ఇతరులకి చెప్పుకోవటానికి ఇది పనికి వస్తుంది. ఈ రంగులవల వ్యామోహం నుంచి బైట పడటానికి కొన్ని సత్యాల్ని పరిశీలిద్దాం. మళ్ళీ చెపుతున్నాను. ఈ అభిప్రాయాలతో మీరు ఏకీభవించక పోవచ్చు. నచ్చితేనే ముందుకు వెళ్ళండి:


1. ఈ కోర్సుల్లో చేరే ప్రతి వంద మందిలో పదిమందిని ముందే డిసైడ్ చేస్తారు. మిగతా తొంభై మంది కట్టే ఫీజులతో ఈ పది మందికీ ఉచితంగా+ప్రత్యేకంగా చదువు చెపుతారు. లక్షల్లో జీతాలు తీసుకునే లెక్చరర్లతో వీరికి మాత్రమే స్పెషల్‌గా చదువు చెప్పిస్తారు. ఈ పిల్లల పేర్లే పేపర్లలో పడతాయి. పందెం కోడిని పెంచినట్టు మిగతా కోళ్లని పెంచరు కదా.

2. మిగతా 90 మందిని 'సీ' క్లాసు పిల్లలు అంటారు. వీరిలో ఒకరిద్దరి కన్నా ఎక్కువమందికి ఐ.ఐ.టీల్లో సీట్లు రావు. ఏ ప్రసిద్ధ సంస్థనైనా తీసుకుని పరిశీలించండి. అలా వచ్చినట్టు నిరూపిస్తే నేను రచనా రంగం నుంచి నిష్క్రమిస్తాను. 'బీ' సెక్షన్ 'సీ' సెక్షన్ అంటే బాధపడతారని వీరిని 'పద్మ', 'కమలం' సెక్షన్లుగా పిలుస్తారు. ఈ మధ్య వీరిని మరీ ఉత్సాహపర్చటం కోసం 'అబ్దుల్ కలాం', 'విశ్వేశ్వరయ్య సెక్షన్' అని పిలుస్తున్నారు.

3. ఈ సెక్షన్ల వారికి సాధారణ లెక్చరర్లు పాఠాలు చెపుతారు. పాఠాలంటే పెద్దగా చేప్పేదేమీ ఉండదు. పైనుంచి వచ్చిన సిలబస్ను ప్రకారం, రాబోయే పరీక్షల్లో... రాబోయే ప్రశ్నలకి సమాధానాలు వ్రాయించటమే వీరి పని. వచ్చే ఏడాది కోసం పిల్లల్ని వెతకటం వీరికి అప్పజెప్పబడే అంతకన్నా పెద్ద బాధ్యత. మంచి లెక్చరర్లకి ఇచ్చే జీతంలో కేవలం పదో వంతు మాత్రమే వీరికి ఇవ్వబడుతుంది. ఇంకో వంద ఎక్కువ జీతం కోసం ఏ కాలేజీకి వెళ్దామా " అని వీరు వెతుక్కుంటూ ఉంటారు. వీరిలో బాగా చెప్పే టీచర్లు మంచి సెక్షన్లకి పాఠాలు చెప్పేవారిగా ప్రమోట్ చేయబడతారు. దీంతో మిగతా వారికి మరింత ఫ్రస్ట్రేషన్ పెరుగుతుంది. దాన్ని విద్యార్థుల మీద చూపిస్తారు.


4. నువ్వు ఫెయిల్ అయితే, "చిన్న తప్పు జరిగి ఉంటుంది. మరోసారి ప్రయత్నిస్తే తప్పు లేదు కదా...! ఈసారి లాంగ్-టర్మ్ కడితే సీటు ఖాయం" అని మనస్ఫూర్తిగా నమ్మేటట్టూ ఈ కలల వ్యాపారులు భ్రాంతి కలిగిస్తారు. అందులో కూడా నూటికి ఒకరో ఇద్దరో మాత్రమే ర్యాంకులో పాసవుతారు.

5. కంచాలు పట్టుకుని, మొహాలు వేలాడేసుకుని రెండో ప్రపంచ యుద్ధకాలంలో నాజీ ఖైదీల్లాగా క్యూలో నడుచకుంటూ భోజనానికి వె ళ్తారు. ఆ తరువాత బాత్రూంల పక్కన కూర్చుని ఒక వైపు చదువుతూ మరో వైపు నిద్రకి జోగుతారు. పదింటికి పక్క మీదకు వెళ్ళి అమ్మ గుర్తొచ్చి తల దిండు తడిచిపోయేలా కొంచెంసేపు ఏడ్చి నిద్ర లోకి జారుకుంటారు. కల పూర్తిగా తీరకముందే తెల్లవార్నే మళ్ళీ లేపేస్తారు. దీనికి పెద్దలు చేసుకునే ఆత్మవంచన 'కష్టపడకపోతే ఎలా?' అని. మరి వాళ్ళెందుకు కష్టపడలేదో ఆత్మవిమర్శ చేసుకోరు. చేరిన మొదటి అయిదారు నెలల్లో మొదటి సెక్షన్‌కి వెళ్ళలేకపోతే, అటువంటి తెలివీ, జ్ఞాపక శక్తి, ఉత్సాహం లేని బలవంతపు చదువు వేస్తనీ



ప్రేమ ఒక కళ

26



-యండమూరి వీరేంద్రనాథ్ సెల్: 92465 02662

తెలుసుకోరు.

6. చాలా సంస్థల్లో ఈ 'సీ' క్లాసు పిల్లల మీద లెక్చరర్లు హీనమైన జోకులు వేస్తూ వుంటారు. బాగా చదివే విద్యార్థులు వాళ్ళని చాలా తక్కువుగా చూస్తారు. గ్రాడ్యుయేషన్‌కి వచ్చేసరికి 'తామెందుకూ పనికిరాము' అన్న అభిప్రాయం వీరికి ఏర్పడిపోయి ఉంటుంది.

7. రిజల్టు రాగానే అయిదు సంవత్సరాల కల ఒక్కసారి కరిగి పోతుంది. ఆ డిప్రెషన్ నుంచి తేరుకోవటం అంత సులభం కాదు.

8. నాలుగైదు సంవత్సరాలు అంత వత్తిడిలో చదివిన పిల్లలు చివరికి ఐ.ఐ.టీలో గానీ, మెడిసిన్‌లో గానీ సీటు రాకపోయే సరికి మామూలు ఇంజనీరింగ్ కాలేజీలో చేరవలసి వస్తుంది. ఒక వైపు కల్లలైపోయిన ఆశలు, మరోవైపు కొత్తగా లభించిన స్వేచ్ఛ. దీనితో వారు చదువు మానేసి, స్వేచ్ఛకి కొత్త అర్థాలు వెతుక్కుంటారు. అత్యంత కఠినశిక్ష అనుభవించి అండమానుదీవుల జైళ్ళ లోంచి బయటపడిన ఖైదీల్లా ఉంటుంది వారి పరిస్థితి. తాము చేస్తున్న తప్పు తెలుసుకునేసరికి చదువు అయిపోతుంది.

అంతాచదివి 'అయితే ఏం చెయ్యమంటావ్? మా పిల్లల్ని చదివించ వద్దంటావా?' అని విరుచుకుపడకండి. నారి ఎంత లాగితే బాణం అంత ముందుకు వెళ్తుంది. కానీ మరీ బలంగా లాగితే తాడుతెగిపోతుంది. గమ్యం చేరితే బావుంటుంది. కానీ పిల్లల శక్తి కూడా చూడాలి కదా. అది చెప్పటమే ఇక్కడ ఉద్దేశ్యం.

ఐ.ఐ.టీ కోచింగ్ కన్నా ఐ.ఏ.యస్ కోచింగ్ మంచిదని నా వ్యక్తిగత అభిప్రాయం. కలెక్టర్ అవకపోయినా లోకజ్ఞానం వస్తుంది. కొన్ని కార్పొరేట్ కాలేజీలు చూసాను. కోచింగ్ చాలా బావుంది.

నాయకత్వ లక్షణాలు నేర్పండి:

ఇంట్లో పుట్టిన రోజు పంక్షన్లు, నాలుగైదు కుటుంబాల గ్రూప్ పిక్నిక్‌ల ఏర్పాట్లు మొదలైన వాటిని పిల్లల్తో ఆర్గనైజ్ చేయిస్తే, వారిలో అంతర్గతంగా ఉండే నాయకత్వపు లక్షణాలు బయట పడతాయి. ముప్ఫై ఏళ్ళ క్రితం మేము ఆరు



కుటుంబాలు ఊటీ వెళ్ళినప్పుడు, రిసార్ట్ పక్కనే సైకిళ్ళు అద్దెకి తీసుకుని అందరికీ బ్రేక్‌ఫాస్ట్ పొట్లాలు కట్టించుకు రమ్మని ఇద్దరు పిలల్నీ; బోట్ రైడింగ్ వివరాలు కనుక్కు రమ్మని మరో ఇద్దరు పిల్లల్నీ పంపాను. తెలియని ఊరని వాళ్ళ తల్లులు ఎంతో భయపడ్డారు. పిల్లల్ని పని మీద పంపటం కన్నా, వాళ్ళ తల్లులకి ధైర్యం చెప్పటమే తలకు మించిన పనైంది. పిల్లలు హుషారుగా వెళ్ళి పనులు పూర్తి చేసుకుని గర్వంగా తిరిగి వచ్చారు.

మీ పిల్లల్ని ఒక కేర్‌టేకర్‌తో అప్పుడప్పుడు టూర్లకి పంపండి. మీరు పక్కన లేని టూర్లు పిల్లల స్వేచ్ఛాన్వేషణ సంతృప్తి పరుస్తాయి. తమపై తమకి నమ్మకం కలగటానికీ, నాయకత్వ లక్షణాలు పెరగటానికీ, ఇతరులతో కమ్యూనికేషన్ పెంచుకోవటానికీ దోహదం చేస్తాయి. బడ్జెట్‌కు తగ్గట్టు డబ్బుని ఖర్చు పెట్టడం కూడా అలవాటు అలవడుతుంది.

రెంచ్, స్క్రూ డ్రైవర్ మొదలైన వాటిని ఉపయోగించి చిన్న చిన్న ఎలక్ట్రికల్ రిపేర్లు చేయడం నేర్పించండి. షూ పాలిష్ చెయ్యడం, గిన్నెలు కడగడం, బట్టలు ఇస్త్రీ చెయ్యడం, బెడ్ సర్దడం వంటివి సెల్ఫ్ డిపెండెన్సీని అభివృద్ధి చేస్తాయి.

మీ టీన్ గనుక మానసికంగా మరింత మెచ్యూర్ అయినట్లయితే, ఆర్థిక, వ్యక్తిగత సమస్యల గురించి మాట్లాడండి. కొస్త వయొసొచ్చాక, ఒక నెల ఇంటి బడ్జెట్ ఎలా వెయ్యాలో నేర్పండి. మీ సంపాదన, ఆస్తులు, అప్పులు వాళ్ళకి చెప్పండి. మీ దీర్ఘకాల ఇన్వెస్ట్‌మెంట్‌ల వివరాల



గురించి చర్చించండి.

ఇలాంటి చిన్న పనులే వాళ్ళకు 'మేము కూడా ఇంటిని నడుపు తున్నాము' అన్న భావనతో అపారమైన ఆనందాన్ని కలుగచేస్తాయి. పన్నెండవ తరగతి దాటిన తరువాత, వారి పాకెట్ మనీ వారే సంపాదించుకొనేందుకు, రోజుకొక గంట కానీ, లేదా వారాంతరంలో కొన్ని గంటలు కానీ, ముఖ్యంగా వేసవి శెలవుల్లో పని చెయ్యమని వారిని ప్రోత్సహించండి.

మా తాత (అమ్మ తండ్రి)గారి గారాబం వల్ల ఆరు, ఏడు క్లాసులు ఫెయిలయి, ఆయన మరణం తరువాత మా తండ్రి వద్దకు చేరుకున్నాను. నేను ఖమ్మంలో ఎనిమిదవ తరగతి చదువుతున్నప్పుడు, పునాది గట్టిపడటం కోసం నాలుగవ తరగతి పిల్లలకు ట్యూషన్లు చెప్పమని మా నాన్నగారు సలహా ఇచ్చారు. ఒక్కొక్క విద్యార్థి నెలకు పది రూపాయల చొప్పున ఇచ్చేవారు. జేబు ఖర్చుల సంపాదనతో పాటూ, సబ్జెక్టు ఫండమెంటల్స్ కూడా రివిజన్ అయ్యేవి. నా కొడుకుతో కూడా అదే విధంగా చేయించాను.

భాగస్వామిని గౌరవించండి:

పిల్లల ముందు (ఆ మాటకొస్తే పిల్లలు లేనప్పుడు కూడా) ఇంట్లో భాగస్వామిని గౌరవించటం ముఖ్యం. ఇది అన్నిటికన్నా ముఖ్యమైనది. ఇంట్లో ఒకరు హేళన చేయబడుతూ ఉంటే, వారిని పిల్లలు కూడా గౌరవించరు. పిల్లల ముందే వ్యంగ్యంగా మాట్లాడటం, చీవాట్లు పెట్టడం, తక్కువ చేసి చూడటం, లేదా వారి తరపు పెద్దల్ని చులకన చెయ్యటం, పిల్లల మీద ప్రభావాన్ని చూపుతాయి. కొందరు పిల్లల ముందే భార్యని కొడతారట. ఇది అసలు ఊహించలేని దారుణం. ఇతరుల్ని కొట్టటం నీచం. భాగస్వామిని కొట్టటం హేయం. పిల్లల ముందు కొట్టటం హీనాతిహీనం.

తల్లిదండ్రుల మధ్య జరిగే వేడి వాదనలు కూడా పిల్లలు భరించలేరు. పరస్పరం ప్రేమించుకునే తల్లిదండ్రుల ప్రేమ వాళ్ళకవసరం.

క్రమశిక్షణకీ, కఠినంగా వుండటానికీ మధ్య తేడా:

మదరింగ్ అంటే ప్రేమతో లాలించటం. స్మాదరింగ్ అంటే చంపేటంత ఉక్కిరిబిక్కిరి చెయ్యటం. Motheringకీ, S-motheringకీ తేడా ఒక్క అక్షరమే అయినా, ప్రేమకీ గారాబానికీ మధ్య ఉన్నంత తేడా ఉంది.

ప్రేమకీ, గారాబానికీ తేడా చెప్పటం కష్టం. క్రమశిక్షణకీ, కాఠిన్యతకీ తేడా చెప్పటం మరీ కష్టం. పిల్లల్ని పెంచడంలోమీరు దయా పూరితం (Lenient)గా ఉన్నారా, మరీ కఠినం (Strict)గా ఉన్నారా; అభిమానం (Affection)గా ఉన్నారా, మురిపెం (Pampering) చూపిస్తున్నారా అన్నది ఏ సైకాలజిస్టూ చెప్పలేదు. పిల్లల ఎదుగుదల పాజిటివ్ వైపు సాగుతోందా, లేక నెగెటివ్ వైపు ఉన్నదా అన్న విషయాన్ని క్రమం తప్పకుండా అంచనా (అసెస్స్) వేసుకుంటూ ఉంటే, దానిని బట్టి మీది ప్రేమా? గారాబమా? అన్నది తెలిసి

పోతుంది. ప్రేమకీ గారాబానికీ మధ్య ఆ విధంగా సరిహద్దు గీతలు జాగ్రత్తగా గీయాలి.

నిద్ర లేచిన తర్వాత బెడ్‌షీట్ సర్దడం, టూత్ బ్రష్‌ను దాని స్థానంలో పెట్టడం, నిద్రపోయే ముందు తాతయ్యకు గుడ్ నైట్ చెప్పటం వంటి నియమాలను కఠినంగా పెట్టండి. అంగీకరింపదగదని ప్రవర్తనను ఎందుకు శిక్షించాలి అని పిల్లలకు వివరించండి. శిక్షించడంలో భాగంగా వారిని భోజనం, నీరు వంటి అవసరమైన వాటి నుండి దూరం చేయటం, లేదా ఎండలో నిల్చో పెట్టడం వంటివి ఎన్నడూ చెయ్యకండి. పిల్లలు కారణాలు తెలుసుకోలేనంత పెద్దవారు కానప్పుడు సాధారణ అభివృద్ధిలో భాగమైన బొటన వేలు నోట్లో పెట్టుకోవటం, స్పీచ్ డెవలప్‌మెంటు మొదలైన విషయాల్లో దండించకండి.



టీనేజర్స్‌ని కొట్టకండి. తప్పును వివరించండి. వారు కారణం మర్చిపోతారు కానీ చనిపోయే వరకూ చెంపదెబ్బ మాత్రం గుర్తుంచుకుంటారు. దండించే కొద్దీ మరింతగా తమ గుహలోకి వెళ్ళిపోతారు. ఇహ అప్పటినుంచీ మీరు జీర్ణించుకోలేని సమాచారాన్ని మీ నుంచి దాయడం మొదలు పెడతారు.

"నీ వయసులో నేను." లాంటి పదసమూహాలను వాడడం నివారించండి. మీరు గొప్పగా చెప్పుకునే సక్సెస్ స్టోరీలతో పాటు, మీ ఫెయిల్యూర్‌లు, వాటి కారణాలను, పుట్టుకతో వచ్చిన బలహీనతలను, చిన్నప్పటి భయాలను మరియు మీరు వాటిని ఎలా అధిగమించారో చెప్పండి. అది పిల్లలకు వాళ్ళ తప్పులు, భయాలు వంటి వాటిని గుర్తించేలా చేస్తుంది.

బయటి చిరుతిళ్ళు తినేందుకు డబ్బులు ఇస్తే, వాళ్ళు ఇంట్లో తక్కువ తింటారు. ఎందుకంటే ఇంట్లో ఆరోగ్యకరమైన ఫుడ్ కంటే బయట ఎక్కువ నూనెతో చేసిన స్పైసీ ఫుడ్ రుచిగా ఉంటుంది. ఒకసారి దానికి అలవాటు పడితే ఇక అమ్మ చేతి వంట అసలు నచ్చదు.

తినేటప్పుడు టివి చూడటాన్ని ప్రోత్సహించకండి. అది జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తుంది. చివరకు పంది కూడా తనేం తింటోందో చూస్తూ తింటుంది. "ఏం? చూస్తూ తినలేనంత దరిద్రంగా ఉందా నా వంట?" అని పిల్లల్ని ప్రశ్నించకండి. మీక్కూడా ఈ అలవాటు ఉంటే మానుకోండి. రోజులో కనీసం ఒకసారి కూడా భోజనం చెయ్యలేని పిల్లలు పదికోట్ల మంది ఉన్న దేశంలో, రోజుకి రెండుసార్లు భోజనం తినగలుగుతున్నందుకు అదృష్టవంతులు మీరు. 'భోజనం'ను గౌరవించమని చెప్పండి.

పెంపకం బావుంటే పిల్లలు బావుంటారు. మంచి పెంపకం బ్రహ్మ విద్యేమీ కాదు. అన్ని వ్యాపకాలకన్నా (ముఖ్యంగా టి.వీ చూడటం కన్నా) అది నిజంగా బావుంటుంది. పెట్టుబడి ఏమీ అక్కరలేదు. పెంచటం పై పాషన్ ఉండాలంతే.

ఆదివారాల్లో, సెలవు రోజుల్లో, వేసవి సెలవుల్లో, తాతగారింట్లో, చివరకు టూర్ వెళ్లినప్పుడు కూడా కనీసం అరగంట సేపు చదవమని ప్రోత్సహించండి. దానిని ఒక హాబీలా మలచండి.

ఎదుగుదల అన్నది నిలువుగా, వెడల్పుగా అని రెండు రకాలు (దరిద్రమైన తెలుగు వాక్యానికి క్షమాపణలు). చదువులో ముందంజ, క్రీడల్లో ఉత్సాహం, గార్డెనింగ్, కుకింగ్, పెయింటింగ్, మ్యూజిక్ వంటి హాబీలు.. పిల్లలు వెడల్పుగా ఎదగటానికి ఉదాహరణలు. అన్నీ కొద్ది కొద్దిగా అన్నమాట.

చివరగా ఒక మాట. పనికిరాని కోర్కెల నుంచి పిల్లల్ని పనికొచ్చే గోల్స్ వైపు తీసుకెళ్ళే దారి 'క్రమశిక్షణ'. ఆ దారి గతుకులతో ఉండకూడదు. జాగ్రత్తగా సిమెంటు చెయ్యాలి. ఆ సిమెంట్‌నే 'ప్రేమ' అంటారు. ఏ ఇంట్లో పిల్లల్ని ప్రేమతో నిద్రలేపి క్రమశిక్షణతో పనులు చేయించి, ఆహ్లాదంతో సాయంత్రాలు గడిపి, ఆప్యాయతతో నిద్రపుచ్చుతారో ఆ ఇంట్లో పిల్లలు విజయులవుతారు" అని ఒక చైనీస్ సామెత ఉన్నది.

ఉప సంహారం: ముగింపుకొచ్చాం. అంతా చదివి, పిల్లల పెంపకం ఇంత కష్టమా అనుకోకండి. ఇంత ఇష్టమా అనుకోండి. ఇదంతా సాధ్యమా అనుకోకండి. సాధ్యమైనంత చేయండి. ఎవరి కర్మకి వారే బాధ్యులు అనుకోకండి. మీ పిల్లల కర్మకి, ఖర్మకీ మీరే బాధ్యులు అని నమ్మండి.

స్వోత్కర్ష అనుకోకపోతే, మంచి పెంపకం మా అందరి మీదా ఎంత ప్రభావం చూపించిందో చెప్పి ఈ వ్యాస పరంపర ముగిస్తాను.

గోదావరి పక్క గుత్తెనదీవి అనే పల్లెటూళ్లో మా తండ్రి గారి తండ్రి, చిన్న స్కూల్లో గుమస్తా. మా తండ్రి ఎనిమిదేళ్ల వయసులో ఆయన చనిపోయారు. ఆ రోజుల్లో రాజమండ్రిలో సీతారామయ్యగారనే ఒక దయార్ద్ర హృదయుడు పది మంది అనాథ పిల్లల్ని చేరదీసి చదివించేవారట. మా తండ్రి అక్కడ చదువుకున్నారు. మా వంశంలో మా నాన్నే మొదటి గ్రాడ్యుయేటు. కవిత్వం కూడా వ్రాసేవారు. ఉద్యోగం వచ్చేవరకూ చిన్న పాకలో ఉండేవారట.

అనంతపురంలోనూ, ఆపైన ఖమ్మంలోనూ చిన్న ఇంట్లో బయట అరుగుమీద కూర్చోబెట్టి మా నాన్న వీధిలో పిల్లలందరికీ ఉచితంగా చదువు చెప్పేవారు. నేను పెద్దగా తెలివైన వాడిని కాను. కేవలం కృషి. తండ్రి పెంపకం. అంతే. ఆయన పెంపకంలో కాకినాడ పి.ఆర్. కాలేజీ ప్రథముడిగా వచ్చాను. నాలుగు సంవత్సరాల సి.ఎ. కోర్సు మూడేళ్ళలో పూర్తి చేసాను. ఆ రోజుల్లో ప్రథమ శ్రేణి విద్యార్థులకి ఆ వెసులుబాటు ఉండేది.

నా కొడుకు ఇంటర్ స్టేట్ రాంకర్. పగలు ఉద్యోగం చేస్తూ, ఈవెనింగ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ చదువుతూ యూనివర్సిటీ థర్డ్ రాంక్‌లో పాసై, ప్రపంచ బ్యాంక్‌లో కొంతకాలం పనిచేసి, స్వంత ఖర్చు మీద విదేశాల్లో ఎం.బి.ఎ. చదివాడు. ప్రస్తుతం వాడి జీతం ఏడాదికి రెండు కోట్ల పైమాటే. అతడి భార్య చార్టెడ్ అకౌంటెన్సీలో ఇండియా టాప్ రాంకర్. పేద విద్యార్థుల చదువుకై ఇద్దరూ బాగా ఖర్చు పెడతారు.

నా మనవడికి పదేళ్లు. పుట్టినరోజులు జరుపుకోకుండా ఆ డబ్బులు ఛారిటీలకు ఇస్తాడు. ఏషియా ఒలంపైడ్‌లో గోల్డ్ మెడల్ సాధించి, ఈ వ్యాసం వ్రాసే సమయానికి ప్రపంచ పోటీల్లో పాల్గొనటానికి చైనా వెళ్తున్నాడు.

పెంపకం బావుంటే పిల్లలు బావుంటారు. మంచి పెంపకం బ్రహ్మ విద్యేమీ కాదు. అన్ని వ్యాపకాలకన్నా (ముఖ్యంగా టి.వీ చూడటం కన్నా) అది నిజంగా బావుంటుంది. పెట్టుబడి ఏమీ అక్కరలేదు. పెంచటం పై పాషన్ ఉండాలంతే.

బెస్ట్ ఆఫ్ లక్.

(ఇరవై ఆరు వారాల పాటు సాగిన ఈ వ్యాసాలని ఎంతగానో ఆదరించిన పాఠకులకు కృతజ్ఞతలు. వీటిలో మొదటి భాగం "లోయ నుంచి శిఖరానికి" అన్న పేరుతో విడుదలైంది. తరువాయి భాగం "ప్రేమ ఒక కళ"గా త్వరలో రిలీజ్ అవుతుంది-రచయిత)

(అయిపోయింది)